
'గ్రామం ప్రగతిపథంలో ఉంటే
ఎవ్వరూ ముఠా కక్షల జోలికి వెళ్లరు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+4+16+40 పేజీల ఆదివారం అనుబంధం వెల: ₹ 6.00

సంపుటి: 10
సంచిక: 156

ఆదివారం 27-8-2017

SIMULTANEOUSLY PRINTED AT KADAPA | VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

అన్నింటిపై ఉత్తమ ధరల ఛాలెంజ్!

బంగారు నగలు

లక్షలాది డిజైన్లు !

GOLD

మార్కెట్‌లోనే తక్కువ తరుగు!
తయారీ ధరకే బంగారు నగలు!

BIS 916 హాల్‌మార్క్

వజ్రాభరణాలు

DIAMOND

క్యారెట్‌కు
రూ.48000 నుంచి!
అంతర్జాతీయ స్థాయి సర్టిఫికెట్‌తో!
V.A. గ్రాముకు రూ.975 మాత్రమే.
100% Quality. E-F Colour Grade & VVS Clarity.

అన్ని వజ్రాభరణాలకు అంతర్జాతీయ స్థాయి సర్టిఫికెట్ అందజేస్తాం.
(Certified by Internationally Recognized Gemmology Bodies.)

అరుదైన ఆదా!

CHIT

స్వర్ణ కమలం

స్వర్ణ కమలం

11 నెలల 'నగల కొనుగోలు పథకం'.
సులభ వాయిదాలు:
రూ.1000, రూ.2000, రూ.2500

తొలినెల వాయిదా మీ కోసం లలితా జ్యువెల్లరి చెల్లిస్తుంది.	తరుగు లేదు. 0% తరుగు	నగదు రూపంగానూ, బంగారం రూపంగానూ ఆదా చేసుకునే సౌలభ్యం.

100% తరుగు లేదు.

PRE-BOOKING

లలితా జ్యువెల్లరి 'అడ్వాన్స్ నగల బుకింగ్ స్కీమ్'
100% తరుగు లేకుండా బంగారు నగలు కొనొచ్చు.

ఒకసారి నగదు చెల్లించి 6 నెలల తర్వాత 6% తరుగు ఉన్న నగలను; 7 నెలల తర్వాత 7% తరుగు ఉన్న నగలను తరుగు లేకుండా కొనొచ్చు. 7% కన్నా అధికంగా తరుగు ఉన్న నగలకు వ్యత్యాసమున్న తరుగు ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది.

మీ వద్ద ఉన్న పాత నగలను ఇచ్చి కూడా ఈ స్కీమ్‌లో చేరవచ్చు.

కేవలం అరశాతం (0.5%) మీ పాత బంగారు నగల మెల్టింగ్, ప్యూరిఫికేషన్ చేసేందుకు పట్టుకుంటాం. పాత నగలు BIS 916 హాల్‌మార్క్ నాణ్యత ప్రకారం లెక్కగట్టబడుతుంది.

వెండివస్తువులు

SILVER

కనువిందు చేసే సంప్రదాయ మరియు వినూత్నమైన వెండి సామగ్రి,
చాలావరకు వెండివస్తువులకు V.A. లేదు!

Lalithaa™

లలితా జ్యువెల్లరి మార్ట్ ప్రై లిమిటెడ్

వైజాగ్ : 29-1-75/1, ఆర్‌టీసీ బస్టాండ్, ద్వారకా నగర్. ఫోన్: 0891-6600001.

తిరుపతి : 481/482, రెడ్డి అండ్ రెడ్డి కాలనీ, మాస్క్ రోడ్డు. (V.V. మహల్ రోడ్డు). ఫోన్: 0877-666 0505 / 0606 / 7888.

హైదరాబాద్ • తిరుపతి • విశాఖపట్నం • చెన్నై • మదురై • తిరుచ్చి • పుదుచ్చేరి • కుంభకోణం • బెంగళూరు • రామనాథపురం • కోయంబత్తూరు



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

‘ప్రతి రైతూ వాణిజ్యవేత్తగా మారాలి’

పేజీలు: 16+4+16+40 పేజీల ఆదివారం అనుబంధం వెల: ₹ 6.00

సంపుటి: 10
సంచిక: 156


ఆదివారం 27-8-2017

SIMULTANEOUSLY PRINTED AT KADAPA | VIJAYAWADA | BANGALORE | CHENNAI | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

SUNDAY Special



శ్రియానుభవాలు - ఫ్యామిలీలో



కొత్త చరిత్ర.. - స్పోర్ట్స్‌లో



శనివారం వెలగపూడిలో ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుకు సన్మాన పత్రం అందజేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, గవర్నర్ నరసింహన్

పరిపాలనా భాషగా తెలుగు

ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

- అంతా తెలుగులోనే మాట్లాడాలి.. తెలుగులోనే పాలన
- తెలుగు రాష్ట్రాలను మర్చిపోను.. సాయానికి ప్రయత్నిస్తా
- విభజన సమయంలో ఏపీకి మేలు జరిగేలా పట్టుబట్టా
- 1972లోనే విభజనైతే ఏపీ అభివృద్ధిలో ముందుండేది
- తెలుగు రాష్ట్రాల సీఎంలు ఇచ్చి పుచ్చుకునేలా ఉండాలి
- అమరావతిలో వెంకయ్యకు ప్రభుత్వం పౌరసన్మానం
- 2.25 లక్షల ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన

సాక్షి, అమరావతి

రాష్ట్రంలో తెలుగు భాష పరిపాలనా భాషగా మారాలని ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు ఆకాంక్షించారు. తెలుగును పరిపాలనా భాషగా ఉపయోగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు. అందరూ తెలుగులోనే మాట్లాడాలని, తెలుగులోనే పాలన సాగాలని పిలుపునిచ్చారు. ఉప రాష్ట్రపతి హోదాలో తొలిసారిగా ఆంధ్రప్రదేశ్‌కు వచ్చిన వెంకయ్యనాయుడికి వెలగపూడి తాత్కాలిక సచివాలయం ప్రాంతంలో రాష్ట్ర ప్రభుత్వం శనివారం పౌరసన్మానం చేసింది. ఈ సందర్భంగా వెంకయ్య ప్రసంగిస్తూ... ‘‘రాజకీయాల్లో అయామ్ రిటైర్డ్, బట్ నాట్ టైర్డ్ (రాజకీయాల నుంచి విరమణ పొందానే కానీ అలసిపోలేదు). ఇక ప్రత్యక్ష రాజకీయాల్లో ఉండను కాబట్టి తరచూ కలిసి మాట్లాడుకునే అవకాశం ఉండదు. అయినా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలను మర్చిపోను. నా స్థాయి వరకూ సాయం చేసేందుకు ప్రయత్నిస్తా’’ అని చెప్పారు. ఉపరాష్ట్రపతి అయితే రాజకీయంగా తమకు అందుబాటులో ఉండరని

మిగతా 6వ పేజీలో ▶

విపక్ష నేతకు ఆహ్వానం
ఇలాగేనా?

ఉపరాష్ట్రపతి సన్మానంలో ఆనవాయితీ పాటించని ప్రభుత్వం

- కేవలం ఒక్క రోజు ముందే మెయిల్‌లో జగన్‌కు ఆహ్వానం
- విపక్షనేత రావాల్సిన అవసరం లేదన్న సంకేతాలను ఇచ్చింది
- వెంకయ్యను జగన్ ఇప్పటికే ప్రత్యేకంగా అభినందించారన్న వైఎస్సార్‌సీపీ వర్గాలు

- 6లో

డేరా విధ్వంసం..

తగలబడ్డ హరియాణా, పంజాబ్

- ఢిల్లీ, రాజస్తాన్‌లోనూ డేరా అభిమానుల ఉన్మాదం
- 36 మంది మృతి.. 269 మందికి గాయాలు
- భారీగా ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తుల దహనం.. ధ్వంసం
- రేప్ కేసులో డేరా చీఫ్ గుర్మీత్‌ను దోషిగా తేల్చిన కోర్టు
- కోర్టు తీర్పుతో డేరా చీఫ్ అభిమానుల విధ్వంసకాండ
- హరియాణా ప్రభుత్వంపై పంజాబ్-హరియాణా హైకోర్టు ఆగ్రహం
- రాజకీయ అవసరాల కోసం డేరా ముందు సాగిలపడ్డారని మండిపాటు

8 లో



శుక్రవారం హరియాణాలోని పంచకులలో డేరా సచ్చా సౌదా చీఫ్ గుర్మీత్ రామ్ రహీమ్‌సింగ్ మద్దతుదారులు నిప్పంటించడంతో తగలబడుతున్న వాహనాలు



కాసులు గ్లాసులు

కాకినాడలో యథేచ్ఛగా డబ్బులు పంచుతున్న టీడీపీ

- ప్రలోభాల పర్వం మరింత ముమ్మరం.. ఇద్దరు మంత్రుల ప్రత్యక్ష పర్యవేక్షణ
- వార్డుకు రూ.3 కోట్లు కేటాయింపు.. ఓటుకు ఇపుడు వెయ్యి, తర్వాత రు.2 వేలు
- నగరంలో ఇప్పటికే రు.42 కోట్లకు పైగా పంపిణీ.. ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసులు

(కాకినాడ నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి)

పెద్ద నోట్ల రద్దు గానీ, వస్తుసేవల పన్ను (జీఎస్టీ) గానీ వీరికేమీ అడ్డు కాలేదు. రు.40 వేలకు మించి నగదును బ్యాంకుల నుంచి ఉపసంహరించకూడదన్న నిబంధనా ఆటంకం కాలేదు. నోట్ల కట్టలు నోళ్లు తెరుచుకున్నాయి. కాకినాడలో కాసులు, గ్లాసుల గలగల మొదలయింది. మున్సిపల్ ఎన్నికల ప్రచారం మరి కొన్ని గంటల్లో ముగియనున్న నేపథ్యంలో అధికార తెలుగు దేశం పార్టీ ఓటర్లను ప్రలోభపెట్టే కార్యక్రమాన్ని మరింత ముమ్మరం చేసింది. విచ్చల విడిగా నగదు పంపిణీ చేస్తోంది. గురువారం రాత్రి వేయి రూపాయలతో ప్రారంభమైన పంపిణీ శనివారం ఉదయానికి రు.2 వేలకు చేరింది. తొలి రౌండ్‌లో ఇప్పటికే రు 42 కోట్లకు పైగా ఓటర్లకు పంచింది. బహిరంగంగా నగదు పంపిణీ జరుగుతున్నా, విపక్షం ఫిర్యాదు చేసినా పోలీసు యంత్రాంగం చేష్టలుడిగి చూస్తోంది. సాక్షాత్తు హోం మంత్రి చిన రాజప్ప, పౌర సరఫరాల శాఖ మంత్రి పత్తిపాటి పుల్లారావు స్వీయ పర్యవేక్షణలోనే ఈ వ్యవహారం నడుస్తుండడంతో పోలీసులు చూసీచూడనట్లు నటిస్తున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో పోలీసుల కనుసన్నలలోనే నగదు పంపిణీ జరుగుతోంది. దీనికి అధికార గణం వత్తాసు పలుకుతుండడంతో నగదు లావాదేవీలు

మిగతా 2వ పేజీలో ▶

అప్పుల బాధతో యువ రైతు ఆత్మహత్య

- వర్షాభావంతో చేతికందని పంట
- కలసిరాని గొర్రెల పెంపకం
- ప్రకాశం జిల్లాలో దిక్కుతోచక ఉరి వేసుకున్న అన్నదాత

- 2లో

అమెరికా సైన్యంలో ట్రాన్స్ జెండర్స్‌పై
నిషేధం

- ట్రంప్ ఉత్తర్వులు జారీ
- కోర్టుకు వెళ్లనున్న డెమోక్రాట్లు

- వివరాలు 9లో

ఆగని అరాచకం

నంద్యాలలో పేట్రేగిపోతున్న అధికార పార్టీ నేతలు

- ఓడిపోతామన్న భయంతో శిల్పా చక్రపాణిరెడ్డిపై హత్యాయత్నం
- టీడీపీకి ఓటు వేయలేదని దళిత మహిళపై ఏవీ సుబ్బారెడ్డి దాడి
- వేట కొడవలితో రెచ్చిపోయిన అభిరుచి మధును అరెస్ట్ చేయని పోలీసులు

- వివరాలు 7లో

నేడు కాకినాడలో వైఎస్ జగన్ పర్యటన

కార్పొరేషన్ ఎన్నికల ప్రచారం.. పలుచోట్ల బహిరంగ సభలు, రోడ్డు షో

2 లో



కశ్మీర్‌లో ముష్కరుల మారణకాండ

- పుల్వామా పోలీసు కాంప్లెక్స్‌పై దాడి..
- ఎనిమిది మంది భద్రతా సిబ్బంది మృతి
- ఎదురుకాల్పుల్లో ముగ్గురు ఉగ్రవాదుల హతం

- వివరాలు 9లో

కోస్తాలో నేడు, రేపు
భారీ వర్షాలు

బలం పుంజుకున్న నైరుతి రుతుపవనాలు

- కర్నూలు జిల్లా అవుకులో 20 సెం.మీ రికార్డు వాన
- విజయనగరంలో పిడుగులు పడి ముగ్గురి మృతి

- వివరాలు 2లో

బిహార్‌కు రూ.500 కోట్లు

వరద ప్రాంతాల్లో ప్రధాని ఏరియల్ సర్వే

9 లో



‘కృష్ణా’కు కష్టకాలం

కనిపించని వరద ప్రవాహం

- బోసిపోతున్న జలాశయాలు
- డెడ్ స్టోరేజ్‌కు చేరుకున్న శ్రీశైలం, నాగార్జునసాగర్ రిజర్వాయర్లు
- నీరుగారిపోతున్న తెలుగు రాష్ట్రాల రైతులు
- ఇక సెప్టెంబర్‌పైనే ఆశలు..



సాక్షి, అమరావతి

కృష్ణా నదిలో ఎగువ నుంచి వరద ప్రవాహం రాకపోవడంతో తెలుగు రాష్ట్రాల్లో జలాశయాలన్నీ బోసిపోయాయి. తాగునీటికి కూడా ఇబ్బందులేర్పడే పరిస్థితి నెలకొంది. జూరాల, శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల ప్రాజెక్టుల్లో గతేడాది ఇదే రోజునాటికి ఉన్న నీటి నిల్వలు.. ప్రస్తుత నీటి నిల్వలకు పొంతనే లేదు. ఈ నేపథ్యంలో సెప్టెంబర్‌పైనే రైతులు ఆశలు పెట్టుకున్నారు. ఎగువ నుంచి దిగువకు భారీ వరద వస్తే తప్ప రెండు రాష్ట్రాల్లోని జలాశయాల్లోకి నీళ్లుచేరని పరిస్థితి నెలకొంది. మహారాష్ట్ర నుంచి వచ్చిన వరద నీటితో కర్ణాటకలో జలాశయాలన్నీ నిండిపోయాయి. కానీ.. ఎత్తిపోతల పథకాల ద్వారా వరద నీటిని మళ్లిస్తూ.. కేటాయించిన జలాలకన్నా కర్ణాటక అధికంగా వినియోగించుకుంటుండటంతో దిగువకు జలాలు రావడం లేదు.

గతేడాది ఇదే సమయానికి..

జూరాల జలాశయానికి శనివారం నాటికి 14.275 టీఎంసీలు మాత్రమే రాగా, గతేడాది ఇదే రోజుకు 210.357 టీఎంసీలు వరద జలాలు వచ్చాయి. తెలంగాణ రాష్ట్రం వినియోగించుకోగా మిగిలిన 199.757 టీఎంసీలు గతేడాది ఇదే రోజు నాటికి శ్రీశైలం జలాశయానికి చేరాయి. కానీ ఈ ఏడాది కేవలం 4.99 టీఎంసీలే వచ్చాయి. నాగార్జున సాగర్‌కు ఈ ఏడాది ఇప్పటివరకూ 3.60 టీఎంసీలు వచ్చాయి. కానీ, గతేడాది ఇదే రోజు నాటికి నాగార్జునసాగర్‌కు

మిగతా 2వ పేజీలో ▶

2

అధికారిక గణాంకాల ప్రకారం, గత ఐదేళ్లలో, అంటే 2012 నుంచి 2017 ఏప్రిల్ 14 వరకు, 298 మంది భారతీయులకు పాకిస్తాన్ ప్రభుత్వం ఆ దేశ పౌరసత్వం ప్రసాదించింది.



'చింగ్ చాంగ్' అన్నందుకు జాబ్ ఊడింది!



జాత్యహంకారాన్ని ప్రదర్శించిన ఓ అమెరికన్ ఉద్యోగాన్ని కోల్పోయాడు. మన హట్టన్ ఈస్ట్ విలేజ్‌లో కార్నర్ స్టోన్ కేఫ్ రెస్టారెంట్‌కు ఆసియాకి చెందిన వ్యక్తి వెళ్లాడు. అతడు తనకు కావలసిన ఐటమ్స్ ఆర్డర్ చేయగా.. రెస్టారెంట్‌లోని ఓ వెయిటర్ కస్టమర్ పేరుకు బదులుగా 'చింగ్ చాంగ్' అని రాశాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న కస్టమర్ రెస్టారెంట్ మేనేజర్ రాక్కో దృష్టికి తీసుకెళ్లాడు.

ఇది కచ్చితంగా జాతి విద్వేష చర్యని వివరించి, తనకు అవమానం జరిగిందని వాపోయాడు. కస్టమర్‌ను అవమానించాడన్న కారణంగా వెయిటర్‌ను ఉద్యోగం నుంచి తొలగించినట్లు మేనేజర్ రాక్కో తన ఫేస్‌బుక్ పేజీలో పోస్ట్ చేశారు. అయితే అసలు ఈ సంఘటన ఒక స్నేహితుడి ఫేస్‌బుక్ పోస్ట్ వల్ల వెలుగులోకి వచ్చింది. తన స్నేహితుడి కుటుంబం రెస్టారెంట్‌కు వెళ్లగా కస్టమర్ పేరుకు బదులుగా చింగ్ చాంగ్ అని రాశారని జిగ్గి చౌ అనే యువకుడు ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశాడు. బిల్లు పేపర్‌పై చింగ్ చాంగ్ ఉన్నట్లు ఓ ఫొటోను పోస్ట్ చేయడంతో ఈ జాతి విద్వేష చర్య విషయం వెలుగుచూసింది. దీనిపై స్పందించిన యాజమాన్యం వెయిటర్ చేసిన తప్పిదాన్ని గుర్తించి ఫేస్‌బుక్ ద్వారా క్షమాపణ చెప్పడంతో పాటు అతడిని జాబ్ నుంచి తొలగించినట్లు వివరించారు.

రోడ్డుపై డ్యాన్స్ చేశాడని..!



పాత హిట్ సాంగ్‌కు జోష్ ఆపుకోలేక రోడ్డుపైన డ్యాన్స్ చేసినందుకు ఓ 14 ఏళ్ల బాలుడు సౌదీ పోలీసులకు అడ్డంగా దొరికిపోయాడు. 1990 నాటి మకారీనా పాటకు కోస్టల సిటీలోని స్ట్రీట్ క్రాసింగ్‌పై ఓ బాలుడు చిందులు వేశాడు. ఈ క్లిప్‌ను సోషల్ మీడియాలో షేర్ చేశాడు. ఊరు, పేరు తెలియని ఈ బాలుడి డ్యాన్స్‌తో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిందని మక్కా పోలీసులు చెప్పారు. అంతేకాక పబ్లిక్‌లో అతను సరిగ్గా ప్రవర్తించలేదని తెలిపారు. అయితే అధికారికంగా ఈ బాలుడిపై కేసు నమోదుచేశారో లేదో ఇంకా స్పష్టంగా తెలియలేదు. సోషల్ మీడియాలో ఈ డ్యాన్స్ వీడియో వైరల్ అవుతోంది. ట్రాఫిక్ సిగ్నల్ వద్ద ఆగి ఉన్న కార్లకు ఎదురుగా వచ్చి మరీ డ్యాన్స్ చేశాడు. ఈ నెల మొదట్లో కూడా ఇదే మాదిరి సౌదీ గాయని కూడా అరెస్ట్ అయింది.

నేడు కాకినాడలో
వైఎస్ జగన్ పర్యటన

సాక్షి ప్రత్యేక ప్రతినిధి, కాకినాడ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదివారం తూర్పు గోదావరి జిల్లా కాకినాడలో పర్యటించనున్నారు. కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో ఆయన రెండు చోట్ల బహిరంగ సభలు, రోడ్డు షో నిర్వహించనున్నారని పార్టీ తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు శనివారం మీడియాకు వెల్లడించారు. జగన్ ఆదివారం ఉదయం హైదరాబాద్‌లో బయల్దేరి రాజమహేంద్రవరం విమానాశ్రయానికి చేరుకుంటారని తెలిపారు. అక్కడి నుంచి కారులో కాకినాడ వస్తారని, ఉదయం 10.30 గంటలకు అన్నమ్మ ఘాటి వద్ద బహిరంగసభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారని పేర్కొన్నారు. తర్వాత చంద్రిక థియేటర్, జగన్నాథపురం వంతెన మీదుగా సినిమా రోడ్డులో రోడ్డు షోలో పాల్గొంటారన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు డెయిరీ ఫామ్ సెంటర్ చేరుకున్న తర్వాత అక్కడ బహిరంగసభలో ప్రసంగిస్తారని చెప్పారు. అనంతరం హైదరాబాద్‌కు తిరిగి ప్రయాణమవుతారన్నారు. పార్టీ కార్యకర్తలు, అభిమానులు, కాకినాడ పౌరులు జగన్ పర్యటనను విజయవంతం చేయాలని కన్నబాబు కోరారు.

ఇంకొక్క రోజు...

నంద్యాల ఉప ఎన్నిక ఫలితం తేలేది రేపే


- ఉదయం 8 గంటలకు కౌంటింగ్ మొదలు
- 14 టేబుళ్ల చొప్పున 19 రౌండ్‌లు
- కౌంటింగ్ కేంద్రం వెలుపల ఎల్ఈడీ స్క్రీన్
- ఎప్పటికప్పుడు రౌండ్ల వారీగా ఓట్ల వివరాలు
- ఫలితంపై సర్వత్రా ఉత్కంఠ

కర్నూలు (అగ్రికల్చర్): రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర ఉత్కంఠ రేకెత్తిస్తున్న కర్నూలు జిల్లా నంద్యాల అసెంబ్లీ స్థానం ఉప ఎన్నిక ఫలితం సోమవారం వెల్లడి కానుంది. ప్రస్తుతం ఈవీఎంలు కేంద్ర బలగాల రక్షణలో ఉన్నాయి. వీటిలో నిక్షిప్తమై ఉన్న ఫలితం సోమవారం ఉదయం 11 గంటలకల్లా వెల్లడయ్యే అవకాశం ఉంది. గతంలో ఎప్పుడూ లేని విధంగా నంద్యాల నియోజకవర్గం ఉప ఎన్నికలో తీవ్ర స్థాయిలో పోరు సాగింది. ఆంధ్రప్రదేశ్‌తో పాటు యావత్ తెలుగు ప్రజలు ఈ ఫలితం కోసం ఆసక్తితో ఎదురు చూస్తున్నారు. మొత్తం 15 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నా ప్రధానంగా అధికార టీడీపీ, ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ మధ్యనే నువ్వా నేనా అన్నట్లుగా పోటీ సాగింది. ఇటు వైఎస్సార్‌సీపీ, అటు తెలుగుదేశం పార్టీలు ఉప ఎన్నికను ప్రతిష్టగా తీసుకొని సర్వశక్తులూ ఒడ్డాయి. వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా శిల్పా మోహన్‌రెడ్డి, టీడీపీ తరఫున భూమా బ్రహ్మానందరెడ్డి పోటీ చేశారు. అధికార పార్టీ ఎలాగైనా విజయం దక్కించుకోవాలన్న ఉద్దేశంతో వందల కోట్ల రూపాయలు మంచి నీళ్ల ప్రాయంగా ఖర్చు చేసింది. కాంగ్రెస్ పార్టీ ఉనికిని చాటుకోవడానికి బరిలో నిలిచింది. ఈ నేపథ్యంలో సోమవారం ఓట్ల లెక్కింపు పకడ్బందీగా చేపట్టడానికి జిల్లా యంత్రాంగం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. నంద్యాలలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో లెక్కింపుచేపట్టనున్నారు. పోలింగ్‌ను ప్రశాంతంగా నిర్వహించిన జిల్లా యంత్రాంగం.. కౌంటింగ్‌ను కూడా విజయవంతంగా పూర్తి చేయడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటోంది. కాగా, నంద్యాల ఫలితంపై భారీ స్థాయిలో బెట్టింగ్‌లు నడుస్తున్నాయి. కాగా, గతంలో ఎప్పుడూ లేని విధంగా నంద్యాల ఉప ఎన్నికలో 79.13 శాతం పోలింగ్ నమోదైన విషయం తెలిసిందే. మొత్తం ఓటర్లు 2,18,858 మంది ఉండగా.. 1,73,189 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీరిలో పురుషులు 84,549 మంది, స్త్రీలు 88,639 మంది, ఇతరులు ఒక్కరు ఉన్నారు.

ఓట్ల లెక్కింపు ప్రక్రియ వెబ్ క్యాస్టింగ్

సోమవారం ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రక్రియ చేపడతారు. తొలుత పోస్టల్ బ్యాలెట్లు, ఆ తర్వాత ఈవీఎంలలోని ఓట్లను లెక్కిస్తారు. కౌంటింగ్‌కు మొత్తం 15 టేబుళ్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో ఒకటి రిటర్నింగ్ అధికారికి ఉంటుంది. ఓట్ల లెక్కింపునకు 14 టేబుళ్లు ఉంటాయి. మొత్తం 255 పోలింగ్ కేంద్రాలు ఉండగా 255 ఈవీఎంల్లోని ఓట్లను లెక్కించాల్సి ఉంటుంది. మొత్తం 19 రౌండ్లలో ఓట్ల లెక్కింపు జరుగుతుంది. ఒక్కో రౌండ్‌లో 8–10 వేల ఓట్ల వరకు లెక్కిస్తారు. సగం రౌండ్లు పూర్తయ్యేసరికి విజయం ఎవరిదనేది తెలిసిపోయే అవకాశం ఉంది. కౌంటింగ్ ప్రక్రియ 12 గంటలకు పూర్తయ్యే అవకాశముంది. కౌంటింగ్ కేంద్రం వెలుపల ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేసి, రౌండ్ల వారీగా అభ్యర్థులకు లభించిన ఓట్ల వివరాలను తెలియజేస్తారు. ఓట్ల లెక్కింపునకు మొత్తం 60 మంది సిబ్బందిని వినియోగించనున్నారు. ఒక్కో టేబుల్‌కు ఒక కౌంటింగ్ ఆఫీసర్, ఒక కౌంటింగ్ అసిస్టెంట్ ఉంటారు. అదనంగా (రిజర్వ్) 20 మంది కౌంటింగ్ అధికారులు, 20 మంది కౌంటింగ్ అసిస్టెంట్లు ఉంటారు. ప్రతి టేబుల్‌కు ఒక సూక్ష్మ పరిశీలకుడు ఉంటారు. కౌంటింగ్ సిబ్బందికి ఇప్పటికే శిక్షణ ఇచ్చారు. కౌంటింగ్ ప్రక్రియను రిటర్నింగ్ అధికారితో పాటు జిల్లా కలెక్టర్, సాధారణ పరిశీలకుడు పర్యవేక్షిస్తారు. కౌంటింగ్ పక్రియను పారదర్శకంగా చేపట్టేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. మొత్తం ప్రక్రియను వీడియోగ్రఫీ చేయడంతో పాటు వెబ్ క్యాస్టింగ్ చేస్తున్నారు. కౌంటింగ్ ప్రక్రియను ప్రశాంతంగా చేపట్టడానికి పోలీసు యంత్రాంగం చర్యలు చేపట్టింది.

1న రాష్ట్రపతి
తిరుమల రాక?



సాక్షి, తిరుమల: భారత రాష్ట్రపతిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన రామ్‌నాథ్ కోవింద్ సెప్టెంబరు 1న కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల రానున్నట్లు సమాచారం. రాత్రికి ఇక్కడే బస చేసి, 2వ తేదీన వారు శ్రీవారిని దర్శించుకోనున్నారు. అదేవిధంగా తిరుపతి స్విమ్స్ ఆస్పత్రిలో జరిగే కార్యక్రమంలో రాష్ట్రపతి పాల్గొననున్నారు. ఈ మేరకు టీటీడీ అధికారులకు ప్రాథమిక సమాచారం అందింది. అధికారిక ఉత్తర్వులు ఇంకా అందలేదని వారు తెలిపారు.

ఏఎన్‌యూ దూరవిద్య ఎల్ఎల్ఎం ఫలితాలు విడుదల

ఏఎన్‌యూ (గుంటూరు): ఆచార్య నాగార్జున యూనివర్సిటీ దూరవిద్యా కేంద్రం ఈ ఏడాది మేలో ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో నిర్వహించిన ఎల్ఎల్ఎం కోర్సు పరీక్షా ఫలితాలను శనివారం విడుదల చేసినట్లు ఏఎన్‌యూ దూరవిద్యా కేంద్రం పీజీ పరీక్షల డిప్యూటీ రిజిస్ట్రార్ భవనం ఆంజనేయరెడ్డి తెలిపారు. ఫలితాలను www.anucde.ingo వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చని పేర్కొన్నారు. రీవాల్యుయేషన్ ఫీజు చెల్లించేందుకు సెప్టెంబర్ 7 ఆఖరు తేదీగా నిర్ణయించామన్నారు. రీవాల్యుయేషన్ ఫీజు ఒక్కో పేపర్‌కు రూ.960 చొప్పున చెల్లించాలని పేర్కొన్నారు.

కాసులు.. గ్లాసులు!

▶ మొదటి పేజీ తరువాయి

యధేచ్ఛగా సాగిపోతున్నాయి. కానీ, ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే పోలీసులు ఆగమేఘాల మీద ఆయా ప్రాంతాలకు వెళ్లి హల్‌చల్ చేస్తున్నారు. విచారణ పేరిట స్టేషన్లకు తీసుకువెళ్లి నిర్బంధిస్తున్నారు.

అత్యంత పకడ్బందీగా డబ్బు పంపిణీ..

సర్వేలు, స్లిప్పుల పంపిణీ పేరిట ఐదుగురితో కూడిన ఓ బృందం రాత్రి 8 గంటల తర్వాత ఓటర్ల ఇళ్ల వద్దకు వెళుతుంది. వీరిలో ఇద్దరు ఇంటిలోకి వెళతారు. ముగ్గురు ఇంటి బయట ఉంటారు. ఇంట్లోకి వెళ్లిన వాళ్లు ఓటర్ల జాబితా ప్రకారం ఆ ఇంట్లో ఎన్ని ఓట్లు ఉన్నాయో విచారిస్తారు. డబ్బులివ్వాలి గనుక ఓటరు కార్డు, ఆధార్ కార్డు తీసుకు రమ్మంటారు. వాటిని తమ జాబితాలోని నెంబర్ల ప్రకారం సరిపోల్చుకుని ఆ ఇంట్లోని ఓటర్లందరికీ వేయి నుంచి రు.2 వేల మధ్య – స్లిప్పుల్ని, డబ్బుల్ని టీడీపీ కరపత్రంలో పెట్టి– ఇస్తారు. ఇవి తొలి విడత మాత్రమేనని, మలి విడత సొమ్ము ఇవ్వాలంటే ఆధార్ లేదా ఓటరు కార్డుల్లో ఏదో ఒకటి తమ వద్ద ఉంచాలంటారు. పోలింగ్ రోజున స్లిప్పులు చూపిస్తే మిగతా డబ్బుతో పాటు ఓటర్, ఆధార్ కార్డులను తిరిగి ఇస్తామని చెబుతున్నారు. ఇందుకు ఇష్టపడని వారి వద్ద మీ ఓటు మాకేనని ఒట్టేసి చెప్పించుకుంటున్నారు. సెంటిమెంట్‌గా ప్రమాణం చేయించుకుంటున్నారు. ఈ తంతంగం నడిచినంత సేపు బయట ఉన్న ముగ్గురు కాపలా కాస్తారు. ప్రత్యర్థులెవరైనా ఆవైపు వస్తున్నారేమో గమనిస్తుంటారు. ఇలా ఇప్పటికి దాదాపు 35 వార్డులు ప్రధానంగా బస్తీలలో పంపిణీ చేసినట్టు సమాచారం.

ఎవరయినా పర్లేదు..

టీడీపీ పంపిణీదారులకు ఒక్కో చోట ప్రతిఘటనలూ ఎదురవుతున్నాయి. తాము టీడీపీ ఓటర్లం కాదని, డబ్బుతో తమ ఓట్లను కొనలేరని కొందరు కుండబద్దలు కొట్టి చెబుతున్నారు. అయినప్పటికీ వాళ్లు మాత్రం పట్టువదలని విక్రమార్కుల్లాగా... మీరు మా వాళ్లు (టీడీపీ) కాకపోయినా పర్లేదు. డబ్బు తీసుకోండంటూ వెంటబడుతున్నారు. వీడియో తీస్తామని హెచ్చరిస్తుండడంతో పరారవుతున్నారు.

పట్టపగలు ప్రజాస్వామ్యం ఖూనీ.....

సాధారణ ఎన్నికలకు తలదన్నే రీతిలో హోరాహోరీగా జరుగుతున్న కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రజాస్వామ్యం పట్టపగలే కూనీ అవుతోంది. జగన్నాథపురం ప్రాంతంలో అధికార పార్టీ ఎమ్మెల్యే కొండబాబు అనుచరుల ఆగడాలు హద్దు మీరాయి. తమ వార్డుల్లోకి వేరే వాళ్లు ఎవ్వరూ రావడానికి వీలు లేదంటూ పలువురు ప్రత్యర్థులను అటకాయిస్తున్నారు. ఈ వ్యవహారమై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. కొండబాబు అన్న కుమారుడు పోటీ చేస్తున్న ఓ వార్డులో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ప్రచారానికి వెళ్లిన వాళ్లను సైతం డబ్బులు పంచేందుకు వచ్చారంటూ పోలీసులకు పట్టిస్తున్నారు. ఎమ్మెల్యే అనుచరులు మాత్రం పట్టపగలే బాహాటంగా డబ్బు కట్టలతో తిరుగుతున్నా పోలీసులు చోద్యం చూస్తున్నారు.

ప్రతి వార్డుకూ రు.3 కోట్లు?

అధికారాన్ని కై వసం చేసుకోవడమే లక్ష్యంగా అధికార తెలుగుదేశం పార్టీ బరి తెగించింది. నగదును విచ్చల విడిగా వెదజల్లుతోంది. ఓటు వేసేందుకు, వేయకుండా ఉండేందుకు కూడా డబ్బులు పంచుతోంది. ప్రతి వార్డుకూ రు.3 కోట్లను కేటాయించినట్టు ఆ పార్టీ నేతలే చెబుతున్నారు. 'ఖర్చు ఎంతయినా పర్వాలేదు. గెలవడమే ముఖ్యం. అనుకూలంగా లేని చోట్ల రు.3 వేలయినా సరే ఇచ్చి కొనండి. డబ్బుకు వెనకాడవద్దని' ఎన్నికల ఇన్‌చార్జ్, రాష్ట్ర మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు తమ పార్టీ వాళ్లకు చెప్పినట్టు తెలిసింది. ఈనెల 29న కార్పొరేషన్‌లోని 48 వార్డులకు ఎన్నికలు జరుగనున్నాయి.

నేడు, రేపు భారీ వర్షాలు

బలం పుంజుకున్న నైరుతి రుతుపవనాలు



వైఎస్సార్ జిల్లా చెన్నూరు బ్రిడ్జి వద్ద పెన్నాలో పరవళ్లు తొక్కుతున్న వరద నీరు

సాక్షి, నెట్‌వర్క్: రానున్న 48 గంటల్లో (ఆది, సోమ వారాల్లో) కోస్తా జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది. కోస్తాంధ్రలో నైరుతీ రుతు పవనాలు బలం పుంజుకోవడం, వాయవ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడటంవల్ల కోస్తాంధ్ర జిల్లాల్లో ఆది, సోమ వారాల్లో భారీ వర్షాలు, రాయలసీమలో జల్లులు, తేలికపాటి వానలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ శనివారం రాత్రి వెబ్‌సైట్‌లో ప్రకటించింది. వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరిత ఆవర్తనం వచ్చే 24 గంటల్లో అల్పపీడనంగా బలపడే అవకాశం ఉందని వివరించింది. వీటి ప్రభావంవల్ల వచ్చే రెండు రోజులు కోస్తాంధ్రలో భారీ వర్షాలు కురుస్తాయని, తదుపరి రెండు రోజులు విస్తారంగా తేలికపాటి నుంచి ఓ మోస్తారు వానలు పడతాయని ఐఎండీ తెలిపింది. ఇదే సమయంలో రాయలసీమలో తేలికపాటి వానలు పడతాయని పేర్కొంది. కర్నూలు జిల్లాలో శుక్ర, శనివారాల్లో విస్తారంగా వర్షాలు కురిశాయి. అవుకులో రికార్డు స్థాయిలో 20 సెంటీమీటర్లు (200.2 మిమీ), చాగలమర్రిలో 15.2 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. గత దశాబ్ద కాలంలో ఇంత భారీగా వర్షపాతం నమోదు కాలేదు. వైఎస్సార్ జిల్లా రాయచోటి పట్టణంలోని కొత్తపేటలో గోడకూలి చిన్నారి రిజ్వాన (4) మృత్యువాత పడింది. విజయనగరంలో జిల్లాలో పిడుగులుపడి ముగ్గురు మృత్యువాతపడ్డారు. గడచిన 24 గంటల్లో వరరామచంద్రపురంలో 7, వీరఘట్టం, కారంచేడు, అద్దంకిల్లో 5, వేలేరుపాడు, పాతపట్నం, హోలగుండల్లో 4, బత్తలపల్లి, ఆలూరు, బాపట్ల, గజపతినగరం, కూనవరం, అర్ధవీడు, సంతమగుళూరు, అరకు, ఎర్రగొండపాలెం, కంభం, జియ్యమ్మవలస, మాచెర్లలో 3 సెం.మీల చొప్పున వర్షపాతం నమోదైంది.

పుంజుకున్న వర్షాలు

బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనాలు ఏర్పడటం, నైరుతీ రుతు పవనాలు బలోపేతం కావడంతో వారం రోజులుగా పడుతున్న వర్షాలతో రాష్ట్రంలో వర్షపాతం పెరిగింది. ఈ సీజన్‌లో ఇప్పటి (జూన్ 1 నుంచి ఈ నెల 26వ తేదీ సాయంత్రం)వరకూ రాష్ట్రంలో సగటు వర్షపాతం సాధారణం కంటే ఎక్కువగా నమోదైంది. రాష్ట్ర సాధారణ వర్షపాతం 380.9 మిల్లీమీటర్లు కాగా 384.0 మిల్లీమీటర్ల (ఒక శాతం ఎక్కువ) వర్షపాతం రికార్డయింది.

'కృష్ణా'కు కష్టకాలం

▶ మొదటి పేజీ తరువాయి

ఎగువ నుంచి 51.24 టీఎంసీలు వరద జలాలు వచ్చాయి. పులిచింతల ప్రాజెక్టుకు గతేడాది ఇదే రోజు నాటికి 21.30 టీఎంసీలు రాగా.. ఈ ఏడాది కేవలం 5.40 టీఎంసీలే చేరాయి. ఎగువ నుంచి వరద జలాలు రాకపోవడంతో.. కృష్ణా నదిలో నీటి లభ్యత ఎన్నడూ లేని రీతిలో కనిష్ఠ స్థాయికి పడిపోయింది. ఒక్క కృష్ణా డెల్టా మినహా కృష్ణా బేసిన్‌లో ఏ ఒక్క ప్రాజెక్టు పరిధిలోనూ ఆయకట్టుకు చుక్క నీరు విడుదల చేసిన దాఖలాల్లేవు. శ్రీశైలం, నాగార్జునసాగర్‌లలో నీటి నిల్వలు డెడ్ స్టోరేజీకి చేరుకోవడంతో కనీసం తాగునీటి అవసరాలకు కూడా వినియోగించుకోలేని దుస్థితి నెలకొంది. ఆంధ్రప్రదేశ్‌లో రాయలసీమ, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో, తెలంగాణలో నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లో తాగునీటి ఎద్దడి నెలకొంది. హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం మాత్రమే నాగార్జునసాగర్ నుంచి రోజుకు 766 క్యూసెక్కులు తరలిస్తున్నారు. సెప్టెంబర్‌లో నదీ పరివాహక ప్రాంతంలో భారీవర్షాలు కురిసి.. కృష్ణా నది ఉప్పొంగితేనే తెలుగు రాష్ట్రాల్లోని జలాశయాల్లోకి కొన్నైనా నీళ్లు చేరే అవకాశం ఉంటుంది. అక్టోబర్‌లో కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలో భారీ వర్షాలు కురిసే అవకాశాలు తక్కువ అని వాతావరణ శాస్త్రవేత్తలు అంచనావేస్తున్నారు. ఈ నేపథ్యంలో సెప్టెంబర్‌పైనే రైతులు ఆశలు పెట్టుకున్నారు.

మూసీ నీరు పులిచింతలలోకి..

హైదరాబాద్, నల్గొండ తదితర జిల్లాల్లో రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తుండటంతో మూసీ నది ఉప్పొంగుతోంది. శనివారం పులిచింతల జలాశయంలోకి 7912 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. ఈ ఏడాది పులిచింతలలోకి వచ్చిన గరిష్ట వరద ప్రవాహం ఇదే కావడం గమనార్హం.

కృష్ణా నదిపై ప్రధాన ప్రాజెక్టుల్లో నీటి నిల్వల పరిస్థితి ఇదీ

జలాశయం పేరు	పూర్తి నీటి నిల్వ (టీఎంసీల్లో)	ప్రస్తుత నీటి నిల్వ	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	గతేడాది ఇదే రోజు నాటికి నీటి నిల్వ(టీఎంసీల్లో)
ఆల్మట్టి	129.721	121.92	6871	1003	128.19
నారాయణపూర్	37.646	33.99	1145	3941	37.3
జూరాల	9.657	5.973	1446	2152	8.83
శ్రీశైలం	215.807	21.45	1525	30	150.47
నాగార్జునసాగర్	312.045	115.47	766	766	138.19
పులిచింతల	45.77	4.56	7912	0	7.15

అప్పుల బాధతో యువ రైతు ఆత్మహత్య



తిరుపతయ్య (ఫైల్)

కొనకనమిట్ల (మార్కాపురం): వర్షాభావం వల్ల పంట దిగుబడి రాక, పెట్టుబడి కోసం తెచ్చిన అప్పులు తీర్చలేక ఓ యువ రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం ప్రకాశం జిల్లాలో చోటుచేసుకుంది. మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపిన వివరాల మేరకు.. మండల కేంద్రం కొనకనమిట్లకు చెందిన అంగడి తిరుపతయ్య (33) తన మూడెకరాల పొలంలో వివిధ పంటలు సాగు చేస్తూ జీవనం సాగించేవాడు. ఈ ఏడాది బొబ్బర్లు, మినుము పంటలు సాగు చేయగా తీవ్ర వర్షాభావం కారణంగా దెబ్బతిన్నాయి. కనీసం పెట్టుబడి సొమ్ము కూడా చేతికి అందలేదు. వ్యవసాయంలో ఏటా నష్టాలు వస్తుండటంతో 40 గొర్రెలు కొనుగోలు చేసి వాటిని పోషించాడు. అందులో 20 గొర్రెలు ఇటీవల వ్యాధుల బారిన పడి మృతి చెందాయి. వ్యవసాయం, గొర్రెల కొనుగోలుకు రూ.4 లక్షలు అప్పు చేశాడు. మరో వైపు ఇతని తండ్రి రామయ్య వ్యవసాయం కోసం చేసిన బ్యాంకు అప్పు మాఫీ కాలేదు. దీంతో బయటి వ్యక్తుల వద్ద రూ.2 లక్షల అప్పు తెచ్చి రుణం చెల్లించాడు. అనారోగ్యంతో గత ఏడాది రామయ్య మృతి చెందడంతో ఈ అప్పు కూడా తిరుపతయ్య నెత్తినే పడింది. మొత్తం రూ.6 లక్షల వరకు అప్పు తేలడంతో.. ఎలా తీర్చాలని తిరుపతయ్య తరచూ బంధువులకు చెప్పి బాధపడేవాడు. ఈ క్రమంలో శనివారం భార్య సుశీల పొలం పనులకు వెళ్లగా, ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి నాలుగేళ్ల కుమారుడు ఉన్నాడు. కేసు దర్యాప్తులో ఉంది.

కాణిపాకంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం



స్వామి వారికి పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న మంత్రి మాణిక్యాలరావు

కాణిపాకం (ఐరాల): చిత్తూరు జిల్లా కాణిపాకంలో శనివారం వరసిద్ధి వినాయక స్వామి వారి బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం తరఫున దేవాదాయ శాఖ మంత్రి పైడికొండల మాణిక్యాలరావు శుక్రవారం సతీసమేతంగా స్వామి వారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. మంగళ వాయిద్య మేళతాళాల నడుమ ఈ వేడుక వైభవంగా జరిగింది.



గవర్నర్ నరసింహన్‌కు స్వాగతం పలుకుతున్న అర్చకులు

మంగళగిరి నృసింహుని సేవలో గవర్నర్

మంగళగిరి: గుంటూరు జిల్లా మంగళగిరిలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీలక్ష్మీ నృసింహస్వామి వారిని తెలుగు రాష్ట్రాల ఉమ్మడి గవర్నర్ నరసింహన్ శనివారం దర్శించుకున్నారు. ఎగువ, దిగువ సన్నిధులలో స్వామి వారిని దర్శించుకున్న గవర్నర్‌కు ఆలయ అధికారులు, పాలకవర్గ సభ్యులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద నార్త్ జోన్ డీఎస్పీ జి.రామాంజనేయులు, సీఐ బ్రహ్మయ్య, ఎస్ఐ వినోద్‌కుమార్ బందోబస్తును పర్యవేక్షించారు.

వైద్యం చేయించలేక
కన్న కూతురునే కడతేర్చింది

- అనారోగ్యంతో బాధపడుతున్న చిన్నారిని హత్యచేసిన తల్లి
- వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులో ఘటన



తల్లి చేతిలో హత్యకు గురైన పసికందు

ప్రొద్దుటూరు క్రైం : పేదరికం ఓ మాతృమూర్తి హృదయాన్ని బండరాయిగా మార్చింది. సొంత బిడ్డనే కడతేర్చింది. పుట్టుకతోనే కన్న బిడ్డ వ్యాధితో జన్మించడం, ఖరీదైన కార్పొరేట్ వైద్యం చేయించే స్థోమత లేక, ఆ తల్లి నవమాసాలు మోసిన తన ఐదు మాసాల బిడ్డను స్వహస్తాలతో చంపుకునేలా చేసిన ఘటన వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని అమృతానగర్‌కు చెందిన షేక్ గైబూసాహెబ్, ఫాతిమా దంపతులకు రిజ్వాన్ (5), రిహాన్ (4) అనే కుమారులతో పాటు రోకియా అనే ఐదు నెలల కుమార్తె ఉంది. గైబూసాహెబ్ పాత టైర్ల దుకాణంలో కూలి పనికి వెళ్లేవాడు. ఉదయం పనికి వెళ్తే తిరిగి రాత్రికి ఇంటికి వస్తాడు. కుమార్తె రోకియాను పుట్టుక నుంచి అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి. తలలో నీరు చేరడం వల్ల సాధారణ స్థాయి కంటే తల రెండింతలు పెరిగింది. దీంతో చిన్నారి అందవికారంగా కనిపిస్తోంది. కొన్ని రోజుల నుంచి కడప రిమ్స్, ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రిలో కుమార్తెను చూపిస్తున్నారు. తిరుపతి లేదా కర్నూలుకు వెళ్తే కొంత వరకు నయం అవుతుందని వైద్యులు చెప్పడంతో ఈ నెలాఖరులో డ్వాక్రా డబ్బులు రాగానే వెళ్దామని అనుకున్నారు. అయితే ఇంతలోనే ఇంట్లో ఉన్న నీటి తొట్టిలో చిన్నారిని ముంచి తల్లి హత్య చేసింది. శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఉన్న కుమార్తె కనిపించలేదని ఫాతిమా భర్తకు సమాచారం అందించింది. తన కుమార్తెను ఎవరో కిడ్నాప్ చేశారని చెప్పడంతో పోలీసులు అమృతానగర్‌కు చేరుకుని రాత్రంతా గాలించారు. అయితే అర్ధరాత్రి సమయంలో కుమార్తెను తానే హత్య చేశానని ఫాతిమా పోలీస్‌స్టేషన్‌లో అంగీకరించింది.

నేడు విజయవాడకు జస్టిస్ లావు నాగేశ్వరరావు

విజయవాడ లీగల్: సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.ప్రవీణ్‌కుమార్ ఆదివారం కృష్ణాజిల్లాలో పర్యటించనున్నారు. 'క్రిమినల్ లా అండ్ మ్యారేజెస్' చట్టాలపై విజయవాడలో ఆదివారం జరిగే సెమినార్‌లో వారు పాల్గొంటారు. నగరంలోని ఐవీ ప్యాలెస్‌లో ఆదివారం ఉదయం 9 గంటలకు భారత న్యాయవాదుల సంఘం (ఐఏఎల్) ఆధ్వర్యంలో ఈ సెమినార్ నిర్వహిస్తున్నట్లు సంస్థ రాష్ట్ర కార్యదర్శి, బీబీఏ మాజీ అధ్యక్షుడు చలసాని అజయ్‌కుమార్ తెలిపారు. భారత న్యాయవాదుల సంఘం అధ్యక్షులు ఆర్ఎస్ సీమా, నాయకులు జితేంద్ర శర్మ, సి.మురళీధరన్, రాష్ట్ర అధ్యక్షుడు ముప్పాళ్ల సుబ్బారావు తదితరులు పాల్గొంటారు.

పాదయాత్రకు అడ్డు తొలగేవరకు 'చలో కిర్లంపూడి'

విశ్రమించకుండా పోరాడాలని కాపులకు ముద్రగడ పిలుపు



ముద్రగడకు మద్దతు తెలుపుతున్న ఎమ్మెల్యేలు రాజన్నదొర, కంబాల జోగులు

జగ్గంపేట: పాదయాత్రకు అడ్డుతొలగే వరకు 'చలో కిర్లంపూడి' నిర్వహించాలని కాపు నాయకులు, కార్యకర్తలకు మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత ముద్రగడ ముద్రగడ పద్మనాభం పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ తూర్పు గోదావరి జిల్లా కిర్లంపూడిలోని తన నివాసం వద్ద శనివారం కూడా ఆయన ఆందోళన నిర్వహించారు. అనంతరం తనకు మద్దతు తెలిపేందుకు వచ్చిన వారినుద్దేశించి ముద్రగడ ప్రసంగించారు. ఎన్నికల హామీని అమలు చేయాలని కోరుతుంటే.. సీఎం చంద్రబాబు కాపులను అణచి వేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రిజర్వేషన్ల కోసం చేపట్టిన ఉద్యమం చివరి దశలో ఉన్నందున.. కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులస్తులు శ్రమ అయినా కూడా విశ్రమించకుండా పోరాడాలని కోరారు. కాపుల నిరసనలు ముఖ్యమంత్రి కుర్చీకి తుమ్మ కర్ర మంటలాగా తగలాలన్నారు. కాపులకు జరుగుతున్న అన్యాయాన్ని గ్రామగ్రామాలకూ వెళ్లి విస్తృతంగా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. కాగా, ముద్రగడ పద్మనాభానికి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు రాజన్నదొర, కంబాల జోగులు మద్దతు తెలిపారు. ముద్రగడ ఉద్యమం న్యాయమైనదని వారు చెప్పారు. ఎన్నికల హామీని నెరవేర్చాలని కోరడం తప్పు కాదని, చంద్రబాబు వెంటనే స్పందించాలని వారు డిమాండ్ చేశారు.

ప్రతి గ్రామం శక్తి పీఠంలా మారాలి

కమలానంద భారతి స్వామీజీ



మాట్లాడుతున్న స్వామీజీ

వెంకటగిరి రూరల్: హిందూ సమాజంలోని గ్రామాల్లో ఉండే ప్రతి ఆలయం ఒక శక్తి పీఠంలా మారాలని హిందూ దేవాలయ ప్రతిష్ఠాన పీఠం పీఠాధిపతి కమలానందభారతి స్వామీజీ పేర్కొన్నారు. హిందూ దేవాలయాల అభివృద్ధి ధ్యేయంగా సంపూర్ణ గ్రామ దేవాలయ సందర్శనా రథయాత్రలో భాగంగా శనివారం శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వెంకటగిరి మండలంలోని బుసపాళెం, వల్లివేడు, 9వ బెటాలియన్, యాతలూరు, కె.ఉప్పరపల్లి, చిన్నపరెడ్డిపల్లి, నీలకంఠాపురం, చిన్నన్నపేట గ్రామాల్లోని ఆలయాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ చిట్ట చివరి గ్రామాల్లోని ఆలయాలను అన్నిటినీ క్రియాశీలకం చేసేందుకు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఉన్న అన్ని స్వయంభు, చారిత్రాత్మక దేవాలయాల్లో నిరంతరం పూజలు చేయాలన్నారు.

మన నేతలు.. పంక్చర్ షాపులు

ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా

శివాజీనగర (బెంగళూరు): అనేకమంది భారత రాజకీయ నాయకులు పంక్చర్ షాపుల్లాంటివారని ఆప్ నేత, ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా వ్యంగ్య వ్యాఖ్యలు చేశారు. శనివారం బెంగళూరు గాంధీభవన్‌లో జరిగిన ఆమ్ ఆద్మీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. కొందరు పంక్చర్ షాపులవారు వారే రోడ్లపై మేకులు వేసి, వాహనాలను పంక్చర్ చేస్తారని, తరువాత మరమ్మతు చేసి ఉపకారం చేసినట్లు ప్రవర్తిస్తుంటారన్నారు. ప్రభుత్వం నుంచి సామాన్య ప్రజలకు అతి సులభంగా లభించాల్సిన సదుపాయాలను అడ్డుకుని, ఆ తరువాత తాము ఎంతో కష్టపడుతున్నట్లు చూపి పథకాలను మంజూరు చేస్తుంటారని విమర్శించారు. ప్రస్తుత పరిస్థితిలో తమ కష్టాలను ఎవరు అర్థం చేసుకుంటారో తెలుసుకొని ఓటు వేయాల్సిన అవసరం ఉందని సూచించారు. ఢిల్లీలో మొహల్లా సమావేశాన్ని జరిపి ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి రూ.20 లక్షల నిధులతో అభివృద్ధి చేయాలనుకుంటే, ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ అనుమతించలేదని ఆరోపించారు. స్వాతంత్ర్య సమరయోధుడు ప్రొ.హెచ్.ఎస్.దొరస్వామి మాట్లాడుతూ.. అసెంబ్లీ, పార్లమెంట్‌లలో సక్రమంగా చర్చలు జరుపుకుండానే చట్టాలను ఆమోదిస్తున్నారని విమర్శించారు.

అత్యాచారానికి గురైన ఐదేళ్ల బాలిక మృతి

బెంగళూరులో ఘోరం

బనశంకరి (బెంగళూరు): అభంశుభం తెలియని ఐదేళ్ల చిన్నారి ఒక మృగాడి కామదాహానికి బలైంది. ఇంటి యజమాని అత్యాచారానికి పాల్పడడంతో ఆ బాలిక 9 రోజులు మృత్యువుతో పోరాడుతూ ఓడిపోయింది. ఈ ఘటన బెంగళూరు తలఘట్టపుర పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. కొడగు జిల్లా మడికేరికి చెందిన ఒక మహిళ ఉపాధి కోసం ఐదేళ్ల కూతురితో కలిసి ఇక్కడి వచ్చి అద్దె ఇంట్లో ఉంటూ కూలీ పనులకు వెళ్లేది. తల్లి కూలీకి వెళ్లినప్పుడు బాలిక ఇంట్లో ఒంటరిగా ఉండేది. ఈ సమయంలో చందన అనే పక్కింటి మహిళ బాలికను తాను చూసుకుంటానని హామీనిచ్చింది. ఉదయం తల్లి కూలీ పనులకు వెళ్లగానే బాలికను చందన తన ఇంటికి తీసుకెళ్లేది. చందనకు ఆమె ఇంటి యజమాని మల్లికార్జునతో వివాహేతర సంబంధం ఉండేది. నిత్యం ఆమె ఇంటికి వచ్చి వెళ్లే అతడు చిన్నారిపై కన్నేసి, ఈ నెల 17న పాపపై అత్యాచారం చేశాడు. మరుసటిరోజు తీవ్ర అస్వస్థతకు గురైన బాలికను తల్లి ఏమైందని అడగ్గా, ఘోరం గురించి వివరించింది. తక్షణం తలఘట్టపుర పోలీస్‌స్టేషన్‌లో మల్లికార్జున, చందనలపై బాధితురాలి తల్లి ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి, తీవ్ర అస్వస్థతకు గురైన బాలికను సెయింట్‌జాన్స్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం ఉదయం బాలిక మృతిచెందింది.

పోస్ట్‌మార్టంలో విస్తుగొలిపే విషయాలు

కామాంధుని అఘాయిత్యానికి ప్రాణాలు కోల్పోయిన ఐదేళ్ల చిన్నారి పోస్ట్‌మార్టంలో విస్తుగొలిపే విషయాలు వెలుగుచూస్తున్నాయి. నిందతుడు మల్లికార్జున బాలిక సున్నిత ప్రాంతాల్లోకి ఇనుప రాడ్‌తో పాటు కొవ్వొత్తిని చొప్పించినట్లు గాయాలను బట్టి వైద్యులు అవగాహనకు వచ్చినట్లు తెలుస్తోంది. బాలికపై కాలుతున్న కొవ్వొత్తి మైనాన్ని వేసి హింసించారని తెలుస్తోంది. అప్పుడు బాలిక కేకలు వేయకుండా నోట్లో గుడ్డలు కుక్కినట్లు వైద్య నివేదికలో తేలింది.

చెన్నై పోర్టులో 40 టన్నుల ఎర్రచందనం స్వాధీనం

దుంగల విలువ రూ.16 కోట్లు

సాక్షి ప్రతినిధి, చెన్నై: చెన్నై పోర్టులో ఇంటెలిజెన్స్ అధికారులు రూ.16 కోట్ల విలువైన ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు గురు, శుక్రవారాల్లో చెన్నైలోని పోర్టులో కంటైనర్లను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో మలేసియాకు తరలించేందుకు సిద్ధం చేసిన 4 కంటైనర్లలో 40 టన్నుల ఎర్రచందనం బయటపడింది. ఆ దుంగలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.16 కోట్లు ఉంటుందని అంచనా వేశారు. గత మూడేళ్లలో రూ.71 కోట్ల విలువైన 176 టన్నుల ఎర్రచందనం దుంగలను పోర్టులో అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
ఆదివారం । ఆగస్టు । 27 । 2017
www.sakshi.com

దేవుడా... దెయ్యమా?!

త్రికాలమ్



కె. రామచంద్రమూర్తి

గోప్యతను ప్రాథమిక హక్కుగానూ, రాజ్యాంగంలోని 21వ అధికరణలో అంతర్భాగంగానూ నిర్ధారిస్తూ తొమ్మిదిమంది న్యాయమూర్తుల సుప్రీంకోర్టు ధర్మాసనం గురువారం ఏకగ్రీవంగా అద్భుతమైన తీర్పు ఇచ్చే క్రమంలో వర్తమాన రాజకీయ, సామాజిక వ్యవస్థకు వర్తించే ఒకానొక ముఖ్యమైన అంశం మెరుపులా మెరిసింది. న్యాయమూర్తులలో ఒకరైన జస్టిస్ ధనంజయ్ యశ్వంత్ చంద్రచూడ్ అమెరికా చరిత్ర నుంచి ఒక ఉదంతం ఉటంకించారు. అమెరికా సంయుక్త రాష్ట్రాల వ్యవస్థాపకులలో ఒకరైన బెంజమిన్ ఫ్రాంక్లిన్‌ను ఒక మహిళ వీధిలో పట్టుకొని 'మాకు ఎటువంటి ప్రభుత్వం ఇచ్చావయ్యా?' అని ప్రశ్నించిందట. దానికి ఆయన 'ఒక గణతంత్ర ప్రభుత్వాన్ని ఇచ్చాం. మీరు నిలబెట్టుకుంటే అది ఉంటుంది (A Republic, if you can keep it),' అని సమాధానం చెప్పారట. అమెరికా పౌరులు అనేక త్యాగాలు చేసి వారి రిపబ్లిక్‌ను కాపాడుకున్నారు. అరవై అయిదు సంవత్సరాల క్రితం రాజ్యాంగ నిర్మాతలు ఇండియాకు రిపబ్లిక్ వ్యవస్థను ప్రసాదించారు. రిపబ్లిక్‌ను మనం రక్షించుకోగలమా? అత్యున్నత న్యాయస్థానం వెలువరించిన చారిత్రక తీర్పును ఆలకించినప్పుడు భారత రిపబ్లిక్‌కు ఢోకా లేదనిపిస్తుంది. మర్నాడు పంచకూలాలో సీబీఐ కోర్టు న్యాయమూర్తి జగదీప్‌సింగ్ సాహసోపేతంగా తీర్పు ఇచ్చిన తర్వాత హరియాణా, పంజాబ్, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, రాజస్థాన్, జార్ఖండ్ రాష్ట్రాలలో జరిగిన ప్రాణ నష్టం, ఆస్తినష్టం గమనించినప్పుడు గణతంత్ర భారతం మనుగడపైన భయసందేహాలు కలుగుతాయి. అంబేడ్కర్ నేతృత్వంలో రాజ్యాంగ నిర్మాతలు ఎంతో దూరదృష్టితో, వివేకంతో రూపొందించి ప్రసాదించిన రాజ్యాంగ విలువలను పరిరక్షించుకోవడం జాతి ప్రాథమిక కర్తవ్యం. అందరికీ సమన్యాయం జరగాలంటే, అర్భకులకూ, అధికారం లేనివారికీ అందరితోపాటు సమాన హక్కులు ఉండాలంటే రిపబ్లిక్ వ్యవస్థను పరిరక్షించుకోవడం అత్యవసరం.

అరాచకం, అల్లకల్లోలం

ప్రధాని నరేంద్ర మోదీ అధికారంలోకి రాకముందు ఎన్నికల ప్రచారంలోనూ, అధికారంలోకి వచ్చిన కొత్తల్లోనూ పరిమితమైన ప్రభుత్వం, అపరిమితమైన పరిపాలన (limited government, unlimited governance) సమకూర్చుతామని హామీ ఇచ్చారు. కేంద్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వంపైన ఇంతవరకూ అవినీతి ఆరోపణలు రాకపోవడాన్ని అభినందించవచ్చు. ప్రభుత్వ యంత్రాంగం పని తీరు మెరుగైందని కానీ రాష్ట్రాలలో పరిపాలన సజావుగా సాగుతున్నదని కానీ సాధికారికంగా చెప్పడం కష్టం. ముఖ్యంగా హరియాణాలో బీజేపీ ప్రభుత్వ నిర్వాకం చూసిన తర్వాత అక్కడ పరిపాలన ఎంత లోపభూయిష్టంగా ఉన్నదో లోకానికి తెలిసిన అనంతరం రాష్ట్రాలలో పరిపాలన మెరుగైనదని బీజేపీ నేతలు సైతం ధైర్యంగా చెప్పజాలరు. డేరా సచ్చా సౌదా అధినేత గుర్మీత్ రాంరహీమ్ సింగ్ మహిళపైన అత్యాచారం చేసినట్టు సీబీఐ కోర్టు ధ్రువీకరించిన అనంతరం జరిగిన హింసాకాండలో ఒక్క సిర్సాలోని పంచకూలాలోనే 28 మంది (ఎక్కువ మంది డేరా విధేయులే) మరణించడం హరియాణా ప్రభుత్వం అసమర్థతకు నిదర్శనం. మొత్తం మీద 32 మంది మరణించారు. 250 మందికిపైగా గాయపడినారు. 1984లో ఇందిరాగాంధి హత్యానంతరం ఉత్తర భారతంలో కనబడిన భయానక వాతావరణమే శుక్రవారం సాయంత్రం అగుపించింది. న్యాయ వ్యవస్థ, మీడియా, ఇంటెలిజెన్స్ వర్గాలు చేసిన స్పష్టమైన హెచ్చరికలను హరియాణా ముఖ్యమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ పెడచెవిన పెట్టారు.

ఖట్టర్ అసమర్థత

డేరా ఆశ్రమంలో 1.5 లక్షల మంది చేరడాన్ని అనుమతించారు. 144వ సెక్షన్ కింద అయిదుగురు కంటే ఎక్కువ మంది గుమికూడరాదంటూ నిషేధాజ్ఞలు పంచకూలాలో కూడా విధించినప్పటికీ ఆశ్రమానికి ఈ ఉత్తర్వులు వర్తించవంటూ రాష్ట్ర విద్యామంత్రి రాంవిలాస్‌శర్మ ప్రకటించారు. శర్మ రాంరహీమ్ భక్తుడు. ఖట్టర్, ఆయన సహచరులు కూడా అంతే. ఎన్నికలు పూర్తయిన తర్వాత మొత్తం 47 మంది బీజేపీ శాసనసభ్యులలో 19 మంది డేరా బాబా దగ్గరకు వెళ్ళి కృతజ్ఞత ప్రకటించుకొని వచ్చారు. 2002 సెప్టెంబర్ 25న నాటి ప్రధాని వాజపేయికి ఒక అజ్ఞాత మహిళ రాసిన ఉత్తరంలో గుర్మీత్ రాజకీయ నేతలకు ఎంత సన్నిహితంగా ఉన్నాడో, అతనికి అధికారమదం ఎంతగా తలకెక్కిందో వివరించింది. తనపైన అత్యాచారం చేశాడనీ, ఆ విషయం బయటికి పొక్కితే చంపివేయగలననీ, తాను ఏమి చేసినా చట్టానికి చిక్కబోననీ, ముఖ్యమంత్రులూ, మంత్రులూ తనకు పరమ విధేయులనీ గుర్మీత్ చెప్పుకున్నట్టు ఆ మహిళ వివరించింది. తన అనుచరులలోని ఇద్దరు మహిళలపై అత్యాచారం చేసినట్టు సీబీఐ కోర్టు తేల్చింది. హరియాణా కోర్టు సూమోటోగా ఈ కేసును స్వీకరించి సీబీఐ దర్యాప్తునకు ఆదేశించింది. 2007లో సీబీఐ చార్జిషీటు దాఖలు చేసింది. సిర్సా ఆశ్రమంలో 15 మంది సాధ్వీలను విచారిస్తే ఇద్దరు తమపైన బాబా అత్యాచారం చేశాడని ఆరోపించారు. అత్యాచారం వివరాలను బయటపెట్టిన జర్నలిస్టును హత్య చేయించాడనే అభియోగం కూడా బాబాపైన ఉన్నది. ఆరు ఉత్తరాది రాష్ట్రాలలో విస్తృతంగానూ, ఇతర రాష్ట్రాలలో పలచగానూ బాబా భక్తులున్నారు. ప్రపంచం మొత్తం మీద ఆరుకోట్ల మంది భక్తులు కానీ అభిమానులు కానీ బాబాకు ఉన్నట్టు అంచనా. అందుకే మొదట కాంగ్రెస్, తర్వాత బీజేపీ, అకాలీదళ్ బాబా అనుగ్రహం కోసం అంగలార్చాయి. గాలి ఉన్న ఎన్నికలలో బాబా ఫలితాలను ప్రభావితం చేయలేడు. ఆయన మద్దతు ఇచ్చే పార్టీకి అనుకూలంగా గాలి ఉంటే దాని జోరు పెంచగలడు. ఉదాహరణకు పంజాబ్‌లో 2007లోనూ, 2012లోనూ డేరాబాబా కాంగ్రెస్‌కి మద్దతు ప్రకటించారు. 2007లో కాంగ్రెస్ గెలిచింది కానీ 2012లో ఓడిపోయింది. 2014లో దేశమంతటా బీజేపీకి అండగా నిలిచాడు. కానీ పంజాబ్‌లో కాంగ్రెస్ విజయం సాధించింది. హరియాణాలో బీజేపీ గెలుపొందింది. బాబాను ప్రసన్నం చేసుకుంటే ఖాయంగా గెలుస్తామన్న నమ్మకం లేకపోయినా పది ఓట్లకోసం కక్కుర్తిపడి విలువలతో రాజీపడే రాజకీయ నాయకులు బాబా సేవ చేస్తూనే ఉన్నారు. ఇటీవల బాబాపై నిర్మించిన చిత్రం (ఎంఎస్‌జీ–2)కు హరియాణా ప్రభుత్వం వినోదం పన్ను మినహాయించింది. వందల కోట్ల విలువ చేసే ఆస్తులున్న డేరా సచ్చా సౌదాను ఒక ప్రభుత్వేతర సంస్థ (ఎన్‌జీవో)గా రిజిస్టర్ చేశారు. 2016లో జాట్ల ఆందోళన సమయంలో ఘోరంగా విఫలమైన తర్వాత అయినా ఖట్టర్ ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవలసింది.

హైకోర్టు అభిశంసన

కేంద్ర ప్రభుత్వం ఉపేక్షించినా పంజాబ్–హరియాణా హైకోర్టు మాత్రం రాష్ట్ర ప్రభుత్వానికి గట్టిగా మొట్టికాయలు వేసింది. 'బాబాకు రాజకీయంగా లొంగిపోయింది' అంటూ అభిశంసించింది. కేంద్ర ప్రభుత్వం తరపు న్యాయవాది 'ఇది రాష్ట్రానికి సంబంధించిన విషయం' అంటే 'హరియాణా భారతదేశంలో లేదా? ప్రధాని కేవలం బీజేపీ ప్రధాని కాదు. దేశానికి ప్రధాని' అంటూ ఘాటుగా వ్యాఖ్యానించింది.

సిక్కు మతం ఆవిర్భవించింది ఐదువందల సంవత్సరాల క్రితమే. ఇది ఇంకా పరిణామ క్రమంలో ఉన్నది. అనేక ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నది. తెల్ల తలపాగా ధరించే నిరంకారీలు కొంతకాలం రాజకీయాలనూ, సమాజాన్నీ ప్రభావితం చేశారు. నిరంకారీలు జరిపిన కాల్పులలో 16 మంది అనుచరులు మరణించడంతో భింద్రన్‌వాలేకు పలుకుబడి పెరిగింది. నిరంకారీ అధినేత గురుబచన్‌సింగ్‌ను భింద్రన్‌వాలే అనుచరులు హత్య చేశారు. జైల్‌సింగ్ సృష్టించిన భస్మాసురుడు భింద్రన్‌వాలే ఊహకు మించిన సంక్షోభం సృష్టించాడు. అకల్‌తఖ్త్‌పైకి సైన్యాన్ని పంపించి అతన్నీ, అతని అనుచరులనూ చంపే వరకూ పరిస్థితులు విషమించాయి. ఇందుకు ఇందిరాగాంధీ తన ప్రాణాలతో మూల్యం చెల్లించుకోవలసి వచ్చింది. భనియారా బాబా, ఫ్రీజర్ (అశుతోశ్) బాబా, అసీరాం బాబా వగైరాలు పంజాబ్, హరియాణా రాష్ట్రాలలో పుట్టుకు రావడానికి సామాజిక, మతపరమైన కారణాలు ఉన్నాయి. తమ బాబా మరణించడనే విశ్వాసంతో 2014లో మరణించిన అశుతోశ్‌ను ఫ్రిజరేటర్‌లో పెట్టి అంత్యక్రియలు జరిపించకుండా ఆయన శిష్యులు శవాన్ని ఉంచారు.

బాబా భక్తుల నేపథ్యం ఏమిటి?

సంక్షేమ కార్యక్రమాల అమలులో, ఆర్థిక, సాంఘిక అసమానతలను తగ్గించడంలో ప్రభుత్వాలు ఘోరంగా విఫలమౌతున్నాయి. బాధితులు తమ బాధలూ,



డేరా సచ్చా సౌదా అధినేత గుర్మీత్ రాంరహీమ్ సింగ్ : ఒక వికృత విన్యాసం

కష్టాలూ విస్మరించేందుకు నవలోకాన్ని కలగంటున్నారు. ఏదో ఒక అద్భుతం తమ బాబా అలౌకిక శక్తుల ద్వారా జరుగుతుందనీ, తాము కోరుకుంటున్న సంపద అంతా తమ ఒడిలో పడుతుందనీ భ్రమిస్తారు. కొత్త క్రీస్తు పుట్టుకొస్తాడనీ, పునరుత్థాన సమయంలో ఆకాశం విచ్చుకొని ఫ్రిజిరేటర్లూ, ఎలక్ట్రానిక్ సామాగ్రి అన్నీ భూమిపైన పడతాయనీ మతం, మూఢభక్తి కలబోసిన ఉన్మత్తతకు లోనైన భక్తులు భావిస్తారన్నది పీటర్ మారిస్ వార్స్లీ అనే ప్రఖ్యాత బ్రిటిష్ సామాజిక శాస్త్రవేత్త ప్రవచించిన సిద్ధాంతం. గుర్మీత్ రాంరహీమ్‌సింగ్ సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకొని భక్తులను ఆకట్టుకున్నాడు. బాబా చేసే సాహస కృత్యాలూ, అద్భుతాలూ అన్నీ ఆయన నిర్మించే సినిమాలలో పంచరంగులలో కనిపిస్తాయి. సైంటిఫిక్ ఫిక్షన్‌ను మించిన అభూతకల్పనలు (ఫాంటసీ) వారి చిత్రాలలో ఉంటాయి. భారీస్థాయిలో రక్తదాన శిబిరాలను నిర్వహించి గిన్నిస్ బుక్‌లోకి ఎక్కాడు. సెక్స్‌వర్కర్లకి సామూహిక వివాహాలు చేసి వారికి సమాజంలో గౌరవ స్థానం ప్రసాదించాడు. ఒక్కొక్క జంటకు రూ 1.5 లక్షలు సహాయంగా అందిస్తాడు. వితంతువుల వివాహం జరిపిస్తాడు. హిజ్రాలకు న్యాయపరమైన హోదా కల్పించాలని కోరుతూ డేరా సచ్చా సౌదా 2014లో సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ సంస్థ సంస్కరణలు తెస్తోంది. సత్యసాయి సేవా ట్రస్టు మాదిరే ఆస్పత్రులు నిర్వహిస్తోంది. డేరా సచ్చా సౌదా ఆశ్రమాలలో ఒకరకమైన సమాంతర ప్రభుత్వం నడుస్తున్నది. విరాళాలు వసూలు చేసి పేదవారి కోసం ఖర్చు చేస్తున్నారు. బాబా భక్తులలో అత్యధికులు ఓబీసీలూ, సిక్కు దళితులూ. సత్యసాయిబాబా, సద్గురులూ, స్వామినారాయణ వంటి పీఠాధిపతులూ, మఠాధిపతులూ సంపన్నులనూ, మధ్యతరగతి ప్రజలనూ ఆకర్షించారు. ఈ తరహా భక్తులకు ప్రభుత్వంలో పలుకుబడి ఉంటుంది. పరిపాలనలో భాగస్వామ్యం ఉంటుంది. డేరాబాబా భక్తులు అందరూ నిమ్నకులాలకీ, దిగువవర్గాలకీ చెందినవారు. వీరికి తమ బాబాపైన ఎటువంటి భక్తివిశ్వాసాలు ఉంటాయంటే వారు పోలీసులనీ, చట్టాలనీ లెక్కచేయరు. బాబా ఆదేశిస్తే ఏదైనా చేస్తారు. వారికి ఆశ్రమమే సర్వస్వం. బాబానే కొత్త దేవుడు. ఈ దేవుడికి మానవులకు ఉండే బలహీనతలు ఉంటాయంటే వారు నమ్మరు. అందుకే అత్యాచారం కేసులో సీబీఐ కోర్టు తీర్పును ఆమోదించరు.

ఈ ఉదంతంలో హరియాణా ప్రభుత్వ వైఫల్యాన్ని గుర్తించి తగిన చర్య తీసుకోవడంతో పాటు రాష్ట్రంలో పరిపాలన ఎంత అస్తవ్యస్తంగా ఉన్నదో ప్రధాని గుర్తించాలి. మొన్న స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో సుపరిపాలన గురించి చేసిన ప్రస్తావనను మనసుకు పట్టించుకొని పేద, బడుగు వర్గాలకు సంక్షేమ పథకాలు అందే విధంగా గట్టి చర్యలు తీసుకోవాలి. రాజ్యాంగ నిర్మాతలు ఆశించిన శాస్త్రీయ దృక్పథాన్ని ప్రజాబాహుళ్యంలో వ్యాప్తి చేయడానికి ప్రభుత్వం అహరహం శ్రమించాలి. మూఢ నమ్మకాలనూ, మూఢాచారాలనూ ప్రజల జీవితాల నుంచి పారదోలడానికి చిత్తశుద్ధితో కృషి చేయాలి. ◆

లాలూ ప్రసాద్ (ఆర్జేడీ) రాయని డైరీ 4

మాధవ్ శింగరాజు

కాలం కలిసి రాకపోతే స్నేహితులు చెయ్యిస్తారు. శత్రువులు సలహాలు ఇస్తారు. సుశీల్‌కుమార్ మూడు రోజులుగా ఇంటి చుట్టూ తిరుగుతున్నాడు. 'లాలూజీ, ఈ వరదల్లో ర్యాలీ ఎందుకు? పోస్ట్‌పోన్ చేసుకోండి' అని సలహా ఇచ్చి వెళుతున్నాడు.

వస్తాడు. సలహా ఇస్తాడు. వెళతాడు. టీ తాగి వెళ్లమంటే తాగడు. 'బాగుండదు లాలూజీ' అంటాడు! 'ఏం బాగుండదు సుశీల్‌జీ' అని అడిగితే.. 'వరదల్లో ర్యాలీ బాగుండదు' అంటాడు తప్ప, 'మీ ఇంట్లో టీ తాగానని నితీశ్ కుమార్‌కు తెలిస్తే బాగుండదు' అని మాత్రం అనడు.

"డిప్యూటీ సీఎంగా తాగకండి సుశీల్‌జీ. పాట్నా యూనివర్సిటీలో మనకు ఓల్డ్ ఫ్రెండ్‌షిప్ ఉంది కదా. అప్పటి ఫ్రెండ్‌షిప్ అనుకుని తాగండి" అన్నాను.. మొన్న మళ్లీ ఇంటి బయట తచ్చాడుతున్నప్పుడు.

సుశీల్ ఇబ్బంది పడ్డాడు.

'మన మధ్య ఓల్డ్ ఫ్రెండ్‌షిప్ మాత్రమే కాదు లాలూజీ, ఓల్డ్ రైవల్రీ కూడా ఉంది" అన్నాడు. నాపై దాణా కేసు వేసి, నన్ను జైలుకు పంపింది అతడే!

పెద్దగా నవ్వి, 'తాగండి సుశీల్‌జీ' అని, గోడ ఇవతలి నుంచి టీ కప్పు అందించాను.



అందుకున్న కప్పుని వెంటనే పిట్టగోడ మీద పెట్టి, 'బాగుండదు లాలూజీ' అన్నాడు సుశీల్.

"ఏం బాగుండదు సుశీల్‌జీ" అని అడిగాను.

"వరదల్లో ర్యాలీ బాగుండదు లాలూజీ" అన్నాడు.

"ఎందుకు బాగుండదు సుశీల్‌జీ" అని అడిగాను.

"ప్రధాని ఏరియల్ సర్వేకి వస్తున్నప్పుడు, ప్రధానికి వ్యతిరేకంగా మీరు నడుపుతున్న ర్యాలీ బాగుండదు లాలూజీ" అన్నాడు.

"సుశీల్‌జీ.. బిహార్‌కు మోదీ కొత్త కానీ, వరదలు కొత్త కాదు. పదిహేనులో వరదలు వచ్చాయి. మోదీ రాలేదు. పదహారులో వరదలు వచ్చాయి. మోదీ రాలేదు. అప్పుడు రాని మోదీ, ఇప్పుడొస్తున్నారు! మేం ర్యాలీ పెట్టుకున్నాం కదా.. దానికి ఒక రోజు ముందు వస్తున్నారు.. డైవర్ట్ చెయ్యడానికి" అన్నాను.

సుశీల్ వెళ్లిపోయాడు. మళ్లీ రాలేదు.

శనివారం ఏరియల్ సర్వేకి మోదీ వచ్చాడు, వెళ్లాడు. ర్యాలీకి వస్తానన్నవాళ్లే ఇంకా రాలేదు!

సోనియాజీకి ఒంట్లో బాగోలేదు. రాహుల్ బాబు ఇంట్లో లేడు. మాయావతి రానన్నారు! ములాయం హ్యాండిచ్చారు. సి.సి.ఎం. నోరెత్తడం లేదు. ఫరూక్ ఫోన్ తియ్యడం లేదు. శరద్ యాదవ్ సైలెంట్ అయిపోయాడు. వీళ్లెవరూ లేకుండా పట్నా గాంధీ మైదాన్‌లో 'బీజేపీ భగావో, దేశ్ బచావో' అని నేను, నా ఇద్దరు కొడుకులు మైకు పట్టుకుని ఎంత అరిస్తే మాత్రం.. దేశ ప్రజలకు వినిపిస్తుందా?!

బలం చూపిద్దాం అనుకుంటే బలహీనతలు బయటపడేలా ఉన్నాయి!

ఆకాశవాణి తెలుగు పలికిన వేళ..!

ఒక్క తెలుగు ప్రాంతమే కాదు, దేశం యావత్తూ సమాజానికి దోహదపడే ఆలోచనలతో ప్రాణాలకు తెగించి పోరాడాలని సిద్ధమవుతున్న రోజులవి. స్వార్థం చంపుకోవాలనే త్యాగకాంక్ష బలపడుతుండగా మద్యపాన నిషేధం, అక్షరాస్యత, మూఢ నమ్మకాల నిర్మూలన, గ్రంథాలయోద్యమం, కుటీర పరిశ్రమలు, ఖాదీ, స్త్రీ జనోద్ధరణ వంటివి జన బాహుళ్యంలోకి వెళుతున్నాయి. ఈ ఉద్యమాలు విడివిడిగా, కలివిడిగా ఆవేశాన్నీ, ఆక్రోశాన్నీ పంచుతున్నాయి, పెంచుతున్నాయి. 1938 జూన్ 16న మద్రాసులో తెలుగు ప్రసారాలు మొదలైన సందర్భపు నేపథ్యం ఇది.

1914లో మొదలైన మొదటి ప్రపంచ యుద్ధం ఫలితంగా జర్నలిజం విశ్వవ్యాప్తం కావడం మొదలైంది. 1914లోనే ఆంధ్రపత్రిక బొంబాయి నుంచి మద్రాసు తరలివచ్చి వారపత్రిక దిన పత్రికగా మారింది. ఎం.ఏ. చదివిన రెండవ తెలుగు వ్యక్తి, అనేక ఉద్యమాల భాగస్వామి, రచయిత గాడిచర్ల హరిసర్వోత్తమరావు ఆంధ్ర పత్రిక తొలి సంపాదకులు. కట్టమంచి రామలింగారెడ్డి తొలి ఆధునిక సాహిత్య విమర్శ 'కవిత్వతత్త్వ విచారం' వెలువడింది 1914 లోనే. కృష్ణా పత్రిక, శ్రీ సాధన వంటి ప్రధాన పత్రికలతోపాటు ఎన్నో ఇతర పత్రికలూ; 1924లో మొదలైన భారతి వెలుగులు చిమ్మడం ప్రత్యేకత. తెలుగు వచనాన్ని శక్తిమంతంగా రాసిన శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి కథల సంపుటం 1915లో వెలువడింది. వేమనను యోగవాదిగా, ప్రయోజనశీలిగా పరిచయం చేస్తూ రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మ చేసిన ప్రసంగాలు అప్పట్లో సంచలనం రేపుతున్నాయి. సమాజంపై రచనల ద్వారా ఈటెలు విసిరిన చలం 'మాలపిల్ల' సినిమా రచనలో భాగస్వామి అయిన సందర్భం కూడా ఇదే. గిడుగు రామమూర్తి వ్యవహారిక తెలుగు ఉద్యమం ఫలితంగా, పరివర్తన చెందిన తాపీ ధర్మారావు కొత్తపాళీతో వ్యవహారిక భాషకు పత్రికల ద్వారా, సినిమా ద్వారా కాగడా పట్టారు. సుబ్రహ్మణ్య శాస్త్రి ప్రచురించిన గిడుగు రామమూర్తి వ్యాసం కారణంగా గూడవల్లి రామబ్రహ్మం ప్రజామిత్ర మాసపత్రిక వాడుక భాషలోకి 1934లో మారింది. 1938లో మొదలైన 'ఆంధ్రప్రభ'కు తొలుత ఖాసా సుబ్బారావు సంపాదకుడైనా, వ్యవహారిక భాషలో చక్కని కాలమ్ రాసిన న్యాపతి నారాయణమూర్తి కొద్దికాలంలోనే బాధ్యతలు తీసుకున్నారు. కనుక వస్తుపరంగానే కాదు వ్యక్తీకరణ పరంగా కూడా చాలా అర్థవంతమైన నేపథ్యం ఉన్న సమయంలో ఆకాశవాణి తెలుగు పలికింది. తెలుగు పత్రికలు, తెలుగు సినిమా, తర్వాతి కాలంలో తెలుగు టెలివిజన్ కూడా మొదలైన మద్రాసులోనే తెలుగు ఆకాశవాణి మొదలు కావడం ఔచిత్యమే.

మద్రాసు రేడియో క్లబ్ 1924లో ప్రసారాలు ప్రారంభించింది. అయితే మూడేళ్లకు మించి సాగలేదు. మళ్లీ 1930లో మద్రాసు పురపాలక సంస్థ రేడియో ప్రసారాలు ప్రారంభించినా



జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత రావూరి భరద్వాజతో రచయిత

పరిమితంగానే ఉండేవి. 1933లో తపాలా శాఖ ఉద్యోగి మహబూబ్ అలీ హైదరాబాద్‌లో చిన్న రేడియో కేంద్రం మొదలుపెట్టాడు. దీన్ని 1935లో నిజాం వశం చేసుకున్నాడు. నాలుగు భాషలలో సాగిన నిజాం రేడియోలో రాయప్రోలు రాజశేఖర్, భాస్కరభట్ల కృష్ణారావు, దుర్గాచలం, కురుగంటి సీతారామయ్య, మహారథి వంటి వారు పని చేశారు. నిజాం రేడియో 1950 ఏప్రిల్ 1న ఆకాశవాణి హైదరాబాద్‌గా మారింది. 1935 సెప్టెంబరులో మైసూరులోనూ, 1937 సెప్టెంబరులో తిరువాన్కూరు సంస్థానంలోనూ రేడియో కేంద్రాలు వచ్చాయి. అంటే మద్రాసు ఆకాశవాణి నాలుగు భాషలతో ప్రసారాలు ప్రారంభించే సమయానికి హైదరాబాద్, మైసూరు, తిరువాన్కూరు సంస్థానాలలో మాత్రమే రేడియో కేంద్రాలున్నాయి.

దేశంలో తొలిసారిగా 1921లో బొంబాయిలో స్వల్ప స్థాయిలో రేడియో ప్రసారాలు మొదలై 1927 జూలై 23కు ఒక గాడిన పడ్డాయి. కలకత్తా, మద్రాసు, హైదరాబాద్, బరోడా, మైసూరు వంటి చోట్ల వ్యాప్తి చెందాయి. 1936లో ఆలిండియా రేడియోగా నామకరణం జరిగింది. అదే సంవత్సరంలో రేడియో పత్రిక కూడా ఒక స్థిర రూపానికి వచ్చింది. ఈ పరిపక్వత మద్రాసు తెలుగు ఆకాశవాణి ప్రసారాలలో ద్యోతకమైంది. సాహితీవేత్త అచంట జానకీరామ్, న్యూక్లియర్ ఫిజిక్స్‌లో ఎంఎస్సీ చేసిన అయ్యగారి వీరభద్రరావు వంటి వారు తొలి ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్స్. మల్లంపల్లి సోమశేఖర శర్మ తమ్ముడు ఉమామహేశ్వరరావు తొలి తెలుగు అనౌన్సర్ కాగా, గాయని విశ్వేశ్వరమ్మ చెల్లెలు భానుమతి మలి తెలుగు అనౌన్సర్. చక్రవర్తుల రాజగోపాలాచారి ప్రారంభ ప్రసంగం చేయగా; గాత్ర కచేరి తర్వాత సర్ కూర్మా వెంకటరెడ్డి నాయుడు రేడియో గురించి మాట్లాడారు. గిడుగు రామమూర్తి, కోలవెన్ను రామకోటేశ్వరరావు, మల్లంపల్లి సోమశేఖర శర్మ, అడవి బాపిరాజు వంటి వారు తొలి ప్రసంగాలు చేసినవారు. ముద్దుకృష్ణ రచించిన 'అనార్కలి' తొలి రేడియో నాటకం. సాహిత్య కార్యక్రమాలే కాక విద్యార్థులకు, గ్రామస్తులకు, వ్యవసాయదారులకు, సంగీతాభిలాషులకు తగిన రీతిలో తొలి దశలోనే ప్రయత్నాలు జరగడం విశేషం. తెలుగు ప్రసారాల నేపథ్యం ఎంత ఉజ్వలంగా ఉందో, తర్వాత గమనం కూడా అంతే గొప్పగా కనబడుతుంది.

(భాషా సాహిత్యాలకు ఆకాశవాణి చేసిన సేవ గురించి సాహిత్య అకాడమీ ఆగస్టు 28, 29 తేదీలలో హైదరాబాద్‌లో సదస్సు నిర్వహిస్తున్న సందర్భంగా)

డాక్టర్ నాగసూరి వేణుగోపాల్, సంచాలకులు, ఆకాశవాణి, తిరుపతి । మొబైల్ : 94407 32392

ప్రభుత్వ చట్టవిరుద్ధ నిఘా పీడ ఆగేనా?

మిగతా ప్రజాస్వామ్యాల్లో వలే అధికారిక నిఘాలకు సంబంధించి మనకు రక్షణలు, అవరోధాలు లేవు. నేరపూరితమైన ప్రభుత్వ నిఘాకు స్వచ్ఛందంగా మనం మన వివరాలు ఎందుకు ఇవ్వాలి? తప్పనిసరి ఆధార్ నమోదు, మన జీవితంలోని అన్ని రంగాలనూ మన బయోమెట్రిక్ గుర్తింపులతో తప్పక అనుసంధానించాల్సి రావడం ఆగిపోవాలి. సుప్రీంకోర్టు తీర్పు మనకు ఆ ఆశను కలిగించింది.



ఆకార్ పటేల్

అవలోకనం

పదిహేనేళ్ల క్రితం నేను సంపాదకీయం వహిస్తున్న ఒక వార్తాపత్రిక సల్మాన్‌ఖాన్, ఐశ్వర్యారాయ్‌ల మధ్య జరిగిన సంభాషణ రాత ప్రతిని ప్రచురించింది. ఆ కథనాన్ని జే డే అనే విలేకరి ముంబై పోలీసుల నుంచి సంపాదించారు. ఆ సంభాషణలో ప్రీతీ జింటాపై సల్మాన్ చేసిన అసభ్యకరమైన వ్యాఖ్య ఉంది. ఆగ్రహించిన ప్రీతీ నాపై పరువు నష్టం దావా వేశారు. ఆ కేసు కొన్నేళ్లపాటు, చివరకు ఆమె దాన్ని వెనక్కు తీసుకునే వరకు నడిచింది. పోలీసులు, ఆ ఫోన్ ట్యాపింగ్ చేసినది తాము కాదనడం ఆసక్తికరం. ఆ గొంతులు ఆ ఇద్దరు నటులవేనని స్పష్టంగా తెలుస్తూనే ఉంది. కాబట్టి అది నిజమైనదే. మరి ఆ ఫోన్ ట్యాపింగ్ చేసినది ఎవరు?

అది మనకు ఇప్పటికీ తెలియదు. ఇలాంటి ఘటనలు చాలానే ఉన్నాయి. టాటాలు, అస్సాం వేర్పాటువాదులకు బలవంతపు వసూళ్లను చెల్లించినట్టు చెప్పిన 20 ఏళ్ల క్రితం నాటి ***టాటా టేపులు*** అలాంటివే. నస్లీ వాడియా, కేశబ్ మహేంద్ర, జనరల్ శామ్ మానెక్‌షా, రతన్ టాటాల మధ్య సాగిన ఆ ప్రైవేటు సంభాషణలను రికార్డు చేసి లీకు చేశారు. ఆ పని చేసింది ఎవరు? మనకు తెలియదు. భారత పౌరులపై ప్రభుత్వ నిఘా అధికారిక ఆదేశాలు లేదా పర్యవేక్షణ లేకుండానే చట్టవిరుద్ధంగా సాగుతోందని ఈ ఘటనలన్నీ తెలుపుతున్నాయి. ఈ నేరాలన్నీ రచ్చకెక్కినా చట్టవిరుద్ధ నిఘాకు గానూ ఏ అధికారినీ బోనెక్కించలేదు.

మన దేశంలో చట్టబద్ధంగా సాగే ప్రభుత్వ నిఘా విస్తృతి చాలా ఎక్కువ. కేంద్ర హోంశాఖ కార్యదర్శి నెలకు 10,000 ఫోన్ ట్యాప్‌లను అనుమతించినట్టు **ఇండియన్ ఎక్స్‌ప్రెస్** పత్రిక ఇటీవల సమాచార హక్కు చట్టం కింద దఖలు చేసిన ఓ దరఖాస్తు వల్ల తెలిసింది. ఇలా సేకరించిన సమాచారాన్నంతటినీ ఏం చేస్తున్నారు? అది మనకు చెప్పలేదు. మిగతా ప్రజాస్వామ్యాల్లో వలే అధికారిక నిఘాలకు సంబంధించి మనకు రక్షణలు గానీ, దానికి అవరోధాలు గానీ లేవు. అమెరికాలోనైతే, ఫోన్ ట్యాపింగ్‌కు అధికారిక ఆమోదం లభించాలంటే పోలీసులు న్యాయమూర్తికి ఆధారాలు చూపాలి. ఆమోదం లభించినా దాన్ని కఠినమైన షరతులకు లోబడే చేయాల్సి ఉంటుంది. అది మన దేశంలో లోపించింది. లాబీయింగ్‌లను జరిపే నీరా రాడియా ఫోన్లను నెలల తరబడి ట్యాప్ చేశారు. ఆ తర్వాత వాటిని మీడియాకు విడుదల చేసి నేరానికి పాల్పడ్డారు. అవి నేరం జరిగినట్టు సూచించకపోయినా, కొందరు వ్యక్తులకు మచ్చతెచ్చాయి. మన ప్రభుత్వం పౌరుల ఫోన్లను ట్యాప్ చేసి, ఆ పని చేయలేదని నిరాకరించగలుగుతోంది. సంస్థాగతమైన ఒక క్రమం అంటూ లేకపోవడం వల్ల నిఘా ద్వారా సేకరించిన సమాచారంపై, అది చట్టబద్ధంగా సేకరించినదే అయినా, ప్రభుత్వ నియంత్రణ ఉండటం లేదు (రాడియా టేపులలాగా). జవాబుదారీతనమూ లేదు.



వ్యక్తిగత గోప్యతపై సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యం ఇది. మన ప్రభుత్వ నిఘా చరిత్ర తెలుసు కాబట్టి నేను ఆధార్ కార్డ్ తీసుకోలేదు. నా బయోమెట్రిక్ వివరాలను అప్పగించమని ప్రభుత్వం నన్ను ఎందుకు బలవంత పెట్టాలి? అది అర్థరహితం. గుర్తింపునకు ఆధారంగా, నాకు ఇప్పటికే పాస్‌పోర్ట్, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డ్, నా ల్యాండ్‌లైన్ ఫోన్ బిల్లు, నా ఎలక్ట్రిసిటీ బిల్లు, నా ఇంటి డాక్యుమెంట్లు, నా ఓటర్ గుర్తింపు కార్డ్ ఉన్నాయి. ఇవన్నీ ప్రభుత్వం జారీ చేసిన చెల్లుబాటయ్యే వివిధ రూపాల గుర్తింపులే. అది నా నుంచి ఇంకా ఎన్ని ఇతర విషయాలు కావాలంటుంది, ఎందుకు? నా మొబైల్ ఫోన్‌ను, బ్యాంకు ఖాతాను ఆధార్‌తో తప్పక అనుసంధానించాలని ఎయిర్‌టెల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు నుంచి తాఖీదులు వచ్చాయి. పాఠశాల పిల్లలను పరీక్షలకు అనుమతించాలంటే ముందుగా ఆధార్ తీసుకోవాలన్న భయానక గాథలనూ వినాల్సివచ్చింది. ట్యాక్స్ రిటర్నుల దఖలుకు ఇప్పటికే ఆధార్‌ను తప్పనిసరి చేశారు (ఈ అర్థరహితమైన ఈ నిబంధన నుంచి తప్పించుకోడానికి నేను ముందే దఖలు చేసేశాను).

దాచుకోడానికి ఏమీలేని వారు ఆధార్ నమోదుకు ఎందుకు ప్రతిఘటిస్తారు? అని ప్రభుత్వ మద్దతుదార్లు వాదిస్తారు. ప్రభుత్వం తీసుకున్న రక్షణ చర్యలు చాలా బలహీనమైనవి కాబట్టి నేను వద్దనుకుంటున్నా. ఆధార్‌ను బ్యాంకు ఖాతాలతో, పాన్ నంబర్లతో అనుసంధానించడం లక్ష్యం, ట్యాక్స్ దొంగలను మరింత మెరుగ్గా పట్టుకోగలుగుతామనేదే అయినా, నేను అభ్యంతరం తెలుపుతాను. నాగరిక ప్రజాస్వామ్యం ఏదైనాగానీ ప్రజలు అమాయకులనే భావిస్తుంది. ప్రతి ఒక్కరు తమ ఆర్థిక లావాదేవీలకు బయోమెట్రిక్ గుర్తింపును జోడించేలా నిర్బంధించడమంటే ప్రతి ఒక్కరూ నేరస్తులేనని భావించడమే. ఇది నాకు ఆమోదనీయం కాదు.

2014, ఏప్రిల్ 8న నరేంద్రమోదీ బెంగళూర్‌లో సార్వత్రిక ఎన్నికల ప్రచారం సాగించారు. గెలిచిన తర్వాత తాను ఆధార్‌ను రద్దు చేస్తానని చెప్పారు. నందన్ నీలేకనీపై దాడి చేస్తూ ఆయన "మీరు ఏ నేరానికి పాల్పడ్డారని సుప్రీంకోర్టు మీ ఆధార్ ప్రాజెక్టుకు మొట్టికాయలు వేసింది?"అని ప్రశ్నించారు. "మొట్టమొదటిసారిగా బహిరంగంగా చెబుతున్నాను. ఆధార్ ప్రాజెక్టుపై నేను పలు ప్రశ్నలను అడిగాను. చట్టవిరుద్ధంగా వలస వచ్చిన విదేశీయుల గురించి, జాతీయ భద్రతకు సంబంధించి వారిని పలు ప్రశ్నలు వేశాను. వారి (యూపీఏ ప్రభుత్వం) వద్ద సమాధానం లేదు" అని కూడా మోదీ అన్నారు. నేడు మోదీ దీనికి పూర్తిగా విరుద్ధమైన వైఖరి చేపట్టి, అవసరం లేదనుకున్న వారి పైన కూడా బలవంతంగా ఆధార్‌ను రుద్దుతున్నారు. ఇలా విరుద్ధ వైఖరిని ఎందుకు చేపట్టాల్సి వచ్చిందో ఆయన వివరించాల్సి లేదా? ఆయన ఆ పని చేయరనుకోండి.

ఒక గూఢచార సంస్థకు చెందిన ఒక వ్యక్తిని కొద్ది రోజుల క్రితం కలుసుకున్నాను. నాపైన ఒక ఫైల్ ఉండేదని, అందులో నాకు సంబంధించిన చాలా వివరాలే ఉన్నాయని, వాటిలో చాలా వరకు చట్టవిరుద్ధంగా సేకరించినవేనని చెప్పారు. ఇలా చట్టవిరుద్ధ ప్రభుత్వ నిఘా కింద ఉన్న వారు లక్షల్లో కాకున్నా, వేలల్లోనైనా ఉన్నారు. ఈ నేరపూరితమైన నిఘా కార్యకలాపం సాగడానికి స్వచ్ఛందంగా మనం మన వివరాలు ఎందుకు ఇవ్వాలి? ఇవ్వనక్కర్లేదు. తప్పనిసరి ఆధార్ నమోదును, మన జీవితంలోని అన్ని రంగాలనూ మన బయోమెట్రిక్ గుర్తింపులతో తప్పక అనుసంధానించాల్సి రావడాన్ని ఆపివేయలి. సుప్రీంకోర్టు తీర్పు మనకు ఆ ఆశను కలిగించింది.

వ్యాసకర్త కాలమిస్టు, రచయిత । a a


నిన్నటి శతాబ్దంలోనే...

ప్రసూతి సెలవు మనకు తెలుసు. 105 ఏళ్ల క్రితం బాలికలకు, ఉపాధ్యాయినిలకు బహిష్టు సమయంలో సెలవు మంజూరు చేసిన ఘటన ఇటీవలే వెలుగు చూసింది. అది ఏ పాఠశాలలో అనే విషయమూ తాజాగా బయటపడింది. కేరళలోని త్రిపుణితుర గ్రామంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో ఆ సౌకర్యం కల్పించారు. పి. భాస్కరన్ ఉన్ని రాసిన '19వ శతాబ్దంలో కేరళ' పుస్తకంలో ఈ విషయం చెప్పారు. అప్పటి ప్రధానోపాధ్యాయులు వీపీ విశ్వనాథన్ అయ్యర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆ పాఠశాలలో తరచు పరీక్షలు జరిగేవట. వాటికి బహిష్టు సమయమైతే కొందరు బాలికలు, ఉపాధ్యాయినిలు హాజరు కాలేకపోయారట. సమస్య తీవ్రతను బట్టి ప్రధానోపాధ్యాయులు జనవరి 19, 1912న ఆ నిర్ణయం తీసుకున్నారు. కొద్దిరోజులకే పై అధికారుల నుంచి దీనికి అనుమతి వచ్చింది.

గ్రహం అనుగ్రహం

శ్రీ హేవిళంబి నామ సంవత్సరం
దక్షిణాయనం, వర్ష ఋతువు, భాద్రపదమాసం
తిథి శు.షష్ఠి రా.11.06 వరకు, తదుపరి సప్తమి
నక్షత్రం స్వాతి రా.7.20 వరకు, తదుపరి విశాఖ
వర్జ్యం రా.1.24 నుంచి 3.09 వరకు
దుర్ముహూర్తం సా.4.36 నుంచి 5.26 వరకు
అమృతఘడియలు ఉ.9.57 నుంచి 10.34 వరకు.

నమాజ్ వేళలు



ఫజర్	4.47
జొహర్	12.18
అసర్	4.44
మగ్రీబ్	6.34
ఇషా	7.48


సూర్యోదయం : 5.48
సూర్యాస్తమయం : 6.17
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

సాక్షి
రాష్ట్రీయం
వైఎస్ఆర్ జిల్లా
ఆదివారం | ఆగస్టు | 27 | 2017
www.sakshi.com

5

వినాయక చవితి సందర్భంగా ఈ ఏడాది ముంబైలో 50 వేలకు పైగా, హైదరాబాద్‌లో 64,600 పైగా విగ్రహాలు ఏర్పాటు చేశారు.









3. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రి గణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం పుష్కరాలరేవు వద్ద 21,116 రాగి కలశాలతో ఏర్పాటు చేసిన వైష్ణవ గణపతి విగ్రహం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. దివంగత మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు సతీమణి, వైఎస్సార్ సీపీ కేంద్రపాలకమండలి సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఇక్కడ ఉత్సవాలు జరుగుతున్నాయి.

1. శ్రీకాకుళం జిల్లా పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని కేటీ రోడ్డు శ్రీనివాస ట్రేడర్స్ సైకిల్ షాపు యజమానులు వంట పాత్రలతో ఏర్పాటు చేసిన వినాయకుడు అందరినీ ఆకట్టుకుంటున్నాడు. ఈ విగ్రహాన్ని ప్లాస్టిక్, రసాయన రహితంగా ప్రతిష్ఠించారు.

2. విశాఖ నగరంలో అతిపెద్ద వినాయక విగ్రహం శీలానగర్‌లో కొలువుతీరింది. మహా గణపతి కమిటీ ఆధ్వర్యంలో 96 అడుగుల వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.

కాకినాడ కోసమే కాకిలెక్కలు..

అధికారపార్టీ ఎత్తులకు అంతూదరీ లేదు..

- నిషేధం ఉన్నా ఎగ్జిట్ పోల్ సర్వే ఎలా చేశారు?
- సర్వేల పేరుతో దొంగ లెక్కల ప్రచారం
- శ్రేణులను ఉత్సాహపరిచేందుకే గెలుపుపై లీకులు
- కాకినాడ ఎన్నికలకు బాగా పనిచేస్తారనే..
- అయినా ఇన్ని పొంతనలేని లెక్కలు అవసరమా?
- నంద్యాల సర్వేలపై విస్తుపోతున్న విశ్లేషకులు

సాక్షి, ప్రత్యేక ప్రతినిధి

నంద్యాల ఎన్నికలలో విజయం ఎవరిదో బ్యాలెట్ బాక్సులలో నిక్షిప్తమై ఉంది. ఓటరు ఏ నిర్ణయం తీసుకున్నాడో 28న గానీ వెల్లడి కాదు. కానీ ఎగ్జిట్ పోల్స్ పేరిట, సర్వేల పేరిట రకరకాల ఊహాగానాలు ప్రచారంలో ఉన్నాయి. కొన్ని చానళ్లలోనూ, పత్రికలలోనూ, సోషల్‌మీడియాలోనూ ఒక పార్టీకి అనుకూలంగా పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. ఒకదానికొకటి పొంతన లేకుండా అనేక కాకిలెక్కలు ప్రచారంలో ఉన్నాయి. అసలు ఎగ్జిట్ పోల్స్‌పై నిషేధం ఉన్నా వాటిని ఎవరు నిర్వహించారు? అది ఎలా సాధ్యం? ఇక సర్వేల లెక్కలు ఒకదానితో ఒకటి పొంతన కుదరకపోవడాన్ని ఎలా చూడాలి? ఎందుకు ఇలాంటి ప్రచారాలు చేస్తున్నారు? వీటన్నిటికీ ఒకటే సమాధానం.. నంద్యాల లెక్కలను చూసి శ్రేణులు కాకినాడ ఎన్నికల్లో ఉత్సాహంగా పనిచేయాలి.. అన్న లక్ష్యంతోనే అధికారపార్టీ ఈ కాకిలెక్కలను ప్రచారం చేస్తోందని విశ్లేషకులంటున్నారు.

పొంతనలేని లెక్కలు..

కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల కోసమే అధికారపార్టీ నంద్యాల ఉప ఎన్నికల ఫలితంపై కాకిలెక్కల సర్వేల కట్టుకథలు అల్లుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నెల 23వ తేదీన ఉప ఎన్నిక పోలింగ్ అనంతరం నుంచి టీడీపీ నేతల్లో, శ్రేణుల్లో విశ్వాసం సన్నగిల్లకుండా ఉండటానికి, కాకినాడలో ప్రచారం కొనసాగించుకోవడానికి, ఓటర్లను నానా అడ్డదారుల్లో ప్రభావితం చేయడానికి వీలుగా అవసరమైన ఏర్పాట్లు చేసుకోవడానికి పడరాని పాట్లు పడుతోందని అంటున్నారు.. అందులో భాగంగానే ఉప ఎన్నికల ఫలితంపై పూటకో మాట, రోజుకో లెక్క చొప్పున సర్వేల పేరిట ఊదరకొడుతూ విభిన్న రకాల లీకులు ఇప్పిస్తూ, అనుకూల మీడియా ద్వారా ప్రచారం చేసుకుంటోందని విమర్శకులు అంటున్నారు. ఇప్పటివరకు వచ్చిన సర్వేలలో ఏ ఒక్క దానికి సరైన పొంతన, వాస్తవ విశ్లేషణ లేకపోవడమే ఇందుకు నిదర్శనమని వారు పేర్కొంటున్నారు.. చివరకు ప్రభుత్వ ఆధ్వర్యంలోని పోలీసు నిఘా యంత్రాంగం పేరిట లీకుల రూపంలో వస్తున్న సర్వేలు కూడా విభిన్నంగా ఉంటుండటం పరిశీలనాంశమని అంటున్నారు.

కాకినాడ కోసమే ఈ కాకిలెక్కలు..

నంద్యాల ఉప ఎన్నికలో ఓటర్ల మద్దతును అంచనా వేసుకున్న చంద్రబాబు, ఆయన కోటరీ కాకినాడ కార్పొరేషన్ ఎన్నికలకు ఎలా సన్నద్ధం కావాలనే అంశంపై సుదీర్ఘంగా చర్చించుకుందని తెలిసింది. నంద్యాల ఎన్నికల్లో మనదే గెలుపు అన్నరీతిలో భారీ ప్రచారం చేయాలని, లేదంటే కాకినాడలో కనీసం ప్రచారానికి కూడా నాయకులు, శ్రేణులను వెతుక్కోవాల్సి వస్తుందనే భావన పార్టీ ముఖ్యుల్లో వ్యక్తమైందనేది వినికిడి. పైగా ఆ జిల్లాలో ప్రభుత్వానికి, పార్టీకి తీవ్ర వ్యతిరేకత ఉందని కూడా అంచనా వేసింది. ఆదివారం సాయంత్రానికి కాకినాడ ప్రచారం ముగుస్తుందని, అప్పటి వరకు సర్వేల పేరిట లీకులిస్తూ పార్టీ క్యాడర్‌లో ఉత్సాహాన్ని కొనసాగింపజేయాలనే నిర్ణయానికి వచ్చిందని, అందులో భాగంగానే విభిన్న సర్వేలంటూ ఒక వర్గం మీడియాలో, వాట్సాప్ గ్రూప్‌ల్లో హల్‌చల్ చేయిస్తోంది. చంద్రబాబుకు వత్తాసుగా ఉంటున్న ఓ పత్రిక, ఛానెల్, మరో ఛానెల్ సర్వేలు చేయించిందనేది బహిరంగ రహస్యం. ఆ మీడియా ఏంచెప్పినా, ఎంత చెప్పినా ప్రజలు విశ్వసించరని ప్రభుత్వాధినేతకు తెలుసు. దీన్ని నమ్మకమైన వ్యక్తి ద్వారా చెప్పించాలని చంద్రబాబు వ్యూహం పన్నారని ఆయన సన్నిహితులు చెపుతున్నారు. ఎన్నికల సర్వేలు తనకు హాబీ అని, వాటిని చేయిస్తుంటానని లగడపాటి స్వయంగా వెల్లడించిన సందర్భాలు ఉన్నాయి. నంద్యాల ఉప ఎన్నిక సర్వే ఫలితాలు కూడా ఆయన ద్వారా వెల్లడింపజేస్తే ప్రజలు విశ్వసిస్తారని చంద్రబాబు అంచనా వేసినట్లు తెలుస్తోంది. 'నంద్యాల ఉప ఎన్నికలపై నేను సర్వే చేయించలేదు. కానీ సర్వేచేసిన టీం నాకు తెలుసు. వారు చెప్పిన విషయాలనే నేను మీడియాకు చెపుతున్నాను. టీడీపీకి అనుకూలంగా ఫలితం ఉంటుంది' అని లగడపాటి మీడియా ఎదుట స్పష్టంగా చెప్పారు.

ఉన్నది లేనట్లు.. లేనిది ఉన్నట్లు..

ఓటుకు దాదాపు రూ.5,000 తో పాటు చీరలు, ముక్కుపుడకలను పంపిణీ చేయించినా జనామోదం లభించలేదని ముఖ్యమంత్రి సభలకు హాజరైన జనాన్ని చూసి అర్థం చేసుకోవచ్చని విశ్లేషకులంటున్నారు. మరోవైపు తన వద్ద డబ్బు లేదని, అధికారం లేదని, ఉన్నది లేనట్లు లేనిది ఉన్నట్లు చూపించే చానళ్ల పత్రికలు లేవని ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వాడవాడలా ఎలుగెత్తి చెప్పారని, అయినా ఆయన సభలకు జనం ఇసుకేస్తే రాలనంతగా హాజరయ్యారని, దీనిని బట్టే జనం ఎటువైపు ఉన్నారో అర్థమౌతోందని వారు వాఖ్యానిస్తున్నారు. అయినా ఎగ్జిట్ పోల్స్, సర్వేల పేరుతో తప్పుడు లెక్కలు ఎందుకు ప్రచారం చేస్తున్నారో తెలికగానే అర్థం చేసుకోవచ్చని వారు పేర్కొంటున్నారు. 'నంద్యాల ఫలితం వ్యతిరేకంగా రాబోతోందని తెలితే శ్రేణులు డీలా పడిపోతాయి. దానివల్ల కాకినాడ కూడా కోల్పోవాల్సి వస్తుంది. అందుకే నంద్యాలలో మనం జయకేతనం ఎగురవేయబోతున్నామని ప్రచారం చేస్తే కాకినాడ కోసం ఉత్సాహంగా పనిచేస్తారు అందుకే ఇలా సర్వేలను జనంలోకి వదిలాం' అని పేరు చెప్పడానికి ఇష్టపడని తెలుగుదేశం నాయకుడొకరు వ్యాఖ్యానించారు. సాధారణంగా ఏ ఉప ఎన్నిక జరిగినా అధికార పార్టీయే గెలుస్తుండడం సహజమే కాబట్టి తమ ప్రచారాన్ని ఎవరూ తప్పుబట్టలేరని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అయితే మరీ ఇన్ని కాకిలెక్కలు అవసరమా, రేపు ఫలితం కాస్త అటూ ఇటు అయితే ఏం చెబుతారని అడిగితే జనానికి అన్నీ గుర్తుండవని, ముందు కాకినాడలో గట్టెక్కేయడమే తమ నాయకుడి లక్ష్యమని ఆయన వ్యాఖ్యానించారు.

అచ్చం.. నంద్యాల సీన్ రిపీట్!

- సర్వే ముసుగులో కాకినాడలో ప్రలోభాలు
- డివిజన్‌కు ముగ్గురు చొప్పున ఇల్లిల్లూ తిరుగుతున్న వైనం
- ఎవరికి అనుకూలమో తెలుసుకుని టీడీపీ నేతలకు చేరవేత
- రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని పోలీసులకు సమాచారమిచ్చిన వైఎస్సార్ సీపీ శ్రేణులు
- మీరే కిడ్నాప్ చేశారని ఫిర్యాదు అందిందన్న పోలీసులు



పట్టుబడిన అశోక్, విజయ్‌భాస్కర్, విజయ్

కాకినాడ: తూర్పు గోదావరి జిల్లా కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల్లో గెలుపొందడానికి టీడీపీ పెద్దలు కర్నూలు జిల్లా నంద్యాల ఉప ఎన్నికలో అనుసరించిన వ్యూహాన్నే అమలు చేస్తున్నారు. వందలాది మందిని రంగంలోకి దింపి సర్వే పేరుతో ఎవరు అనుకూలురు.. ఎవరు వ్యతిరేకులు అనే విషయాన్ని సేకరించడం ఇందులో తొలి ఘట్టం. ఆ తర్వాత ప్రలోభాల పర్వం.. కాదు కూడదంటే బుజ్జగింపులు..ఆపై బెదిరింపులు. ఇలా సమాచారం చేర వేస్తున్న వారిని వైఎస్సార్‌సీపీ నేతలు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని పోలీసులకు అప్పగిస్తే.. అచ్చంగా నంద్యాల సీనే రిపీట్ అయ్యింది. మీరే కిడ్నాప్ చేశారేమో అంటూ పోలీసులు ఎదురు ప్రశ్నించడం విస్తుగొలుపుతోంది. కాకినాడ 35వ డివిజన్‌లో శుక్రవారం ఉదయం ముగ్గురు వ్యక్తులు ఇంటింటికీ వెళ్లి సర్వే చేస్తున్నారు. 'ఏ రాజకీయ పార్టీ అభివృద్ధి చేయగలదని భావిస్తున్నారు? చంద్రబాబు పాలనపై మీ అభిప్రాయం ఏమిటి? జగన్ తీరుపై ఏమనుకుంటున్నారు? కార్పొరేషన్ ఎన్నికల్లో ఏ పార్టీకి ఓటు వేస్తారు?' అంటూ ప్రశ్నలు వేస్తూ వారు టీడీపీకి అనుకూలమా.. వ్యతిరేకమా అనే విషయాన్ని గమనించి నోట్ చేసుకుంటున్నారు. చివరలో ఇంటి యజమాని ఫోన్, అకౌంట్ నంబర్‌ను కూడా తీసుకుంటున్నారనే సమాచారం తెలియడంతో అనుమానం వచ్చిన అక్కడి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి బెండా విష్ణు అనుచరులతో కలసి వెళ్లి అశోక్, విజయ్‌భాస్కర్, విజయ్ అనే వ్యక్తులను పట్టుకుని కార్పొరేషన్ కార్యాలయానికి తీసుకొచ్చారు. ఆ మేరకు పోలీసులకు సమాచారం ఇచ్చారు. కాసేపటి తర్వాత.. ముగ్గురు వ్యక్తులను మీరు కిడ్నాప్ చేసినట్లు ఫిర్యాదు అందిందని పోలీసులు చెప్పేసరికి వైఎస్సార్‌సీపీ నేతలు నివ్వెరపోయారు.

150 మందితో సర్వే టీమ్

ఎన్నికల్లో సర్వే కోసం కృష్ణ, గుంటూరు జిల్లాల నుంచి వచ్చామని వైఎస్సార్‌సీపీ నేతలకు పట్టుబడ్డ అశోక్, విజయభాస్కర్, విజయ్ చెప్పారు. డివిజన్‌కు ముగ్గురు చొప్పున 150 మంది వచ్చామని, వివిధ హోటళ్లలో ఉంటున్నామన్నారు. నాలుగు రోజులుగా ఈ సర్వే చేస్తున్నామని చెప్పారు. తమకు వసతి, భోజనం కల్పించి రోజుకు రూ.400 ఇస్తున్నారని, సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో తమ సంస్థకు తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. వాస్తవానికి ఎన్నికల కోడ్ అమలులో ఉండగా ఏ సంస్థా సర్వే నిర్వహించకూడదు. ఇందుకు విరుద్ధంగా 150 మంది సర్వేలో పాల్గొనడం అనేక సందేహాలకు తావిస్తోంది. పైగా ప్రతి సర్వే సిబ్బంది వద్ద ట్యాబ్‌లు కూడా ఉన్నాయి. ఆ ట్యాబ్‌లలో ఓటర్ల లిస్టు నిక్షిప్తం చేసి మరీ ఇచ్చారు. సదరు ఇంటి యజమాని లేదా ఓటరు పేరు టైప్ చేయగానే ఓటరు అవునో కాదో కూడా అక్కడికక్కడే తెలిసిపోతోంది. మామూలుగా సర్వే చేసే వారి వద్ద ఇన్ని వివరాలు ఉండవు. పైగా అకౌంట్ నంబర్ అడగడంపై అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. పైగా సర్వే చేసే వారు ప్రతి ఇల్లూ తిరిగరనే విషయం తెలిసిందే. ఈ అనుమానాలతోనే వైఎస్సార్ సీపీ శ్రేణులు వారిని పట్టుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు.

మాకు తీట పట్టి వచ్చామా..

మహిళలపై మంత్రి ఆదినారాయణరెడ్డి అనుచిత వ్యాఖ్యలు



మంత్రి మాట్లాడుతుండగా సమావేశం నుంచి వెళ్లే ప్రయత్నం చేస్తున్న మహిళలు

ప్రొద్దుటూరు టౌన్: రాష్ట్ర మంత్రి ఆదినారాయణరెడ్డి తన నోటి దురుసుతనాన్ని మరో మారు మహిళలపై చూపెట్టారు. వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు మున్సిపల్ కార్యాలయ ఆవరణలో శనివారం హౌసింగ్ ఫర్ ఆల్ స్కీం గృహ నిర్మాణాలకు మంత్రి భూమిపూజ నిర్వహించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతుండగా డ్వాక్రా మహిళలు లేచి వెళ్లిపోవడం ప్రారంభించారు. సహనం కోల్పోయిన మంత్రి మహిళలను ఉద్దేశించి ''మాకేమైనా తీట పట్టి వచ్చామా.. కూర్చునే ఓపిక కూడా లేదా? అన్ని పథకాలు కావాలంటారే'' అని మండిపడ్డారు. ''ఇది మాకు కూడా భోజనం సమయమే. మాకు ఆకలవుతోంది.. అందరూ వచ్చి కూర్చోండి'' అని అనడంతో మహిళలు తిరిగి వచ్చి సీట్లలో కూర్చున్నారు. మంత్రి దురుసుగా మాట్లాడటంపై డ్వాక్రా మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశానికి, తమకు ఎలాంటి సంబంధం లేకపోయినా, మెప్మా సీఓలు, ఆర్పీలు బలవంతంగా ఉదయం తమను పిలుచుకొచ్చారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మధ్యాహ్నం కావస్తోందని, తమ పిల్లలకు భోజనం పెట్టడానికిఇంటికి వెళతామంటే సీఓలు అడ్డుకున్నట్లు తెలిపారు. కాగా, మంత్రి మహిళలను కించపరుస్తూ మాట్లాడినప్పుడు వేదికపై ఉన్న టీడీపీ నాయకులు ముసిముసి నవ్వులు నవ్వుకోవడం గమనార్హం.

చంద్రబాబు చెప్పే కాకమ్మ కబుర్లు నమ్మొద్దు

కాకినాడ ప్రజలకు వైఎస్సార్‌సీపీ నేత ధర్మాన పిలుపు



సాక్షి ప్రత్యేక ప్రతినిధి, కాకినాడ: మూడేళ్ల పాలనలో కాకినాడలో కనీసం డంపింగ్‌యార్డును కూడా ఏర్పాటు చేయని సీఎం చంద్రబాబు ఇప్పుడు కార్పొరేషన్ ఎన్నికలు రావడంతో కాకమ్మ కబుర్లు చెబుతున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు మండిపడ్డారు. ఆయన శనివారం తూర్పు గోదావరి జిల్లా కాకినాడలో మీడియాతో మాట్లాడారు. 10 వేల కుటుంబాలకు జీవనాధారమైన యాంకరేజి పోర్టును అభివృద్ధి చేస్తానని అసెంబ్లీ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన చంద్రబాబు వరుసగా నాలుగు బడ్జెట్లలో ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని దుయ్యబట్టారు. కొన్ని నిబంధనలకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిన స్మార్ట్‌సిటీల జాబితాలో కాకినాడకు స్థానం దక్కిందే తప్ప ఇందులో చంద్రబాబు శ్రమ ఏమీ లేదని తేల్చిచెప్పారు. స్మార్ట్‌సిటీ కోసం రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులను కేటాయించలేదన్నారు.

చంద్రబాబు పాలనకు స్వస్తి పలకాలి

ఒకవేళ చంద్రబాబు చెబుతున్నట్లు అభివృద్ధి చేస్తే నంద్యాల ఉపఎన్నికలో రూ.వంద కోట్లను వరదలా పారించాల్సిన అవసరం టీడీపీ నాయకులకు ఎందుకొచ్చిందో చెప్పాలని ధర్మాన నిలదీశారు. మూడున్నరేళ్లలో అభివృద్ధి చేయకుండా మిగిలిన ఏడాదిన్నరలో చేస్తామంటే నమ్మవద్దని ప్రజలను కోరారు. ఏ ఎన్నికలు వచ్చినా చంద్రబాబుకు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. మరికొద్ది నెలల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో అధికారంలోకి రానున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కాకినాడతోపాటు రాష్ట్రం అభివృద్ధి బాధ్యతలను తీసుకుంటుందని భరోసా ఇచ్చారు. స్వప్రయోజనాల కోసం రాజ్యాంగ వ్యవస్థలన్నింటినీ కుప్పకూల్చేస్తున్న చంద్రబాబు పాలనకు ఇప్పటికైనా స్వస్తి పలకకపోతే భవిష్యత్తు మరింత అంధకారమవుతుందని హెచ్చరించారు. టీడీపీ పాలనలో ప్రజాస్వామ్య విలువలను దిగజార్చేసి రాష్ట్రానికే మచ్చ తెచ్చారని విమర్శించారు. ఒక సిద్ధాంతానికి కట్టుబడి ప్రజల కోసం అనునిత్యం శ్రమిస్తున్న జగన్ నాయకత్వాన్ని సమర్థించాలని, కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల్లో తెలివైన నిర్ణయం తీసుకోవాలని ప్రజలను కోరారు. మీడియా సమావేశంలో వైఎస్సార్‌సీపీ రాజకీయ సలహామండలి సభ్యుడు ధర్మాన కృష్ణదాసు, రాష్ట్ర అధికార ప్రతినిధి చెల్లుబోయిన వేణు, రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు, సీఈసీ సభ్యుడు అంధవరపు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కాకినాడలో ఓడినా ప్రభుత్వానికి ముప్పేమీ లేదు

- సీఎం చంద్రబాబు స్పష్టీకరణ
- ఎన్నికలు కాబట్టి చెప్పడం లేదు.. అందరికీ ఇళ్లు కట్టిస్తాం..
- కాకినాడలో సీఎం రోడ్ షో



సాక్షి, కాకినాడ: తూర్పు గోదావరి జిల్లా కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఓడిపోయినా తమ ప్రభుత్వానికి వచ్చిన ముప్పేమీ లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. తమ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే కాకినాడను బ్రహ్మాండమైన నగరంగా తయారు చేస్తామని హామీ ఇచ్చారు. ఆయన శనివారం నగరంలో రోడ్‌షో నిర్వహించారు. ఐదు రహదారి కూడళ్లలో ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. దేశంలో చండీగఢ్, యానాం తర్వాత మూడో ప్రణాళికాబద్ధమైన నగరంగా కాకినాడ నిలుస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం కాకినాడను స్మార్ట్‌సిటీగా ప్రకటించి ఇప్పటిదాకా రూ.400 కోట్లు మంజూరు చేసిందని గుర్తుచేశారు.

సముద్రంతోనే సమస్య

కాకినాడలో విశాలమైన, పొడవైన రహదారులున్నా సముద్రంతోనే పెద్ద సమస్య అని చంద్రబాబు అన్నారు. సముద్రం పొంగినప్పుడు నగరంలోకి నీరు వస్తోందన్నారు. డ్రైనేజీ సమస్య ఎక్కువగా ఉందని చెప్పారు. తమ పార్టీని గెలిపిస్తే డ్రైనేజీ వ్యవస్థను పూర్తిగా మార్చివేస్తామని హామీ ఇచ్చా రు. ఎన్నికలు కాబట్టి చెప్పడం లేదని, కాకినాడలో ప్రతి ఒక్కరికీ ఇల్లు కట్టిస్తామని ఉద్ఘాటించారు. కాపుల విషయంలో మంజునాథ కమిషన్ రిపోర్టు రేపోమాపో వస్తుందని, దాన్ని కేంద్రానికి పంపించి ఆమోదింపజేస్తామని చెప్పారు. అవినీతి జరగకుండా అభివృద్ధి పనులు చేస్తామన్నారు.

మమ్మల్ని గెలిపిస్తేనే అభివృద్ధి

కార్పొరేషన్ ఎన్నికల్లో టీడీపీ–బీజేపీ కూటమి గెలిస్తేనే అభివృద్ధి జరుగుతుందని చంద్రబాబు అన్నారు. బకింగ్‌హామ్ కెనాల్‌ను పునరుద్ధరించి కాకినాడకు పూర్వవైభవం తెస్తామన్నారు. ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోపాటు స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలపై చంద్రబాబు ఆరోపణలు గుప్పించారు. సీఎం రోడ్‌షోకు జనం పల్చగా కనిపించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప, ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు, స్థానిక ఎంపీ తోట నరసింహం, ఎమ్మెల్యేలు వనమాడి వెంకటేశ్వరరావు, పిల్లి అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఓటమి భయంతో 'రెబల్' రాజకీయం

కాకినాడలో టీడీపీ కుమ్మక్కు కుట్రలు

- ఓడిపోయే చోట్ల బరిలో రెబల్ అభ్యర్థులు
- బీజేపీకి కేటాయించిన స్థానాల్లోనూ రెబల్స్



ఈ చిత్రం విచిత్రం చూశారా? కాకినాడలోని 35వ డివిజన్‌లో టీడీపీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, బీజేపీ నాయకులు కలిసి ఇండిపెండెంట్ అభ్యర్థి (రెబల్)కోసం ప్రచారం చేస్తున్న దృశ్యమిది. ఈ డివిజన్‌ను పొత్తుల్లో భాగంగా బీజేపీ నేత ప్రసాదరావు కి కేటాయించారు. పొత్తు ధర్మం వదిలేసి టీడీపీ నాయకులు తమ పార్టీకి చెందిన మరో వ్యక్తిని రెబల్‌గా బరిలో ఉంచారు. ఇద్దరికీ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో ఎమ్మెల్యే వనమాడి మరో నీచరాజకీయానికి తెర తీశారు. కాస్త బలంగా ఉన్న స్వతంత్ర అభ్యర్థి (టీడీపీ) బలపురి రామకృష్ణకి నేరుగా మద్దతు పలకడంతో పాటు స్థానిక బీజేపీ నేతలను ఒప్పించి ప్రచారం కూడా చేశారు.



ఈ ఫొటో చూశారా? కాకినాడ కార్పొరేషన్ పరిధిలోని 29వ డివిజన్‌లో స్వతంత్ర అభ్యర్థి గెలుపు కోసం టీడీపీ నాయకులు చేస్తున్న ప్రచార దృశ్యమిది. పొత్తులో భాగంగా ఈ డివిజన్‌ను కూడా బీజేపీకి కేటాయించారు. ఇక్కడ ఆ పార్టీ తరపున చిట్నీడి శ్రీనివాస్ బరిలో ఉన్నారు. కానీ...ఇక్కడ టీడీపీకి చెందిన వాసిరెడ్డి రాంబాబు, ఏళ్ల పట్టాభి అనే వ్యక్తులు బీజేపీకి రెబల్స్‌గా బరిలో నిలిచారు. ఇక్కడ కూడా టీడీపీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు నీతిమాలిన రాజకీయానికి దిగజారారు. పొత్తును విస్మరించి బీజేపీకి రెబల్‌గా నిలబడిన టీడీపీ నేత వాసిరెడ్డి రాంబాబుకు మద్దతు పలికారు. టీడీపీ జెండాలు పట్టుకుని స్వతంత్ర అభ్యర్థి కోసం ప్రచారం కూడా చేశారు.

సాక్షి ప్రతినిధి, కాకినాడ: కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ పోటీ చేస్తున్న ప్రతి డివిజన్‌లో టీడీపీ నాయకులు రెబల్స్‌గా బరిలో ఉన్నారు. రెబెల్ అభ్యర్థుల గెలుపనకు టీడీపీ నాయకులు బరితెగించి మరీ ప్రచారం చేసున్నారు. బీజేపీ పోటీ చేస్తున్న స్థానాల్లోనే కాకుండా టీడీపీ పోటీ చేసిన డివిజన్లలో కూడా అధికారిక అభ్యర్థి బలంగా లేనిచోట రెబల్స్‌ని గెలిపించుకునేందుకు టీడీపీ పావులు కదుపుతుంది.

కుమ్మక్కు రాజకీయాలు...: కాకినాడ కార్పొరేషన్‌లో పరిస్థితులు ఎక్కడా అనుకూలంగా లేకపోవడంతో టీడీపీ నాయకులు కుమ్మక్కు రాజకీయాలకు దిగారు. కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీతో కుదుర్చుకున్న పొత్తుకు తూట్లు పొడిచారు. పొత్తును తూచ్ అనేసి బలంగా ఉన్న రెబల్ అభ్యర్థులకు మద్దతిస్తున్నారు. స్థానిక బీజేపీ నాయకులను ప్రలోభాలకు గురిచేసి ఆ పార్టీ అభ్యర్థులకు కూడా దగ్గరుండి వెన్నుపోటు పొడిపిస్తున్నారు. వారి మధ్య లోపాయికారీ ఒప్పందం కుదిరిపోయింది. టీడీపీ నాయకుల కుట్ర రాజకీయాలకు బలైపోయామని బరిలో ఉన్న అధికారిక అభ్యర్థులు వాపోతున్నారు.

రెబల్సే అసలు అభ్యర్థులు..: టీడీపీ పోటీ చేసిన 1,3,21,22,27,28,38,43,49,50 డివిజన్‌లలో ఆ పార్టీకి చెందిన నాయకులే రెబల్స్‌గా ఉన్నారు. బీజేపీ పోటీ చేసిన 4,5,9,29,35,36,39,47 డివిజన్‌ల్లో కూడా టీడీపీ నాయకులు రెబల్స్‌గా బరిలో ఉన్నారు. పార్టీ తరఫున పోటీ చేసిన అభ్యర్థులు కన్నా పలుచోట్ల రెబల్సే బలంగా ఉన్నారని గుర్తించడంతో టీడీపీ ప్లేటు ఫిరాయించింది. పార్టీ తరఫున పోటీ చేసిన అభ్యర్థులను పక్కన పెట్టి రెబల్‌గా ఉన్న వారినే అసలైన అభ్యర్థులుగా పరిగణిస్తూ చేయూతనందిస్తోంది. టీడీపీ, బీజేపీ తరఫున పోటీ చేస్తున్న డివిజన్లలో రెబల్స్‌గా ఉన్న టీడీపీ నేతలపై వేటు వేసేందుకు అధిష్టానం ఏమాత్రం ఆసక్తి చూపడం లేదు. ఎన్నికల పొత్తులో భాగంగా రెబల్స్‌గా ఎవరైనా బరిలో ఉంటే వారిపై సస్పెన్షన్ వేటు వేస్తామని టీడీపీ పెద్దలు హెచ్చరించినా ఆ దిశగా చర్యలు తీసుకోలేదు.

బాబుకు కాకినాడలో ఓటు అడిగే హక్కు లేదు


వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత బొత్స



కాకినాడ: ''మూడేళ్లుగా అధికారంలో ఉంటున్న చంద్రబాబు నాయుడు ఒక్క హామీని కూడా నెరవేర్చలేదు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలనే ఇప్పుడొచ్చి మళ్లీ చెబుతున్నారు. ఇలా ప్రజలను మోసం చేయడానికి చంద్రబాబుకు సిగ్గనిపించడం లేదా? పేదలకు ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదు. స్మార్ట్‌సిటీకి వచ్చిన నిధులను వాటాల పంపకాలు జరగక ఖర్చు పెట్టడం లేదు. కాకినాడను మురికి కూపంగా మార్చిన చంద్రబాబుకు ఇక్కడ ఓటు అడిగే హక్కు లేదు'' అని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ స్పష్టం చేశారు. ఆయన శనివారం తూర్పు గోదావరి జిల్లా కాకినాడలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాపుల సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ హామీ ఇవ్వలేదనడం దారుణమన్నారు. పార్టీ మేనిఫెస్టో 36వ పేజీని ఒకసారి చూడాలని హితవు పలికారు. బాబు చెప్పే అబద్ధాలకు ఆ స్కార్ అవార్డు ఇవ్వొచ్చన్నారు. బాబు హామీలను నమ్మి అవినీతిపరుల చేతిలో కాకినాడ భవిష్యత్‌ను పెట్టొద్దని ప్రజల ను బొత్స కోరారు. కాకినాడలో టీడీపీ ఎమ్మెల్యే, అతడి అన్న, అనుచరులు చేస్తున్న అవినీతిని గురించి ఒకసారి తెలుసుకోవాలని సూచించారు. క్రికెట్ బెట్టింగ్‌లో దొరికినవారు ఆ ఎమ్మెల్యే అనుచరులేనని ఆరోపించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కారుమూరి నాగేశ్వరరావు, పార్టీ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు మూర్తి, జెడ్పీ మాజీ చైర్మన్ చెల్లుబోయిన వేణు పాల్గొన్నారు.

నవరత్నాలతో మళ్లీ రాజన్న పాలన

కార్పొరేషన్ ఎన్నికల కోర్ కమిటీ సభ్యుడు చెవిరెడ్డి



సాక్షి ప్రత్యేక ప్రతినిధి, కాకినాడ: రాష్ట్రంలో ప్రజల కష్ట నష్టాలను దగ్గర్నుంచి చూసిన ప్రతిపక్షనేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల్లాంటి సంక్షేమ పథకాలను ప్రకటించారని, వాటితో మళ్లీ రాజన్న పాలన వస్తుందని వైఎస్సార్ సీపీ కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల కోర్ కమిటీ సభ్యుడు, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి చెప్పారు. సంక్షేమ పథకాలను గాలికొదిలి, ఓటు వేయకపోతే ఉన్నవాటినే లాగేసుకుంటామంటూ భయపెడుతున్న చంద్రబాబుకు ప్రజలు ఓటుతోనే బుద్ధి చెప్పాలని కోరారు. శనివారం ఉదయం తూర్పు గోదావరి జిల్లా కాకినాడలోని పార్టీ కార్యాలయంలో చెవిరెడ్డి మీడియాతో మాట్లాడారు. కాకినాడలో ఓట్ల కోసం టీడీపీతొక్కని అడ్డదారి లేదని విమర్శించారు. ఎవరికి ఓటేశారో తమకు తెలిసిపోతుందని, అలాంటి వారి తెల్లరేషన్ కార్డు తీసేస్తామని, పింఛన్ ఆపేస్తామని బెదిరింపులకు దిగుతున్నారని ఆరోపించారు. చివరకు డివిజన్లలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను, నాయకులను ప్రచారానికి రాకుండా అడ్డంకులు సృష్టిస్తున్నారన్నారు. అధికారుల నుంచి అంగన్‌వాడీ కార్యకర్తల వరకూ, కమ్యూనిటీ రీసోర్సుపర్సన్‌ల నుంచి డ్వాక్రా సంఘాల సభ్యుల వరకూ భయపెట్టి రాజకీయ లబ్ధి కోసం వాడుకుంటున్నారని ధ్వజమెత్తారు. డ్వాక్రా సభ్యుల ఖాతాల్లో సొమ్ములు జమ చేస్తామని టీడీపీ నేతలు మభ్యపెడుతున్నారని ఆరోపించారు. అంత సొమ్ము ఎక్కడి నుంచి వచ్చిందో జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. రాజధాని అమరావతి, పట్టిసీమ, పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకాల్లో కొట్టేసిన వేలాది కోట్ల రూపాయలను ఓట్ల కోసం వరదలా పారిస్తున్నారని ఆరోపించారు.ఎన్నికల్లో గెలిచే పరిస్థితి లేదన్న అనుమానంతోనే టీడీపీ నాయకులు దారుణాలకు తెగబడుతున్నారని చెప్పారు.

సాక్షి
రాష్ట్రీయం
వైఎస్‌ఆర్ జిల్లా
ఆదివారం | ఆగస్టు | 27 | 2017
www.sakshi.com


'ఇన్‌స్టిట్యూట్ ఫర్ డెమోక్రటిక్ అండ్ ఎలక్టోరల్ అసిస్టెన్స్' ప్రకారం ప్రపంచవ్యాప్తంగా పార్లమెంట్, అధ్యక్ష ఎన్నికల్లో ఓటు శాతం తగ్గుతూ వస్తోంది. 20వ శతాబ్దారంభంలో 77.3 శాతం నుంచి 1960ల్లో 85.6 శాతానికి పెరిగినది క్రమంగా 2017 నాటికి 58.7 శాతానికి పడిపోయింది.



బామ్మ ప్రాణాన్ని కాపాడిన ఫేస్‌బుక్



సోషల్ మీడియాలో రారాజుగా వెలిగిపోతున్న ఫేస్‌బుక్... ఓ వృద్ధురాలి ప్రాణాలను కాపాడింది. ఎలాగంటే... అమెరికాలోని న్యూయార్క్‌కి చెందిన 61 ఏళ్ల లెస్సీఖాన్ స్విమ్మింగ్ పూల్‌లో ఉన్న స్టెప్స్ మీద కూర్చొని ఫేస్‌బుక్ చూస్తోంది. అనుకోకుండా ఒక్కసారిగా నిచ్చెన విరిగిపోవడంతో బామ్మ స్విమ్మింగ్ పూల్‌లో పడిపోయింది. బ్రెస్ట్ కేన్సర్ కారణంగా ఎంతో కాలంగా మందులు వాడుతున్న ఆ బామ్మ ఎంతో బలహీనంగా తయారయింది. దీంతో ఆ స్విమ్మింగ్ పూల్ గట్టు పైకి ఎక్కలేక ఒక చివరన నీళ్లలో మూడు గంటలకు పైగా నిలబడింది. అప్పుడే ఆమెకు ఓ అద్భుతమైన ఆలోచన వచ్చింది. వెంటనే తన పరిస్థితిని వివరిస్తూ ఫేస్‌బుక్‌లో ఓ పోస్ట్ పెట్టింది. తనకు సాయం చేయాలంటూ కోరింది. ఎప్పింగ్ స్కీవాక్స్ గ్రూప్‌లో పెట్టిన ఈ పోస్టును పక్కనే ఉంటున్న స్నేహితుడు చూసి, వెంటనే వచ్చి బామ్మను కాపాడాడు. అయితే అప్పటికే బామ్మకు సాయం చేసేందుకు గ్రూప్‌లోని 3,981 మంది తమ గమ్యస్థానాల నుంచి స్టార్ట్ అయ్యారట. కానీ పక్కింటి వ్యక్తి కాపాడిన విషయాన్ని కూడా బామ్మ పోస్ట్ చేయడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారట.



ప్రతిపక్ష నేతకు ఆహ్వానం ఇలాగేనా?

కేవలం ఒక్క రోజు ముందు మెయిల్ ద్వారా ఆహ్వానం

సాక్షి, అమరావతి: రాజకీయాలకు అతీతంగా జరిగే కార్యక్రమానికి రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్ష నేతను ముఖ్యమంత్రి లేదా మంత్రులు స్వయంగా ఆహ్వానించడం ఆనవాయితీ. కానీ, ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడి సన్మాన కార్యక్రమం విషయంలో ప్రభుత్వం ఈ ఆనవాయితీని పాటించలేదు. నిజానికి ఈ సన్మాన కార్యక్రమ తేదీ ఎప్పుడో ఖరారైంది. అయినా కేవలం ఒక్కరోజు ముందు అది కూడా సాయంత్రం మెయిల్ ద్వారా ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రభుత్వం ఆహ్వానం పంపినట్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు చెప్పారు. సర్కారు నుంచి సరైన రీతిలో ఆహ్వానం అందలేదన్నారు. దీన్నిబట్టి జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమానికి రావాల్సిన అవసరం లేదన్న సంకేతాలను ప్రభుత్వమే ఇచ్చినట్లుగా ఉందని వారు తప్పుపట్టారు. వెంకయ్య నాయుడు విషయంలో ప్రతి సందర్భంలోనూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సముచిత గౌరవం ఇచ్చారని గుర్తు చేశారు. వెంకయ్య పేరును ఉపరాష్ట్రపతి పదవికి ప్రతిపాదించినప్పుడు తమ పార్టీ ముందే మద్దతు ప్రకటించినట్లు తెలిపారు. వెంకయ్య నాయుడిని వైఎస్ జగన్ ఇప్పటికే ప్రత్యేకంగా అభినందించినట్లు వైఎస్సార్‌సీపీ వర్గాలు వెల్లడించాయి.

మహనీయుల జీవితాలే స్ఫూర్తి

- ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు
- రాజకీయాలకు కావాల్సింది కులం, ధనం కాదు.. గుణం



ఆలపాటి వెంకట్రామయ్య విగ్రహావిష్కరణలో ఉపరాష్ట్రపతి వెంకయ్య, శాసనమండలి ప్రతిపక్షనేత ఉమ్మారెడ్డి తదితరులు

సాక్షి, అమరావతి బ్యూరో: రాజకీయాల్లోకి వచ్చేవారు మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలని ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. ఆయన శనివారం గుంటూరు జిల్లా తెనాలిలో ఆలపాటి వెంకట్రామయ్య శతజయంతి వేడుకల్లో పాల్గొన్నారు. వెంకట్రామయ్య విగ్రహంతోపాటు జీవిత చరిత్రను తెలియజేసే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకయ్య మాట్లాడుతూ.. ఆలపాటి వెంకట్రామయ్య తెనాలికి చేసిన సేవలను కొనియాడారు. ఆయన స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని చరిత్ర పుటల్లో నిలిచిపోయారని పేర్కొన్నారు. రాజకీయాల్లోకి వచ్చేవారు ఇలాంటి నాయకులను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం రాజకీయాల్లో కులం, ధనం ప్రభావం పెరిగిపోయాయన్నారు. రాజకీయాలకు కావాల్సింది కులం, ధనం కాదని.. గుణం అని, అది నేటితరం వారు గుర్తుంచుకోవాలని హితవు పలికారు.

హామీ పొందితే సాధించుకోవచ్చు

రాష్ట్ర విభజన సమయంలో రాజ్యసభలో తాను చాలా పోరాటం చేసిన తరువాతే చాలా అంశాలను విభజన చట్టంలో చేర్చారని వెంకయ్య చెప్పారు. హామీ పొందితే సాధించుకోవచ్చని అన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా అడిగితే ప్రత్యేక ప్యాకేజీ వచ్చిందన్నారు. రాజకీయాల్లోకి రాకుండానే సమాజ సేవ చేయవచ్చని తెలిపారు. రాజకీయాల నుంచి రిటైర్ అయ్యానని, డ్రస్ మార్చానని, అడ్రస్ మారుస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలపాటి వెంకట్రామయ్య కుమార్తె తులసి, అల్లుడు డాక్టర్ డీఎల్‌ఎన్ ప్రసాద్, కుటుంబసభ్యులు, స్పీకర్ కోడెల, ఎంపీ గల్లా జయదేవ్, మంత్రులు నక్కా ఆనందబాబు, కామినేని, శాసనమండలి ప్రతిపక్ష నేత ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యేలు ఆలపాటి రాజేంద్ర, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నన్నపనేని, వైఎస్సార్‌సీపీ నేత అన్నాబత్తుని శివకుమార్, విజ్ఞాన్ విద్యాసంస్థల అధినేత లావు రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ వాసులకు 'ర్యాలీ' కష్టాలు

ఉప రాష్ట్రపతి రాక సందర్భంగా ట్రాఫిక్ ఆంక్షలు

- గన్నవరం నుంచి వెలగపూడి దాకా ప్రముఖుల ర్యాలీ
- దారి పొడవునా విద్యార్థులు, డ్వాక్రా మహిళల మానవ హారం
- మూడు గంటలకు పైగా నిల్చొని నీరసించిన విద్యార్థులు



విజయవాడ వన్‌టౌన్‌లో స్తంభించిన ట్రాఫిక్

సాక్షి, అమరావతి: ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడికి ఏపీ ప్రభుత్వం శనివారం అమరావతిలో పౌరసన్మానం చేసింది. వెంకయ్య, గవర్నర్ నరసింహన్, సీఎం చంద్రబాబు ఓపెన్ టాప్ జీపులో గన్నవరం విమానాశ్రయం నుంచి వెలగపూడిలోని తాత్కాలిక సచివాలయం వరకూ ర్యాలీగా చేరుకున్నారు. ఈ ర్యాలీ విజయవాడ ప్రజలను కష్టాల పాలుచేసింది. ఎక్కడికక్కడ ట్రాఫిక్‌ను నిలిపివేయడంతో అంగుళం కూడా ముందుకు కదిలే అవకాశం లేక జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కార్యాలయాలకు సకాలంలో చేరుకోలేకపోయారు. ర్యాలీ షో కోసం శాఖలవారీగా అధికారులకు టార్గెట్లు పెట్టి మరీ భారీగా జన సమీకరణ చేశారు. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, డ్వాక్రా మహిళలను మూడు గంటలకు పైగా రోడ్లపై మానవ హారంగా నిల్చోబెట్టారు. చాలామంది విద్యార్థులు నీరసించిపోయారు. శనివారం ఉదయం 6.30 గంటల నుంచే విజయవాడలో ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేశారు. ర్యాలీ ముగిసిన అనంతరం కూడా గంటకుపైగా ట్రాఫిక్ క్లియర్ కాక వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. ఒక్కొక్కరు కనీసం 10 మందిని విజయవాడకు తీసుకురావాలంటూ పౌర సరఫరాల అధికారి ఉదయ్‌భాస్కర్ రేషన్ డీలర్లకు వాయిస్ మెస్సేజ్‌లు పంపించడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇదిలా ఉంటే ఉపరాష్ట్రపతి సన్మాన సభలో స్థానిక ఎమ్మెల్యే, సర్పంచ్‌లకు చోటు దక్కలేదు.



నగరంలోని పీవీపీ మాల్ వద్ద ట్రాఫిక్‌లో చిక్కుకున్న వాహనదారులు

బాలల హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తాం: ఎస్‌ఎఫ్‌ఐ

ఉపరాష్ట్రపతి రాక సందర్భంగా పెద్ద సంఖ్యలో విద్యార్థులను తరలించి రోడ్డుపై గంటల తరబడి నిలబెట్టడం దారుణమని భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్‌ఎఫ్‌ఐ) రాష్ట్ర అధ్యక్షుడు వై.రాము, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.నూర్ మహమ్మద్ మండిపడ్డారు. విద్యార్థులను అవస్థల పాలుచేసిన ప్రభుత్వ తీరుపై బాలల హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గన్నవరం నుంచి సచివాలయం వరకు ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు రోడ్డుపై మానవ హారంగా నిలబెట్టేందుకు విద్యార్థులను తీసుకురావాలంటూ డీఈవోలకు టార్గెట్లు ఇవ్వడం సరికాదని పేర్కొన్నారు. పలు స్కూళ్లు, కాలేజీలకు సెలవులు ఇచ్చి మరీ విద్యార్థులను తీసుకురావడం దారుణమన్నారు. ఇటీవల ఎస్‌ఆర్‌ఎం, విట్ యూనివర్సిటీల శంకుస్థాపనలకు, దోమలపై యుద్ధం తదితర ర్యాలీలకు, ముఖ్యమంత్రి, మంత్రుల సభలకు విద్యార్థులను తరలించారని, ఇదో తంతుగా మారుతోందని ధ్వజమెత్తారు.

డ్రోన్ కెమెరా కలకలం

ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు రాక సందర్భంగా శనివారం విజయవాడలో నిర్వహించిన ర్యాలీలో డ్రోన్ కెమెరా కలకలం రేపింది. గన్నవరం విమానాశ్రయం నుంచి ఓపెన్‌టాప్ జీపులో ర్యాలీగా బయల్దేరిన ఉపరాష్ట్రపతి వెంకయ్య, గవర్నర్ నరసింహన్, ముఖ్యమంత్రి చంద్రబాబు దారి పొడవునా అభివాదం చేసుకుంటూ వచ్చారు. భద్రతా చర్యల్లో భాగంగా పోలీసులు ఈ ర్యాలీని పైనుంచి డ్రోన్ కెమెరాతో చిత్రీకరించారు. ఏలూరు రోడ్డులోని ప్రభుత్వ ఆస్పత్రికి ర్యాలీ చేరుకోగానే రహదారి పక్కనున్న చెట్టు కొమ్మల్లో డ్రోన్ కెమెరా చిక్కుకుంది. దీన్ని తప్పించేందుకు ఆపరేటర్లు ప్రయత్నాలు చేస్తుండగానే వెంకయ్య ప్రయాణిస్తున్న వాహనం సమీపించింది. అదే సమయంలో డ్రోన్ కెమెరా పైనుంచి ఒక్కసారిగా కుప్పకూలి వెంకయ్యకు అతి సమీపంలోనే పడింది. దీంతో ప్రముఖులకు త్రుటిలో ప్రమాదం తప్పింది. ఊహించని ఈ పరిణామంతో భద్రతా సిబ్బంది ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు.



కాజ టోల్‌గేట్ వద్ద భారీగా నిలిచిపోయిన వాహనాలు



ఉప రాష్ట్రపతికి స్వాగతం పలికేందుకు ఎండలో నిల్చున్న విద్యార్థులు



ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తున్న జామర్ వాహన డ్రైవర్

ఉపరాష్ట్రపతి కాన్వాయ్‌లో డ్రైవర్ సెల్‌ఫోన్ సంభాషణ

ఉపరాష్ట్రపతి పౌరసన్మానం నిమిత్తం శనివారం కృష్ణా జిల్లా గన్నవరం విమానాశ్రయం నుంచి విజయవాడ ప్రకాశం బ్యారేజీ వరకు ర్యాలీగా వెళ్లారు. ఆయన వాహన శ్రేణి విజయవాడకు చేరుకున్న సమయంలో ఓ వాహనంలోని డ్రైవర్ సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ 'సాక్షి' కెమెరాకు చిక్కారు. జామర్లు ఆన్‌చేసి ఉన్న సమయంలోనూ ఆ సెల్‌ఫోన్ పనిచేయడం గమనార్హం.

14న చెన్నైలోని ఆంధ్రా క్లబ్‌లో 'సదావర్తి' వేలం

భూముల అమ్మకానికి నేడు నోటిఫికేషన్

సోమవారం నుంచి ఆన్‌లైన్‌లో వివరాలు

సాక్షి, అమరావతి: గుంటూరు జిల్లా అమరావతిలోని సదావర్తి సత్రానికి చెన్నై నగర సమీపంలో ఉన్న భూముల అమ్మకానికి సంబంధించి సెప్టెంబర్ 14న చెన్నైలోని ఆంధ్రా క్లబ్‌లో బహిరంగ వేలం నిర్వహించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం నోటిఫికేషన్ విడుదల చేయనుంది. అలాగే తెలుగు, ఇంగ్లిష్, తమిళ దినపత్రికల్లో ప్రకటనలు ఇవ్వనున్నారు. సత్రం భూముల అమ్మకానికి సంబంధించిన విధివిధానాలు సోమవారం ఆన్‌లైన్‌లో పెడతారు.

మూడు దశల్లో వేలం ప్రక్రియ..

మూడు దశల్లో వేలం ప్రక్రియ కొనసాగుతుందని అధికారులు చెబుతున్నారు. భూముల కొనుగోలుకు ముందుకొచ్చి బహిరంగ వేలం, ఈ–టెండర్‌లో పాల్గొనేందుకు కనీస ధరావత్తు చెల్లించిన వారి సమక్షంలో.. మొదటగా బహిరంగ వేలం నిర్వహిస్తారు. తర్వాతి దశలో సీల్డు టెండర్లు తెరుస్తారు. మూడో దశలో ఈ–టెండర్ల ద్వారా ధర అంచనా వేస్తారు. ఉమ్మడి హైకోర్టు ఆదేశాల మేరకు సదావర్తి భూములకు తిరిగి వేలం ప్రక్రియ నిర్వహిస్తున్నందున.. మూడు దశల్లోనూ అత్యధిక ధర కోట్ చేసిన వారి వివరాలను దేవాదాయ శాఖ కోర్టుకు తెలియజేస్తుంది. చెన్నై నగర సమీపంలోని తాళంబూరు గ్రామ పరిధిలో సదావర్తి సత్రం పేరిట ఉన్న 83.11 ఎకరాల భూమికి.. బహిరంగ వేలంలో కనీస ధరను రూ. 27.45 కోట్లుగా దేవాదాయ శాఖ నిర్ణయించింది. వేలంలో పాల్గొనే వారు ఆ ధరకు అదనంగా ఐదు లక్షల చొప్పున పెంచుకుంటూ పోవాలన్న నిబంధన విధించనున్నట్లు తెలిసింది.

పరిపాలనా భాషగా తెలుగు

▶ మొదటి పేజీ తరువాయి

పలువురు తన వద్ద ప్రస్తావించినట్టు తెలిపారు. జాతీయ స్థాయి నాయకుడిగా ఉన్నప్పటికీ ఏపీకి అన్ని విధాలుగా సహకరిస్తూ వచ్చానన్నారు. రాష్ట్ర విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్‌కు జరుగుతున్న అన్యాయాన్ని సరిదిద్దేందుకు జాతీయ నాయకుడిగా ఉన్న తాను రాష్ట్రం కోసం మాట్లాడాలా? వద్దా? అనే దానిపై మూడు రోజులు ఆలోచించానన్నారు. చివరకు ఎవరు ఏమనుకున్నా రాష్ట్రానికి అన్ని విధాలుగా మేలు జరిగేలా రాజ్యసభలో పట్టుబట్టానని వెంకయ్య గుర్తు చేశారు. ఆయన ఇంకా ఏం మాట్లాడారంటే...

''1972లో జైఆంధ్ర ఉద్యమంలో పాల్గొన్నా. అప్పుడే రాష్ట్ర విభజన జరిగి ఉంటే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో ఎంతో ముందుండేది. తెలంగాణ కూడా అభివృద్ధి సాధించేది. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు తరచూ కలుస్తూ ఉండాలి. మనసు విప్పి మాట్లాడుకుని ఇచ్చి పుచ్చుకునే ధోరణితో వ్యవహరించాలి. ఇదే విషయాన్ని రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కేసీఆర్, చంద్రబాబులకు గతంలోనే చెప్పా. ప్రజాస్వామ్యంలో చట్టసభలకు ఎంతో ప్రాధాన్యం ఉంది. ప్రస్తుతం వాటిపై ప్రజలకు నమ్మకం సన్నగిల్లుతోంది. ప్రభుత్వం చేతిలో అధికారం ఉంటుంది. ప్రభుత్వంలో ఉన్నవారు ప్రతిపక్షాన్ని గౌరవించాలి. ప్రభుత్వంపై ప్రతిపక్షం సద్విమర్శలు చేయాలి. ఇరు పక్షాలు రాజకీయంగా ప్రత్యర్థులే తప్ప విరోధులు కారు. రాజకీయాల్లో వ్యక్తిగత ద్వేషాలకు తావులేదు. పంచాయతీ నుంచి అసెంబ్లీ, పార్లమెంట్ వరకు చట్టసభల్లో అర్థవంతమైన చర్చ జరిగేలా చూడాలి. స్వరాజ్యాన్ని సురాజ్యంగా మార్చేందుకు ప్రయత్నిద్దాం. అవినీతి, అవిద్య, అరాచకం, ఆకలి, అసమానతలను రూపుమాపేందుకు కృషి జరగాలి.

నా కోరిక నెరవేరేలా లేదు

ఇప్పటి వరకు నేను అనుకున్నవన్నీ చేశా. 2020 జనవరి 12న రాజకీయాల నుంచి వైదొలగి సేవా కార్యక్రమాల్లోకి వెళ్లాలన్న కోరిక నేరవేరేలా లేదు. నాకు ఇప్పుడు 68 ఏళ్లు. మరో రెండేళ్లు అంటే 2019 ఎన్నికల్లో నరేంద్ర మోదీని మరోసారి ప్రధానిని చేశాక, రాజకీయాల నుంచి తప్పుకోవాలని భావించినట్టు నా భార్యకు చెప్పా. ఇప్పుడు అనుకోకుండా ఉపరాష్ట్రపతి కావడంతో మరో ఆరేళ్లు ఈ పదవిలో కొనసాగాల్సి ఉంది. అందువల్ల రాజకీయ పార్టీలకు అతీతంగా ఉన్నప్పటికీ రిటైర్మెంట్ అనే కోరిక నేరవేరే అవకాశం లేదు. సన్మానాలు బాధ్యతలను గుర్తు చేస్తాయి. ఇక్కడ లభించిన అపూర్వ స్వాగతాన్ని ఎప్పటికీ మరచిపోలేను. ఇప్పటివరకు నేను చేపట్టిన ప్రతి పదవికీ న్యాయం చేశా. రాజ్యసభలో కొత్త ప్రమాణాలు నెలకొల్పి పెద్దల సభకు పూర్వ వైభవం తీసుకొస్తా'' అని వెంకయ్యనాయుడు ఉద్ఘాటించారు. వెంకయ్య నాయుడుది సుదీర్ఘ రాజకీయ ప్రస్థానం అని రాష్ట్ర గవర్నర్ ఈఎస్‌ఎల్ నరసింహన్ పేర్కొన్నారు. క్రమశిక్షణకు మారుపేరుగా ఎన్నో గొప్ప గుణాలు కలిగిన వ్యక్తి వెంకయ్య అని కొనియాడారు.



ర్యాలీగా వస్తున్న ఉప రాష్ట్రపతి వెంకయ్య. చిత్రంలో గవర్నర్ నరసింహన్, సీఎం చంద్రబాబు (వృత్తంలో) కాన్వాయ్ సమీపంలో పడిపోతున్న డ్రోన్ కెమెరా

బాధగా ఉంది: సీఎం చంద్రబాబు

రాష్ట్ర విభజన సమయంలో ఏపీకి వెంకయ్య నాయుడు అండగా నిలిచారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రతి సందర్భంలోనూ తమకు పెద్ద దిక్కుగా ఉన్న ఆయన ఉపరాష్ట్రపతిగా రాజకీయాలకు దూరంగా ఉండటం లోటు అని, ఇది బాధగా ఉందని చెప్పారు. వెంకయ్య ఇకపై రాజకీయాలు మాట్లాడకపోయినా ఏపీకి అవసరమైన అండదండలు అందిస్తారని ఆశిస్తున్నట్టు తెలిపారు. దేశవ్యాప్తంగా ప్రధానమంత్రి పట్టణ గృహ నిర్మాణ పథకం కింద 26 లక్షల ఇళ్లను మంజూరు చేస్తే ఒక్క ఆంధ్రప్రదేశ్‌కే 5.35 లక్షల ఇళ్ల మంజూరుకు వెంకయ్య చొరవ చూపారని పేర్కొన్నారు. ఉప రాష్ట్రపతి అయ్యే ముందు కూడా రాష్ట్రానికి 2.25 లక్షల ఇళ్ల మంజూరుకు సంతకం చేశారని చెప్పారు.

2.25 లక్షల ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన

పౌరసన్మానం సందర్భంగా స్వచ్ఛ సత్తెనపల్లి, స్వర్గపురి పుస్తకాలను ఆవిష్కరించారు. వెంకయ్య నాయుడుకు వేదపండితులు ఆశీర్వచనాలు అందించారు. వెంకయ్య తొలుత సభా ప్రాంగణంలో పోలీస్ గౌరవ వందనాన్ని స్వీకరించారు. రాష్ట్రంలోని వంద మున్సిపాలిటీలకు ప్రధానమంత్రి పట్టణ గృహ నిర్మాణ పథకం కింద కేంద్ర ప్రభుత్వం కేటాయించిన 2.25 లక్షల ఇళ్ల నిర్మాణానికి వెంకయ్య నాయుడు శంకుస్థాపన చేశారు. ఈ మేరకు శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు పూసపాటి అశోక్ గజపతిరాజు, సుజనా చౌదరి, అసెంబ్లీ స్పీకర్ కోడెల శివప్రసాదరావు, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్, నాగులపల్లి శ్రీకాంత్, సీనియర్ పాత్రికేయుడు పొత్తూరి వెంకటేశ్వరరావు మాట్లాడారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, డీజీపీ నండూరి సాంబశివరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

'సిట్' గడువు పొడిగింపుపై సందిగ్ధం

నేటితో ముగియనున్న దర్యాప్తు గడువు

పొడిగించాలని కోరిన సిట్ చీఫ్.. స్పందించని ప్రభుత్వం

సాక్షి, విశాఖపట్నం : రాష్ట్రాన్ని కుదిపేసిన విశాఖ భూకుంభకోణంపై ప్రభుత్వం ఏర్పాటుచేసిన స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం(సిట్) గడువు ఆదివారంతో ముగియనుంది. గడువు మరో 2 నెలలు పెంచాలని కోరుతూ సిట్ చీఫ్ వినీత్ బ్రిజ్‌లాల్ రాసిన లేఖకు ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాలేదు. దీంతో విచారణ కొనసాగింపుపై సందిగ్ధం నెలకొంది. మధురవాడ, కొమ్మాది ప్రాంతాల్లో రికార్డుల ట్యాంపరింగ్‌పై మొదలైన ఈ వివాదం లక్ష ఎకరాలకు సంబంధించిన ఎఫ్‌ఎంబీలు, విలేజ్ మ్యాప్‌లు ఇతర విలువైన డాక్యుమెంట్లు గల్లంతయ్యాయని జిల్లా కలెక్టర్ ప్రకటించడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనమైంది. ఈ భూవివాదంపై సీబీఐ విచారణకు డిమాండ్ చేస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో విపక్షాలన్నీ పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టాయి. ప్రభుత్వం మాత్రం సిట్‌తోనే సరిపెట్టింది. సిట్‌కు 2,865 ఫిర్యాదులు రాగా వాటిలో నిబంధనలకు అనుగుణంగా సిట్ పరిధిలోకి 337 అర్జీలు వచ్చాయి. మిగిలిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులకు పరిష్కారం నిమిత్తం రిఫర్ చేశారు. సిట్ పరిధిలోకి వచ్చే ఫిర్యాదుల పరిష్కారం కోసం 6 ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేపట్టారు. 2 నెలలుగా సాగుతున్న ఈ విచారణలో ఇప్పటి వరకు సిట్ పరిధిలోకి వచ్చిన 106, సిట్ పరిధిలోకి రాని అర్జీల్లో 103 పరిష్కరించగలిగారు.

రెండు నెలలు గడువు కోరినా..: మొత్తం వ్యవహారంలో ఇప్పటివరకూ సుమారు 8 ఎఫ్‌ఐఆర్‌లు నమోదయ్యాయి. అనకాపల్లి ఎమ్మెల్యే పీలా గోవింద్, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి పీలా శ్రీనివాసరావుతో పాటు ఎమ్మెల్యే కుటుంబసభ్యులపై ఆనందపురం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. అలాగే జీవీఎంసీ నాలుగోవార్డు టీడీపీ అధ్యక్షుడితో పాటు అదే వార్డుకు చెందిన టీడీపీ మాజీ కార్పొరేటర్‌పై కూడా ఎఫ్‌ఐఆర్ నమోదైంది. ట్యాంపరింగ్ వివాదంలో కీలక నిందితుడిగా భావిస్తున్న ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ జీఎల్ గణేశ్వరరావుతో పాటు రిటైర్డ్ తహసీల్దార్లు మజ్జి శంకరరావు, బీటీవీ రామారావులను కూడా అరెస్టుచేసి విచారణ చేపట్టారు. మరోవైపు సిట్ సిఫార్సుల మేరకు 14 మంది తహసీల్దార్లు, మరికొందరు అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. రికార్డుల అధ్యయనం, క్షేత్రస్థాయి పరిశీలనలతో కూడుకోవడంతో సిట్ దర్యాప్తు అనుకున్నంత వేగంగా జరగడం లేదు. దీంతో మరో 2నెలల గడువు కోరుతూ ఈ నెల 19న సిట్ చీఫ్ ప్రభుత్వానికి లేఖ రాశారు. కమిటీ సభ్యురాలు జేసీని వివరణ కోరగా గడువు పొడిగింపునకు సంబంధించి ఉత్తర్వులు రాలేదని, ఒకట్రెండు రోజుల్లో వెలువడే అవకాశముందన్నారు.

సాక్షి
రౌండప్
వైఎస్సార్ జిల్లా
ఆదివారం | ఆగస్టు | 27 | 2017
www.sakshi.com

ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) వివరాల ప్రకారం భారతదేశంలో పట్టణప్రాంతాల్లో 20-40 శాతం, గ్రామీణ ప్రాంతాల్లో 12-17 శాతం మంది బీపీ బాధితులు ఉన్నారు. 25 ఏళ్లు పైబడిన వాళ్లలో 23.10 శాతం మంది పురుషులు, 22.60 శాతం మంది మహిళలు అధిక బీపీతో బాధపడుతున్నారు.



రాష్ట్రంలో రక్తపోటు బాధితుల సంఖ్య రోజు రోజుకూ తీవ్రమవుతోంది. అయితే ఇరవై ఏళ్ల నుంచి 45 ఏళ్ల లోపు వారిలోనే ఎక్కువగా బీపీ ఛాయలు కనిపిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. రాష్ట్రంలో ఎక్కువగా స్ట్రోక్ (పెరాలసిస్) వస్తున్న వారి సంఖ్య కూడా పెరుగుతున్నట్టు ఇటీవల జాతీయ కుటుంబ ఆరోగ్య సంస్థ సర్వేలో తేలింది. ఏటా 40 వేల మందికి పైగా పెరాలసిస్ బారిన పడుతున్నట్టు సర్వేలో వెల్లడైంది. మెదడులో రక్తస్రావం (బ్రెయిన్ హెమరేజ్) కేసులు కూడా పెరుగుతున్నాయని వైద్యులు చెబుతున్నారు. ఇతర రాష్ట్రాలతో పోల్చుకుంటే ఏపీలో నమోదవుతున్న ఈ కేసుల వివరాలు చాలా ప్రమాదకర స్థాయిలో ఉన్నట్టు వెల్లడైంది. రాష్ట్రంలో చాలా మందికి రక్తపోటు మీద ఏ మాత్రం అవగాహన లేదని సర్వేలో తేలింది. చాలామంది 45 ఏళ్లు వచ్చే వరకూ బీపీ పరీక్షలు చేయించుకోకపోవడం విస్మయపరుస్తోంది. సాధారణంగా 120/80 నార్మల్ బీపీ. కానీ సగటున సాధారణం కంటే ఎక్కువ బీపీ ఉన్నవారిలో మహిళలు 7.6 శాతం ఉండగా, పురుషులు మాత్రం 11 శాతం ఉన్నారు. 180కి మించి బీపీ ఉన్నవారిలో 1.6 శాతం మంది పురుషులుండగా, 0.7 శాతం మంది మహిళలు ఉన్నారు. రాష్ట్రంలో సాధారణం కంటే ఎక్కువ స్థాయిలో బీపీ నమోదైనవారు కోటిన్నర మంది వరకూ ఉన్నట్టు అంచనా.


- సాక్షి, అమరావతి



బీపీ పెరుగుతోంది!!

- కోటిన్నర మందిలో సాధారణం కంటే ఎక్కువగా నమోదు
- మూడు జిల్లాల్లో పురుషుల కంటే మహిళల్లోనే బీపీ ఎక్కువ
- రాష్ట్రంలోనే అత్యధికంగా వైఎస్సార్ జిల్లాలో 17.8 శాతం
- మహిళల్లో అత్యధికంగా అనంతపురం జిల్లాలో 9.2 శాతం
- వ్యాధిపై అవగాహన లేక బాధితులుగా మారుతున్న గ్రామీణులు
- జాగ్రత్తలు పాటిస్తే నియంత్రణలో ఉంచుకోవచ్చు అంటున్న వైద్యులు

అధిక రక్తపోటుకు కారణాలు..



ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కువ మంది రక్తపోటు బాధితులుగా మారడానికి వివిధ కారణాలు ఉన్నాయి. ఇందులో ప్రధానంగా..

1. శరీర బరువు నియంత్రణలో లేకపోవడం
2. విపరీతమైన పని ఒత్తిడి కారణంగా బీపీ రావడం
3. వారానికి రెండ్రోజులు కూడా వ్యాయామం చేయకపోవడం
4. అవగాహన లేక ఉప్పు అధికంగా వాడటం
5. మాంసాహారం ఎక్కువగా వాడటం వల్ల బరువు పెరిగి బీపీకి చేరువవడం
6. జీవనశైలి కారణంగా అంటే సమయానికి ఆహారం తీసుకోకపోవడం నిద్ర పోకపోవడం వల్ల కూడా రక్తపోటు పెరుగుతోంది.

బీపీ నియంత్రణకు వైద్యుల చిట్కాలు



ఒక్కసారి రక్తపోటు వచ్చాక అది జీవితాంతం ఉంటుంది. దాన్ని నియంత్రణలో ఉంచుకోవడం మినహా పూర్తిగా నివారించడం సాధ్యం కాదు. నియంత్రణలో ఉంచుకోవాలంటే..

- రోజూ 30 నుంచి 40 నిముషాల పాటు వ్యాయామం చేయాలి.
- నిల్వ పచ్చళ్లను పూర్తిగా దూరంగా ఉంచాలి.
- టేబుల్ సాల్ట్ (అదనపు ఉప్పు) పెరుగులో, కూరల్లో అదనంగా వేసుకోవడం మానాలి.
- కూరగాయలు, ఆకుకూరలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలి.
- అధిక బరువును నియంత్రణలో ఉంచుకోవాలి.
- అధిక రక్తపోటు నియంత్రణకు ఈదడం, నడవడం చేయాలి.
- తక్కువ సోడియం ఉన్న పదార్థాలను తినాలి.
- ఆల్కహాల్ అలవాటున్నవారు తక్కువ మోతాదులో తీసుకోవాలి.
- ఆహారంలో వెల్లుల్లి తీసుకోవడం వల్ల రక్తపోటు నియంత్రణలో ఉంటుంది.
- అధిక రక్తపోటు ఉన్న వారు ఆరుమాసాలకోసారి కిడ్నీ పరీక్షలు, ఈసీజీ పరీక్షలు చేయించుకోవాలి.

ఏటా 10 వేల మంది శాశ్వత వికలాంగులుగా..

చాపకింద నీరులా విస్తరిస్తోన్న రక్తపోటు ఎన్నో కుటుంబాలను విధివంచితులుగా చేస్తోంది. ఏటా సుమారు 40 వేల పెరాలసిస్ కేసులు నమోదు అవుతుండగా.. అందులో సమయానికి వైద్యం అందకపోవడంతో సుమారు 10 వేల మంది శాశ్వత వికలాంగులుగా మారుతున్నట్టు వైద్యులు చెబుతున్నారు. కాలు, చేయి పడిపోవడం ద్వారా ఆయా బాధితులు కనీస పనులు కూడా చేసుకోలేని స్థితిలో ఉన్నట్టు తేలింది. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ మందికి అవగాహన లేకపోవడంతో ఇలా బాధితులుగా మారుతున్నట్టు వైద్యులు అభిప్రాయపడుతున్నారు.


పురుషుల్లో వైఎస్సార్, విజయనగరం

బీపీ బాధితుల్లో పురుషుల విభాగంలో మొదటి స్థానంలో వైఎస్సార్ జిల్లా ఉండగా, రెండో స్థానంలో విజయనగరం ఉంది. వైఎస్సార్ జిల్లాలో 17.8 శాతం మంది రక్తపోటు బాధితులున్నారు. కాగా విజయనగరంలో 15.9 శాతం మంది ఉన్నారు. మహిళల్లో అనంతపురం జిల్లాలో 9.2 శాతం మంది బీపీ బాధితులు ఉండగా, రెండో స్థానంలో కృష్ణా జిల్లాలో 9.1 శాతం మంది ఉన్నారు.

మూడు జిల్లాల్లో మహిళలే టాప్

ఆంధ్రప్రదేశ్‌లో 10 జిల్లాల్లో మహిళల కంటే పురుషుల్లోనే బీపీ బాధితులు ఎక్కువగా ఉండగా కృష్ణా, గుంటూరు, నెల్లూరు జిల్లాల్లో మహిళలే ఎక్కువ. కృష్ణాలో పురుషులు 8.6 శాతం ఉండగా మహిళలు మాత్రం 9.1 శాతం మంది ఉన్నారు. అలాగే గుంటూరు జిల్లాలో 8 శాతం మంది పురుషులు, 8.7 శాతం మంది మహిళలు, నెల్లూరు జిల్లాలో 7.1 శాతం మంది పురుషులు, 8.8 శాతం మంది మహిళలున్నారు. మారిన జీవన శైలి, ఆహార పదార్థాలు రక్తపోటు పెరగడానికి కారణమని వైద్యులు చెబుతున్నారు.

140 నుంచి 159 మధ్య రక్తపోటు నమోదైన బాధితులు (శాతాల్లో)



అసిస్టెంట్ సొలిసిటర్ జనరల్‌గా కె.లక్ష్మణ్



సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి హైకోర్టులో కొత్త అసిస్టెంట్ సొలిసిటర్ జనరల్ (ఏఎస్‌జీ)గా కె.లక్ష్మణ్ నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర న్యాయ శాఖ ఉత్తర్వులు జారీచేసింది. హైకోర్టులో కేంద్ర ప్రభుత్వం తరఫున అసిస్టెంట్ సొలిసిటర్ జనరల్ వాదనలు వినిపిస్తారు. శుక్రవారం వరకు ఏఎస్‌జీగా ఉన్న బి.నారాయణరెడ్డి స్థానంలో లక్ష్మణ్ నియమితులయ్యారు. మూడేళ్లు లేదా తదుపరి ఉత్తర్వులు జారీ అయ్యేంత వరకు ఆయన ఈ పోస్టులో కొనసాగుతారు. లక్ష్మణ్ స్వస్థలం యాదాద్రి జిల్లా రామన్నపేట మండలం భోగారం గ్రామం. ప్రస్తుతం ఆయన న్యాయవాద పరిషత్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు.

కో పైలట్‌కు గుండెపోటు

ఖతార్ విమానం అత్యవసర ల్యాండింగ్

హైదరాబాద్: కో పైలట్‌కు గుండెపోటు రావడంతో ఖతార్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన క్యూఆర్ 964 విమానం శంషాబాద్ ఎయిర్‌పోర్టులో అత్యవసరంగా ల్యాండైంది. శుక్రవారం సాయంత్రం 5.20కు దోహా విమానాశ్రయం నుంచి బాలీ (ఇండోనేసియా)లోని డెన్‌పార్ విమానాశ్రయానికి వెళ్లడానికి టేకాఫ్ తీసుకుంది. ఆ విమానంలో కో పైలట్‌గా ఉన్న రుమానియా దేశానికి చెందిన టీనుఆమ్రే (34) తీవ్ర అస్వస్థతకు గురికావడంతో పైలట్ శంషాబాద్ ఏటీసీని సంప్రదించాడు. ఏటీసీ సూచనల మేరకు రాత్రి 12.10 గంటల సమయంలో విమానాన్ని శంషాబాద్ విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండ్ చేశారు. వెంటనే అతడిని విమానాశ్రయంలోని అపోలో ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రాథమిక చికిత్స అనంతరం అక్కడ్నుంచి నగరంలోని మరో అపోలో ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతడి ఆరోగ్యం నిలకడగా ఉందని ఎయిర్‌పోర్టు వర్గాలు వెల్లడించాయి.

దినకరన్ శిబిరంలోకి మరో ఇద్దరు

- 113కు పడిపోయిన తమిళనాడు ప్రభుత్వ బలం
- చెన్నైకి చేరుకున్న గవర్నర్.. నిర్ణయంపై ఉత్కంఠ

సాక్షి ప్రతినిధి, చెన్నై: తమిళనాడులో అధికార పార్టీ రాజకీయాలు రోజుకో మలుపు తిరుగుతున్నాయి. పళనిస్వామి ప్రభుత్వాన్ని కూల్చివేసే దిశగా అడుగులు వేస్తున్న టీటీవీ దినకరన్ మరో ట్విస్ట్ ఇచ్చారు. తాజాగా మరో ఇద్దరు ఎమ్మెల్యేలను తన శిబిరంలోకి లాగేసుకున్నారు. ఎమ్మెల్యేలు రత్నసభాపతి, కలైసెల్వన్ దినకరన్ శిబిరంలో చేరడంతో దినకరన్ వర్గ బలం 21కు చేరుకుంది. మరో రెండు రోజుల్లో 8 మంది మంత్రులు, 60 మంది ఎమ్మెల్యేలు తమ వైపునకు రానున్నారని శశికళ తమ్ముడు దినకరన్ శనివారం మీడియాకు చెప్పారు. కాగా, అనర్హత వేటుపై స్పీకర్ ఇచ్చిన నోటీసులు తమకు అందలేదని, ఒకవేళ అందినా బదులిచ్చేది లేదని దినకరన్ వర్గ ఎమ్మెల్యే వెత్రివేల్ తేల్చిచెప్పారు. 2 రోజుల్లోగా గవర్నర్ నిర్ణయం తీసుకోకపోతే రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను కలుస్తామని దినకరన్ వర్గ ఎమ్మెల్యేలు స్పష్టం చేశారు. అసెంబ్లీలో అన్నాడీఎంకేకు 134 మంది ఎమ్మెల్యేలు ఉండగా.. వారిలో 21 మంది దినకరన్ శిబిరంలో చేరారు. దీంతో అధికార అన్నాడీఎంకే బలం 113కు పడిపోయింది. ప్రభుత్వం నిలబడేందుకు మరో నలుగురు ఎమ్మెల్యేలు అవసరం. అన్నాడీఎంకే మద్దతుతో గెలిచిన మిత్రపక్ష పార్టీ ఎమ్మెల్యేలు ముగ్గురు కూడా దినకరన్ వైపే మొగ్గు చూపుతున్నట్లు తెలిసింది. కాగా, ప్రభుత్వం మైనార్టీలో పడిపోయిన స్థితిలో ఎలాంటి నిర్ణయం ప్రకటించకుండా ముంబై వెళ్లిపోయిన తమిళనాడు తాత్కాలిక గవర్నర్ విద్యాసాగర్‌రావు శనివారం సాయంత్రం చెన్నైకి చేరుకున్నారు. దీంతో ఎడపాడి ప్రభుత్వంపై ఆయన ఏ నిర్ణయం తీసుకుంటారో అని అందరిలో ఉత్కంఠ నెలకొంది. అసెంబ్లీలో బలాన్ని నిరూపించుకోవాలని గవర్నర్ ఆదేశించిన పక్షంలో ఎడపాడి ఇరుకునపడక తప్పదు. ఇదిలా ఉండగా, ఉప రాష్ట్రపతి హోదాలో వెంకయ్యనాయుడు ఆదివారం తొలిసారి చెన్నైకి వస్తున్నారు. ఆయనకు స్వాగతం పలికేందుకే గవర్నర్ వస్తున్నారని.. ఇతరత్రా నిర్ణయాలేవీ తీసుకోరని కొందరు చెబుతున్నారు.

రక్షణ పరిశోధనలో అగ్రగామిగా భారత్

పొరుగు దేశాల బెదిరింపులకు భయపడేది లేదు
వందవ హాక్–ఐ ఆవిష్కరణలో రక్షణ మంత్రి అరుణ్ జైట్లీ స్పష్టీకరణ

సాక్షి, బెంగళూరు: దేశ రక్షణ విషయంలో ఏమాత్రం రాజీపడబోమని రక్షణ శాఖ మంత్రి అరుణ్ జైట్లీ స్పష్టం చేశారు. భారత సార్వభౌమాధికారానికి భంగం కలిగించే ఏ చర్యనూ ఎన్డీఏ ప్రభుత్వం సహించబోదని అన్నారు. మేక్ ఇన్ ఇండియాలో భాగంగా స్థానిక హిందుస్థాన్ ఏరోనాటికల్ (హెచ్ఏఎల్) సంస్థ పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన తేలికపాటి యుద్ధ విమానం హాక్–ఐను శనివారం బెంగళూరు హెచ్ఏఎల్ ప్రాంగణంలో ఆయన జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా జైట్లీ మాట్లాడుతూ....పొరుగు దేశాలతో పోలిస్తే రక్షణ శాఖ పరిశోధనలు, శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానంలో భారత్ ముందుందని అన్నారు. రక్షణ సామగ్రిని గతంలో ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకునే వారమని, ఇప్పుడు ఎగుమతి చేసే స్థాయికి చేరుకున్నామని చెప్పారు. పొరుగు దేశాల బెదిరింపులకు ఏమాత్రం భయపడేది లేదని తేల్చి చెప్పారు. దేశ రక్షణ రంగానికి అవసరమైన వస్తువుల ఉత్పత్తిలో ప్రైవేటు సంస్థలనూ భాగస్వాములు చేస్తున్నామని, ఇది మంచి ఫలితాలనే ఇస్తోందని తెలిపారు.



హాక్ ఐ విమానాన్ని పరిశీలిస్తున్న అరుణ్‌జైట్లీ

ఆగని అరాచకం

- నంద్యాలలో పేట్రేగిపోతున్న టీడీపీ నేతలు
- ఓడిపోతామన్న భయంతో శిల్పా చక్రపాణిరెడ్డిపై హత్యాయత్నం
- టీడీపీకి ఓటు వేయలేదని ఓ మహిళపై దాడి
- దళిత మహిళలను ఇంట్లోంచి బయటకు లాగి కొట్టిన ఏవీ సుబ్బారెడ్డి

నంద్యాల: కర్నూలు జిల్లా నంద్యాలలో రౌడీయిజం రాజ్యమేలుతోంది. ఉప ఎన్నిక పోలింగ్ ముగిసినా టీడీపీ నేతల ఆగడాలు కొనసాగుతూనే ఉన్నాయి. పోలింగ్‌కు ముందు ప్రలోభాలు, బెదిరింపులు, ప్రత్యర్థుల ఇళ్లలో పోలీసుల ద్వారా సోదాలతో బెంబేలెత్తించిన నేతలు.. ఆ తర్వాత ఏకంగా దాడులకు దిగుతున్న వైనం ఆందోళన కలిగిస్తోంది. తమ ఓటు బ్యాంకుకు గండి పడిందనే అక్కసుతో పేట్రేగిపోతున్నారు. వైఎస్సార్‌సీపీ నేత, మాజీ ఎమ్మెల్సీ శిల్పా చక్రపాణిరెడ్డిపై గురువారం హత్యాయత్నం ఘటన రాష్ట్ర వ్యాప్తంగా కలకలం రేపిన విషయం తెలిసిందే. అదేరోజు.. తమకు ఓటు వేయలేదనే అనుమానంతో విశ్వనగర్‌లో రాములమ్మ అనే మహిళపై దాడి చేశారు. ఈ ఘటనలు మరువకముందే గురువారం రాత్రి భూమా అనుచరుడు, టీడీపీ నేత ఏవీ సుబ్బారెడ్డి దళిత మహిళలపై తన అనుచరులతో కలిసి దాడి చేయడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. నంద్యాలలోని నూనెపల్లెలో ఈ ఘటన చోటుచేసుకుంది. చెన్నకేశవ స్వామి దేవాలయం సమీపంలో వినాయకుడి విగ్రహం ఏర్పాటు చేయాలని టీడీపీ నాయకులు నిర్ణయించారు. అయితే.. ఇక్కడ ఇదివరకెన్నడూ విగ్రహం ఏర్పాటు చేయలేదని, మరోచోట ఏర్పాటు చేయాలని స్థానికులు సూచించారు. ఈ విషయాన్ని టీడీపీ నేతలు ఏవీ సుబ్బారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన తన అనుచరులతో కలిసి దేవాలయం వద్దకు చేరుకుని స్థానికులతో వాదనకు దిగారు. ఇక్కడ ఏర్పాటే చేయొద్దని మహిళలు ఎంతగా చెప్పినా వినకపోవడంతో ఏవీ సుబ్బారెడ్డి తన అనుచరులతో కలిసి వారిపై దాడి చేశారు. తిరుపతి దేవి, చెన్నమ్మ అనే దళిత మహిళలను ఇంట్లో నుంచి బయటకు లాగి కొట్టారు. దాడిలో గాయపడిన మహిళలను స్థానికులు నంద్యాల ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఏవీ సుబ్బారెడ్డి, ఆయన అనుచరులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ సీఐ దేవేందర్ తెలిపారు. నంద్యాల ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళలను వైఎస్సార్‌సీపీ అభ్యర్థి శిల్పామోహన్‌రెడ్డి తనయుడు శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి పరామర్శించి ధైర్యం చెప్పారు.


అసలు నిందితుడిని అరెస్ట్ చేయరా?

పట్టపగలు నడిరోడ్డుపై వేట కొడవలి పట్టుకుని మాజీ ఎమ్మెల్సీ శిల్పా చక్రపాణిరెడ్డిపై హత్యాయత్నం చేసిన టీడీపీ నాయకుడు అభిరుచి మధు వీరంగాన్ని అందరూ చూశారు. అతనిపై కేసు నమోదవుతుందని తెలుసుకున్న టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ నాయకులపై ఎదురు కేసు పెట్టారు. కోట్లాది మంది ప్రజలు నంద్యాలలో ఏం జరిగిందో టీవీ చానళ్లలో, సోషల్ మీడియాలో చూసిన జనం ఏమనుకుంటారన్న ఆలోచన లేకుండా పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తుండటం గమనార్హం. అసలు నిందితుడు అభిరుచి మధు జోలికి వెళ్లకుండా, వైఎస్సార్‌సీపీ నాయకులను మాత్రం లొంగిపోవాలంటూ ఒత్తిడి తెచ్చారు. ఈ ఘటనకు సంబంధించి వైఎస్సార్‌సీపీ నాయకుడు జగదీశ్వరరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అభిరుచి మధుతో పాటు అతని అనుచరులపై టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే అభిరుచి మధు ఫిర్యాదు మేరకు శిల్పాచక్రపాణిరెడ్డితో పాటు కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులపై కేసు పెట్టారు. ఇరువర్గాలపై కేసు నమోదు చేసిన పోలీసులు.. కేవలం వైఎస్సార్‌సీపీ నాయకులనే టార్గెట్ చేశారు. లొంగిపోవాలని, లేకపోతే అరెస్ట్ చేస్తామని తీవ్ర స్థాయిలో ఒత్తిడి తెచ్చారు. చట్టాన్ని గౌరవిస్తూ వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదిరెడ్డి, కౌన్సిలర్ జాకీర్ హుసేన్, చెంగల్‌రాయుడు శుక్రవారం రాత్రి టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయారు. వీరిని శిల్పా మోహన్‌రెడ్డి తనయుడు రవిచంద్రకిశోర్‌రెడ్డి స్వయంగా తీసుకొచ్చి స్టేషన్‌లో అప్పగించారు. వీరిని టూటౌన్ సీఐ శ్రీనివాసులు నంద్యాల కోర్టులో హాజరు పర్చగా.. మెజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించారు. కాగా.. నడిరోడ్డుపై మీసం మెలేస్తూ, వేటకొడవలి పట్టుకొని గీత గీసి సవాల్ విసురుతూ, నానా దుర్భాషలాడుతూ చక్రపాణిరెడ్డిని చంపడానికి వెళ్లిన అభిరుచి మధును మాత్రం పోలీసులు అరెస్ట్ చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. అతను శనివారం నంద్యాల పట్టణంలోనే ఉంటూ తన జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకోవడం గమనార్హం. ఇంటి వద్ద తన మద్దతుదారులతో కలిసి హంగామా చేస్తున్నా పోలీసులు అటువైపు కన్నెత్తి చూడలేదు. మధు జోలికి వెళ్లవద్దని నంద్యాల పోలీసులకు ఉన్నత స్థాయి అధికారులు మౌఖిక ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.


నంద్యాల ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న తిరుపతిదేవి


శనివారం పుట్టిన రోజు వేడుకలు జరుపుకుంటున్న అభిరుచి మధు

అసహనంతోనే దాడులు



ఉప ఎన్నిక పోలింగ్ శాతం పెరగడంతో ప్రజలు వైఎస్సార్‌సీపీకి ఓటు వేశారన్న అసహనంలో టీడీపీ నాయకులు ఉన్నారు. అందువల్లే ప్రజలపై దాడులు చేస్తున్నారు. దళిత మహిళలని చూడకుండా దౌర్జన్యం చేస్తూ వారిని కొట్టడం దారుణం. వేటకొడవలి పట్టుకొని శిల్పా చక్రపాణిరెడ్డిని చంపడానికి వచ్చిన అభిరుచి మధును వదిలేసి మా పార్టీ నాయకులను అరెస్ట్ చేయడం అన్యాయం. గొడవ జరుగుతుంటే మా పార్టీ నాయకులు సర్ది చెప్పారే తప్ప దాడికి పాల్పడలేదు. టీడీపీ నాయకులే దాడి చేసి.. వారే మాపై ఎదురు కేసులు పెట్టారు. పైగా మమ్మల్నే అరెస్ట్ చేయడం వెనుక కుట్ర ఉంది. అభిరుచి మధు స్వేచ్ఛగా నంద్యాలలో తిరుగుతున్నా ఎందుకు అరెస్ట్ చేయడం లేదు? పోలింగ్ ముగిసిన తర్వాత కూడా టీడీపీ నేతలు రెచ్చిపోతుండటం ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తోంది. ఇప్పటికైనా ప్రజాస్వామ్యయుతంగా నడుచుకోకపోతే ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నాం. కార్యకర్తలు, ప్రజలు భయపడాల్సిన పనిలేదు. ఎవరికేం అన్యాయం జరిగినా ఎల్లప్పుడూ అండగా ఉంటాం.

- శిల్పా మోహన్ రెడ్డి, వైఎస్సార్ సీపీ అభ్యర్థి

ఆ ఖర్చంతా టీడీపీ అభ్యర్థి ఖాతాలోకే

స్టార్ క్యాంపెయినర్ల ఖర్చుపై ఈసీ నిర్ణయం

సాక్షి ప్రతినిధి, కర్నూలు: నంద్యాల ఉప ఎన్నికలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన భూమా బ్రహ్మానందరెడ్డికి కొత్త చిక్కులు వచ్చిపడ్డాయి. ఎన్నికల సంఘానికి (ఈసీ) తమ పార్టీ స్టార్ క్యాంపెయినర్ల జాబితాను సకాలంలో టీడీపీ సమర్పించలేదు. పోలింగ్‌కు ముందు రోజున జాబితాను సమర్పించినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో స్టార్ క్యాంపెయినర్ల ప్రచార ఖర్చును కూడా అభ్యర్థి ఖర్చులోనే కలిపేయాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఆ పార్టీ స్టార్ క్యాంపెయినర్లు సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే బాలకృష్ణ ఖర్చులు కూడా కలిపి మొత్తం ఖర్చు రూ.28 లక్షలు దాటితే పరిస్థితి ఇబ్బందికరంగా మారనుంది. ఇప్పటికే ఎమ్మెల్యే బాలకృష్ణ డబ్బు పంచుతూ మీడియాకు అడ్డంగా దొరికిపోయారు. దీనిపై విచారణ జరపాలని కలెక్టర్‌ను ఈసీ ఆదేశించింది. ఈ సమస్యకు తోడు ఇపుడు కొత్త సమస్య వచ్చి పడిందని ఆ పార్టీ శ్రేణులు ఆందోళనకు గురవుతున్నాయి. నిబంధనలు తెలిసినప్పటికీ టీడీపీ నేతలు ఎందుకు ఆలస్యంగా జాబితాను ఇచ్చారనేది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది.

నిబంధనలు ఏమంటున్నాయంటే..

వాస్తవానికి తమ పార్టీ తరఫున ఎవరెవరు స్టార్ క్యాంపెయినర్లుగా ప్రచారం నిర్వహించనున్నారనే విషయాన్ని నోటిఫికేషన్ విడుదలైన వెంటనే ఈసీకి అందించాల్సి ఉంటుంది. ఈ విధంగా అందజేస్తే సదరు స్టార్ క్యాంపెయినర్ల ప్రచార ఖర్చును అభ్యర్థి ఖర్చులో కాకుండా పార్టీ ఖర్చులో జమ చేస్తారు. ఈ మేరకు ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 77 స్పష్టం చేస్తోంది. అయితే, టీడీపీ.. జాబితా అందించడంలో తీవ్ర ఆలస్యం చేయడంతో వారి ఖర్చును కూడా అభ్యర్థి వ్యయంలో జమ చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి భన్వర్‌లాల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) ఆదేశించింది. వాస్తవానికి తమ స్టార్ క్యాంపెయినర్లుగా సీఎం చంద్రబాబు నాయుడు, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణలను అధికార పార్టీ నిర్ణయించింది. ఈ జాబితాను ఎన్నికల సంఘానికి పోలింగ్ తేదీకి ముందు రోజున ఇచ్చింది. ఈ నేపథ్యంలో అభ్యర్థి ప్రచార ఖర్చు రూ.28 లక్షలు దాటితే బ్రహ్మానందరెడ్డి పోటీ వ్యవహారం మొత్తం తలకిందులు కానుంది. ఈ విషయమై.. పరిశీలించిన తర్వాత తదనుగుణంగా చర్యలు తీసుకుంటామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కర్నూలు జిల్లా జేసీ ప్రసన్న వెంకటేశ్ తెలిపారు.

అమిత్‌షా రాష్ట్ర పర్యటన వాయిదా

సాక్షి, అమరావతి: భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా రాష్ట్ర పర్యటన వాయిదా పడింది. దేశవ్యాప్తంగా బీజేపీ బలోపేతం చేసే ప్రక్రియలో భాగంగా ఈ నెల 28వ తేదీ నుంచి మూడు రోజులపాటు ఆయన రాష్ట్రంలో పర్యటించాల్సి ఉంది. విజయవాడ కేంద్రంగా ఆయన రాష్ట్ర పార్టీ నేతలందరితో విడతల వారీగా భేటీ కావడంతోపాటు ఒక రాత్రి పార్టీ కార్యకర్తల ఇంట బస చేసే కార్యక్రమాలకు ప్రణాళికలు సిద్ధం చేశారు. కాగా, శుక్రవారం రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు కె.హరిబాబు మీడియాకు ఒక ప్రకటనలో విడుదల చేస్తూ.. 'ఆగస్టు 28, 29, 30 తేదీల్లో ఏపీలో జరగవలసిన అమిత్ షా పర్యటన వాయిదా పడింది' అని పేర్కొన్నారు. కేంద్ర మంత్రివర్గ విస్తరణ, ఉత్తరాది రాష్ట్రాలు హర్యానా, పంజాబ్, యూపీ, ఢిల్లీ వంటి ప్రాంతాల్లో అల్లర్లు చెలరేగడం తదితర కారణాల నేపథ్యంలో జాతీయ అధ్యక్షుడి పర్యటన వాయిదా పడినట్టు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. సెప్టెంబర్‌లో అమిత్ షా తమిళనాడు రాష్ట్రంలో మూడు రోజులపాటు పర్యటించాల్సి ఉందని.. ఆ కార్యక్రమం అనంతరం ఏపీ పర్యటన ఉండవచ్చని బీజేపీ నేతలు తెలిపారు.


సాక్షి
జాతీయం /అంతర్జాతీయం
వైఎస్ఆర్ జిల్లా
ఆదివారం । ఆగస్టు । 27 । 2017

డేరా విధ్వంసకాండ



రేప్ కేసులో గుర్మీత్‌ను కోర్టు దోషిగా తేల్చడంతో పంచకులలో ఆందోళనకారుల విధ్వంసకాండకు సజీవ సాక్ష్యమీ చిత్రం

ఆందోళనల నేపథ్యంలో సిర్సాలో జనజీవనం స్తంభించిపోయింది. మూడు రోజులుగా బ్యాంకులు, ఏటీఎంలు మూతపడటంతో నిత్యావసరాల కొనుగోలుకు డబ్బులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నేడు సిర్సాలో ఉదయం 6 నుంచి 11 గంటల వరకు కర్ఫ్యూను సడలిస్తారు.



తగలబడ్డ హరియాణా, పంజాబ్.
36 మంది మృతి.. 269 మందికి గాయాలు

పంచకుల/చండీగఢ్/న్యూఢిల్లీ

హరియాణా, పంజాబ్ రాష్ట్రాలు భగ్గుమన్నాయి. డేరా సచ్చా సౌధా చీఫ్ గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్‌ను రేప్‌కేసులో శుక్రవారం సీబీఐ కోర్టు దోషిగా ప్రకటించటంతో ఈ రెండు రాష్ట్రాలతోపాటు ఢిల్లీలోనూ ఆయన అభిమానులు బీభత్సం సృష్టించారు. వీరి విధ్వంసకాండతో రెండు రాష్ట్రాల్లో 36 మంది చనిపోగా.. 269 మంది గాయపడ్డారు. డేరా అభిమానులు పెట్రోలు బాంబులతో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులపై దాడులు చేశారు. పంచకులలో వీరి ఉన్మాదానికి కనబడ్డ వస్తువల్లా అగ్నికి ఆహుతైంది. రైలు, బస్సు, కారు, బైక్ అనే తేడా లేకుండా ప్రతి వాహనాన్నీ అన్యాయంగా తగలబెట్టేశారు. భవనాలనూ ఆందోళనకారులు వదల్లేదు. పంచకులలో ఎటుచూసినా వాహనాలను తగులబెట్టిన అగ్నికీలలే ఎగిసిపడ్డాయి. తమ ఉన్మాదాన్ని అడ్డుకునేందుకు వచ్చిన పోలీసులపైనా రాళ్లు రువ్వారు. మొత్తంగా హరియాణాలోని పంచకుల, సిర్సాలతోపాటు పంజాబ్‌లోని పలు ప్రాంతాల్లో ఈ అల్లర్లలో గాయపడిన వారిలో పలువురి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ఢిల్లీ శివార్లలో డేరా ఉన్మాదులు ఓ రైలు బోగీని తగులబెట్టారు. రాజస్తాన్‌లోనూ ప్రభుత్వ వాహనాలు, శ్రీ గంగానగర్ జిల్లాలో లేబర్ కోర్టు సహా రెండు ప్రభుత్వ కార్యాలయాలకు నిప్పుబెట్టారు.

డేరాల ప్రాబల్యమున్నచోట..

పంజాబ్‌లోని మాల్వా ప్రాంతంలోనూ 32 దాడి కేసులు నమోదయ్యాయి. డేరా ప్రాబల్యం ఎక్కువగా ఉన్న మాన్సా, బతిండా, ఫిరోజ్‌పూర్, పటియాలా, బర్నాలా, ఫరీద్‌కోట్ ప్రాంతాలతోపాటుగా హరియాణాలోని పంచకుల, సిర్సాతోపాటు పలు ప్రాంతాల్లో కర్ఫ్యూ (144 సెక్షన్) విధించారు. అయినా పరిస్థితి అదుపులోకి రాలేదు. పంజాబ్‌లోని మాన్సాలో ఆదాయపన్ను శాఖ భవనాన్ని తగులబెట్టగా.. మిగిలిన చోట్ల రైళ్లు, మోటార్ సైకిళ్లు, కార్లు, భవనాలకు నిప్పంటించారు. మోగా, ఫిరోజ్‌పూర్ మధ్యనున్న దాగ్రు రైల్వే స్టేషన్‌ను తగులబెట్టేందుకు ప్రయత్నించగా.. పోలీసులు అడ్డుకున్నారు. పంచకులలో విధ్వంసం ఎక్కువగా జరిగింది. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తుల విధ్వంసంతోపాటుగా మూడు టీవీచానెళ్ల ఓబీ వ్యాన్లను తగులబెట్టారు. రెండింటిని ధ్వంసం చేశారు. ఓ చానెల్ వాహనంపై దాడిచేయటంతో కెమెరామెన్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు బాష్పవాయువు ప్రయోగించి, గాల్లోకి కాల్పులు జరిపినా విధ్వంసం ఆగలేదు.

డేరా కార్యాలయాల్లో సోదాలు

కోర్టు ఆదేశాలతో సిర్సాతోపాటుగా హరియాణాలోని డేరా ప్రధాన కార్యాలయంతోపాటుగా 30 వేర్వేరు కేంద్రాల్లో పోలీసులు సోదాలు నిర్వహించారు. అక్కడున్న అనుచరులు, భక్తులను పంపించేశారు. ఈ సోదాల్లో ఓ ఏకే 47, ఆరు పిస్టళ్లు, రెండు రైఫిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. 3వేల లాఠీలు, హాకీ స్టిక్స్, పెద్ద సంఖ్యలో డీజిల్, పెట్రోల్ బాంబులను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. డేరా అభిమానులపై దేశద్రోహం కేసు నమోదు చేసినట్లు డీజీపీ వెల్లడించారు. డేరాకు సంబంధించిన 24 వాహనాలను సీజ్ చేసి వాటి నుంచి ఐదు పిస్టళ్లు, 79 రౌండ్లు కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి హరియాణాలో 552 మందిని అరెస్టు చేసినట్లు హరియాణా డీజీపీ బీఎస్ సంధు వెల్లడించారు. ఎనిమిది ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. కాగా, డేరా చీఫ్‌పై అభియోగాలు నమోదైన కేసులో దోషులకు సాధారణంగా ఏడేళ్ల జైలుశిక్ష విధిస్తారు. పలు కేసుల్లో ఇది జీవిత ఖైదుగా కూడా మారే అవకాశం ఉంది.

అసలేం జరిగింది?

2002 నాటి అత్యాచారం కేసు విచారణ సందర్భంగా డేరా చీఫ్ గుర్మీత్‌ను సీబీఐ కోర్టుకు తీసుకొచ్చారు. దీంతో వేల మంది డేరా అభిమానులు, కార్యకర్తలు కోర్టుముందు గుమిగూడారు. తమకు వ్యతిరేకంగా తీర్పు వెలువడటంతో.. అభిమానులు ఒక్కసారిగా రెచ్చిపోయారు. ముందస్తుగానే అల్లర్లపై ప్రణాళికతో సిద్ధమై వచ్చిన ఆందోళనకారులు.. పెట్రోల్ బాంబులతో భయానక వాతావరణాన్ని సృష్టించారు. సీబీఐ కోర్టు ఉన్న హరియాణాలోని పంచకుల కేంద్రంగానే ఈ గొడవలు ప్రారంభమైనా ఈ సమాచారం దావానలంలా వ్యాపించింది.

నిఘావర్గాల హెచ్చరికలు బేఖాతరు!

డేరా చీఫ్ అభిమానుల విధ్వంసపు ఆలోచనల సంగతిపై రాష్ట్ర ఇంటెలిజెన్స్ ముందుగానే సమాచారం అందించింది. మూడేళ్ల క్రితం హరియాణాలోని హిస్సార్ జిల్లాలో ఇదేవిధంగా అన్యాయాలకు పాల్పడిన బాబా రాంపాల్‌ను అరెస్టు చేసే సందర్భంలో అతని అభిమానుల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురైన విషయం సంగతి తెలిసిందే. ఈ విషయాన్ని గుర్తుచేస్తూ గుర్మీత్‌పై కోర్టు తీర్పు ఆధారంగా విధ్వంసానికి అతని అభిమానులు ప్రయత్నించే అవకాశం ఉందని హరియాణా, పంజాబ్ ప్రభుత్వాలకు ఇంటెలిజెన్స్ సూచించింది. అయితే సూచనలు ఇరు ప్రభుత్వాలూ పెద్దగా పట్టించుకోలేదని అర్థమవుతోంది. ఈ హెచ్చరికలకు అనుగుణంగా చర్యలు చేపట్టి ఉంటే.. ఈ పరిస్థితి వచ్చేది కాదని విపక్షాలు విమర్శిస్తున్నాయి. హింస మొదలవుతూనే.. పెట్రోల్ బాంబులతో దాడికి తెగబడ్డారంటే ఎంత పకడ్బందీగా దాడులకు వ్యూహరచన జరిగిందో అర్థమవుతుంది.

వీఐపీ సౌకర్యాల్లేవు!

కోర్టు తీర్పు నేపథ్యంలో డేరా చీఫ్ రాంరహీమ్ గుర్మీత్ సింగ్‌కు గతంలో కేటాయించిన 'జడ్ ప్లస్' భద్రతను హరియాణా ప్రభుత్వం వెనక్కుతీసుకున్నట్లు ఆ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీఎస్ దేశీ వెల్లడించారు. రోహ్‌తక్ జిల్లా సునరియా జైల్లో డేరా చీఫ్‌కు వీఐపీ వసతులు కల్పిస్తున్నట్లు వస్తున్న వార్తలు అవాస్తవమన్నారు. కాగా, జైలు చుట్టుపక్కల భారీ సంఖ్యలో పారామిలటరీ బలగాలను మోహరించారు. వదంతులను నమ్మొద్దని, సంయమనం పాటించాలని పోలీసు ఉన్నతాధికారులు ప్రజలకు సూచించారు. డేరా అభిమానుల విధ్వంసంతో పంజాబ్–హరియాణాల్లో రవాణా వ్యవస్థ పూర్తిగా స్తంభించింది. జమ్మూ శివార్లలోని ప్రధాన రైల్వేస్టేషన్‌లో ఈ మార్గంలో వెళ్లే రైళ్లు, బస్సులను ఆపేశారు. దీంతో వైష్ణోదేవి యాత్ర ముగించుకుని వస్తున్న భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పంజాబ్, హరియాణాల్లో జరిగిన విధ్వంసకాండను ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు ఖండించారు.

పంచకుల డీసీపీ సస్పెన్షన్

తాజా ఉద్రిక్తతల నేపథ్యంలో శాంతిభద్రతలను కాపాడటంతో విఫలమయ్యారంటూ వివాదానికి కేంద్రబిందువైన పంచకుల డీసీపీ అశోక్ కుమార్‌ను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. జిల్లా వ్యాప్తంగా, కోర్టు సమీపంలో భారీగా జనాలు గుమిగూడుతున్నా వారిని చెదరగొట్టడంలో విఫలమయ్యారని హరియాణా హోం శాఖ అదనపు కార్యదర్శి రాం నివాస్ పేర్కొన్నారు. హరియాణా, పంజాబ్‌లలో శాంతిభద్రతల పరిస్థితిని కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సమీక్షించారు. జాతీయ భద్రత సలహాదారు అజిత్ దోవల్, కేంద్ర హోం శాఖ కార్యదర్శి రాజీవ్ మెహర్షి, పారామిలటరీ బలగాల చీఫ్‌లతో ఉన్నతస్థాయి సమావేశం ఏర్పాటుచేశారు. పరిస్థితి అదుపులో ఉందని హరియాణా, పంజాబ్ డీజీపీల నుంచి సమాచారం అందినట్లు సమావేశం అనంతరం రాజీవ్ మెహర్షి వెల్లడించారు. హరియాణా, పంజాబ్, చండీగఢ్‌లలో 20వేలకు పైగా పారామిలటరీ బలగాలను మోహరించారు.

రాజకీయ అవసరాల కోసమే తగలబెట్టారు

హైకోర్టు మండిపాటు

చండీగఢ్: డేరా అభిమానుల విధ్వంసకాండతో జరిగిన నష్టంపై పంజాబ్, హరియాణా హైకోర్టు ప్రత్యేకంగా విచారించింది. ఆందోళనకారులు యథేచ్ఛగా హింసకు పాల్పడుతుంటే.. వారిపై చర్యలు తీసుకోవాల్సింది పోయి వారికి రాజకీయ ఆశ్రయం ఇచ్చేలా హరియాణా ప్రభుత్వం వ్యవహరించిందని మండిపడింది. సీఎం



ఖట్టర్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేసింది. 'రాజకీయ అవసరాల కోసం పంచకులను తగలబెట్టారు. డేరా అభిమానుల ముందు ప్రభుత్వం సాగిలపడింది' అని కోర్టు మండిపడింది. కేంద్ర ప్రభుత్వంపైనా కోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. పరిస్థితిని ఊహించి అదుపులోకి తీసుకురావటంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అసమర్థత బయటపడిందని పేర్కొంది. శాంతిభద్రతలు రాష్ట్రం పరిధిలోకి వస్తాయని అడిషనల్ సొలిసిటర్ జనరల్ పేర్కొనగా.. 'మోదీ దేశం మొత్తానికీ ప్రధాని. పంజాబ్, హరియాణాలూ భారత్‌లో భాగమే. ఈ రాష్ట్రాలను సవతి పిల్లలుగా చూడటం సరికాదు' అని న్యాయమూర్తి మండిపడ్డారు. రోహ్‌తక్ జైలులో విచారణకు వెళ్లే సీబీఐ కోర్టు న్యాయమూర్తికి భద్రత కల్పించటంతోపాటు ప్రయాణానికి ఏర్పాట్లు చేయాలని కోర్టు ఆదేశించింది.

రేప్ కేసులో దోషి


డేరా సచ్చా సౌదా చీఫ్ గుర్మీత్ రాంరహీమ్‌పై 2002 నాటి ఓ అత్యాచారం కేసులో సీబీఐ అభియోగాలు నమోదుచేసింది. దీనిపై శుక్రవారం విచారించిన పంచకుల సీబీఐ కోర్టు న్యాయమూర్తి జగ్‌దీప్ సింగ్.. డేరాచీఫ్‌ను దోషిగా తేల్చారు. గుర్మీత్ అరెస్టుకు ఆదేశాలు జారీచేయటంతోపాటుగా సోమవారం ఆయనకు శిక్ష ఖరారు చేయనున్నట్లు ప్రకటించారు. తనను దోషిగా తేల్చటంతో రాంరహీమ్ ఆశ్చర్యానికి గురైనట్లు ఆయన తరపు న్యాయవాది తెలిపారు. అరెస్టు ఆదేశాలు వెలువడగానే.. డేరాచీఫ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కోర్టుకు రాంరహీమ్ వచ్చిన వాహన శ్రేణి వెళ్లిపోవాలంటూ పోలీసులు ఆదేశించారు. అనంతరం ప్రత్యేక హెలికాప్టర్‌లో రోహ్‌తక్ జైలుకు తరలించారు. కాగా, సీబీఐ కోర్టు న్యాయమూర్తి సోమవారం సునారియా జైలుకెళ్లి గుర్మీత్‌కు విధించాల్సిన శిక్షలను ఖరారు చేయనున్నారు.

ఖట్టర్‌ను తొలగించబోం: బీజేపీ

డేరా ఉన్మాదకాండ నేపథ్యంలో హరియాణా సీఎం ఖట్టర్‌ను తొలగించాలన్న విపక్షాల డిమాండ్‌ను బీజేపీ తోసిపుచ్చింది. 'హరియాణా, పంజాబ్‌లలో జరిగిన ఘటనలు దురదృష్టకరం. అయినా విధ్వంసం మొదలైన మూడుగంటల్లోనే ప్రభుత్వం పూర్తిగా పరిస్థితిని అదుపులోకి తెచ్చింది. ఇది సీఎం ఖట్టర్ వైఫల్యమేమీ కాదు. ఆయన్ను తొలగించాలన్న ఆలోచనేదీ లేదు' అని బీజేపీ ప్రధాన కార్యదర్శి, హరియాణా బీజేపీ వ్యవహారాల ఇంచార్జ్ అనిల్ జైన్ స్పష్టం చేశారు. డేరా ఆందోళనకారుల విధ్వంసకాండతో జరిగిన నష్టాన్ని ఆ సంస్థ ఆస్తుల నుంచే రికవరీ చేయాలని హైకోర్టు ఆదేశించింది.









పంచకులలో మీడియా వాహనాలను తగలబెట్టి పోలీసులపైకి కర్రలు, రాళ్లతో దాడికి దిగిన గుర్మీత్ మద్దతుదారులు. ప్రాణాలు కోల్పోయిన మద్దతుదారుడు. ఢిల్లీలోని ఆనంద్ విహార్ రైల్వే స్టేషన్ సమీపంలో కాలిపోయిన రైలు బోగీ . గుర్మీత్‌ను రోహ్‌తక్ జైలుకు హెలికాప్టర్‌లో తీసుకెళ్తున్న దృశ్యం



ఎవరీ గుర్మీత్?

రాజస్తాన్‌లోని గంగానగర్ జిల్లాలోని శ్రీ గురుసార్ మోడియా గ్రామం గుర్మీత్ స్వస్థలం. జాట్ సిక్కు, సంపన్న రైతు మఘర్ సింగ్, నసీబ్ కౌర్‌ల ఏకైక సంతానం.1967 ఆగస్టు 15న గుర్మీత్ పుట్టారు. డేరా సచ్చా సౌదా మతగురువు షా సత్నామ్... గుర్మీత్‌ను ఏడేళ్ల వయసులోనే తనతో తీసుకెళ్లి సచ్చా సౌదాలో చేర్పించారు. పేరును గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్‌గా మార్చారు. గుర్మీత్‌కు 23 ఏళ్ల వయసు ఉన్నపుడు మత గురువు హోదాను ప్రసాదించి సెప్టెంబర్ 23, 1990లో తన వారసుడిగా ప్రకటించారు షా సత్నామ్. గుర్మీత్‌కు భార్య హర్‌జీత్ కౌర్, కొడుకు జస్మీత్, కూతుళ్లు చరణ్‌ప్రీత్, అమర్‌ప్రీత్ ఉన్నారు. హనీప్రీత్ అనే అమ్మాయిని దత్తత తీసుకున్నారు. హనీప్రీత్ పంజాబీ సినీనటి, దర్శకురాలు. గుర్మీత్ సహా కుటుంబంలో అందరి పేరు చివరన 'ఇన్సాన్ (మనిషి)' అనే పదం ఉంటుంది.

సకల కళావల్లభుడు

గుర్మీత్ వేషధారణ రాక్‌స్టార్‌ను తలపిస్తుంది. జిగేల్‌మని మెరిసిపోయే ఆభరణాలు, వస్త్రధారణతో కనిపిస్తుంటారు. చలువ కళ్లజోడు, టీషర్టులు, రంగురంగుల చొక్కాలతో కనిపిస్తారు. ఆధ్యాత్మిక గురువు, దానశీలి, గాయకుడు, ఆల్‌రౌండర్ క్రీడాకారుడు, సినిమా దర్శకుడు, నటుడు, ఆర్ట్ డైరెక్టర్, సంగీత దర్శకుడు, రచయిత, గేయ రచయితగా ట్వీటర్ ప్రొఫైల్‌లో రాసుకున్న గుర్మీత్‌ను సకల కళావల్లభుడిగా చెప్పొచ్చు. ట్వీటర్‌లో ఆయనకు 37 లక్షల మంది ఫాలోవర్లు ఉన్నారు. స్వయంగా పాటలు రాసి, సంగీతం సమకూర్చి ఆల్బమ్స్ విడుదల చేస్తుంటారు. ఆధునిక సంగీతం ద్వారా ఆధ్యాత్మిక సందేశాన్ని ఇస్తున్నానని చెప్పుకుంటారు. యూనివర్సల్ లేబుల్ కింద పాటల ఆల్బమ్స్‌ను విడుదల చేస్తుంటారు. 2014లో వచ్చిన హైవే లవ్ చార్జర్ ఆల్బమ్ మూడురోజుల్లోనే 30 లక్షల కాపీలు అమ్ముడైంది. సంగీత ప్రదర్శనలూ ఇస్తుంటారు. దేశంలోని వివిధ నగరాల్లో ఆయన 'రు–బా–రు నైట్స్' పేరిట వంద ప్రదర్శనలు ఇచ్చారు.

రచన- దర్శకత్వం- స్క్రీన్ ప్లే- మాటలు- పాటలు

సినిమాల్లోనూ గుర్మీత్‌కు ఆసక్తి మెండు. తన సినిమాల్లో తానే హీరో, తానే దర్శకుడు, కథ, మాటలు, పాటలు... ఇలా అన్నీ తానే. మెసెంజర్ ఆఫ్ గాడ్ (ఎంఎస్‌జీ) పేరిట రెండు సినిమాలను 2015లో తీశారు. దుష్టశక్తులు, గ్రహాంతరవాసుల నుంచి మానవాళిని కాపాడే గురూజీ పాత్రలో గుర్మీత్ నటించారు. ఖరీదైన స్పోర్ట్స్ బైకులను నడుపుతారు. తర్వాత ఎంఎస్‌జీ: ద వారియర్ లయన్‌హార్ట్, హింద్ కా నపాక్‌కో జవాబ్, జట్టూ ఇంజనీర్... అనే మూడు సినిమాలను తీశారు. దేశవ్యాప్తంగా వేలాది థియేటర్లలో ఈయన సినిమాలు విడుదలవుతుంటాయి. ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ఈయన పేరుంది. ఎందుకో తెలుసా.. ఒక సినిమాలో అత్యధిక బాధ్యతలు నిర్వర్తించినందుకు. ఎంఎస్‌జీ–2 సినిమాకు గుర్మీత్ ఏకంగా 43 బాధ్యతలు నిర్వర్తించాడు.

అకల్‌తక్త్‌తో వివాదం

సిక్కుల పదో గురువు గురుగోవింద్ సింగ్‌ను పోలిన వస్త్రధారణ చేయడం ద్వారా సిక్కుల ఆగ్రహానికి గురయ్యారు గుర్మీత్. 2007లో జరిగిన ఈ సంఘటన సిక్కులకు, గుర్మీత్ అనుయాయులకు మధ్య ఉద్రిక్తతల కారణంగా ఘర్షణలు జరిగాయి. సిక్కుల మనోభావాలను దెబ్బతీశాడని కేసు నమోదైంది. మధ్యవర్తులు, ప్రభుత్వ పెద్దల జోక్యంతో గుర్మీత్ ఒకటికి రెండుసార్లు క్షమాపణ చెప్పినా సిక్కుల మత వ్యవహారాలకు సంబంధించి అత్యున్నత మండలి 'అకల్‌తక్త్' సంతృప్తి చెందలేదు. క్షమాపణ సరిగా కోరలేదని అభిప్రాయపడింది. 2015 సెప్టెంబర్ 27న క్షమాపణను అంగీకరించినా సిక్కుల వ్యతిరేకతతో మళ్లీ ఉపసంహరించుకుంది.

జడ్ ప్లస్ సెక్యూరిటీ

మనోభావాలను దెబ్బతీశాడని రగిలిపోయిన సిక్కు యువకులు 2007 జూలై 16న గుర్మీత్‌పై దాడి చేశారు. దీని నుంచి సురక్షితంగా బయటపడ్డారు. 2008లో ఆయన కాన్వాయ్‌పై బాంబుదాడి జరిగింది. ఇందులో గుర్మీత్‌కు ఏమీ కానప్పటికీ 11 మంది అనుయాయులు గాయపడ్డారు. దీంతో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆయనకు జడ్ ప్లస్ భద్రతను కల్పించింది. జడ్ ప్లస్‌లో 36 మంది సుశిక్షితులైన కమాండోలను భద్రత నిమిత్తం కేటాయిస్తారు.

విలాసవంతమైన జీవనశైలి

ఖరీదైన కార్లపై మోజు. బుల్లెట్ ప్రూఫ్ లెక్సస్, మెర్సిడెజ్ ఎస్‌యూవీల్లో తిరుగుతుంటారు. చిత్రమైన కార్లను డిజైన్ చేస్తుంటారు. ఎక్కడికి వెళ్లినా మందీమార్బలంతో తరలివెళతారు. చార్టర్డ్ విమానాలు, హెలికాప్టర్‌లో ప్రయాణం చేస్తారు. డేరా సచ్చా సౌదాకు దేశవ్యాప్తంగా 50 ప్రాంతాల్లో ఆశ్రమాలు ఉన్నాయి. డేరా ఆస్తులు కాకుండా గుర్మీత్ వ్యక్తిగత సంపద విలువ... 250 కోట్ల రూపాయలు ఉంటుందని అంచనా.

– సాక్షి నాలెడ్జ్ సెంటర్

డేరా కమామిషు!

69 ఏళ్ల చరిత్ర.. గుర్మీత్ బాధ్యతలు చేపట్టాకే వివాదాలు

మూడు ఉత్తరాది రాష్ట్రాల్లో విస్తరించిన డేరా సచ్చా సౌదా(డీఎస్ఎస్)కు 69 ఏళ్ల చరిత్ర ఉంది. డీఎస్ఎస్‌కు గుర్మీత్ నాయకత్వం చేపట్టినప్పటి నుంచి దీని నడక కొత్త పుంతలు తొక్కింది.

డేరాల నేపథ్యం

హిందూ ఆశ్రమాల మాదిరిగా పనిచేసే ఆధ్యాత్మిక కేంద్రాలను అవిభక్త భారత్‌లోని పంజాబ్, సింధ్, ఫక్తూనిస్తాన్‌లలో డేరాలుగా పిలుస్తారు. పంజాబ్‌లో అతిపెద్దది, మొదటిది అయిన డేరా రాధాస్వామీ సత్సంగ్ బియాస్‌ను 1891లో ప్రారంభించారు. పంజాబ్, హరియాణాలో 9000కుపైగా డేరాలున్నాయని ఓ అంచనా. డేరా రాధాస్వామీ సత్సంగ్‌తోపాటు డీఎస్ఎస్, డేరా నూర్మహల్, డేరా సచ్‌ఖండ్ బలాన్, డేరా నిరంకారీ, డేరా నాంధారీ ఎక్కువ మంది అనుచరులున్న డేరాలు. రోజువారీ జీవితంలో తాము ఎదుర్కొంటున్న అగ్రవర్ణాల ఆధిపత్యం డేరాల్లో లేకపోవడం బడుగువర్గాలకు నచ్చింది. తమకు తాముగా పీఠాధిపతిగా ప్రకటించుకుని, భక్తుల కోసం ప్రసంగాలు, ప్రవచనాలు



చేసే గురువులు, బాబాలు ఈ ప్రాంతంలో 19వ శతాబ్దం నుంచి డేరాలు ప్రారంభించారు.

డీఎస్ఎస్ స్థాపన, విస్తరణ..

మస్తానా బలూచీ అనే క్షత్రియ సన్యాసి అవిభక్త పంజాబ్ (ప్రస్తుత హరియాణా)లోని సిర్సాలో డీఎస్ఎస్‌ను స్థాపించారు. 1948–60 మధ్యకాలంలో ఇక్కడ నామ్ శపథ్ అనే ధ్యానం ఎలా చేయాలో మస్తానా బోధించారు. డీఎస్ఎస్ తర్వాతి అధినేత అయిన సత్నామ్‌సింగ్ డేరాను 1960 నుంచి 1990 మధ్య విస్తరించారు. 1990 ఏప్రిల్‌లో గుర్మీత్ అధిపతి అయ్యారు. డేరా వెబ్‌సైట్‌లో బాబా గుర్మీత్ పేరును సెయింట్ డాక్టర్ గుర్మీత్ రామ్‌రహీమ్‌సింగ్ ఇన్సాన్‌గా ప్రస్తావించడమేగాక ప్రపంచవ్యాప్తంగా ఆరు కోట్ల మంది అనుచరులున్నారని ప్రచారం జరుగుతోంది. జిల్లా ముఖ్య పట్టణమైన సిర్సాలో వెయ్యి ఎకరాలకు పైగా స్థలంలో విస్తరించి ఉంది డీఎస్ఎస్ ప్రధానకేంద్రం. దీనిలో హోటెల్, సినిమాహాలు, క్రికెట్ మైదానం, క్రీడా గ్రామం, స్టూడియో, బయోగ్యాస్ ప్లాంట్ ఉన్నాయి. ముందస్తు అనుమతి లేకుండా బాబాను కలవడం అసాధ్యం. డేరా వెలుపల బాబా గుర్మీత్ అనుచరులు నడిపే 40 దుకాణాలున్నాయి.

ఆకర్షిస్తున్న డేరా కార్యక్రమాలు

దేశంలోనూ, అమెరికా, ఆస్ట్రేలియా, కెనడా, యూఏఈ వంటి ఇతర దేశాల్లో కలిపి డీఎస్ఎస్‌కు 46 ఆశ్రమాలున్నాయి. డీఎస్ఎస్ చేపట్టే అనేక సేవా కార్యక్రమాలు లక్షలాది అనుచరులను ఆకట్టుకుంటున్నాయి. డేరా రెండో గురువు పేరిట సత్నామ్‌జీ గ్రీన్–ఎస్ వేల్ఫేర్ ఫోర్స్ ఏర్పాటు చేసి ప్రకృతి వైపరీత్యాలు, భారీ ప్రమాదాల సమయంలో బాధితులకు సహాయం అందిస్తున్నారు. కోల్‌కతా అగ్నిప్రమాదం, జలంధర్ ఫ్యాక్టరీ ప్రమాదం, ఉత్తరాఖండ్ వరదల్లోనూ సంస్థ తరపున వందలాది మంది వైద్యులు, వలంటీర్లు పనిచేశారు.

– సాక్షి నాలెడ్జ్ సెంటర్

రాజకీయ క్రీ'డేరా'!

దేశంలో స్వయం ప్రకటిత స్వామిజీలు, బాబాలు, గురువులతో అధికార యంత్రాంగం రాజకీయ నాయకుల బంధం విడదీయరానిదిగా మారుతోంది. ఇందుకు గుర్మీత్ సింగ్ మినహాయింపేం కాదు. ఇతనికి కేంద్రం, హరియాణా ప్రభుత్వాలు అత్యున్నత స్థాయి జడ్ ప్లస్ కేటగిరీ భద్రత కల్పించడం, న్యాయస్థానం దోషి అని తేల్చాక కూడా ప్రధాన పార్టీల నేతలు స్పందించకపోవడాన్ని బట్టి డేరా హవా ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

దళిత, బీసీల ఓట్ల కోసమే...

పంజాబ్, హరియాణా, రాజస్తాన్ రాష్ట్రాల్లో నిమ్న తరగతులకు చెందినవారు పెద్దసంఖ్యలో డేరా అనుచరులున్నారు. వారి ఓట్లను పొందేందుకే రాజకీయపార్టీలు డేరా మద్దతు కోసం పోటీపడుతున్నాయి. 2014లో బీజేపీకి మొదలైన డేరా మద్దతు లోక్‌సభ ఎన్నికలు, హరియాణా అసెంబ్లీ ఎన్నికల వరకు, ఆ తర్వాతా కొనసాగుతోంది. డేరా వర్గం ఓట్లు అటు కేంద్రంలో ఇటు హరియాణాలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడేందుకు తోడ్పడ్డాయి. 2014లో లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా హరియాణాకు వచ్చిన నాటి ఎన్డీయే ప్రధాని అభ్యర్థి, నేటి ప్రధాని మోదీ సిర్సా బహిరంగసభలో, అంతకు పూర్వం పాల్గొన్న సభల్లోనూ, గుర్మీత్‌ను కీర్తించారు. గతంలోనే అమిత్ షా, పంజాబ్ సీఎం అమరీందర్‌సింగ్, కాంగ్రెస్, బీజేపీలకు చెందిన అనేక మంది నాయకులు డేరా కేంద్రాన్ని సందర్శించారు.గుర్మీత్‌ను దోషిగా తేల్చిన శుక్రవారానికి పదిరోజుల ముందు... ఆగస్టు 15న గుర్మీత్ పుట్టినరోజు కార్యక్రమానికి హరియాణా విద్యా శాఖ మంత్రి రాంవిలాస్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. డేరాలో క్రీడల ప్రోత్సాహం పేరుతో తన శాఖ నిధుల నుంచి మంత్రి రూ. 51 లక్షల విరాళాన్ని ప్రకటించారు. భారత యోగా ఫెడరేషన్ ఇటీవల క్రీడల్లో గురువులకిచ్చే ప్రతిష్టాత్మక 'ద్రోణాచార్య' అవార్డుకు డేరా చీఫ్ పేరును సిఫార్సు చేసింది. గుర్మీత్‌ది 'గొప్ప ఆత్మ' (నోబుల్ సోల్) అని శుక్రవారం బీజేపీ నేత సాక్షి మహారాజ్ కోర్టు నిర్ణయాన్ని తప్పుబట్టారు.

– సాక్షి నాలెడ్జ్ సెంటర్

గుర్మీత్ సింగ్‌పై కేసులు..

- తనతో విభేదించిన డేరా మేనేజర్ రంజిత్‌సింగ్ హత్యకు గుర్మీత్ రామ్‌రహీమ్‌సింగ్ 2002 జూలైలో కుట్ర పన్నారనే ఆరోపణలున్నాయి. డేరా ప్రధాన కేంద్రం సిర్సాలో సాధ్వీలు లైంగిక వేధింపులకు గురవుతున్నారని రంజిత్‌సింగ్ ఆకాశరామన్న లేఖలు పంపిణీ చేశాడని అనుమానించారు.
- డేరా ప్రధాన కార్యాలయంలో చట్టవ్యతిరేక కార్యకలాపాలు సాగుతున్నాయంటూ వార్తా కథనాలు రాసిన సిర్సాకు చెందిన రాంచందర్ ఛత్రపతి అనే పాత్రికేయుడు 2002 అక్టోబర్ 23న హత్యకు గురయ్యాడు. ఈ హత్యలో ప్రమేయముందంటూ గుర్మీత్‌తో సహా మరో ముగ్గురిపై కేసు నమోదైంది.
- 2014 డిసెంబర్ 23న డేరా ప్రధాన కేంద్రంలో గుర్మీత్ తన అనుయాయులైన 400 మంది వృషణాలను నొక్కేసి నిర్వీర్యులను చేశారన్న ఆరోపణలపై హైకోర్టు విచారణకు ఆదేశించింది.
- సిక్కుల మతగురువు గురు గోవింద్ సింగ్ మాదిరిగా గుర్మీత్ దుస్తులు ధరించారంటూ 2007లో భటిండా పోలీసులు కేసు నమోదు చేశారు.
- సిర్సాలో డేరా కార్యకర్తలకు ఆయుధ శిక్షణనిస్తున్నారంటూ భారత సైన్యం పేర్కొంది. ఆయుధ శిక్షణపై పరిశీలన జరిపి వివరాలు తెలియజేయాలంటూ హరియాణా ప్రభుత్వానికి హై కోర్టు నోటీసులిచ్చింది.

సాక్షి పెళ్ళిచూపులు

ఆదివారం 27-8-2017

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



బ్రాహ్మణ/40/ MA /MLISC /5'4"/ భరద్వాజ / నియోగి / చిన్న ఉద్యోగం/ 1.5 కోట్ల ఆస్తి. సెల్ : 9248843819 [HA-691204]

CNB /39/5'9"/MBA (UK) / 10K PA/ గల వరునికి US/ ఆస్ట్రేలియా/కెనాడా వధువు కావలెను. 9959053051, 8978462512 [HA-6715]

కాపు/30Year/5'8" /MCA/ SBI in Cashier/ 40,000/-pm/ 5 Cr (ప్రాపర్టీ) వెల్ సెటిల్డ్ అయిన వరుడుకి వధువు కావలెను. 8142220475 [HA-1591]

కులపట్టింపులేదు /26Year/ 5'10"/ B.Tech / SWE/80,000/-pm/ (2 Cr ప్రాపర్టీ) వెల్ సెటిల్డ్ అయిన వరుడుకి వధువు కావలెను. 8142220817 [HA-1591]

Yadav/Late Marriage/ 6 L PA / 37/6'0"/ Handsome/ గల వరుడికి Slim + అందమైన వధువు కావలెను CNB (Except SC & ST) Cont: Whatsap:9441065123 /98499 91513 (No Brokers) [HA-691607]

రెడ్డి, డాక్టర్, 31, 157cm, M.Ch. సర్జికల్ గ్యాస్ట్రో చేస్తున్న వురునికి రెడ్డి, క్లినికల్ P.G. గల రెడ్డి డాక్టరు వధువు కావలెను. 094400 14646. [A-3333]

రెడ్డి/లేట్‌మ్యారేజ్/39/5'6"/ ప్రాపర్టీ 25 లక్షలు PM 30,000/- ప్రైవేట్ జాబ్‌గల వరునికి హిందూ సాంప్రదాయం గల 1వ, 2వ సంబంధం అయినా Ok. పిల్లలు లేని OC, BC, వధువు కావలెను (డైరెక్ట్) 7729000227 [HA-693093]

వైశ్య/2nd మ్యారేజ్/55/5'5"/50000/- పెన్షన్ PM/ వెల్‌సెటిల్డ్ కుటుంబానికి చెందిన వారికి తగిన వధువు కావలెను 9391442434 [HA-693093]

రెడ్డి/28/డిగ్రీ వరుడికి వధువు కావలెను. అందం, చదువుకు ప్రాముఖ్యత. ఇల్లరికం OK. డైరెక్ట్. సెల్: 9440063874. [K-595002]

K.C. రెడ్డి మ్యారేజ్ బ్యూరో ప్రై॥ లి॥

రెడ్డి మ్యారేజ్ బ్యూరో India, Abroad Matches Fast Settlement: Deals with all regions in A.P. & Telangana (For Reddy's only) Cont: K.C. Reddy, Address: 106, A K Enclave, Phase II, 8-2-350, Road No. 3, Banjara Hills (Near Furniture Mall), Hyderabad. Ph: 9849321309 / 9347807015 Email: kcreddy43@gmail.com

వధువు కావలెను

Reddy/ Business / B.Tech/ MBA * 32/6'/400 Cr* 30/5'10"/100 Cr * 29/5'8"/225 Cr * 27/5'8"/200 Cr* 30/5'10"/300 Cr * 28/6'/200 Cr * 29/5'10"/200 Cr* Cont: K.C.Reddy Ph:9347807015.

Reddy/ Business*B.Tech/26/5'6"/120 Cr * 27/5'9"/70 Cr * 34/5'7"/100 Cr * 25/5'9"/30 Cr * 33/5'5"/60 Cr * 30/5'10"/ 50 Cr * 40/6'/100 Cr * Cont: K.C.Reddy Ph: 9849321309

Reddy/ B.Tech/ MS/H1/USA * 28/5'11"/ 60 Cr * 33/5'10"/ 70 Cr * 25/5'6"/30 Cr * 30/5'11"/30 Cr * 29/5'7"/70 Cr * 27/5'8"/30 Cr * Cont: K.C.Reddy Ph: 9347807015.

Reddy/ B.Tech (IIT) / BITS /MS/USA/H1 * 31/6'/ 150 K/ 30 Cr * 31/5'11"/105 K/ 4 Cr *27/ 5'10"/25 Cr *India* 29/5'9"/16K/yr * 30/5'10"/ 21L/Yr* Cont: K.C.Reddy Ph: 9849321309

Reddy/ Divercee * USA /38/5'8"/30 Cr * 42/ 5'10"/10 Cr * India * B.Tech /37/5'9"/60 Cr * 34/6'/MDS/41/5'11"/10 Cr * Cont: K.C.Reddy Mar Bur, Hyd. Ph: 9849321309 / 9347807015.

Reddy/ MBBS /MS (Sur) Borth Parents - Doc/28/5'11"/V.Smart / 50 Cr (Prop) * Cont: K.C.Reddy Mar Bur, Hyd. Ph: 9849321309 / 9347807015.

Reddy/ MBBS /PG * 28'6'/15 Cr * 29/5'10"/DM/ 50 Cr * 30/5'7"/50 Cr * 30/6'/25 Cr * 27/6'/50 Cr* 28/5'9"/25 Cr *29/5'8"/50 Cr*Cont: K.C.Reddy Hyd. Ph: 9849321309 / 9347807015.

Reddy/ MBBS / Res-Doc-USA * 27/6'/50 Cr * 35/5'6"/50 Cr * 30/6' * 30/ 5'7" * 29/5'7" * 30/5'7" * 26/5'7" *Cont: K.C.Reddy, Ph: 9849321309 / 9347807015

Reddy/ Australia * B.Tech / MS/ Citizen/ 28/5'9"/30 Cr * PR / 30 /5'8"/ 25 Cr / 6 L / Rents* Cont: K.C.Reddy Ph: 9849321309 / 9347807015

Reddy/ B.Tech / MS/H1/USA * 29/5'7"/ 150K /70 Cr * 27/5'8"/100K/30 Cr * 31/6'/ 150K/ 30 Cr* 28/5'11"/60 Cr* Cont: K.C.Reddy, Ph: 9849321309 / 9347807015.

వరుడు కావలెను

Reddy/ B.Tech / 29/5'6"/200 Cr * 27/5'3"/ 50 Cr * 27/5'7"/50 Cr*27/5'6"/100 Cr * 30/5'4"/ 70 Cr *5'2 1/2"/100 Cr * Cont: K.C.Reddy, Hyd. Ph: 9849321309 / 9347807015.

Reddy/ MBBS / PG/ 27/5'7"/100 Cr * 28/5'5"/ 50 Cr*22/5'5"/15 Cr * 28/5'7"/25 Cr * USA/ 25/ 5'7"/50 Cr * 25/5'5"/120 Cr/ DDS/29/5'3"/ 100 Cr* Cont: K.C.Reddy Hyd. Ph: 9849321309

Reddy/ B.Tech/MS/H1/USA * IIT/BITS /25/5'7"/30 Cr * 26/5'2"/5 Cr* 26/5'6"/10 Cr* 25/5'4"/3 Cr* 26/5'2"/20 Cr * 26/5'5"/* Cont: K.C.Reddy Hyd. Ph: 9347807015.

Reddy/ US- Citizen/GC * 26/5'6"/MS * 30/ 5'2" *22/5'6" * Doc /25/5'5"/120 Cr * 28/5'5"/25 Cr* 28/5'5"/10 Cr * 29/5'6"*30/5'2"* Cont: K.C.Reddy Hyd. Ph: 9849321309

Reddy/ B.Tech / MS/H1/USA/ Rich * 24/5'4"/ 10 Cr * 27/5'4"/30 Cr * 24/5'5"/10 Cr *25/5'6'/60 Cr * 28/5'5"/20 Cr* Cont: K.C.Reddy Hyd. Ph: 9849321309

Reddy/ B.Tech / Rich / 27/5'5"/ 40 Cr * 27/5'5" /25 Cr * 27/5'6"/25 Cr * 27/5'3"/20 Cr*27/5'3"/30 Cr * 28/5'5"/10 Cr* 25/5'1"/20 Cr * 33/5'7"/20 Cr* Cont: K.C.Reddy Hyd. Ph: 9849321309

Reddy/ Most Beautiful * B.Tech/26/5'4"/6 Cr * 25/5'5"/20 Cr * 25/5'5"/10 Cr * 25/5'5"/5 Cr * 27/5'5"/20 Cr*27/5'3"/20 Cr * 25/5'7"/30 Cr * Cont: K.C.Reddy Hyd. Ph: 9849321309

Reddy/ IAS/ 28/5'5" *28/5'3" * Cont: K.C.Reddy Marriage Bureau, Road No.3, Banjara Hills, Hyd. Ph: 9849321309 / 9347807015.

Reddy/ (Christian)* B.Tech /24/5'5"/15 cr * 25/5'7"/30 Cr * 29/5'6"/5 Cr * 25/5'6"/10 Cr * Cont: K.C.Reddy Marriage Bureau, Hyd. Ph: 9849321309 / 9347807015.

Reddy/ (Divercee) B.Tech / USA/ 27/5'2"/4 Cr * 30/ 5'6"/ 4 Cr*34/5'3"/10 Cr * 31/5'5"*36/5'2" /India* 28/ 5'5"/5 Cr* 36/5'7"/130 K/M*30/5' 21/2"/10 Cr * Cont: K.C.Reddy, Ph: 9849321309 / 9347807015

[D-038]

కుల ప్రసక్తి లేదు/డైరెక్ట్/రెడ్డి/33/5.9/B.Com/3 Lac P.A./ బిజినెస్/Own House/పొలాలు/3 కోట్ల ఆస్తి/ 1st Marriage అబ్బాయికి 1వ, 2వ, వధువు కావలెను. డైరెక్ట్. 7013892292. [K-595001]

క్రిష్టియన్, 31/5.6/MBA in USA, 60,000 PM/ 5cr-prop - అందమైన వరుడుకు - MBBS,DGO, M.S, M.D OR MBA , M.Tech , M.C.A చక్కని వధువు కావలెను.DIRECT. NO BROKERS No: 91215 20886. [P- 856045]

కుల పట్టింపులేదు 40Y/5'6"/ ఇంటర్ / బిజినెస్/నెలకు 50వేలు గల వరునికి విడో / జాబ్ చేస్తున్న వధువు కావలెను. సంప్రదించండి. 7799182844 [HA-691079]

★★

శెట్టిబలిజ, B.A., B.Ed., 63 సం॥ పెన్షను 25,000/- తోడుకోసం 55 సం॥ పైబడిన, చదువుకున్న వధువు కావలెను. కుల ప్రసక్తిలేదు. అనంతపురం జిల్లా వారికి ప్రాధాన్యత. డైరెక్ట్‌గా సంప్ర॥ 9966769684. [A-3334]

వరుడు కావలెను



రాజులు /కుల ప్రసక్తి లేదు/25/5'5"/B.Com / 28 కోట్ల ఆస్తి /యాక్సిడెంట్‌లో తండ్రిని కోల్పోయిన చాలా అందమైన వధువుకు మధ్యతరగతి వరుడు కావలెను. ఇల్లరికం అయినా సరే. 7097258384 [HA-691376]

చౌదరి/విడో/32 కోట్ల ప్రాపర్టీ/ 2 సం॥ల పాప /36/5'4"Fair / MBBS (డాక్టర్) / ఒంటరి వధువుకు కుల ప్రసక్తి లేని మధ్యతరగతి1వ, 2వ మ్యారేజ్ వరుడు కావలెను. పిల్లలున్నా సరే. 7337269487 [HA-691376]

రెడ్డి/విడో/కుల ప్రసక్తి లేదు/24/5'6"/Fair / B.Tech/15 కోట్ల ఆస్తి/70 ఎకరాల గ్రానైట్ ల్యాండ్ / సంపాదన కలిగిన ఏకైక చాలా అందమైన వధువుకు వరుడు కావలెను. 9502554983 [HA-691376]

కుల పట్టింపులేదు/కమ్మ/47Yr / 5'3"/ MBA / BEd/ Govt. టీచర్/75K (PM) & బిజినెస్/ విడో/ ఫెయిర్/అందమైన వధువుకి తగిన వరుడు కావలెను. 7893744393 [HA-691077]

కుల, ఆస్తి ప్రసక్తి లేదు/రెడ్డి/ లేట్ మ్యారేజ్/ 34/డిగ్రీ / మంచి కలర్ కలిగిన / 5'5"/ 25 కోట్లు /యాక్సిడెంట్‌లో ఫ్యామిలీని కోల్పోయిన వధువుకు 1వ, 2వ, మ్యారేజ్ వరుడు కావలెను. 8520927897 [HA-691376]

క్రిస్టియన్ మాదిగ/BTech/Govt A.E (R&B Dept)/45000/- PM / 5'4" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. 9885055185 [HA-16509]

కుల పట్టింపులేదు (2వ పెళ్ళి) /38/5'3"/ ఇంటర్/ ఓన్ స్వీట్ షాప్/ 25 వేలు PM/ ఓన్ హౌస్‌గల అందమైన వధువుకు వరుడు కావలెను. 8790045436/8978894173 [HA-16509]

రెడ్డి/24/5'6"/B.Tech / BITS/ MS/(USA) / SWE/ H1/10 Cr*23/5'5"/B.Tech (CSE)/ SWE/ 40,000/-pm/ 6 Cr వధువులకు తగిన వరులు కావలెను. 9032906177 [HA-16509]

పద్మశాలి/24Year/5'4"/B.Tech /SWE/ 30,000/-pm/ 2 Cr (ప్రాపర్టీ) వెల్ సెటిల్డ్ అయిన వధువుకి వరుడు కావలెను. 8142220475 [HA-1591]

కుల పట్టింపులేదు/రెండవ సంబంధం / 25 Year/5'4"/MBA / Pvt. Job/ 20,000/-pm/ వెల్ సెటిల్డ్ అయిన వధువుకి వరుడు కావలెను. 8142220817 [HA-1591]

కాపు/విడో/32/5'2"/BTech/ బిజినెస్/ నెలకు సంపాదన 6 లక్షలు/ 20 కోట్ల ఆస్తి /కుల ప్రసక్తి లేని వధువుకి మంచి వరుడు కావలెను. 7286906109 [HA-693626]

రెడ్డి/లేట్ మ్యారేజ్/29Y/5'5"/ ఆటో మొబైల్స్/ 10 కోట్ల ప్రాపర్టీ గల అందమైన వధువుకు కులపట్టింపులేని వరుడు కావలెను. 8978377133 [HA-693093]

బ్రాహ్మణ/ 28-8-1989/ డిగ్రీ /5'4"/ గౌతమస వధువుకి/బ్రాహ్మణ పురోహిత్/టీచర్ జాబ్/ వరుడు కావలెను. IInd Match అయినా Ok. 9110723130/ 7285997452 [HA-693093]

SC మాల డైవర్సీ/CNB 31/5'.6"/V.Fair/ MBBS, MD/Own Hospital/Well to do Reputed Family వధువుకు తగిన వరుడు కావలెను. కుల ప్రసక్తిలేదు. 9394466119. [T-5263]

మాల: MBBS, MD, 5'5", 33Y, V.Fair, 5cr, 1 లక్ష జీతంతో డాక్టర్‌గా చేస్తున్న వధువు కొరకు (అర్జంటుగా) సంప్ర॥ ✆ 9248494810, 9248537764. [B-280]

రెడ్డి, విడో / 24y/ 5'3/ B.Tech / 27 కోట్ల స్థిరాస్తి, తండ్రిలేని అందమైన ఏకైక వధువుకు వరుడు కావలెను. (ఆస్తి,కుల ప్రసక్తి లేదు) కాంటాక్ట్ ✆ 99896 93592 [B-472]

Divorce/ Doctor/ USA/ Kapu/ 5'8"/ Fair / Prefer / Doctor / USA/ No Caste Bar/ +91 9989849715 [HA-3005]

★★

క్షత్రియ/విడో/39/5'4"/BSc /Govt. నర్స్/ 30,000/-pm/ 1పాప వున్న సాంప్రదాయక వధువుకు ఏ బాదరబందీలేని పిల్లలు వున్న వరుడు కూడా (ok) కుల/ఆస్తి ప్రసక్తిలేదు 7095922464 [HA-695661]

చౌదరి/విడో/ 5'5"/30/B.Com BEd/Govt. టీచర్/40,000/-pm/Own బిజినెస్/6 Cr / ఈ మధ్యనే భర్తను కోల్పోయిన వధువకు కుల/ఆస్తి ప్రసక్తిలేని ఇల్లరికం వరుడు కావలెను. 8096851488 [HA-691036]

SC, హిందూమాల, 24/5'5", B.Tech, S/W/E, Infosys, 35,000/- PM అందమైన వెల్ సెటిల్డ్ వధువుకి తగిన వరుడు కావలెను. సంప్ర : 80080 55675 [V- 596772]

వేదికలు



కావ్యశ్రీ మ్యారేజ్ బ్యూరో. రిజిస్ట్రేషన్ ఫీజు రూ. 1000/- మాత్రమే. 1వ, 2వ లేట్ మ్యారేజెస్, డైవర్సీస్, విడో, పెన్షనర్లకు అన్ని కులాల వారికి సంబంధములు త్వరగా కుదర్చబడును. (స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) 9705782042 [H-693963]

కులపట్టింపులేని అన్ని కులాల 1వ, 2వ & లేటు, డైవర్సీ, విడో, విడోయర్స్, ఒంటరి, ఇల్లరికం, రిటైర్డ్, పెన్షనర్స్, రిచ్, వెరి రిచ్, మ్యాచెస్. 8500671845 (వాట్సప్-9676453353) స్త్రీలకు ఫ్రీ. [HA-16509]

రెడ్డి fairlinksmatrimony.com లో ఉచితంగా login అవ్వండి. వేలాది వధూవరులనుండి మీకు తగిన సంబంధం మా ద్వారా కుదుర్చుకొండి. తిరుపతి: 9396655166, నెల్లూరు: 9394466117, Hyd: 9299992603, VJA: 9618129221. [T-5264]

15రో॥ అన్ని కులాల వారికి మీకు తగిన సంబంధాలు చూపించగల పెద్ద సంస్థ రోహిణి. info@rohinimarriages.com, ✆ 9849058673, 94418 29644, 94920 33897, 94407 85888 [B-1067]

కేవలం మాల మాదిగ ST, క్రిస్టియన్, మా ప్రత్యేకత 1వ, 2వ, లేటు, డైవర్సీ, విడోస్, ఇల్లరికం Govt & సాఫ్ట్‌వేర్ జాబ్స్, దేశ విదేశ సంబంధాలకై AP, తెలంగాణలో (3 బ్రాంచిలు) 7032961809 [H-691502]

Visit//www.amityalliances.com/ Most popular marriage bureau for Telugu speaking educated people worldwide. Register FREE. [V- 5785]

★★

Kalyani Matrimony కాపు, కమ్మ, రెడ్డి, గౌడ వారి ఉన్నతమైన సాంప్రదాయబద్ధమైన వివాహ సంబంధముల కొరకు వెంటనె సం. Hyd-8500747535, విజయవాడ -9533133969 [HA-691032]

రిషిల్ మ్యారేజ్ బ్యూరో : అన్ని కులములు, మతముల వారికి 1వ, 2వ పెళ్ళి సంబంధాలకై సంప్రదించండి. రిజిస్ట్రేషన్ ఫ్రీ. ఫోన్ : 73311 20338. [N-878188]



సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పదవీ విరమణ చేయబోతున్న జస్టిస్ జేఎస్ ఖేహర్‌కు ఢిల్లీలో వీడ్కోలు విందు ఇచ్చారు. ఈ సందర్భంగా తదుపరి సీజేఐ జస్టిస్ దీపక్ మిశ్రాతో కరచాలనం చేస్తున్న జస్టిస్ ఖేహర్..

కశ్మీర్‌లో ముష్కరుల మారణకాండ

పుల్వామా పోలీసు కాంప్లెక్స్‌పై దాడి.. 8 మంది భద్రతా సిబ్బంది మృతి

- ఎదురుకాల్పుల్లో ముగ్గురు ఉగ్రవాదుల హతం

శ్రీనగర్: దక్షిణ కశ్మీర్‌లోని పుల్వామా జిల్లాలో శనివారం ఉగ్రవాదులు రెచ్చిపోయారు. జిల్లా పోలీసు కాంప్లెక్స్‌పై దాడికి పాల్పడడంతో నలుగురు సీఆర్‌పీఎఫ్ జవాన్లు సహా 8 మంది భద్రతా సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. భద్రతా సిబ్బందికి, ఉగ్రవాదుల మధ్య జరిగిన భారీ ఎదురుకాల్పుల్లో మొత్తం ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు.

శనివారం తెల్లవారుజామున శ్రీనగర్‌కు 25 కి.మీ. దూరంలోని పుల్వామా జిల్లాలోని పోలీసు కాంప్లెక్స్‌లోకి విదేశీయులుగా అనుమానిస్తున్న ఉగ్రవాదులు చొరబడ్డారు. వెంటనే పోలీసులు, సీఆర్‌పీఎఫ్, ఆర్మీ సిబ్బంది అప్రమత్తమై ఉగ్రవాదుల్ని చుట్టుముట్టారు. అదే సమయంలో ఆ కాంప్లెక్స్‌లో నివసిస్తున్న పోలీసు సిబ్బంది కుటుంబసభ్యుల్ని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. మధ్యాహ్నానికి భద్రతా సిబ్బంది ఒక ఉగ్రవాదిని మట్టుబెట్టగా.. సాయంత్రం 5 గంటల సమయంలో మరో ఉగ్రవాది మృతదేహం లభ్యమైందని అధికారులు తెలిపారు. ఎదురుకాల్పులు ముగిశాయని, మూడో మృతదేహాన్ని కూడా స్వాధీనం చేసుకుంటామని వారు వెల్లడించారు.

మృతుల్లో నలుగురు సీఆర్‌పీఎఫ్ సిబ్బంది

ముగ్గురు ఉగ్రవాదులు.. పోలీసు కాంప్లెక్స్‌లోని మూడు బ్లాకుల్లోకి ప్రవేశించి భద్రతా బలగాలపైకి కాల్పులు ప్రారంభించారు. ఎన్‌కౌంటర్ సమయంలో ఉగ్రవాదుల్లో ఒకరు భవనం నుంచి బయటకు వచ్చి విచక్షణా రహితంగా కాల్పులు జరిపాడని, అతన్ని అక్కడే మట్టుబెట్టామని పోలీసు అధికారులు చెప్పారు. ఉగ్రవాదుల కాల్పుల్లో మరణించిన వారిలో నలుగురు సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, జమ్మూ కశ్మీర్ పోలీసు విభాగానికి చెందిన ఒక కానిస్టేబుల్, ముగ్గురు ప్రత్యేక పోలీసు సిబ్బంది ఉన్నారు. ఉగ్రవాదులు అమర్చిన ఐఈడీ పేలుడు పదార్థాన్ని నిర్వీర్యం చేసే క్రమంలో ఇద్దరు సీఆర్‌పీఎఫ్ జవాన్లు మరణించారు. ఇది ఆత్మాహుతి దాడేనని శ్రీనగర్ 15వ కార్ప్స్ లెఫ్టినెంట్ జనరల్ జేఎస్ సంధు చెప్పారు. భారీ ప్రాణనష్టం చోటుచేసుకుందని, భద్రతా బలగాలకు ఇది దుర్దినమని డీజీపీ ఎస్పీ వైద్ ఆవేదన వ్యక్తం చేశారు. అయినా సరే మన భద్రతా బలగాలు ఎంతో ధైర్యంగా పోరాడాయని, రాష్ట్రం నుంచి ఉగ్రవాదాన్ని తుదముట్టించేందుకు మరింత దృఢనిశ్చయంతో ఉన్నామని ఆయన పేర్కొన్నారు.



పుల్వామాలో ఉగ్రవాదులపై భద్రతా బలగాల ఎదురుకాల్పులు

ముగ్గురు పాక్ రేంజర్ల మృతి

జమ్మూలోని భారత్–పాక్ అంతర్జాతీయ సరిహద్దు వెంట పాకిస్తాన్ కవ్వింపు చర్యల్ని దీటుగా తిప్పికొట్టామని, భారత బలగాల ఎదురుకాల్పుల్లో ముగ్గురు పాక్ రేంజర్లు మరణించారని బీఎస్ఎఫ్ తెలిపింది. జమ్మూలోని పర్గ్వాల్ ప్రాంతంలో శనివారం మధ్యాహ్నం నుంచి పాక్ కాల్పుల్ని కొనసాగించిందని, అదే స్థాయిలో గట్టిగా బదులిచ్చామని బీఎస్ఎఫ్ అధికారులు వెల్లడించారు. కాగా శనివారం పాక్ బలగాలు ఆర్‌ఎస్ పురా సెక్టార్ సరిహద్దు వెంట కాల్పులకు పాల్పడడంతో బీఎస్ఎఫ్ కానిస్టేబుల్ కె.కె.అప్పారావు గాయపడ్డారు. అతని పరిస్థితి నిలకడగా ఉందని బీఎస్ఎఫ్ ప్రతినిధి వెల్లడించారు.

మూడు క్షిపణుల్ని పరీక్షించిన ఉత్తరకొరియా

వాషింగ్టన్: ఉత్తర కొరియా శనివారం మూడు బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించిందని అమెరికా మిలిటరీ అధికారులు పేర్కొన్నారు. పసిఫిక్ సముద్ర తూర్పు జలాల్లో ఉత్తర కొరియా ఈ ప్రయోగాలు నిర్వహించిందని, మొదటి రెండు విఫలమవడంతో మూడోది ప్రయోగించినట్లు చెప్పారు. 250 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలపై ప్రయోగించే ఈ మూడు క్షిపణులు తేలికపాటివేనన్నారు. 'పరిస్థితిని మేం నిశితంగా పరిశీలిస్తున్నాం' అని వైట్‌హౌజ్ పేర్కొంది.

బ్రిటన్, బెల్జియంలో ఉగ్ర కలకలం

లండన్: బ్రిటన్, బెల్జియంలో కత్తి దాడులు ప్రకంపనలు సృష్టించాయి. బ్రిటన్ రాణి నివాసం బకింగ్‌హాం ప్యాలెస్ సమీపంలో ఓ వ్యక్తి కత్తితో చేసిన దాడిలో ముగ్గురు పోలీసులు గాయపడ్డారు. పోలీసు వ్యాను వైపునకు దూసుకొచ్చిన కారు డ్రైవర్‌ను ప్రశ్నించేందుకు వెళ్లగా అతను పోలీసులపై కత్తితో దాడికి పాల్పడ్డాడు. దుండగుడు పలుమార్లు అల్లాహు అక్బర్ అని అరిచాడు. మరోవైపు బెల్జియం రాజధాని బ్రసెల్స్‌లో కత్తితో సైనికుడిని గాయపరచిన వ్యక్తిని కాల్చి చంపారు. దుండగుడి వద్ద కత్తితో పాటు రెండు ఖురాన్ ప్రతులు లభ్యమయ్యాయి. ఈ రెండు సంఘటనలపై ఉగ్రకోణంలో విచారణ ప్రారంభమైంది.

మయన్మార్ ఉగ్రదాడుల్లో 89 మంది మృతి

మాంగ్డా: మయన్మార్‌లోని రఖినే రాష్ట్రం ఉగ్రదాడులతో దద్దరిల్లుతోంది. శుక్రవారం తెల్లవారుజాము నుంచి దేశంలోని సరిహద్దు ప్రాంతాలపై తీవ్రవాదులు దాడులకు తెగబడుతున్నారు. ఈ దాడుల్లో 12 మంది భద్రతాదళ అధికారులు, 77 మంది మిలిటెంట్లు మరణించారు. అప్రమత్తమైన ప్రభుత్వం రాష్ట్రమంతటా ఎమర్జెన్సీని ప్రకటించింది. అరాకాన్ రోహింగ్యా సాల్వేషన్ ఆర్మీ(ఎఆర్ఎస్ఏ) అనే ఉగ్రవాద సంస్థ దాడులకు పాల్పడినట్లు ఆర్మీ ప్రకటించింది.



సైన్యం అధీనంలో రఖీనే రాష్ట్రం

టెక్సస్‌ను వణికించిన హార్వీ తుఫాను

హూస్టన్: అమెరికాలోనే గత 12 ఏళ్లలో ఎన్నడూ లేనంతగా అత్యంత భారీ తుఫాను టెక్సస్ రాష్ట్రాన్ని వణికించింది. హార్వీ తుఫాను సమయంలో గరిష్టంగా గంటకు 195 కి.మీ వేగంతో గాలులు వీచాయి. చెట్లు, కరెంటు స్తంభాలు నేలకూలాయి. విమానాలు రద్దయ్యాయి. పాఠశాలలు, కార్యాలయాలకు సెలవు ప్రకటించారు. దాదాపు రెండున్నర లక్షల ఇళ్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. లక్షలాది మందిపై తీవ్ర ప్రభావం పడింది. వేలాది మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. రాబోయే వారం రోజుల్లో 40 అంగుళాల వర్షం కురవచ్చని వాతావరణ కేంద్రం వెల్లడించింది.

ఆర్జేడీ ర్యాలీకి హాజరవనున్న శరద్, మమత

న్యూఢిల్లీ: ఆర్జేడీ అధినేత లాలూ నేడు నిర్వహించనున్న ర్యాలీకి హాజరవడాన్ని శరద్ యాదవ్ నేతృత్వంలోని జేడీ(యూ) వర్గం సమర్థించుకుంది. పార్టీ జాతీయ మండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకే శరద్ ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారని పేర్కొంది. బీజేపీతో జత కట్టడం ద్వారా సీఎం నితీశ్‌కుమార్ పార్టీ నిర్ణయాలను ధిక్కరించారని శరద్ యాదవ్ వర్గం జనరల్ సెక్రటరీ జావెద్ రజా శనివారం ప్రకటన విడుదల చేశారు. ఈ ర్యాలీలో బెంగాల్ సీఎం మమతా బెనర్జీ కూడా పాల్గొంటారు.

ట్రాన్స్‌జెండర్స్‌పై నిషేధం

అమెరికా సైన్యంలోకి ఎంపికను రద్దు చేస్తూ ట్రంప్ ఉత్తర్వులు

వాషింగ్టన్: లింగమార్పిడి చేయించుకున్న వారిని అమెరికా సైన్యంలోని ఉద్యోగాలకు అనుమతిస్తూ నాటి అధ్యక్షుడు ఒబామా తీసుకొచ్చిన విధానాన్ని ప్రస్తుత అధ్యక్షుడు ట్రంప్ రద్దుచేశారు. ఈ మేరకు డొనాల్డ్ ట్రంప్ శుక్రవారం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే సైన్యంలో ఉన్న ట్రాన్స్‌జెండర్స్‌ను కొనసాగించాలో లేదో నిర్ణయించే అధికారాన్ని రక్షణ శాఖ మంత్రి జిమ్ మ్యాటిస్‌కు ట్రంప్ కట్టబెట్టారు. వచ్చే ఏడాది మార్చి 23నుంచి కొత్త నిబంధనలను అమలు చేయాలని ట్రంప్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. లింగ మార్పిడి చేయించుకున్న వారిని కూడా సైన్యంలోకి తీసుకునేలా ఒబామా ఉత్తర్వులు జారీ చేయగా గతేడాది జూన్ నుంచి ఇది అమలవుతోంది. అలాగే మిలిటరీ ఉద్యోగులు ఎవరైనా కొత్తగా లింగమార్పిడి చేయించుకోవాలనుకుంటే కూడా వారికి అయ్యే ఖర్చును రక్షణ శాఖ భరించేలా ఒబామా ఏర్పాట్లు చేశారు. ఈ రెండు విధానాలను ట్రంప్ తాజాగా రద్దు చేశారు. ట్రంప్ ఉత్తర్వులపై కోర్టులో కేసు వేసేందుకు డెమోక్రాట్లతోపాటు పలువురు సిద్ధమవుతున్నారు.

బిహార్‌కు రూ. 500 కోట్ల సాయం

వరద ప్రాంతాల్లో ప్రధాని ఏరియల్ సర్వే

పూర్ణియా: బిహార్‌లోని వరద ప్రాంతాల్లో శనివారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విహంగ వీక్షణం చేశారు. తక్షణ ఆర్థిక సాయం కింద బిహార్‌కు రూ. 500 కోట్లు ప్రకటించారు. వరదల్లో చనిపోయిన ఒక్కో మృతుని కుటుంబానికి రూ. 2 లక్షల పరిహారం, తీవ్రంగా గాయపడిన వ్యక్తికి రూ. 50 వేలు అందజేస్తామని హామీనిచ్చారు. వరదల వల్ల జరిగిన నష్టాన్ని అంచనా వేసేందుకు త్వరలో ఒక కేంద్ర బృందాన్ని రాష్ట్రానికి పంపిస్తామని తెలిపారు. బీమా కంపెనీలు వెంటనే వరద ప్రాంతాలకు వెళ్లి పంట నష్టాన్ని అంచనా వేసి రైతులకు పరిహారం చెల్లించాలని కోరారు. రాష్ట్ర సీఎం నితీశ్ కుమార్, ఉప ముఖ్యమంత్రి సుశీల్‌కుమార్, ఇతర ఉన్నతాధికారులతో చునాపూర్ విమానాశ్రయంలోనే ప్రధాని సమీక్ష నిర్వహించారు. బిహార్‌కి అవసరమైన సహకారాన్ని అందజేస్తామని హామీనిచ్చారు. వరదల ప్రభావం సుమారు 19 జిల్లాలపై పడిందని, 13 జిల్లాల్లో దారుణంగా నష్టం వాటిల్లిందని ప్రధాని పేర్కొన్నారు. అనంతరం ఢిల్లీకి తిరుగుపయనమయ్యారు. పూర్ణియా, కటిహార్, కిసాన్‌గంజ్, అరేరియా జిల్లాల్లో మోదీ ఏరియల్ సర్వే నిర్వహించారు. వరదల వల్ల బిహార్‌లో 449 మంది మృత్యువాత పడగా, 1.67 కోట్ల మంది ప్రజలు ప్రభావితులయ్యారు.



వరదలపై మోదీ, నితీశ్ ఏరియల్ సర్వే

అమెరికాకు 'ఆధార్' సమాచారం!

- ట్వీటర్‌లో వికీలీక్స్ సంచలన వ్యాఖ్యలు
- దుర్వినియోగమయ్యే అవకాశం లేదు: భారత్

వాషింగ్టన్: భారతీయుల ఆధార్ సమాచారం అమెరికాకు అందుబాటులో ఉందంటూ వికీలీక్స్ సంచలన వ్యాఖ్యలు చేసింది. అమెరికాకు చెందిన సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ (సీఐఏ)కి చెందిన గూఢచారులకు ఆధార్ డేటాబేస్ అందుబాటులో ఉందని ట్వీటర్‌లో ఆరోపించింది. ఆధార్ డేటాబేస్‌ను అందుబాటులోకి తెచ్చుకునేందుకు సీఐఏ.. అమెరికాకు చెందిన క్రాస్ మ్యాచ్ టెక్నాలజీస్ కంపెనీని వాడుకుంటున్నట్లు పేర్కొంది. గోప్యత ప్రాథమిక హక్కేనని సుప్రీం కోర్టు తీర్పునిచ్చిన నేపథ్యంలో వికీలీక్స్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అయితే ఈ ఆరోపణలు నిరాధారమైనవని భారత్ ఖండించింది. 'ఆధార్ డేటా చాలా సురక్షితంగా నిక్షిప్తమై ఉంది. వేరే ఏ ఏజెన్సీ కానీ, సంస్థ కానీ ఆ వివరాలను పొందే అవకాశమే లేదు'అని అధికార వర్గాలు పేర్కొన్నాయి. ఆధార్ కార్యక్రమాన్ని అమలు చేసేందుకు యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యూఐడీఏఐ) ధ్రువీకరించిన బయోమెట్రిక్ పరికరాలను సరఫరా చేసే కంపెనీల్లో క్రాస్ మ్యాచ్ టెక్నాలజీస్ ముందువరుసలో ఉంది. వేలిముద్రలు, ఐరిస్ రికార్డు చేసే పరికరాలను సరఫరా చేసేందుకు 2011లో ఈ కంపెనీ అనుమతులు పొందింది. రహస్యంగా డేటాను సేకరించేందుకు 'ఎక్స్‌ప్రెస్ లేన్'అనే వ్యవస్థను సీఐఏ ఉపయోగించుకుంటోందని 'గ్రేట్ గేమ్ ఇండియా'వెబ్‌సైట్ ఓ కథనంలో పేర్కొంది. సీఐఏకు చెందిన ఆఫీస్ ఆఫ్ టెక్నికల్ సర్వీసెస్ వద్ద బయోమెట్రిక్ వివరాలను సేకరించే వ్యవస్థ ఉందని, దీని ద్వారా వివరాలను అక్రమంగా సేకరిస్తుందని వివరించింది. పాకిస్తాన్‌లో ఒసామా బిన్ లాడెన్ జాడ వెతికేందుకు క్రాస్ మ్యాచ్‌కు సంబంధించిన పరికరాలను అమెరికా మిలిటరీ వాడుకుందని 2011లో వార్తలు వచ్చాయి.



నైజీరియాలో 27 మంది ఊచకోత

మైదుగురి: ఆఫ్రికా దేశమైన నైజీరియాలో బొకోహరమ్ ఉగ్రవాదులు రెచ్చిపోయారు. బోర్నో రాష్ట్రంలోని పల్లెలపై తుపాకులు, కత్తులతో దాడిచేసి దాదాపు 27 మంది పౌరులను హతమార్చారు. తుపాకులతో కాల్చడంతో పాటు కత్తులతో గొంతు కోసి చంపారని స్థానిక ఆత్మరక్షణ బృంద సభ్యుడు మోడు జియల్టా తెలిపారు. ఈ దాడిలో ఆరుగురు పౌరులు గాయపడ్డారని వెల్లడించారు. బొకోహరమ్ హింసతో గత 8 ఏళ్లలో నైజీరియా, దాని పొరుగుదేశాల్లో 20,000 మంది మృతి చెందారు.

2,510 కోట్ల జాక్‌పాట్



మెగా మిలియన్స్ జాక్‌పాట్‌లో గెలుచుకున్న రూ.2510 కోట్ల (393 మిలియన్ డాలర్లు) చెక్కును షికాగోలో విలేకర్ల సమావేశంలో చూపుతున్న జో, పాట్రిషియా దంపతులు. ఒకేసారి రూ.1571.57 కోట్లను చెల్లించాలని వారు నిర్వాహకుల్ని కోరారు. రూ. 2510 కోట్లు కావాలంటే మాత్రం విడతలవారీగా చెల్లిస్తారు.

స్పర్థయా వర్ధతే విద్య

విద్య నేటి విద్యలో..
- జనరల్ స్టడీస్: ఇండియన్ ఎకానమీ
- బ్యాంక్ పీవోస్, క్లర్క్స్: జనరల్ అవేర్‌నెస్,
- టెన్త్ క్లాస్: మ్యాథమెటిక్స్ ప్రిపరేషన్ టిప్స్

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన ఈ-మెయిల్
sakshieducation@gmail.com

ఇంటర్వ్యూ తేదీలు
- ఎయిరిండియా ఇంజనీరింగ్ సర్వీసెస్ లిమిటెడ్‌లో ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటనెన్స్ ఇంజనీర్ పోస్టులకు: ఆగస్టు 30
- స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌లో ఆర్‌హెచ్‌ఓ, రిజిస్ట్రార్, సీనియర్ రిజిస్ట్రార్ పోస్టులకు: ఆగస్టు 31
- సెంట్రల్ టొబాకో రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో యంగ్ ప్రొఫెషనల్ పోస్టులకు: సెప్టెంబర్ 4



ఆర్థిక రంగం.. వర్తమాన అంశాలు



వరదల సమస్యపై అధ్యయనం..

★ ఈశాన్య రాష్ట్రాల్లో వరదల సమస్యను అధ్యయనం చేసి శాశ్వత పరిష్కారాన్ని కనుగొనేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ 2017, ఆగస్టు 1న రూ.100 కోట్ల కార్పస్ ఫండ్ ప్రకటించారు. దీంతోపాటు గువహటిలో ఈశాన్య రాష్ట్రాల్లో వరదల పరిస్థితులపై జరిగిన సమీక్షా సమావేశానంతరం తక్షణ సహాయంగా రూ.2,350 కోట్లు ప్రకటించారు. ఈ సమావేశానికి అసోం, అరుణాచల్‌ప్రదేశ్, నాగాలాండ్, మణిపూర్ ముఖ్యమంత్రులు, సీనియర్ అధికారులు హాజరయ్యారు. అత్యున్నత కమిటీని ఏర్పాటు చేయడం, వరదల విషయంలో బ్రహ్మపుత్ర పాత్రను అధ్యయనం చేసేందుకు ప్రధాని కార్పస్ ఫండ్‌ను ప్రకటించినట్లు అసోం ఆర్థిక మంత్రి హిమంత బిశ్వ శర్మ తెలిపారు. తక్షణ పునరావాస చర్యల నిమిత్తం అసోంకు ఇప్పటికే రూ.250 కోట్లు మంజూరు అయ్యాయని అసోం నీటి వనరుల మంత్రి కేశబ్ మహంత వెల్లడించారు. అసోం సమస్యను దేశం ఎదుర్కొంటున్న సమస్యగా ప్రధానమంత్రి అభివర్ణించారు. దీని పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

★ బ్రహ్మపుత్ర నది అధిక ప్రవాహం కారణంగా ఈశాన్య రాష్ట్రాల్లో వరదలు సంభవించాయి. వీటివల్ల అసోంలో 15 జిల్లాలు దెబ్బతిన్నాయి. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఆ రాష్ట్ర ప్రభుత్వం 128 పునరావాస శిబిరాలను ఏర్పాటు చేసింది. వీటిలో 25,129 మంది ప్రజలు తలదాచుకున్నారు. అసోంలో సుమారు 606 గ్రామాలు ఇప్పటికీ నీటిలోనే ఉండగా, తొమ్మిది జిల్లాల్లో 4.5 లక్షల మంది ప్రజలు వరదల వల్ల ఇబ్బందులకు గురయ్యారు. 2017లో ఇప్పటివరకు వరదల కారణంగా 156 మంది మరణించారు. 2017, జూలైలో అసోంలో వరదల కారణంగా మరణించినవారి కుటుంబాలకు ప్రధాని రూ.2 లక్షల వంతున ఆర్థిక సహాయం ప్రకటించారు. తీవ్రంగా గాయపడినవారికి ప్రధానమంత్రి నేషనల్ రిలీఫ్ ఫండ్ నుంచి రూ.50,000 ఇవ్వనున్నట్లు ప్రధాని వెల్లడించారు.

★ నైరుతి రుతుపవనాల సీజన్‌లో 20 రాష్ట్రాలు ప్రభావితమయ్యాయి. ఇప్పటివరకు అందిన సమాచారం ప్రకారం దేశవ్యాప్తంగా 600 మంది మరణించగా, 63,215 గృహాలకు నష్టం వాటిల్లింది. అధిక వర్షాలు, వరదలు, భూపాతం తదితరాల వల్ల 2.8 లక్షల హెక్టార్ల భూమిలో పంట నష్టం జరిగింది.

పంటల ఉత్పత్తి అంచనాలు

★ వ్యవసాయం, సహకారం, రైతు సంక్షేమ డిపార్ట్‌మెంట్ 2017, ఆగస్టు 16న 2016-17 సంవత్సరానికి పంటల ఉత్పత్తికి సంబంధించి 4వ ముందస్తు అంచనాలను విడుదల చేసింది.

ముఖ్యాంశాలు

1. 2016-17లో దేశంలో మొత్తం ఆహార ధాన్యాల ఉత్పత్తి 275.68 మిలియన్ టన్నులుగా నమోదైంది. ఇటీవల ఆహార ధాన్యాల ఉత్పత్తి అధికంగా సాధించిన 2013-14తో పోల్చితే 2016-17లో ఆహారధాన్యాల ఉత్పత్తిలో పెరుగుదల 4.01 శాతం. 2011-12 నుంచి 2015-16 వరకు సగటు ఆహార ధాన్యాల ఉత్పత్తిలో 18.67 మిలియన్ టన్నుల పెరుగుదల ఏర్పడింది.
2. వరి ధాన్యం ఉత్పత్తి 2016-17లో 110.15 మిలియన్ టన్నులు. 2013-14తో పోల్చితే 2016-17లో ఉత్పత్తిలో పెరుగుదల 3.28 శాతం. 2015-16తో పోల్చితే 2016-17లో ఈ ఉత్పత్తిలో పెరుగుదల 5.50 శాతం.
3. గోధుమ ఉత్పత్తి 2016-17లో 98.38 మిలియన్ టన్నులుగా నమోదైంది. 2013-14తో పోల్చినప్పుడు ఉత్పత్తిలో పెరుగుదల 2.64 శాతం కాగా, 2015-16తో పోల్చినప్పుడు 2016-17లో ఉత్పత్తిలో పెరుగుదల 6.61 శాతం.
4. ముఖ్య పప్పుధాన్యాల కింద సాగు విస్తీర్ణం, ఉత్పాదకత పెరిగిన కారణంగా 2016-17లో పప్పుధాన్యాల ఉత్పత్తి 22.95 మిలియన్ టన్నులుగా నమోదైంది. 2013-14తో పోల్చినప్పుడు 2016-17లో ఈ ఉత్పత్తిలో పెరుగుదల 19.22 శాతం. 2016-17లో మొత్తం నూనెగింజల ఉత్పత్తి 32.10 మిలియన్ టన్నులుగా, చెరకు ఉత్పత్తి 306.72 మిలియన్ టన్నులుగా నమోదైంది. పత్తి ఉత్పాదకతలో పెరుగుదల కారణంగా పత్తి అధిక ఉత్పత్తి (33.09 మిలియన్ బేళ్లు) సాధ్యమైంది.

ప్రధానమంత్రి వయ వందన యోజన

★ 60 ఏళ్లు లేదా అంతకు పైబడిన సీనియర్ సిటిజన్లకు ప్రత్యేకంగా ప్రకటించిన పెన్షన్ పథకం 'ప్రధానమంత్రి వయ వందన యోజన'. దీన్ని కేంద్ర ఆర్థిక, రక్షణ, కార్పొరేట్ వ్యవహారాల మంత్రి అరుణ్ జైట్లీ 2017, జూలైలో అధికారికంగా ప్రారంభించారు. పథకాన్ని ఎల్ఐసీ (లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) నిర్వహిస్తుంది. ఈ పథకంలో నిబంధనల మేరకు 2018, మే వరకు పెట్టుబడి పెట్టొచ్చు. పెన్షన్ కోరుకునే కాలానికి అనుగుణంగా పెట్టుబడికి సంబంధించిన సాంవత్సరిక ప్రతిఫలం (రిటర్న్) 8 నుంచి 8.30 శాతం ఉంటుంది. నెలవారీ పెన్షన్ కోరుకునే వారికి కనీస కొనుగోలు ధర రూ.1.50 లక్షలు కాగా సీనియర్ సిటిజన్లు ప్రతి నెలా రూ.1000 పెన్షన్ పొందుతారు. నెల వారీ పెన్షన్‌కు సంబంధించి గరిష్ట కొనుగోలు ధర రూ.7.50 లక్షలుగా ఉన్నప్పుడు ప్రతి నెలా రూ.5000 పెన్షన్ వస్తుంది. పాలసీ కాల వ్యవధి (పదేళ్ల) లోపు వ్యక్తులు మరణిస్తే కొనుగోలు ధరను లబ్ధిదారులకు అందిస్తారు. ఈ పథకంలో చేరే సీనియర్ సిటిజన్లకు గరిష్ట వయో పరిమితి లేదు. పాలసీ కాల వ్యవధి (పదేళ్ల)లో మూడేళ్లు పూర్తయితే రుణ సౌకర్యం కల్పిస్తారు. కొనుగోలు ధరలో 75 శాతాన్ని గరిష్ట రుణంగా పొందొచ్చు. సీనియర్ సిటిజన్ క్లిష్టమైన వ్యాధులకు గురైనప్పుడు పాలసీని సరెండర్ చేస్తే కొనుగోలు ధరలో 98 శాతం అందిస్తారు. ఈ పథకంతోపాటు ఇప్పటికే అమల్లో ఉన్న సీనియర్ సిటిజన్స్ సేవింగ్స్ స్కీమ్‌కు కూడా ఏడాదికి 8.3 శాతం రిటర్న్ అందిస్తోంది. ప్రధానమంత్రి వయ వందన యోజనకు వస్తు, సేవల పన్ను పరిధి నుంచి మినహాయింపు ఇచ్చారు. ఈ పథకానికి సంబంధించి కొనుగోలు ధర లేదా పెన్షన్ మొత్తానికి ఏవిధమైన పన్ను ప్రయోజనం ఉండదు.

వస్తు, సేవల పన్ను

★ రిటైలర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అభిప్రాయం ప్రకారం వస్తు, సేవల పన్ను అమలు వల్ల రానున్న మూడేళ్లలో రిటైలర్లకు గల అన్ని రకాల ప్రయోజనాల్లో దాదాపు 5 శాతం పెరుగుదల ఉండనుంది. ఏకగవాక్ష విధానం అమ్మకాల వృద్ధిని పెంపొందించగలదు. సప్లయ్ చైన్ సామర్థ్యం కారణంగా రిటైలర్లకు ప్రయోజనం కలుగుతుంది. రిటైల్ కంపెనీల్లో వ్యయ పొదుపునకు ఆస్కారం ఏర్పడుతుంది.

★ వస్తు, సేవల పన్ను అమలు అల్పాదాయ, దిగువ-మధ్య ఆదాయ వర్గాల ప్రజలకు ప్రయోజనకారిగా ఉంటుందని ఆసియా అభివృద్ధి బ్యాంకు పేర్కొంది. గతంతో పోల్చితే వస్తువులపై పన్ను రేటును జీఎస్టీ తగ్గిస్తుండగా, సేవలపై అధిక జీఎస్టీ ఉండగలదు. అధిక ఆదాయ బ్రాకెట్లలో చేసే వ్యయంలో సేవల వాటా పెరిగి, వస్తువుల వాటా తగ్గుతుందని ఆసియా అభివృద్ధి బ్యాంకు పేర్కొంది.

★ నూతన వస్తు, సేవల పన్ను కింద మొదటి నెల ఫైలింగ్‌కు సంబంధించి ప్రభుత్వానికి లభించిన పన్ను రాబడి రూ.42,000 కోట్లు. ఈ మొత్తంలో అంతర్రాష్ట్ర వస్తు కదలికలపై ఉండే ఐజీఎస్టీ ద్వారా రూ.15000 కోట్లు; కార్లు, పొగాకుపై ఉండే సెస్ ద్వారా రూ.5000 కోట్ల రాబడి లభించింది. మిగిలిన రూ.22,000 కోట్లు సీజీఎస్టీ, ఎస్‌జీఎస్టీ ద్వారా లభించింది. ఈ మొత్తాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య పంపిణీ చేస్తారు. పది లక్షల మంది పన్ను చెల్లింపుదారులు తమ రిటర్న్స్ దాఖలు చేయగా మరో 20 లక్షల మంది రిటర్న్స్ దాఖలు చేస్తారని అంచనా. 2016, జూలైలో ఎక్సైజ్ పన్ను ద్వారా రూ.31,782 కోట్లు, సేవల పన్ను ద్వారా రూ.19,600 కోట్ల ఆదాయం ప్రభుత్వానికి లభించింది. పాత పరోక్ష పన్ను పరిధిలో ఉన్న 72 లక్షల assessees జీఎస్టీ పరిధిలోకి వచ్చారు. వీరిలో 50 లక్షల మంది జీఎస్టీ పరిధిలోకి వచ్చే ప్రక్రియ పూర్తి కాగా, మరో 15 లక్షల కొత్త రిజిస్ట్రేషన్లు జరిగాయి.

★ ఎయిర్‌క్రాఫ్ట్, ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజన్లు, వాటి భాగాల దిగుమతులను జీఎస్టీ నుంచి మినహాయించారు. సిగరెట్లపై కాంపెన్సేషన్ సెస్ రేటును జీఎస్టీ కౌన్సిల్ జూలై 17న పెంచింది.

రూ.200, రూ.50 నోట్ల జారీ

★ 2016, నవంబర్ 8న పెద్ద నోట్ల ఉపసంహరణ తర్వాత ఆర్‌బీఐ రూ.2000 నోట్లను విడుదల చేసింది. రూ.2 వేల నోటును వాడే క్రమంలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తక్కువ denomination కరెన్సీ అవసరమైన మేరకు అందుబాటులో లేకపోవడం సమస్యలు తలెత్తాయి. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ 2017, ఆగస్టు 23న కొత్త రూ.200 నోటు జారీని ధ్రువీకరించింది. రిజర్వ్ బ్యాంక్-సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ (సీబీడీ) సిఫార్సు మేరకు ఆర్‌బీఐ చట్టం 1934 (సెక్షన్ 24) కింద రూ.200 నోటు జారీకి సంబంధించి నోటిఫికేషన్ విడుదలైంది. రూ.50 నోటు జారీని కూడా రిజర్వ్ బ్యాంక్ ధ్రువీకరించింది.

★ రిజర్వ్ బ్యాంకు గణాంకాల ప్రకారం 2017, మార్చి 10 నాటికి దేశంలో చెలామణీలో ఉన్న కరెన్సీ రూ.12.45 ట్రిలియన్లు. 2016, నవంబర్ 4న ప్రజల వద్ద ఉన్న కరెన్సీ రూ.17.97 ట్రిలియన్లు.

బీడబ్ల్యూఈఎల్ మూసివేత!

★ ఆర్థిక వ్యవహారాలపై కేంద్ర కేబినెట్ 2017, ఆగస్టు 23న రైల్వే మంత్రిత్వ శాఖ ప్రతిపాదించిన 'భారత్ వ్యాగన్ అండ్ ఇంజనీరింగ్ కంపెనీ లిమిటెడ్ (బీడబ్ల్యూఈఎల్) మూసివేతను అనుమతించింది. ఇది రైల్వే మంత్రిత్వ శాఖ పరిధిలోని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ. ఈ సంస్థ రుణాలను పరిష్కరించడానికి కేంద్ర ప్రభుత్వం గ్రాంటుగా రూ.151.18 కోట్లను అందించాల్సి ఉంటుంది. ప్రస్తుతం బీడబ్ల్యూఈఎల్‌లో ఉన్న 626 మంది ఉద్యోగులు 2007 వేతన స్కేలు ప్రకారం స్వచ్ఛంద పదవీ విరమణ పథకం కింద లబ్ధిపొందుతారు.

★ బీడబ్ల్యూఈఎల్.. భారత్ భారీ ఉద్యోగ్ నిగమ్ (బీబీయూఎన్)కు అనుబంధంగా ఉంది. ఖాయిలాపడిన ఆర్థర్ బట్లర్ అండ్ కంపెనీ, బ్రిటానియా ఇంజనీరింగ్ కంపెనీలను టేకోవర్ చేయడం ద్వారా బీడబ్ల్యూఈఎల్‌ను ఏర్పాటు చేశారు.

డా॥ తమ్మా కోటిరెడ్డి
ప్రొఫెసర్, ఐబీఎస్,
హైదరాబాద్



కాంపిటీటివ్ కౌన్సెలింగ్

సివిల్స్ మెయిన్స్‌లోని ప్రశ్నలకు సమాధానాలు రాసేటప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? *- ఎస్.సుధీర్, హైదరాబాద్.*

- పదాల పరిమితిపై ఆందోళన చెందకుండా, నాణ్యతకు ప్రాధాన్యమిస్తూ బాగా రాస్తే మంచి స్కోర్ సాధించవచ్చు.
- ప్రశ్నను బట్టి సమాధానాన్ని పాయింట్ల రూపంలో రాయాలా? లేదంటే విశ్లేషణాత్మకత విధానంలోనూ రాయాలా? అనేది నిర్ణయించుకోవాలి. కొన్ని ప్రశ్నలకు పాయింట్ల రూపంలో సమాధానం రాయడం వల్ల మంచి ప్రయోజనం ఉంటుంది. మరికొన్నింటికి రెండు విధానాలనూ జోడిస్తూ రాసినప్పుడే మేలు జరుగుతుంది.
- Comment, Elaborate, Illustrate, analyse, Be Critical.. తదితర పదాలు ప్రశ్నల్లో కనిపిస్తాయి. ఓ ప్రశ్నను రూపొందించే ఎగ్జామినర్ మీ నుంచి ఏం ఆశిస్తున్నాడనేది ఈ పదాల ద్వారా అర్థం చేసుకోవచ్చు. దానికి తగినట్లు సమాధానం



రాయాలి. వ్యాఖ్యానించమన్నారా.. విశ్లేషించమన్నారా? లేదంటే విమర్శనాత్మకంగా విశ్లేషించమన్నారా? ఇలా సమాధానాన్ని ఏ కోణంలో రాయాలో గుర్తించాలి.
- మరో ముఖ్య విషయం కచ్చితమైన సమాధానమంటే కేవలం ఫ్యాక్ట్స్‌ను మాత్రమే రాయడం కాదు. విశ్లేషణాత్మకంగా సమాధానం రాయడం ప్రధానం. ఫ్యాక్ట్స్ అనేవి ఓ అంశంపై అభ్యర్థి శ్రద్ధను మాత్రమే తెలియజేస్తాయి.
- జనరల్ ఎస్సే రాసే విషయంలో ఒక్కొక్కరికీ ఒక్కో శైలి ఉంటుంది. ఓ అంశానికి సంబంధించి అభిప్రాయాలను సౌకర్యవంతంగా, స్వేచ్ఛగా వెల్లడించగల శైలి ఏంటన్నది గుర్తించి, దాన్ని అనుసరించాలి. అభ్యర్థి రాసే వ్యాసంలో ఆత్మస్థైర్యం, ఆశావాదం, నిర్మాణాత్మకత ప్రతిబింబించాలి. అనవసర విషయాల జోలికి వెళ్లకూడదు. ఎస్సే ద్వారా మన వ్యక్తిత్వం ఏంటన్నది బయటపడుతుంది. దీన్ని గుర్తుంచుకొని ముందడుగు వేయాలి. మంచి వాక్యాలతో ఉత్సాహంతో మనస్ఫూర్తిగా ఇష్టపడుతూ రాసే ఎస్సే.. ఎగ్జామినర్‌ను కట్టిపడేస్తుందనడంలో సందేహం లేదు.

India and Nepal ink 8 pacts

International

ISA to be ratified multilateral agency of UN by December

The International Solar Alliance (ISA) is likely to be a recognized multilateral agency of the United Nations by the end of year 2017. According to the Minister of State (Independent Charge) Coal, Power, New and Renewable Energy and Mines, Piyush Goyal, before the end of this calendar, it will be seen that the International Solar Alliance as a multilateral agency ratified by the first 15 countries who would then be founding members. ISA was launched by Prime Minister Narendra Modi and French President Francois Hollande in November 2015. It aims to channel $300 billion in 10 years to promote renewable energy projects under a global mega fund for clean energy.

BRICS wants to create Golden decade

Brazil, Russia, India, China, South Africa (BRICS) nation's academics, consultants has discussed how to achieve a golden decade for the developing countries. The two day summit was held on 17th and 18th August in China. During the seminar over 160 representatives from BRICS members participated. The theme of seminar was "Openness, Inclusiveness, Mutual Benefits and Win-Win: Working Together to Build a Community of Shared Future for Mankind".

National

Commission to examine the Sub-Categorization within OBCs

The Union Cabinet chaired by Prime Minister Narendra Modi 23rd August approved a proposal for setting up of a Commission under article 340 of the Constitution to examine the issue of sub-categorization of the Other Backward Classes (OBCs). The Commission shall submit its report within 12 weeks from the date of appointment of the Chairperson of the Commission. The Commission shall be known as the Commission to examine the sub-categorization of Other Backward Classes. Andhra Pradesh, Telangana, Puducherry, Karnataka, Haryana, Jharkhand, West Bengal, Bihar, Maharashtra and Tamil Nadu have already carried out sub-categorization of Other Backward Classes.

Right to Privacy a Fundamental Right: SC

The Supreme Court (SC) on 24th August ruled that privacy is a fundamental right because it is intrinsic to the right to life. The bench, led by Chief Justice J.S. Khehar, pronounced a unanimous judgment. The ruling was delivered by a rare nine-member bench and is based on an array of petitions that challenge the mandatory use of Aadhaar cards which assign a unique 12-digit ID to every citizen. The ruling on the highly contentious issue was to deal with a batch of petitions challenging the Centre's move to make Aadhaar mandatory for availing the benefits of various social welfare schemes.

Bilateral

Pact on vaccine research

The Indian Council of Medical Research (ICMR) and the Union Ministry of Health on 21st August inked a pact with the International Vaccine Institute (IVI), South Korea to collaborate on vaccine research and development. With a long history of scientific collaboration with IVI, India officially became a signatory to the treaty of the Seoul-based organisation



in 2012. The IVI has 35 signatory countries. With this partnership, India is committing an annual contribution of USD 5,00,000 to IVI and joins Sweden and South Korea as financially contributing signatories to IVI.

India and Nepal ink 8 pacts

India and Nepal had entered into eight pacts. Of the eight pacts, four were related to utilisation of India's grant component in the post-earthquake re-construction package in the areas of housing, education, health and cultural heritage. Nepal Prime Minister Sher Bahadur Deuba, is on visit to India. He met Indian Prime Minister Narendra Modi. Pacts also includes post-earthquake re-construction and checking drug trafficking.

Economy

FDI grew by 37%

Foreign Direct Investments, grew by 37%, i.e. $10.4 billion during the period of April to June, in the 2017-18 financial year. In the same period of last fiscal, it was only 8 billion dollar. The main sectors which attracted the highest foreign inflows include services, telecom, trading, computer hardware and software and automobile. Bulk of the FDI came in from Singapore, Mauritius, the Netherlands and Japan.

NITI to launch Mentor India Campaign

NITI Aayog will launch the Mentor India Campaign, a strategic nation building initiative to engage leaders who can guide and mentor students at Atal Tinkering Labs. More than 900 such labs have been established across the country as a part of the Atal Innovation Mission and by the end of the year 2000 such labs will be in place.

Cabinet approves framework of consolidation of public sector banks

The Union Cabinet chaired by the Prime Minister Narendra Modi has given in-principle approval for Public Sector Banks to amalgamate through an Alternative Mechanism (AM). The decision would facilitate consolidation among the Nationalised Banks to create strong and competitive banks.

New Central Sector Scheme - "Pradhan Mantri Kisan Sampada Yojana" approved

The Cabinet Committee on Economic Affairs, chaired by the Prime Minister Narendra Modi, has approved the renaming of the new Central Sector Scheme - SAMPADA (Scheme for Agro-Marine Processing and Development of Agro-Processing Clusters) as "Pradhan Mantri Kisan Sampada Yojana (PMKSY) " for the period of 2016-20. The objective of PMKSY is to supplement agriculture, modernize processing and decrease Agri-Waste. PMKSY has an allocation of Rs. 6,000 crore. It is expected to leverage investment of Rs. 31,400 crore, and also handling of 334 lakh MT agro-produce valuing Rs. 1,04,125 crore. It benefits 20 lakh farmers and generate 5,30,500 direct/ indirect employment in the country by the year 2019-20.

Persons in news

Ashwani Lohani: Ashwani Lohani will be the new Chairman of Railway Board. He is presently serving as the Chairman and Managing Director of Air India. He has previously served as DRM, Delhi Division, Director of National Rail Museum and Chief Administrative Officer of Rail Alternate Fuel. Incumbent Railway Board Chairman A K Mittal resigned owning moral responsibility for Muzzafarnagar train accident which had claimed over 20 lives.

Nandan Nilekani: Nandan Nilekani the architect of the unique identity number, Aadhaar, took over as the non-executive chairman of Infosys. Following this development, Vishal Sikka, R Seshasayee, Jeff Lehman and John Etchemendy stepped down from the Board.

Awards

- **KCR:** Telangana Chief Minister K Chandrasekhar Rao has been selected for the Agriculture Leadership Award 2017, instituted by the Indian Council of Food and Agriculture.

Sports Awards



- Sports Ministry declared Rajeev Gandhi Khel Ratna, Dronacharya, Arjuna and Dhyan Chand Awards..
- **Rajeev Gandhi Khel Ratna:** Devendra (Para Athlete), Sardar Singh (Hockey).
- **Arjuna Awards:** Cricketer Cheteshwar Pujara, Women Cricketer Harmanpreet Kaur and shooter P.N. Prakash are among the 17 sportsmen who will be given Arjuna Awards for their outstanding performance.
- **Dronacharya Awards:** Seven persons have been chosen for Dronacharya Awards. They include late Dr. R.Gandhi in Athletics, Brij Bhushan Mohanty in Boxing and P.A.Raphel in the filed of hockey. Heera Nand Kataria, G.S.S.V Prasad, Sanjoy Chakravarthy, Roshan lal are others.
- **Dhyan Chand Award:** It will be given to Bhupender Singh in Athletics, Syed Shahid Hakim in Football and Sumarai Tete in Hockey for their life time contribution to sports development.

Rajendra Sharma
Current Affairs Faculty,
Hyderabad.



రెజ్యూమె..
ఉద్యోగార్థి విద్యా ప్రతిభకు కొలమానం..
నైపుణ్యాన్ని అంచనా వేసే ప్రమాణం..
అనుభవాన్ని బేరీజువేసే సాధనం..
ప్రశంసలు, పురస్కారాలను పొందుపరిచే పత్రం..
మొత్తంగా కొలువు సాధనలో వారధి..



కొలువుకు.. తొలిమెట్టు



జాబ్ స్కిల్స్

ఉపాధి వేటలో ఉన్న అభ్యర్థులకు రెజ్యూమె ప్రాధాన్యం ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఏళ్ల తరబడి చదివిన చదువు.. ఉద్యోగ ప్రయత్నంలో నేర్చుకున్న నైపుణ్యాలు.. అప్పటికే ఉద్యోగంలో ఉంటే సాధించిన అవార్డులు, ఘనతలను పేర్కొంటూ తమను తాము సరికొత్తగా ఆవిష్కరించుకునేలా రెజ్యూమె తయారీ కత్తి మీద సాము. పెద్ద పెద్ద సంస్థలు అభ్యర్థుల రెజ్యూమెను బట్టే వారిపై ప్రాథమిక అవగాహనకు వస్తాయి. అంతటి ప్రాధాన్యమున్న రెజ్యూమెలో ఏమేం రాయాలి..? ఎలా రాయాలి..? పాటించాల్సిన మెలకువలేమిటో చూద్దాం..!

సరైన సమాచారం


రెజ్యూమె తయారీలో చాలా ముఖ్యమైన అంశమిది. కొందరు అభ్యర్థులు ఉత్తీర్ణత సాధించిన సంవత్సరాలు, అనుభవం తదితర అంశాలను రాసే విషయాన్ని తేలికగా తీసుకుంటారు. లేదా తప్పు సమాచారం పొందుపరుస్తుంటారు. రెజ్యూమెలో పేర్కొన్న సమాచారం సరైనదో.. కాదో తెలుసుకోవడానికి సంస్థలు బ్యాక్‌గ్రౌండ్ వెరిఫికేషన్ చేస్తాయని గుర్తించాలి. అందుకని కచ్చితమైన, వాస్తవ వివరాలు మాత్రమే ఇవ్వాలి. అప్పుడే మీరు కూడా ఇంటర్వ్యూలను ధైర్యంగా ఎదుర్కోగలుగుతారు. రెజ్యూమె నిర్మాణానికి టెంప్లేట్స్ ఉపయోగించడం తప్పు కాదు. కానీ అభ్యర్థులు అభిరుచికి అనుగుణంగా మార్పులు చేయాలి.

సూటిగా.. స్పష్టంగా

రెజ్యూమెలో భాష సరళంగా ఉండాలి. విరామ చిహ్నాల దగ్గర్నుంచి గ్రామర్ వరకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. మొత్తానికి అభ్యర్థికి మంచి కమ్యూనికేషన్ స్కిల్స్ ఉన్నాయనే భావన కలగాలి. పదాల పునరుక్తులు లేకుండా.. రాత సృజనాత్మకంగా ఉండాలి. ఐ, మి, మై వంటి పదాలను ఎక్కువగా రాయకపోవడమే మంచిది. అక్షర దోషాలు లేకుండా ఒకటికి రెండుసార్లు సరిచూసుకోవాలి. వృత్తిరీత్యా (ప్రొఫెషనల్) వాడే భాషనే ఉపయోగించాలి.

ప్రజెంటేషన్

సమాచారాన్ని పాయింట్లవారీగా రాయడం.. ఆసాంతం ఒకటే ఫాంట్ వాడటం కీలకం. తద్వారా చదవడం సులువవుతుంది. బిజినెస్ లెటర్లలో సాధారణంగా వాడే.. ఏరియల్, టైమ్స్ న్యూ రోమన్, కొరియర్ న్యూ ఫాంట్‌లను ఉపయోగించవచ్చు. పరిమాణం 11 లేదా 12 ఉంటే రెజ్యూమె ఆకర్షణీయంగా ఉంటుంది. శీర్షికలకు కూడా స్థిరమైన ఫాంట్, సైజులను కేటాయించాలి. హెడ్డింగ్.. టెక్స్ట్ కంటే కొంచెం పెద్దదిగా ఉండాలి. హెడ్డింగులను బోల్డ్ చేయడం, అండర్ లైన్‌లో ఏకరూపత పాటించాలి.



కీలకాంశాలు మరువద్దు

రెజ్యూమెలో రంగులు ఎక్కువగా ఉపయోగించవద్దు. బ్యాక్‌గ్రౌండ్ పిక్చర్స్, క్లిప్ ఆర్ట్స్, ఫొటోలు అవసరం లేదు. ఆబ్జెక్టివ్, కాంటాక్ట్ ఇన్ఫర్మేషన్, వర్క్ హిస్టరీ, విద్యా విషయాలు, నైపుణ్యాలు, పర్సనల్ రిఫరెన్స్ ప్రస్తావనలో నిర్లక్ష్యం ప్రదర్శించవద్దు.

కెరీర్ ఆబ్జెక్టివ్

రెజ్యూమె లేదా కవర్ లెటర్‌లో ప్రత్యేక అంశంగా పేర్కొనాల్సిన అంశం ఇది. సాధారణంగా ఒకటి లేదా రెండు వాక్యాల్లో ముగించాలి. ఉద్యోగానికి ఎందుకు దరఖాస్తు చేస్తున్నారో అందులో చర్చించాలి.

కాంటాక్ట్ ఇన్ఫర్మేషన్

పైభాగంలో చదవడానికి అనువైన ప్రదేశంలో పేరు, ఫోన్ నంబరు, ఈ-మెయిల్ ఐడీ, ప్రొఫెషనల్ వెబ్‌సైట్ వివరాలు రాయాలి. సోషల్ నెట్‌వర్క్స్, బ్లాగులు ప్రొఫెషనల్‌వైతేనే పొందుపర్చాలి.

అర్హతలు.. అనుభవం

అభ్యర్థులు విద్యార్హతలు, ప్రొఫెషన్, పని అనుభవం స్పష్టంగా పేర్కొనాలి. పాఠశాల విద్య, కళాశాల కోర్సులు, టెక్నికల్ డిగ్రీ ప్రోగ్రామ్స్, సర్టిఫికేషన్స్, సాధించిన అవార్డుల గురించిన సమాచారం పొందుపర్చాలి. కంప్యూటర్ నాలెడ్జ్, భాషా పటిమ తదితర అంశాలు, నైపుణ్యాలను రాయాలి.

ప్రతికూల అంశాలొద్దు

రెజ్యూమెలో ప్రతికూల విషయాలను, పదాలను ఉపయోగించవద్దు. వివరాలను సానుకూల వివరణల్లోనే రాయాలి. నిర్వహించిన బాధ్యతల కంటే సాధించిన విజయాలు, దోహదపడిన అంశాలను ప్రస్తావిస్తేనే ప్రయోజనం ఉంటుంది. ఇతర నైపుణ్యాలను పేర్కొనడం మరిచిపోవద్దు. వాలంటీరుగా పనిచేసిన అనుభవం, కమ్యూనిటీ సర్వీస్, లాంగ్వేజ్ స్కిల్స్, ప్రోగ్రామింగ్ లాంగ్వేజెస్, టెక్నికల్ ప్రొఫీషియన్సీలను పేర్కొనాలి. ఉద్యోగానికి సంబంధించినవైతేనే అభిరుచుల గురించి రాయడం మంచిది. వ్యక్తిగత అలవాట్లను పేర్కొనడం సమయం, స్థలం వృథా చేయడమే అని గుర్తుంచుకోవాలి.

కీ టు సక్సెస్

జాబ్ సాధించడమే ధ్యేయంగా కాకుండా ఇంటర్వ్యూ స్థాయికి చేరుకోవాలనే లక్ష్యాన్ని దృష్టిలో ఉంచుకుని రెజ్యూమె రూపొందించాలి. తర్వాత ముఖ్యమైన ఇంటర్వ్యూ ఉంటుందని అభ్యర్థులు గమనించాలి. ఉద్యోగ నేపథ్యం, విధులు, బాధ్యతలు, అనుభవాలను ప్రతిబింబించేలా రెండు నిమిషాల్లో చదవగలిగేలా ఉండాలి. సంస్థలకు, దరఖాస్తు చేసుకునే ఉద్యోగాలకు అనుగుణంగా మార్పులు చేయాలి. తాజా సమాచారంతో అప్‌డేట్ చేస్తుండాలి.

వీడియో రెజ్యూమె ఇలా..



అభ్యర్థి ప్రజెంటేషన్ స్కిల్స్ స్పష్టంగా తెలుసుకోవడంతో పాటు ఎంపిక ప్రక్రియ సులువు కాబట్టి సంస్థలు ప్రస్తుతం వీడియో రెజ్యూమెలకు ప్రాధాన్యం ఇస్తున్నాయి. ఈ విషయంలో పాటించాల్సిన సూచనలు..

- వీడియో రెజ్యూమె ఎలా రూపొందించాలనే విషయంపై అవగాహన కోసం ఇంటర్‌నెట్‌లో పాత వీడియోలను చూడాలి.
- మొదట ఎలా మాట్లాడాలో పేపర్‌పై రాసుకోవాలి. ఆ విషయాన్ని అద్దం ముందు ప్రాక్టీస్ చేయాలి.
- వీడియో షూట్ చేసే ముందు లైటింగ్ డల్‌గా లేకుండా చూసుకోవాలి. ఆకర్షణీయంగా కనిపించేలా జాగ్రత్తలు తీసుకోవాలి.
- కెమెరాకు ఎదురుగా ఉండాలి. దిక్కులు చూడటం, పైకి, కిందకి చూడటం చేయకూడదు.
- చుట్టుపక్కల ఎలాంటి శబ్దాలు లేకుండా జాగ్రత్తపడాలి.
- ఫేస్ టు ఫేస్ ఇంటర్వ్యూగా భావించి తొలుత మీ పేరు చెప్పి వీడియో రెజ్యూమ్‌ను ప్రారంభించాలి.
- ప్రొఫెషనల్‌గా డ్రసప్ కావాలి. మాటలు మనసులోంచి రావాలి. స్క్రిప్ట్ అప్పజెప్పినట్టుగా ఉండకూడదు.
- నెమ్మదిగా లేదా వేగంగా మాట్లాడకూడదు. సాధారణంగా మాట్లాడాలి.
- వ్యక్తిగత విషయాల కంటే ప్రొఫెషనల్ అంశాలను ప్రస్తావిస్తూ.. ఏం నేర్చుకున్నారో సూటిగా, స్పష్టంగా చెప్పాలి.
- విద్యార్హతలతో పాటు మీరు పనిచేస్తున్న రంగంలో అనుభవాన్ని కచ్చితంగా చెప్పాలి.
- చివరగా నవ్వు ముఖంతో రిక్రూటర్‌కు థ్యాంక్స్ చెప్పాలి.
- మూడు నిమిషాల్లో పూర్తిచేయాలి కాబట్టి.. మీ ప్రతిభ, క్రియేటివిటీ, సామర్థ్యం సాధ్యమైన మేర నిరూపించుకోవాలి.

వర్చువల్ రియాలిటీ (వీఆర్).. ప్రస్తుతం అందరినోట వినిపిస్తున్న మాట. సాంకేతికత కొత్తపుంతలు తొక్కుతున్న క్రమంలో పుట్టుకొచ్చినదే వీఆర్. వస్తువు లేదా సన్నివేశాన్ని 360 డిగ్రీల కోణంలో చూడగలగడం వీఆర్ ప్రత్యేకత. త్రీడీ బొమ్మలు, సినిమాలు, టచ్ స్క్రీన్ ఫోన్లకు ఇది అడ్వాన్స్డ్ రూపం. వీక్షకులను మరో లోకంలో విహరింపజేసే వీఆర్.. శరవేగంగా విస్తరిస్తోంది. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుని మార్కెట్ పరిధి విస్తరించుకోవడంపై ప్రముఖ ఐటీ సంస్థలు దృష్టిసారించాయి. ఈ నేపథ్యంలో వీఆర్‌తో కెరీర్ అవకాశాలపై ఫోకస్..



కెరీర్ గైడెన్స్

బెస్ట్ కెరీర్ @ వీఆర్

భవిష్యత్తు ఆకర్షణీయం..

ప్రస్తుతం అందుబాటులో ఉన్న కెమెరాలు కంటికి ఎదురుగా ఉన్న దృశ్యాలను మాత్రమే చిత్రీకరించగలవు. అదే వీఆర్ టెక్నాలజీతో తీసిన వీడియోల్లో చుట్టుపక్కల పరిసరాలను సైతం ప్రత్యక్షంగా చూస్తున్న అనుభూతి కలుగుతుంది. వీఆర్ టెక్నాలజీతో చిత్రీకరించిన వీడియోలను వీఆర్ హెడ్‌సెట్‌లో చూస్తే ఆ మజానే వేరుగా ఉంటుంది. ఇప్పటివరకు ఎంటర్‌టైన్‌మెంట్, గేమింగ్‌లకే పరిమితమైన ఈ టెక్నాలజీని ఈ-కామర్స్, రియల్ ఎస్టేట్, విద్య, వైద్యం, ట్రావెల్ అండ్ టూరిజం తదితర రంగాల్లోనూ అందుబాటులోకి తీసుకొచ్చే ప్రయత్నం జరుగుతోంది. పెద్ద పెద్ద సంస్థలన్నీ ఈ దిశగా అడుగులు వేస్తున్నాయి. ఆక్యులస్, సామ్‌సంగ్ వీఆర్, మైక్రోసాఫ్ట్-హోలోలెన్స్ ఈ కోవకు చెందినవే. ఫేస్‌బుక్ ఇటీవల రెండు బిలియన్ డాలర్లను వెచ్చించి మరీ ఆక్యులస్‌ను సొంతం చేసుకుంది. వీఆర్ హెడ్‌సెట్‌లను తయారు చేసే 'మాజిక్ లీప్' అనే స్టార్టప్‌లో గూగుల్ భారీ పెట్టుబడులు పెట్టింది. 2020 నాటికి ప్రపంచవ్యాప్తంగా వీఆర్ టెక్నాలజీ వ్యాపారం 2 లక్షల కోట్లకు చేరుకుంటుందని టెక్ నిపుణుల అంచనా. ఈ పరిణామాల దృష్ట్యా మున్ముందు వీఆర్ రంగం మరింత ఆకర్షణీయంగా మారనుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

కీలక విభాగాలు

వీఆర్‌లో ప్రధానంగా టెక్నికల్, క్రియేటివ్ అనే రెండు విభాగాలు ఉంటాయి. ఇందులో టెక్నికల్ విభాగం ప్రధానమైనది. కోడింగ్ రాసే సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామర్లు, డెవలపర్లు ఇందులోకి వస్తారు. అప్లికేషన్లు పని చేయడానికి అవసరమైన కోడ్ రాయడం, గేమ్ ఇంజన్ తయారీ, వీఆర్ ప్రపంచానికి అవసరమైన కంటెంట్‌ను తయారు చేయడం వీరి ప్రధాన బాధ్యత. వీక్షకులను అందమైన ఊహాలోకంలో విహరింపజేయడానికి అవసరమైన దృశ్యాలను సృష్టించడం క్రియేటివ్ విభాగం పని. సృజనాత్మక ఆర్టిస్టులు, డిజైనర్లు ఇందులో ఉంటారు.



అర్హతలు

కంప్యూటర్ సైన్స్‌లో ఇంజనీరింగ్ లేదా పీజీ చదివి ఉండాలి. కంప్యూటర్ అప్లికేషన్ డెవలప్‌మెంట్‌లో ఆసక్తి, కోడింగ్‌పై పట్టుతోపాటు 3డీ డిజైన్ టెక్నాలజీపై అవగాహన, సృజనాత్మకత, గేమింగ్ నాలెడ్జ్ అవసరం.

నైపుణ్యాలు

వీఆర్ కెరీర్ ఎంచుకునేవారికి 3డీ మోడలింగ్ సాఫ్ట్‌వేర్ డిజైనింగ్, డెవలప్‌మెంట్ వచ్చి ఉండాలి. జావా, జావా స్క్రిప్ట్, సీ, సీ++, 3డీ ప్రోగ్రామింగ్ లాంగ్వేజెస్, ఆండ్రాయిడ్ ఎస్‌డీకే, వీఆర్ ఆండ్రాయిడ్‌లో నైపుణ్యంతో పాటు.. గేమ్ డెవలప్‌మెంట్, గ్రాఫిక్స్ ప్రోగ్రామింగ్ పైనా అవగాహన అవసరం. 3డీ గ్రాఫిక్స్ ఫండమెంటల్స్, యాప్ డెవలప్‌మెంట్ పరిజ్ఞానం ముఖ్యం. ప్రోగ్రామింగ్ నేపథ్యం ఉండి కొత్త టెక్నాలజీ నేర్చుకోవడంపై ఆసక్తి చూపేవారు ఈ రంగంలో రాణించవచ్చు.

కోర్సులు

- గేమ్ డిజైన్, యానిమేషన్ విభాగాల్లో బ్యాచిలర్, మాస్టర్స్, డిప్లొమా ప్రోగ్రామ్స్‌ను కోల్‌కత్తాలోని ఇన్ఫోకామ్ అందిస్తోంది.
- ఎఫ్‌ఎక్స్ స్కూల్, ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గేమింగ్ అండ్ యానిమేషన్, ఇంటర్నెట్ అకాడమీ వంటి పలు ఇన్‌స్టిట్యూట్స్ వీఆర్ టెక్నాలజీకి సంబంధించి వివిధ కోర్సులను అందిస్తున్నాయి.
- కోర్సును బట్టి ఏడాది నుంచి నాలుగేళ్ల వరకు కాలవ్యవధి ఉంటుంది.
- ఇన్‌స్టిట్యూట్ అందించే కోర్సులు, బోధన, ఫ్యాకల్టీ, ప్రాక్టికల్ శిక్షణ, జాబ్ మార్కెట్ డిమాండ్‌ను వ్యక్తిగతంగా పరిశీలించాకే చేరడం ఉత్తమం అనేది నిపుణుల సలహా.

ఉద్యోగావకాశాలు



కొత్తగా వచ్చిన టెక్నాలజీ కావడంతో నిపుణులను వెతికి పట్టుకోవడం సంస్థలకు పెద్ద సమస్యగా మారింది. సర్టిఫైడ్ నిపుణులు 3డీ జనరలిస్ట్ ప్రోగ్రామర్లుగా, గ్రాఫిక్స్ ప్రోగ్రామర్లు, యూఐ ప్రోగ్రామర్లు, యూఐ లేదా యూఎక్స్ ఆర్టిస్టులు, 3డీ మోడ్లర్స్, లెవల్ డిజనర్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఆటోమేషన్ ఇంజనీర్లు, ఆండ్రాయిడ్ ఇంజనీర్లు, వీఆర్ అప్లికేషన్ ఇంజనీర్, కంప్యూటర్ విజన్ ఇంజనీర్లు, వర్చువల్ రియాలిటీ డెవలపర్లుగా ఉద్యోగాలు పొందవచ్చు.

వేతనాలు

వర్చువల్ రియాలిటీ విభాగంలో గతేడాదితో పోలిస్తే 37 శాతం డిమాండ్ పెరిగిందని అంచనా. అనుభవం, స్కిల్స్‌ను బట్టి టెక్నికల్ ప్రోగ్రామర్లు ఏడాదికి రూ.4 లక్షల నుంచి రూ. 10 లక్షల వరకు సంపాదించవచ్చు. డిజైనర్లు, ఆర్టిస్టులకు ఏడాదికి రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు వేతనాలు అందుతున్నాయి. సాంకేతికతకు తోడు సృజనాత్మకత ఉన్నవారికి పెద్ద పెద్ద సంస్థలు భారీ ప్యాకేజీలతో ఆహ్వానం పలుకుతున్నాయి.

చదువంటే ఆమెకు ఇష్టం..! సీఏ చేస్తే భవిష్యత్తు బాగుంటుందని తెలుసుకుంది..! కానీ.. కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రం..! ఇలాంటి దశలో తండ్రి ప్రోత్సాహం లభించింది..! ఫలితం.. లక్ష్యం దిశగా అడుగులు పడ్డాయి. ఇటీవల వెలువరించిన సీపీటీ (కామన్ ప్రొఫిషియన్సీ టెస్ట్) ఫలితాల్లో 197 మార్కులు సాధించి సత్తా చాటింది. ఆమే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సారపాకకు చెందిన బుద్ది త్రివేణి. ఆమె సక్సెస్ స్పీక్స్..

ప్రాక్టికల్ దృక్పథంతోనే.. విజయం



సక్సెస్ స్పీక్స్

సీపీటీలో 197 మార్కులు పొందిన బుద్ది త్రివేణి

మా స్వస్థలం సారపాక. వ్యవసాయ కుటుంబ నేపథ్యం. నాన్న నరసింహారావు కౌలు రైతు. అమ్మ సుజాత పొలం పనుల్లో సహాయం చేస్తుంది. పదో తరగతి వరకు సారపాకలోనే చదివా. చిన్నప్పటి నుంచి ప్రతి తరగతిలో టాపర్‌గా నిలిచా. పదో తరగతిలో 9.5 గ్రేడ్ పాయింట్లు సాధించా.

పదో తరగతి పూర్తవుతూనే

సీఏ పూర్తిచేస్తే మంచి కెరీర్ ఉంటుందని స్కూల్లో ఉన్నప్పుడే తెలిసింది. అప్పుడే దానిని లక్ష్యంగా నిర్దేశించుకున్నా. ఆర్థికంగా కష్టమైనా.. వెనుకడుగు వేయకుండా నాన్న ప్రోత్సహించారు. పదో తరగతి పూర్తవుతూనే సీపీటీకి పేరు నమోదు చేసుకున్నా. సీపీటీ సిలబస్‌కు సరితూగేలా ఉండే ఎంఈసీ గ్రూప్‌లో చేరా. ఇంటర్ అనంతరం జూన్‌లో పరీక్షలకు హాజరయ్యా.

'కీ' చూసుకున్నాక..

సీపీటీ బాగా రాసినప్పటికీ.. మార్కుల పరంగా అంచనాకు రాలేకపోయా. ఇన్‌స్టిట్యూట్ రూపొందించిన 'కీ' చూసుకున్న తర్వాత నమ్మకం కలిగింది. ఫలితాల్లో 197 మార్కులు రావడం, అఖిల భారత స్థాయిలో టాపర్‌గా నిలవడం సంతోషంగా ఉంది.

ప్రాక్టీస్, అప్లికేషన్

సీపీటీకి ప్రిపరేషన్ నుంచే ప్రణాళికబద్ధంగా వ్యవహరించాలి. ప్రాక్టీస్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రతి అంశాన్ని అప్లికేషన్ ఓరియెంటేషన్‌తో చదవాలి. సబ్జెక్ట్ థియరీ ఆధారితమైనా.. ప్రాక్టికల్ బేస్డ్‌గా ఉన్నా.. ఈ దృక్పథం ఎంతో అవసరం. అప్పుడే పరీక్షలో ప్రశ్నను ఎలా అడిగినా సమాధానం ఇచ్చే సంసిద్ధత లభిస్తుంది.

రోజూ ఎనిమిది గంటలు

ఇంటర్మీడియెట్, సీపీటీ తరగతులు కలిపి రోజుకు సగటున ఎనిమిది గంటలు ప్రిపరేషన్‌కు కేటాయించా. క్లాస్ రూం మెటీరియల్, ఇన్‌స్టిట్యూట్ అందించిన స్టడీ మెటీరియల్ ఎంతో ఉపయోగపడింది. ఏ రోజు చెప్పిన పాఠాలను ఆ రోజు చదవడం, ప్రాక్టీస్ చేయడం వల్ల చివరి నిమిషంలో సైతం ఎలాంటి భయం లేకుండా పరీక్షకు హాజరుకాగలిగా.

స్వీయ విశ్లేషణ

ప్రిపరేషన్‌తో పాటు చదివింది ఎంతవరకు ఆకళింపు చేసుకోగలిగామో తెలుసుకోవడం కూడా ముఖ్యమే. ఇందుకోసం నేను మోడల్ టెస్ట్‌లు, మాక్ టెస్ట్‌లకు హాజరయ్యా. ముఖ్యంగా ఇంటర్మీడియెట్ పరీక్షలు పూర్తయ్యాక.. సీపీటీకి లభించిన సమయంలో ఈ తరహా ప్రిపరేషన్‌కు అధిక ప్రాధాన్యం ఇచ్చా. ఫలితంగా మంచి మార్కులు సాధించగలిగా.

సిలబస్‌కు అనుగుణంగా

ఔత్సాహిక విద్యార్థులు సిలబస్‌ను పరిశీలించి.. అనుగుణంగా ప్రిపరేషన్ సాగిస్తే విజయం సులభమే. దీంతోపాటు కొత్త పరిణామాల గురించి తెలుసుకుంటూ.. ప్రాక్టికల్ దృక్పథంతో చదవాలి. అప్పుడు కచ్చితంగా విజయం లభిస్తుంది.

బుద్ది త్రివేణి సీపీటీ మార్కులు

- ఫండమెంటల్ అకౌంటింగ్ – 60
- మర్కంటైల్ లా – 39
- జనరల్ ఎకనామిక్స్ –50
- క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ – 48

అకడమిక్ ప్రొఫైల్

- పదో తరగతి: 9.5 గ్రేడ్ పాయింట్స్
- ఇంటర్మీడియెట్: 975 మార్కులు

సాక్షి రౌండప్

వైఎస్‌ఆర్ జిల్లా

ఆదివారం | ఆగస్టు | 27 | 2017

www.sakshi.com

12

ఒక అంచనా ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా 90 దేశాల్లో నివసిస్తున్న ఆదిమ జాతుల జనాభా మొత్తం 37 కోట్లు.



పాల మాత్రలు వచ్చేశాయ్!



టీ చేసుకోవాలన్నా, కాఫీ చేసుకోవాలన్నా తప్పనిసరిగా పాలు కావాల్సిందే. లేదంటే కనీసం పాలపొడి ఉన్నా వాటితో పాలను తయారు చేసుకుని టీ, కాఫీ పెట్టుకోవచ్చు. కానీ వీటి అవసరం లేకుండా కేవలం ఓ మాత్రతో పాలు సిద్ధమైతే ఎలా ఉంటుంది? భలే ఐడియా కదూ...! బెర్లిన్ శాస్త్రవేత్తలు అచ్చంగా ఇలాంటి ఓ మాత్రనే అభివృద్ధి చేశారు. వేడి నీటిలో ఓ మాత్ర ఇలా వేయగానే ఆ నీళ్లన్నీ పాలలా మారిపోతాయట. ఈ మాత్రలను భద్రపర్చుకోవడం కూడా ఏమంత కష్టం కాదని చెబుతున్నారు. ప్లాస్టిక్ డబ్బాల్లో లేదంటే కాగితం పొట్లాల్లో కూడా వీటిని నిల్వ చేసుకోవచ్చంటున్నారు. అయితే ఈ మాత్రలను రకరకాల ఫ్లేవర్లలో కూడా తయారు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, షుగర్ క్యూబ్స్‌లాగా ఉండే ఈ మాత్రలను ఎక్కడికైనా వెంట తీసుకెళ్లవచ్చని వీటిని అభివృద్ధి చేసిన జర్మనీలోని హాలే రిటెన్‌బర్గ్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. షుగర్ పూతతో ఉన్న మాత్రలు, షుగర్ లేకుండా ఉన్న మాత్రలను కూడా త్వరలోనే అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ప్రస్తుతం రెండు రకాల మాత్రలను రూపొందించామని, వీటిలో చక్కెర పాళ్లు ఉండడంతో షుగర్ లెస్ ట్యాబ్లెట్ల తయారీపై దృష్టి సారించామని వెల్‌నర్ అనే శాస్త్రవేత్త తెలిపారు.

జీఎస్‌టీ తొలి నెల ఆదాయం నిరాశాజనకం

సాక్షి, అమరావతి: జీఎస్‌టీ అమల్లోకి వచ్చిన తరువాత తొలి నెల ఆదాయం నిరాశాజనకంగా ఉందని రాష్ట్ర వాణిజ్య శాఖ అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు ఎస్‌జీఎస్‌టీ కింద కేవలం రూ.518 కోట్లు మాత్రమే వచ్చినట్లు స్టేట్ ట్యాక్స్ చీఫ్ కమిషనర్ జె.శ్యామలరావు 'సాక్షి'కి వెల్లడించారు. ఇంకా పన్నులు, రిటర్నులు దాఖలు చేయడానికి ఒకరోజు మాత్రమే ఉండటంతో మరో రూ.300 కోట్ల వరకు రావొచ్చని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో మొత్తం 1.8 లక్షల మంది రిటర్నులు దాఖలు చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు కేవలం 44,000 మంది మాత్రమే దాఖలు చేశారని తెలిపారు. వీరు పన్నుల రూపంలో రూ.1,479 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. ఇందులో సీజీఎస్‌టీ కింద రూ.349 కోట్లు, ఐజీఎస్‌టీ కింద రూ.612 కోట్లు వచ్చినట్లు వివరించారు. ఎస్‌జీఎస్‌టీలో రాష్ట్రానికి వచ్చే వాటా ఆగస్టు 6న తెలుస్తుందని, ఇవన్నీ కలిపితే జూలై నెల ఆదాయం రూ.1,000 కోట్ల లోపే ఉంటుందని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. సాధారణంగా వ్యాట్ అమల్లో ఉన్నప్పుడు ప్రతీ నెలా సగటున రూ.1,500 కోట్ల వరకు ఆదాయం వచ్చేదని, ఇప్పుడు ఈ తగ్గిన ఆదాయాన్ని అక్టోబర్ నెలలో కేంద్రం పరిహారం రూపంలో అందిస్తుందన్నారు. ఇప్పటికే రిటర్నులు గడువును 5 రోజులు పెంచడంతో ఇక పెరిగే అవకాశాలు కనిపించడం లేదని, శుక్రవారం లోపు రిటర్నులు దాఖలు చేయకపోతే పెనాల్టీలు చెల్లించాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

రాష్ట్రంలో బిహార్ తరహా పాలన

వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర కన్వీనర్ కోలగట్ల ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం మున్సిపాలిటీ: ముఖ్యమంత్రి చంద్రబాబు హయాంలో రాష్ట్రంలో బిహార్ తరహా పాలన చూడాల్సిన దుస్థితి వచ్చిందని వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర కన్వీనర్ కోలగట్ల వీరభద్రస్వామి ధ్వజమెత్తారు. శనివారం విజయనగరంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హత్యా రాజకీయాలు, దౌర్జన్యాలు జరుగుతున్నా ముఖ్యమంత్రి తమకేమీ పట్టనట్లు వ్యవహరించడం సరికాదన్నారు. దుర్మార్గులకు, రౌడీషీటర్లకు చంద్రబాబు ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నంద్యాల ఉప ఎన్నిక సందర్భంగా అధికారపార్టీకి చెందిన ఏవీ సుబ్బారెడ్డి అరాచకాలకు పాల్పడుతున్నా పోలీస్ నియంత్రణ లేకపోవడం చూస్తుంటే రాష్ట్రంలో ఫ్యాక్షనిజాన్ని ఎంతలా ప్రోత్సహిస్తున్నారో అర్థమౌతోందన్నారు. అభిరుచి మధు కత్తిపట్టుకుని స్వైరవిహారం చేస్తున్నట్లు టీవీల్లో ప్రసారమైనా ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్నించారు. ఓటమి భయంతో శిల్పా కుటుంబాన్ని లేకుండా చేసేందుకు కుట్ర రాజకీయాలు చేస్తున్నారన్నారు.

ఏసీబీ వలలో బాలాయపల్లి తహసీల్దార్

రైతు నుంచి లంచం తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు



తహసీల్దార్ రాంబాబు (తెల్ల చొక్కా)ను విచారిస్తున్న ఏసీబీ అధికారులు

బాలాయపల్లి: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా బాలాయపల్లి మండల తహసీల్దార్ రాంబాబు ఓ రైతు నుంచి రూ.30 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు శనివారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. గొట్టికాడు గ్రామానికి చెందిన అద్దూరు చెంచయ్య పట్టాదారు పాసు పుస్తకం మంజూరు చేయాలని తహసీల్దార్ రాంబాబును మూడు నెలలుగా కోరుతున్నాడు. పాసు పుస్తకం కావాలంటే రూ.40 వేలు లంచమివ్వాల్సిందేనని తహసీల్దార్ రాంబాబు డిమాండ్ చేశారు. మొదట రూ.30 వేలివ్వాలని, పట్టాదారు పాసు పుస్తకం ఇచ్చిన తర్వాత రూ.10 వేలు ఇచ్చేలా బేరం కుదిరింది. అనంతరం దీనిపై రైతు చెంచయ్య ఏసీబీ డీఎస్పీ పరమేశ్వరరావుకు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన ఏసీబీ డీఎస్పీ తన సిబ్బందితో కలిసి శనివారం తహసీల్దార్ కార్యాలయంపై దాడి చేశారు. తహసీల్దార్ రాంబాబుకు చెంచయ్య రూ.30 వేలు లంచమిస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

ప్రశ్నార్థకంగా 108 ఉద్యోగుల భవితవ్యం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 108 అంబులెన్స్ సేవల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు సిబ్బంది భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. సుమారు 400 మంది ఉద్యోగులు తమ ఉద్యోగం ఏమవుతుందోనని ఆందోళన చెందుతున్నారు. 108 అంబులెన్సుల నిర్వహణ గత కొన్నేళ్లుగా జీవీకే సంస్థ చూస్తోంది. గతేడాది సెప్టెంబర్‌లో టెండర్లు పిలవగా బీవీజీ అనే సంస్థ నిర్వహణ కాంట్రాక్టు దక్కించుకుంది. బీవీజీ సంస్థకు అర్హత లేదంటూ జీవీకే సంస్థ కోర్టు కెళ్లగా హైకోర్టు స్టే ఇచ్చింది. కాగా నాలుగు రోజుల క్రితం కోర్టులో బీవీజీ సంస్థకు అనుకూలంగా తీర్పు వచ్చింది. దీంతో జీవీకే పరిధిలో పనిచేస్తున్న సుమారు 300 మంది ఉద్యోగులను తిరిగి బీవీజీ తీసుకుంటుందా లేదా అనే సందేహం నెలకొంది. తమను తొలగించి కొత్తవారిని తీసుకుంటుందేమోనన్న ఆందోళనలో ఉద్యోగులు ఉన్నారు.

అటవీ భూముల్లో వ్యాపారాలా?

- రాష్ట్ర సర్కారు ప్రతిపాదనలను తిరస్కరించిన కేంద్ర అటవీ సలహా కమిటీ
- అమరావతిలో 12,376.69 హెక్టార్ల అటవీ భూమి వినియోగాన్ని మార్పిడి చేయలేం..
- కేవలం రెండు బ్లాకుల్లో 2,087.19 హెక్టార్లలో మార్పిడికి సూత్రప్రాయ అంగీకారం
- ఆ భూముల్లో ప్రభుత్వ సంస్థలనే ఏర్పాటు చేయాలి
- మాస్టర్ ప్లాన్‌లో మార్పులు చేసి కేంద్రానికి సమర్పించాలి

సాక్షి, అమరావతి

నూతన రాజధాని పేరుతో ఇప్పటికే రైతుల నుంచి వేలాది ఎకరాల పంట పొలాలను బలవంతంగా లాక్కున్న రాష్ట్ర ప్రభుత్వం మరోవైపు విలువైన అటవీ భూములపైనా కన్నేసింది. అయితే, అటవీ భూముల విషయంలో రాష్ట్ర సర్కారు ప్రతిపాదనలకు కేంద్ర ప్రభుత్వం కళ్లెం వేసింది. రాజధాని ప్రాంతంలో 26 బ్లాకుల్లో 12,376.69 హెక్టార్ల అటవీ భూమి వినియోగాన్ని మార్పిడి చేయాల్సిందిగా ఏపీ ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. ఈ భూముల్లో అంతర్జాతీయ కన్వెన్షన్ సెంటర్, ఐటీ పార్కు, ఉన్నత విద్యా కేంద్రం, బిజినెస్ డిస్ట్రిక్ట్, ఏరో స్పేస్, పారిశ్రామిక పార్కు వంటివి నిర్మిస్తామని ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనలను కేంద్ర అటవీ సలహా కమిటీ లోతుగా పరిశీలించింది. క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించింది. 26 బ్లాకుల్లో గల 12,376.69 హెక్టార్ల అటవీ భూమి వినియోగ మార్పిడి ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేసింది.

రెండు బ్లాకుల్లోనే అనుమతి

కేవలం తాడేపల్లి, వెంకటాయపాలెం బ్లాకుల్లోని 2,087.19 హెక్టార్లలో అటవీ భూమి వినియోగ మార్పిడి కేంద్ర అటవీ సలహా కమిటీ సూత్రప్రాయంగా అంగీకరించింది. తాడేపల్లి బ్లాకులో 251.77 హెక్టార్లు, వెంకటాయపాలెం బ్లాకులో 1,835.32 హెక్టార్ల అటవీ భూమి వినియోగ మార్పిడికి పలు షరతులతో అంగీకారం తెలిపింది. తాడేపల్లి బ్లాకులోని 251.77 హెక్టార్ల భూమి క్యాపిటల్ సిటీ పరిధిలో ఉన్నందున అక్కడ ప్రభుత్వ సంస్థలనే ఏర్పాటు చేయాలని నిబంధన విధించింది. వెంకటాయపాలెం బ్లాకు అటవీ భూమిలో సాయుధ బలగాల శిక్షణా కేంద్రం, రాష్ట్ర పోలీసు, గ్రేహౌండ్స్, మిలటరీ స్టేషన్, కేంద్ర కారాగారం, రైల్వే అకాడమీ, సీఆర్‌పీఎఫ్‌లకు మాత్రమే వినియోగించాలని షరతు విధించింది. అలాగే అటవీ భూములను వ్యాపారాలు, వాణిజ్య కార్యకలాపాలు, రియల్ ఎస్టేట్, రెసిడెన్షియల్, అపార్ట్‌మెంట్లు, రిటైల్ షాపింగ్ మాల్స్, హోటళ్లు, లాడ్జీలకు వినియోగించరాదని స్పష్టం చేసింది. కేవలం ప్రభుత్వ మౌలిక వసతులకు మాత్రమే వినియోగించాలని పేర్కొంది. 60 శాతం మేర గ్రీనరీ ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపింది. ఇందుకు అనుగుణంగా రాజధాని మాస్టర్ ప్లాన్‌లో మార్పులు చేర్పులు చేసి, కేంద్ర అటవీ మంత్రిత్వ శాఖకు సమర్పించాలని ఆదేశించింది. మాస్టర్ ప్లాన్‌లో మార్పులు చేర్పులను కేంద్రానికి సమర్పించే దాకా అటవీ భూముల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని తేల్చిచెప్పింది.



ప్రత్యామ్నాయంగా 13,449 హెక్టార్లు

రాజధానిలో భారీ ఎత్తున అటవీ భూమి వినియోగ మార్పిడికి ప్రతిపాదించిన ఏపీ ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా వైఎస్సార్, ప్రకాశం జిల్లాల్లో 13,449 హెక్టార్ల భూమిని ఇవ్వనున్నట్లు కేంద్రానికి తెలిపింది. వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులో 5,900.67 హెక్టార్లును, అక్కడే మరోచోట 3,921.99 హెక్టార్లు, ప్రకాశం జిల్లా గిద్దలూరు డివిజన్‌లో 1,087.12 హెక్టార్లు, మార్కాపురం డివిజన్‌లో 2,539.25 హెక్టార్లను ఇస్తామని పేర్కొంది. అయితే, ఈ భూముల్లో అడవులు పెంచడం సాధ్యం కాదని కేంద్ర అటవీ సలహా కమిటీ తొలుత పేర్కొంది. ఇప్పుడు కేవలం 2,087.19 హెక్టార్లలోనే అటవీ భూమి వినియోగ మార్పిడికి అంగీకరించినందున అందుకు అనుగుణంగా ప్రత్యామ్నాయ భూమిని ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది.

పేదలకు ప్రభుత్వమే ఇళ్లు కట్టించి ఇవ్వాలి

రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి



పుంగనూరులో విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి

పుంగనూరు టౌన్: ప్రజల నుంచి డబ్బులు వసూలు చేసి ఇల్లు కట్టే విధంగా కాకుండా ప్రభుత్వమే పేదలకు ఇళ్లు కట్టించి ఇవ్వాలని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం పుంగనూరులో జరిగిన ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం భూమిపూజ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎంపీ మాట్లాడుతూ హౌసింగ్ ఫర్ ఆల్ కార్యక్రమం పేద ప్రజలపై భారాన్ని మోపుతోందన్నారు. అసలే ప్రజలు కరువు కాటకాలతో అల్లాడుతుంటే వారికి అండగా నిలవాల్సింది పోయి వారి నుంచే డబ్బు వసూలు చేసి ఇల్లు కట్టించే విధానానికి ప్రభుత్వం స్వస్తి చెప్పాలన్నారు. 300 చదరపు అడుగుల ఇల్లుకు రూ.2,60,000 చొప్పున కొన్నేళ్ల పాటు ప్రతినెలా కంతులు చెల్లించాలంటే జరిగే పనేనా ప్రశ్నించారు. ప్రభుత్వం సబ్సిడీ ఇస్తామంటున్న రూ.3 లక్షలతోనే ఇల్లు పూర్తి చేయవచ్చన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తే పేద ప్రజల నుంచి ఒక్క రూపాయి తీసుకోకుండా ఉచితంగా ఇళ్లు కట్టిస్తామన్నారు. హౌసింగ్ ఫర్ ఆల్ పథకం కాగితాలకే పరిమితమవుతోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్యే డా.పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పార్టీ నేతలు పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, ఎన్.రెడ్డెప్ప, నాగభూషణం, వెంకటరెడ్డి యాదవ్, ఆవుల అమరేంద్ర, అక్కిసాని భాస్కర్‌రెడ్డి, నాగరాజరెడ్డి పాల్గొన్నారు.


ప్రజల ఆస్తులను అమ్మే హక్కు మీకెక్కడిది?

మోదీ, చంద్రబాబుపై నిప్పులు చెరిగిన రాఘవులు

ద్వారకానగర్ (విశాఖ దక్షిణ): ప్రభుత్వ ఆస్తులను కొల్లగొట్టడానికి, ప్రభుత్వ పరిశ్రమలను ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేయాడానికి పాలకులు ప్రయత్నిస్తున్నారని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బి.వి.రాఘవులు మండిపడ్డారు. ప్రజాపోరాటాలతోనే ప్రభుత్వ ఆస్తులు రక్షించుకోవాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రైవేటీకరణ విధానాలను నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద 'సేవ్ పబ్లిక్ సెక్టార్స్.. సేవ్ విశాఖ' పేరుతో నిర్వహించిన భారీ బహిరంగసభలో రాఘవులు మాట్లాడారు. దేశంలో ప్రధాన రైల్వేస్టేషన్ల చుట్టూ ఉన్న భూములు, ఆస్తులను అమ్మకానికి పెట్టారని, 235 ప్రభుత్వ రంగ సంస్థల్లో కొన్నింటిని మూసెయ్యాలని, మరికొన్నింటిని అమ్మెయ్యాలని నిర్ణయించారని చెప్పారు. చంద్రబాబు గతంలో విజయనగరం జిల్లా బొబ్బిలిలోని నిజాం సుగర్ ఫ్యాక్టరీని కారుచౌకగా రూ.69 కోట్లకు అమ్మేశారని, ప్రస్తుతం వాటి విలువ రూ.600 కోట్లకు పైగా ఉందన్నారు. ప్రజల ఆస్తులను అమ్మేసే హక్కు వీరికెక్కడిదని ప్రశ్నించారు.

ప్రజాస్వామ్యాన్ని మంటగలుపుతున్న చంద్రబాబు

వైఎస్సార్‌సీపీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి ధ్వజం



సభలో మాట్లాడుతున్న నెల్లూరు ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి

గూడూరు: ప్రజాస్వామ్యాన్ని సీఎం చంద్రబాబు మంటగలుపుతున్నారని వైఎస్సార్‌సీపీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా గూడూరులో శనివారం నవరత్నాల సభ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన ఎంపీ మేకపాటి మాట్లాడుతూ.. నంద్యాల ఉప ఎన్నికలో అధికార టీడీపీ రూ.కోట్లు కుమ్మరించినా ప్రజల మనసు మాత్రం మార్చలేకపోయిందన్నారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి విజయం సాధించడం తథ్యమన్నారు. వైఎస్సార్‌సీపీ గుర్తుపై గెలిచిన పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలను కొనుగోలు చేయడం ద్వారా చంద్రబాబు తన అధికార దాహాన్ని చాటుకున్నారని దుయ్యబట్టారు. పార్టీ ఫిరాయించిన వారిని 3 నెలల్లో అనర్హులుగా ప్రకటించాలని ఇటీవల ఢిల్లీలో జరిగిన అన్ని రాజకీయపార్టీల సమావేశంలో కోరామన్నారు. దీనికి అందరూ మద్దతు పలికారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలందరూ నవరత్నాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, పార్టీ నేతలు మేరిగ మురళీధర్, గోపాల్‌రెడ్డి, నేదురుమల్లి పద్మనాభరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

160 క్రెడిట్లు వస్తే చాలు!

- ఇంజినీరింగ్ ఉత్తీర్ణతకు ఏఐసీటీఈ ప్రతిపాదనలు
- ఐదేళ్లపాటు 30 శాతం సీట్లు భర్తీకాని కాలేజీల గుర్తింపు రద్దు

సాక్షి, అమరావతి: ఇంజనీరింగ్ కోర్సుల్లో ఉత్తీర్ణతకు నిర్దేశించిన క్రెడిట్ల సంఖ్యను తగ్గించాలని జాతీయ సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) భావిస్తోంది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను కేంద్ర మానవవనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖకు త్వరలోనే సమర్పించనుంది. 2018–19 విద్యా సంవత్సరంలో అమలు చేయాల్సిన విద్యా, తదితర అంశాలకు సంబంధించి మండలి దేశంలోని వివిధ సాంకేతిక విశ్వవిద్యాలయాల ఉపకులపతులు, ఇతర ప్రముఖులతో గత రెండు రోజులుగా సమావేశం నిర్వహించింది. మండలి ఛైర్మన్ అనిల్ దత్తాత్రేయ సహస్రబుద్ధి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఏపీ నుంచి కాకినాడ జేఎన్‌టీయూ ఉపకులపతి వీఎస్‌ఎస్ కుమార్‌తో పాటు పలువురు వీసీలు హాజరయ్యారు. వచ్చే విద్యా సంవత్సరంలో చేపట్టాల్సిన పలు కార్యక్రమాలపై ఈ సమావేశంలో వీసీలు చర్చించి నూతన ప్రతిపాదనలు చేశారు.

ఉత్తీర్ణత క్రెడిట్లు తగ్గింపు...

ప్రస్తుతం ఉత్తీర్ణతకు సంబంధించి నిర్దేశించిన 200 క్రెడిట్లతో విద్యార్థుల ఇబ్బందులను కొందరు వీసీలు ఏఐసీటీఈ దృష్టికి తెచ్చారు. దీన్ని వచ్చే ఏడాది నుంచి 160 క్రెడిట్లకు తగ్గించాలని ప్రతిపాదించారు. అలాగే ఆన్‌లైన్ ఎడ్యుకేషన్‌లో రిజిస్టరై ఏఐసీటీఈ నిర్వహించే పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి అదనపు క్రెడిట్లు ఇవ్వాలని సమావేశంలో నిర్ణయించారు. ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ కోర్సుల్లో ఉత్తీర్ణులైన వారికి ఇంజనీరింగ్ కోర్సులో 20 శాతం క్రెడిట్లు కలపాలని ప్రతిపాదించారు. అంటే ప్రస్తుతం ఉన్న 200 క్రెడిట్లలో ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ కోర్సుల సర్టిఫికెట్లు పొందిన వారికి 20 శాతం అంటే 40 క్రెడిట్లు కలుపుతారు. దీనివల్ల ఆయా విద్యార్థులకు బ్యాక్‌లాగ్ సబ్జెక్టులు మిగిలిపోకుండా అన్నీ ఉత్తీర్ణులయ్యేందుకు ఆస్కారముంటుందని సమావేశంలో చర్చించారు. ఈ ప్రతిపాదనను కాకినాడ జేఎన్‌టీయూ వీసీ వీఎస్‌ఎస్ కుమార్ ప్రతిపాదించారు. ఇంజనీరింగ్ కోర్సుల్లో ఆయా కాలేజీల్లో ఇన్‌టేక్ సీట్లు ఏటా భారీగా మిగిలిపోతుండడంపైనా సమావేశంలో చర్చకు వచ్చింది. ఇకపై ఆయా కాలేజీల ఇన్‌టేక్ సీట్ల సంఖ్యలో 30 శాతం సీట్లు కూడా భర్తీకాకుండా అయిదేళ్ల పాటు పరిస్థితి అలాగే ఉంటే ఆయా సంస్థల గుర్తింపు రద్దుచేయాలని సమావేశంలో నిర్ణయించారు.

ప్రభుత్వ ఆస్తుల నిర్వీర్యమే బాబు లక్ష్యం

- ముడుపుల కోసం ప్రకాశం బ్యారేజీ గేట్లను 15 ఏళ్లలో 2 సార్లు మార్చారు
- ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ధ్వజం



పీడబ్ల్యూడీ వర్క్‌షాప్‌లో ఉద్యోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆర్కే

తాడేపల్లి రూరల్ (మంగళగిరి): ప్రభుత్వ ఆస్తులను నిర్వీర్యం చేయడమే సీఎం చంద్రబాబు లక్ష్యమని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) విమర్శించారు. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలంలోని సీతానగరంలో ఉన్న పీడబ్ల్యూడీ వర్క్‌షాప్‌ను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్కే మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రభుత్వ సంస్థల ఆస్తులు ఎక్కడ ఉన్నా వాటిని టార్గెట్ చేసి.. ఆ సంస్థను, అందులోని ఉద్యోగులను రోడ్డున పడేయడమే చంద్రబాబు లక్ష్యమని చెప్పారు. ఇందులో భాగంగానే ముడుపుల కోసం 2002లో మార్చిన ప్రకాశం బ్యారేజీ గేట్లను మళ్లీ మార్చేందుకు 2015లో ఓ ప్రైవేటు కంపెనీకి కాంట్రాక్ట్ అప్పజెప్పారని దుయ్యబట్టారు. పదిహేనేళ్ల వ్యవధిలో బ్యారేజీల గేట్లను దేశంలో ఎక్కడా మార్చలేదన్నారు. తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ప్రాజెక్టులకూ గేట్లను అందించిన ఘనత సీతానగరం పీడబ్ల్యూడీ వర్క్‌షాప్ సొంతమన్నారు. కానీ పక్కనే ఉన్న ప్రకాశం బ్యారేజీ గేట్లను మార్చే బాధ్యతను మాత్రం పీడబ్ల్యూడీ వర్క్‌షాప్‌నకు కాకుండా ముడుపులిచ్చిన వారికి చంద్రబాబు కట్టబెట్టారని.. ప్రైవేటు వ్యక్తులకన్నా తక్కువ ధరకు గేట్లు తయారుచేస్తామని చెప్పినా వర్క్‌షాప్ ఉద్యోగులను పక్కన పెట్టారని మండిపడ్డారు. ప్రకాశం బ్యారేజీ గేట్లను తామే తయారు చేస్తామంటూ వర్క్‌షాప్ సిబ్బంది రిలే నిరాహార దీక్షలకు దిగితే వారిని బెదిరించి ఉద్యమాన్ని నీరుగార్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ తర్వాత పీడబ్ల్యూడీ వర్క్‌షాప్ సిబ్బందే ఆ గేట్లకు మరమ్మతులు నిర్వహించాల్సి వచ్చిందన్నారు.

ఇంటి గోడ కూలి చిన్నారి మృతి



రాయచోటి రూరల్: వైఎస్సార్ జిల్లా రాయచోటి పరిధిలోని కొత్తపేటలో శుక్రవారం తెల్లవారుజామున ఇంటి గోడ కూలి షేక్ రిజ్వానా (4) అనే చిన్నారి మృతి చెందింది. లక్కిరెడ్డిపల్లె మండలం మద్దిరేవుల రెడ్డివారిపల్లెకు చెందిన హుస్సేన్‌బీ, మహమ్మద్ అలీ దంపతులు అనంతపురం జిల్లా కేంద్రంలో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అంయితే హుస్సేన్‌బీ రెండో కాన్పు కోసం రాయచోటిలోని తల్లిదండ్రుల ఇంటికి వచ్చింది. ఈ నేపథ్యంలో ఇటీవల వర్షానికి పూర్తిగా తడిచిపోయిన గోడలు కూలి పడ్డాయి. ఘటనలో చిన్నారి రిజ్వానా మృత్యువాత పడింది. చిన్నారి శరీరంపై ఎలాంటి గాయాలూ లేవు. శరీరం లోపలి భాగంలో ఎక్కడైనా తీవ్ర గాయం కావడమో.. లేక పిడుగుపాటు శబ్దానికో చిన్నారి మృతి చెంది ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. ఘటనలో చిన్నారి తాతయ్య కూడా స్వల్పంగా గాయపడ్డాడు.

ఎంబీబీఎస్ మహిళల కోటా సీట్ల భర్తీపై అనుమానాలు

- మెరిట్ ర్యాంక్ విద్యార్థినులకు మహిళల కోటాలో అడ్మిషన్లు
- ఓపెన్ కోటాలో ఇచ్చి ఉంటే మరికొందరికి అవకాశం దక్కేది
- పలు కళాశాలల్లో సీట్ల భర్తీ సరిగ్గా జరగలేదని అభ్యర్థుల ఆరోపణ



సాక్షి, అమరావతి: ఎంబీబీఎస్ సీట్ల భర్తీలో మరో అనుమానానికి ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ తెరతీసింది. ఇప్పటికే సీట్ల భర్తీలో పలు ఆరోపణలు ఎదుర్కొంటున్న విశ్వవిద్యాలయం అధికారులు.. తాజాగా మహిళల కోటా సీట్ల భర్తీలోనూ పలు అనుమానాలకు తావిచ్చారు. సీట్ల భర్తీలో పలువురు విద్యార్థినులకు తీవ్ర అన్యాయం జరిగిందని అభ్యర్థులతో పాటు వారి తల్లిదండ్రులూ ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. మహిళల కోటా కింద 33 శాతం రిజర్వేషన్ ఉందని, కానీ.. ప్రతిభ కలిగిన వారికి కూడా ఆ కోటాలోనే ఇచ్చారనేది ప్రధాన ఆరోపణ. తమ ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకుని సీట్ల భర్తీపై పునఃపరిశీలించాలని వారు కోరారు. ఇప్పటికే దీనిపై ప్రభుత్వానికి, వైద్య విద్యా సంచాలకులు, అధికారులకు ఈ–మెయిల్ పంపించామని విద్యార్థినులు తెలిపారు. ఆంధ్రా మెడికల్ కళాశాల (విశాఖ), రంగరాయ మెడికల్ కాలేజీ (కాకినాడ), శ్రీకాకుళం రిమ్స్ వైద్య కళాశాలల్లో సీట్ల భర్తీలో పలు అవకతవకలు జరిగినట్టు వారు వాపోతున్నారు.

ప్రతి కాలేజీలోనూ ఇలాగే

పైన పేర్కొన్న మూడు కళాశాలల్లోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా పలు మెడికల్ కళాశాలల్లో సీట్ల భర్తీపై విధంగా జరిగినట్టు అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. కర్నూలు, అనంతపురం, ఎస్వీఎంసీ తిరుపతి, గుంటూరు మెడికల్ కళాశాలల్లో కూడా ఉమెన్ కోటా సీట్లకు తీవ్ర అన్యాయం జరిగినట్టు ఫిర్యాదులొచ్చాయి. మంచి ర్యాంకులు సాధించిన విద్యార్థినులకు ఉమెన్స్ కోటా సీట్లు కేటాయించారని, ఓపెన్ జనరల్ కోటాలో ఇవ్వలేదని, దీనివల్ల కొంతమంది ఉమెన్స్ కోటా సీట్లు కోల్పోయారని వాపోతున్నారు. ఏ కళాశాలలోనూ సీట్ల భర్తీపై కేటగిరీల వారీగా వివరాలు ఇవ్వలేదని ర్యాంకులు సాధించిన వారు చెబుతున్నారు. దీనిపై హెల్త్ వర్సిటీ రిజిస్ట్రార్ అప్పలనాయుడును వివరణ కోరగా... అలాంటిదేమీ జరగలేదన్నారు.

అభ్యర్థులు లేవనెత్తిన అంశాలివే...

- ఆంధ్రా మెడికల్ కళాశాలలో 127వ ర్యాంకు సాధించిన వేమిరెడ్డి సాయిచందనకు ఉమెన్ కోటా కింద చూపించారు. అదే 481వ ర్యాంకు సాధించిన అఖిల్ వంశీకి జనరల్ కోటాలో చూపించారు. సాయిచందనకు ఎందుకు ఓపెన్ కోటాలో సీటు ఇవ్వలేదన్నది ఇక్కడ ప్రశ్న.
- రంగరాయ మెడికల్ కళాశాలలో బీసీ–డి జనరల్‌లో జనరల్‌కు 7, ఉమెన్‌కు 4 సీట్లు కేటాయించారు. కానీ కౌన్సెలింగ్‌లో చూస్తే బీసీ–డిలో 23 సీట్లు భర్తీచేశారు.
- ఇదే కళాశాలలో ఓపెన్ కోటాలో జనరల్‌లో 55 సీట్లు, ఉమెన్ కోటాకు 26 సీట్లు కేటాయించారు. అంటే మొత్తం సీట్లు 81. కానీ, 59 సీట్లు మాత్రమే భర్తీ చేశారు.
- శ్రీకాకుళం రిమ్స్ వైద్య కళాశాలలో బీసీ–డి జనరల్‌లో 4, ఉమెన్ కోటాకు 1 కేటాయించారు. కానీ, భర్తీలో మాత్రం బీసీ–డిలో 30 సీట్లు భర్తీ చేశారు.
- ఇదే కళాశాలలో జనరల్ కోటా 27, ఉమెన్ కోటాకు 14 సీట్లు.. అంటే మొత్తం 41 సీట్లు ఉన్నాయి. కానీ, 12 మాత్రమే భర్తీ చేశారు.

న్యాయం జరగాలంటే కోర్టుకెళ్లాల్సిందే!

- వైద్య ఆరోగ్యశాఖలో మూడున్నరేళ్లుగా ఇదే పరిస్థితి
- పలు కేసుల్లో సర్కారుకు వ్యతిరేకంగా హైకోర్టు తీర్పులు
- తీరుమారని శాఖ... టెండర్లలో కొనసాగుతున్న అక్రమాలు



సాక్షి, అమరావతి: వైద్య ఆరోగ్యశాఖలో గత మూడేళ్లుగా కోర్టు కెళ్లనిదే న్యాయం జరగని పరిస్థితి నెలకొంది. నియామకాలు, పదోన్నతులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్... సమస్య ఏదైనా కోర్టు గడప తొక్కితే గానీ సర్కారు స్పందించడం లేదని ఉద్యోగులు వాపోతున్నారు. హైకోర్టు మొట్టికాయలు వేసినా, జరిమానాలు విధించినా ప్రభుత్వం తీరు మారకపోవడం దారుణమని పలువురు ఉద్యోగులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికీ పదోన్నతులు, నియామకాలపై 200కు పైగా కేసులు హైకోర్టులో ఉన్నాయని, ఇక టెండర్లలో ఏకపక్షంగా వ్యవహరించిన తీరుపై హైకోర్టు సర్కారుకు పలుసార్లు అక్షింతలు వేసిందని ఉద్యోగ వర్గాలే గుర్తుచేస్తున్నాయి.

అన్ని కేసుల్లోనూ ప్రభుత్వానికి వ్యతిరేకంగానే తీర్పులు: వైద్య ఆరోగ్యశాఖలో జరిగిన అవినీతి అక్రమాలు, నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించిన తీరు.. ఇలా పలు అంశాల్లో బాధితులు కోర్టుకు వెళ్లడం.. ఆ తర్వాత ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీర్పులు రావడం పరిపాటిగా మారింది. ఒక్కసారి ఈ ఘటనలు పరిశీలిస్తే ఆ విషయం స్పష్టమవుతుంది.

- 2017లో ప్రైవేటు వైద్య కళాశాలల్లో పీజీ పూర్తి చేసిన వారు ప్రైవేటులోనే సీనియర్ రెసిడెన్సీ చేసుకోవచ్చునని వైద్య ఆరోగ్యశాఖ 2017 జులైలో జీవో నెం.99 ఇచ్చింది. ప్రభుత్వ సర్వీసును ప్రైవేటులో చేయడమేంటని అభ్యర్థులు కోర్టును ఆశ్రయించారు. దీనిపై హైకోర్టు తక్షణమే జీవో నెం.99ను రద్దుచేయాలని తాజాగా ఆదేశించింది.
- ఆరోగ్యశ్రీ పథకం అమలులో భాగంగా పనిచేస్తున్న సుమారు 1,900 మంది ఆరోగ్యమిత్రలకు అర్హత లేదని 2015లో సర్కారు తొలగించింది. వారు హైకోర్టును ఆశ్రయించగా.. ఎట్టిపరిస్థితుల్లో తొలగించకూడదని తీర్పునివ్వగా వాళ్లు కొనసాగుతున్నారు.
- 104 వాహనాల టెండర్లలో తీవ్ర అక్రమాలు ఏకపక్షంగా జరిగాయని కోర్టులో వ్యాజ్యం పడింది. తక్షణమే నిర్వహణా సంస్థను తొలగించాలని హైకోర్టు ఆదేశించింది. దీనిపై సర్కారు కౌంటర్ దాఖలు చేసింది. వ్యాజ్యానికి సంబంధించి ఇంకా తుదితీర్పు వెలువడాల్సి ఉంది.
- 2016 గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించే అల్ట్రాసొనాలజీ పరికరాలకు టెండరు నిర్వహించారు. ఇందులో ఎల్1 వచ్చిన సంస్థకు టెండరు ఇవ్వకుండా మరొకరికి ఇచ్చారు. దీంతో ఎల్1 టెండరుదారుడు కోర్టుకెళ్లాడు. కేసును పరిశీలించిన ధర్మాసనం.. సర్కారుకు రూ.10 వేల జరిమానా విధించడంతో పాటు టెండరు రద్దు చేసి, బాధితుడికి నష్టపరిహారం చెల్లించాలని తీర్పునిచ్చింది.

'ఎన్నికల్లో ప్రజాస్వామ్యానికి తూట్లు'

కోటగుమ్మం (రాజమహేంద్రవరం సిటీ): నంద్యాల ఉప ఎన్నికలో ముఖ్యమంత్రి చంద్రబాబు వందల కోట్లు కుమ్మరించి కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలను కొనుగోలు చేశారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆరోపించారు. ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేయాల్సి ఉండగా రాజకీయ పార్టీలు ధనం వెదజల్లుతూ ప్రలోభాలకు గురి చేస్తూ ప్రజాభిప్రాయాన్ని తమకు అనుకూలంగా మలుచుకునేందుకు ప్రయత్నించడం ద్వారా ప్రజాస్వామ్యానికి తూట్లు పొడుస్తున్నాయని విమర్శించారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇప్పుడు కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల్లో ఓట్లు కొనుగోలు ప్రారంభించారని దుయ్యబట్టారు. అవసరమైతే రూ.50 లక్షలు పెట్టి కార్పొరేటర్లను కొనుగోలు చేసే కుట్రలకు కూడా ప్రయత్నిస్తున్నారన్నారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ రాజ్యాంగాన్ని తవ్వి పాతరేస్తున్నారన్నారు. ఇలాగైతే ఎన్నికల నిర్వహణ ఎందుకని, ఎవరికి వారే వేలం పాటలు పెట్టి ఎమ్మెల్యే పదవికి ఇంత, కార్పొరేటర్ పదవికి ఇంత అని కొనుగోలు చేస్తే సరిపోతుందన్నారు. రాయలసీమలో ఫ్యాక్షనిజం అదుపు చేయాలని డిమాండ్ చేశారు.

వయోవృద్ధులకు...
వడ్డీ 'కోత'!

- డిపాజిట్ల రేట్లు తగ్గడంతో
- జీవిత చరమాంకంలో సీనియర్ సిటిజన్ల వెతలు
- ఏడు శాతానికి పడిపోయిన దీర్ఘకాలిక డిపాజిట్ల రేటు
- ప్రత్యామ్నాయ పొదుపు సాధనంలేక ఆందోళన
- అయోమయంలో 11కోట్ల మంది వయోవృద్ధులు



2016-17 సంవత్సరానికి , సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ అనుమతి నిరాకరించిన సినిమాలు 125. ఇందులో 78 భారతీయ, 47 విదేశీ చిత్రాలు. ఈ సంఖ్యలు 2015-16 సంవత్సరానికి 153(94+59). 2014-15కు 156(114+42).



''ఆగస్టు 2012లో బ్యాంకులో ఐదేళ్ల కాలానికి రూ.40 లక్షలు డిపాజిట్ చేస్తే నెలకు వడ్డీ రూపంలో రూ.35,352 వచ్చేవి. ఇప్పుడు అదే మొత్తాన్ని డిపాజిట్ చేస్తే రూ.26,489లు మించి రావడంలేదు. అంటే.. ఐదేళ్లలో నెలకు రూ.8,863 ఆదాయాన్ని నష్టపోయాం. కానీ.. దేశంలో ప్రతీ ఎమ్మెల్యే, ఎంపీలు, ఉద్యోగుల జీతాలు పెరుగుతుంటే...కేవలం బ్యాంకు డిపాజిట్లు అందించే వడ్డీని నమ్ముకున్న మాలాంటి సీనియర్ సిటిజన్స్‌కు మాత్రం ఆదాయం తగ్గిపోతుండటం దారుణం. ఓ పక్క ద్రవ్యోల్బణం తగ్గిందని వడ్డీరేట్లు తగ్గిస్తున్నారు. వాస్తవంగా ఏ వస్తు వు ధరలు తగ్గకపోగా పెరిగాయి. సీనియర్ సిటిజన్లపై కనికరం లేకుండా వడ్డీ రేట్లను తగ్గించడం దారుణం.''

– ఎం.సుబ్రమణ్యం, సీనియర్ సిటిజన్.

సాక్షి, అమరావతి: డిపాజిట్లు, పొదుపు ఖాతాలపై బ్యాంకులు వడ్డీ రేట్లను భారీగా తగ్గిస్తుండటంతో కేవలం వడ్డీపైనే ఆధారపడి జీవించే సీనియర్ సిటిజన్స్ (వయోవృద్ధులు) తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. రెండేళ్ల నుంచి ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీరేట్లు తగ్గుతూ వస్తుండగా ఇప్పుడు పొదుపు ఖాతాల వడ్డీరేట్లనూ తగ్గిస్తుండటంతో వీరిలో ఆందోళన మరింత పెరిగింది. జూలై 31న దేశీయ అతిపెద్ద బ్యాంక్ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పొదుపు ఖాతాలపై వడ్డీరేట్లను 4 శాతం నుంచి 3.5 శాతం వరకు తగ్గిస్తూ నిర్ణయం తీసుకోవడంతో మరో 6 బ్యాంకులు తగ్గించేశాయి. మిగిలిన బ్యాంకులు ఇదే బాట పడుతున్నాయి. పొదుపు ఖాతాలపై వడ్డీరేట్లను స్వేచ్ఛగా నిర్ణయించుకునే అధికారాన్ని ఆర్‌బీఐ 2011 అక్టోబర్‌లో బ్యాంకులకు ఇచ్చింది. అప్పుడు చాలా బ్యాంకులు పొదుపు ఖాతాలపై 4 శాతం వడ్డీని అందించగా, కోటక్, యెస్ బ్యాంకులు వంటివి 6–7 శాతం వడ్డీరేటును ఇచ్చేవి. ఆరేళ్ల తర్వాత ఇప్పుడు పొదుపు ఖాతాలపై వడ్డీరేట్లను అర శాతం వరకు తగ్గిస్తూ బ్యాంకులు నిర్ణయం తీసుకుంటున్నాయి. దీంతో సీనియర్ సిటిజన్లు ఆందోళన చెందుతున్నారు. ఎప్పుడు ఏ అవసరం వస్తుందేమోనని చాలామంది పొదుపు ఖాతాల్లో అధిక మొత్తాలను డిపాజిట్ చేసుకుంటారు. 2010 నుంచి ఖాతాలో ఉండే రోజు వారి నిల్వపై వడ్డీరేటును లెక్కించడం మొదలు పెట్టడంతో సేవింగ్స్ ఖాతాలో అధిక మొత్తాలు ఉంచే వారికి అధిక ఆదాయం వచ్చేది. ఇప్పుడు ఈ వడ్డీరేటును తగ్గించడంతో అత్యవసర నిధిని ఎక్కడ దాచుకోవాలో అర్థంకావడంలేదని మరో సీనియర్ సిటిజన్ వాపోయారు. రెండేళ్ల క్రితం ఫిక్స్‌డ్ డిపాజిట్లపై 9 శాతంగా ఉన్న వడ్డీ ఇప్పుడు 7 శాతానికి పడిపోయింది. 2014లో 9.20 శాతంగా ఉన్న సీనియర్ సిటిజన్స్ సేవింగ్స్ స్కీం వడ్డీరేటు ఇప్పుడు 8.4 శాతానికి పడిపోయింది. ఇలా వడ్డీరేట్లు పడిపోతుండటం, ఇదే సమయంలో సరైన ప్రత్యామ్నాయ ఇన్వెస్ట్‌మెంట్ సాధనాలు లేక పెన్షనర్లు, సీనియర్ సిటిజన్లలో ఆందోళన పెరుగుతోంది.

ఎందుకు తగ్గుతున్నాయి..

2008 ఆర్థిక సంక్షోభం తర్వాత ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలు వడ్డీరేట్లు తగ్గిస్తూ వచ్చాయి. దెబ్బతిన్న ఆర్థిక వ్యవస్థను ఆదుకోవడానికి వడ్డీరేట్ల తగ్గింపు ద్వారా ఉపశమనం లభిస్తుందని భావించడమే కారణం. దీంతో అమెరికా, జపాన్‌లతోపాటు యూరప్‌లో వడ్డీరేట్లు కనిష్ట స్థాయికి చేరుకున్నాయి. అమెరికాలోనూ వడ్డీరేట్లు కనిష్ట స్థాయికి చేరుకోవడమే కాకుండా ఆర్థిక వ్యవస్థ కోలుకోవడంతో తిరిగి పెరగడం కూడా ప్రారంభమయ్యింది. కానీ, మనదేశంలో పరిస్థితి దీనికి భిన్నంగా ఉంది. వడ్డీరేట్ల తగ్గింపు అనేది రెండేళ్ల నుంచే మొదలయ్యింది. దీనికి కారణం మన దేశంలో ద్రవ్యోల్బణం అధిక స్థాయిలో ఉండటమే. ఇప్పుడు ద్రవ్యోల్బణం దిగివస్తుండటంతో మన దేశం కూడా వడ్డీరేట్లను తగ్గించడం మొదలు పెట్టింది ఇప్పుడు అమెరికా కూడా వడ్డీరేట్ల పెంపునకు తాత్కాలికంగా విరామం ఇస్తున్నట్లు సంకేతాలను ఇవ్వడం.. జపాన్, యూరప్‌ల్లో వడ్డీరేట్లు ఇప్పట్లే పెరిగే అవకాశం లేకపోవడంతో మన దేశంలో వడ్డీరేట్లు ఇంకా తగ్గే అవకాశాలున్నాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. కాగా, బ్యాంకుల తీరు సామాన్యుడిని దూరం చేసుకునే విధంగా ఉందని కొందరు సీనియర్ సిటిజన్స్ ఆరోపిస్తున్నారు. ఇప్పటికే నగదు లావాదేవీలపై పరిమితులు విధించడమే కాకుండా.. ఆన్‌లైన్, కార్డు లావాదేవీలపై చార్జీల పేరుతో బాదుతున్నారని గుర్తుచేస్తున్నారు. ఇప్పుడు డిపాజిట్లు, పొదుపు ఖాతాలపై వడ్డీరేట్లు తగ్గిస్తే బ్యాంకు మెట్లు ఎక్కేవారి సంఖ్య క్రమంగా తగ్గిపోతుందని శ్రీకాకుళానికి చెందిన సీహెచ్ శ్రీనివాసరావు వ్యాఖ్యానించారు. 2011 జనాభా లెక్కల ప్రకారం దేశంలో 60 ఏళ్లు దాటిన వారు 11 కోట్ల మంది జీవిస్తున్నారు. వీరందరికీ బ్యాంకుల డిపాజిట్లే ప్రధాన ఆదాయ వనరు. ఇప్పుడు వీటి వడ్డీరేటుతగ్గిస్తుండటంతో దేశవ్యాప్తంగా సీనియర్ సిటిజన్స్ గళమెత్తుతున్నారు. ప్రస్తుతం బ్యాంకులు సీనియర్ సిటిజన్స్‌కు అదనంగా ఇస్తున్న అర శాతం వడ్డీకి మరో రెండు శాతం పెంచాలని వీరు డిమాండ్ చేస్తున్నారు.



సేవింగ్స్ ఖాతాలపై తగ్గిన వడ్డీరేట్లు

	లక్ష లోపు	50 లక్షలలోపు	కోటి దాటితే
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	3.5%	3.5%	4%
బ్యాంక్ ఆఫ్ బరోడా	3.5%	3.5%	4%
ఇండియన్ బ్యాంక్	3.5%	3.5%	4%
యాక్సిస్ బ్యాంక్	3.5%	3.5%	4%
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	3.5%	3.5%	4%
కర్నాటక బ్యాంక్	3%	3.5%	5%
యెస్ బ్యాంక్	5%	6%	6%
ఆంధ్రాబ్యాంక్	4%	4%	4%

సీనియర్ సిటిజన్స్ పథకాలు

ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం సీనియర్ సిటిజన్స్ కోసం రెండు ప్రత్యేక పథకాలను అందిస్తోంది. ఇందులో పోస్టాఫీసు అందించే సీనియర్ సిటిజన్స్ సేవింగ్స్ స్కీం ఒకటి కాగా, ఈ మధ్యనే ప్రధానమంత్రి వయో వందన యోజన (పీఎంవీవీవై) పేరుతో ప్రత్యేక పెన్షన్ పథకాన్ని ప్రవేశపెట్టారు.

ప్రధానమంత్రి వయో వందన యోజన

ఈ ఏడాది మేలో ప్రారంభించిన ఈ పథకం కాల పరిమితి కేవలం ఏడాది మాత్రమే. ఈ సమయంలో ఇన్వెస్ట్ చేసిన వారికి వచ్చే పదేళ్ల పాటు 8శాతం గ్యారంటీ వడ్డీని ఇవ్వడం జరుగుతుంది. అంటే వచ్చే పదేళ్లపాటు 8 శాతం గ్యారంటీ వడ్డీ లభిస్తుందన్న మాట. కానీ, ఒక కుటుంబం గరిష్టంగా రూ.7.5 లక్షలు మించి ఈ పథకంలో ఇన్వెస్ట్ చేయడానికి లేదు. కనీస నెల పెన్షన్ మొత్తాన్ని రూ.1,000గా నిర్ణయించారు. అంటే కనీసం రూ.1.5 లక్షలు ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది. అంటే ఈ పథకం ద్వారా ఏడాదికి రూ.60,000 మించి అంటే నెలకు రూ. 5,000 మించి పెన్షన్ అందుకునే వీలుండదు. కాలాపరిమితి మధ్యలో ఏదైనా అనుకోని సంఘటన జరిగితే ఇన్వెస్ట్ చేసిన మొత్తం వెనక్కి ఇచ్చేస్తారు. అలా కాకుండా మధ్యలో మీకు నగదు అత్యవసరం అయితే మూడేళ్ల తర్వాత వైదొలగవచ్చు. ఆ సమయంలో ఇన్వెస్ట్ చేసిన మొత్తంలో 98 శాతం వెనక్కి ఇవ్వడం జరుగుతుంది. పెన్షన్ నెలనెలా కావాలా మూడు, 6 నెలలు లేదా ఏడాది ఒకేసారి కావాలని అన్నది మనమే ఎంచుకోవచ్చు.

సేవింగ్స్ స్కీం

ప్రస్తుతం ఈ పథకంపై 8.4 శాతం వడ్డీని అందిస్తోంది. కానీ ఈ వడ్డీ స్థిరంగా ఉండదు. 60 ఏళ్లు దాటిన వారు ఈ పథకంలో చేరవచ్చు. 55 ఏళ్లు దాటిన తర్వాత స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన వారు కూడా దీనిలో చేరవచ్చు. ఈ పథకం కాలపరిమితి 5 ఏళ్లు. ఒక కటుంబం గరిష్టంగా రూ. 15 లక్షలు మించి ఇన్వెస్ట్ చేయడానికి వీలులేదు. ప్రతీ మూడు నెలలకు ఒకసారి వడ్డీ లెక్కించి ఇస్తారు. ఏ పోస్టాఫీసులోనైనా ఈ ఖాతాను ప్రారంభించవచ్చు. ఇందులో ఇన్వెస్ట్ చేసిన మొత్తంపై సెక్షన్ 80సీ ప్రకారం పన్ను మినహాయింపులు లభిస్తాయి.

దిక్కుతోచని స్థితిలో ఉన్నాం



రిజర్వ్‌బ్యాంక్ వడ్డీ రేట్లు తగ్గిస్తుండటం మాలాంటి పింఛనుదారులుకు ఇబ్బందే. బయట కంటే తక్కువ వడ్డీ వచ్చినా ఎటువంటి రిస్క్ లేకుండా నెలకు కొంత వస్తుందన్న భావనతో బ్యాంకుల్లో డిపాజిట్లు వేశాం. కానీ ఇప్పుడు బ్యాంకులన్నీ ఫిక్సిడ్ డిపాజిట్లు, సేవింగ్ ఖాతాల్లో వున్న సొమ్ముపై వడ్డీ రేట్లు తగ్గించేయడంతో దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నాం. రిటైర్ అయ్యాక బ్యాంకులో డిపాజిట్ చేస్తే డబ్బుకు భద్రత, వడ్డీ సొమ్ములతో బతికేయొచ్చనే నమ్మకంతోనే డిపాజిట్ చేశాం. విశ్రాంతి తీసుకునే వయస్సులో ఇటువంటి నిర్ణయం తీసుకోవడం బ్యాంకులకు సమంజసం కాదు. పించన్‌దారులకు అధిక వడ్డీ రేట్లను కొనసాగించాలి.

– ఎస్‌కెవిఎస్‌జెకె.వర్మ, విశ్రాంత ప్రిన్సిపల్, మురమళ్ల. తూర్పుగోదావరి జిల్లా

నిపుణుల సలహా



ఎటువంటి రిస్క్ లేకుండా వడ్డీని కోరుకునే వారికి ప్రస్తుతం గడ్డు పరిస్థితులు నడుస్తున్నాయి అని చెప్పవచ్చు. అంతేకాదు.. ఇంకా వడ్డీ రేట్లు తగ్గే అవకాశాలూ కనిపిస్తున్నాయి. కాబట్టి ఇతర ప్రత్యామ్నాయ ఇన్వెస్ట్‌మెంట్ మార్గాలను ఎంచుకోక తప్పని పరిస్థితి ఏర్పడింది. ఒకవేళ బ్యాంకు డిపాజిట్లలోనే ఇన్వెస్ట్ చేస్తాను అనే వారు అధిక వడ్డీరేటు అందిస్తున్న కాలపరిమితిని ఎంచుకోండి. అలాగే, మొత్తం సొమ్మును ఒకే డిపాజిట్‌గా కాకుండా మూడు నాలుగు డిపాజిట్లుగా చేయండి. కొద్దిగా రిస్క్ చేయదలిచే వారు బ్యాంకుల కంటే కొద్దిగా ఎక్కువ వడ్డీ రేటు ఇచ్చే మంచి కార్పొరేట్ బాండ్ల వైపు చూడొచ్చు. అలాగే, మ్యూచువల్ ఫండ్స్‌లో తక్కువ రిస్క్ ఉండే గిల్ట్, లిక్విడ్ వంటి డెట్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయవచ్చు. ఇప్పుడు అన్ని బ్యాంకులు మ్యూచువల్ ఫండ్ పథకాలను విక్రయిస్తున్నాయి. రిటైర్ అయిన వారు, ఐదేళ్లలో రిటైర్ అవుతున్న వారు ఈక్విటీ మార్కెట్‌లో ఇన్వెస్ట్‌మెంట్ సూచించలేం. ఇంకా రిటైర్మెంట్‌కు 5 నుంచి 10 ఏళ్ల సమయం ఉన్న వాళ్లు మాత్రం బ్యాలెన్స్‌డ్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయమని సూచిస్తాను. ఇవి కాకుండా ప్రభుత్వం సీనియర్ సిటిజన్స్ కోసం ప్రత్యేకంగా ప్రవేశపెట్టిన సేవింగ్స్, పెన్షన్ స్కీంల్లో కూడా ఇన్వెస్ట్ చేయవచ్చు.

– సతీష్ కంతేటి, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్, జెన్‌మనీ

హైదరాబాద్‌ను ముంచెత్తిన వాన

- భారీ వర్షంతో చిగురుటాకులా వణికిన నగరం
- శుక్రవారం రాత్రి 8 నుంచి జోరువాన..
- ఆరు గంటల్లో 13 సె.మీటర్ల భారీ వర్షం
- ఉప్పొంగిన నాలాలు.. 395 ప్రాంతాలు జలమయం
- ఇళ్లలోకి నీరు చేరడంతో జనం అవస్థలు

నిజం.. ఇది హైదరాబాదే!

శుక్రవారం రాత్రి ఉధృతంగా కురిసిన వర్షంతో నగరంలోని పరికి చెరువులోని కలుషిత నీరు ఉప్పొంగింది. దీంతో శనివారం ఇక్కడి కాలనీల్లో చెట్లు, భవనాలు, వాహనాలు ఎక్కడ చూసినా.. మురుగు నురుగుతో నిండిపోయాయి. నాలాను ఆనుకుని ఉన్న ధరణినగర్, ఆల్విన్‌కాలనీ పరిస్థితి ఈ ఫొటోలు చూపినట్లు దుర్భరంగా మారింది.





సాక్షి, హైదరాబాద్: కుండపోత వర్షంతో హైదరాబాద్ నగరం అతలాకుతలమైంది. శుక్రవారం రాత్రి 8 గంటల నుంచి అర్ధరాత్రి రెండు గంటల వరకు ఏకంగా సగటున 13 సెంటీమీటర్ల భారీ వర్షం కురిసింది. దీంతో నగరం చిగురుటాకులా వణికిపోయింది. నాలాలు ఉప్పొంగి నగరంలోని అనేక ప్రాంతాలు జలమయమయ్యాయి. వందలాది కాలనీలు నీటమునిగాయి. పలుచోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. చాలా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. శుక్రవారం సెలవుదినం కావడం, రాత్రి సమయంలో వర్షం కురవడంతో ట్రాఫిక్ సమస్య వంటి కొన్ని ఇబ్బందులు తప్పాయి. కానీ వరద నీటి కారణంగా సుమారు 395 ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. మొత్తంగా నగరంలోని 150 ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఇక ఎర్రకుంట, పటేల్ కుంట చెరువులకు వరద పోటెత్తడంతో.. పటేల్ కుంట చెరువు బ్రిడ్జిపైన భారీగా వరద నీరు చేరింది. కాలుష్య కారక రసాయనాలతో కూడిన కూకట్‌పల్లి పరికి చెరువు వరదతో ఉప్పొంగింది. ఆ నీరంతా రహదారులు, ఇళ్లలోకి చేరడంతో జనం అవస్థలు పడుతున్నారు.

విద్యుత్ సరఫరా బంద్

హైదరాబాద్‌లోని చాలా చోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. 154 ప్రాంతాల్లో విద్యుత్ వ్యవస్థలు దెబ్బతిన్నాయి. గోల్కొండ, సరూర్‌నగర్, ఎల్లమ్మ టెంపుల్, సుచిత్ర, ఎస్సార్ నగర్, గ్రీన్‌ల్యాండ్స్, మాదాపూర్, జర్నలిస్టు కాలనీలలో చెట్ల కొమ్మలు విరిగిపడడంతో విద్యుత్ తీగలు తెగిపోయాయి. బర్కత్‌పుర, తార్నాక, బంజారాహిల్స్‌లలో విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. దీంతో ఆయా ఫీడర్ల పరిధిలోని కాలనీలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. జీడిమెట్ల పరిసర ప్రాంతాల్లో శనివారం రాత్రి వరకు కూడా విద్యుత్ సరఫరా పునరుద్ధరించలేకపోయారు.

పొంగిపొర్లిన నాలాలు

కంటోన్మెంట్ 5వ వార్డులోని మహేంద్రహిల్స్ త్రిమూర్తికాలనీ, రోడ్–9 మూలమలుపు వద్ద గుట్టపై నుంచి భారీబండరాళ్లు రోడ్డుపై పడిపోయాయి. దీంతో ఈ రోడ్డుపై రాకపోకలు నిలిచిపోయాయి. బేగంపేట ఎస్పీ రోడ్ భరణి కాంప్లెక్స్ వద్ద ప్రహరీగోడ నిర్మాణ పనుల కోసం 6 నెలల క్రితం ప్రధాన నాలాను పూడ్చారు. దాంతో శుక్రవారం రాత్రి నుంచి కురిసిన భారీవర్షానికి కంటోన్మెంట్‌లో నాలా వెంట ఉన్న కాలనీలు నీట మునిగాయి. ప్యాట్నీ కాంపౌండ్ కాలనీలోని పలు అపార్ట్‌మెంట్లు, భవనాల్లోని సెల్లార్లలోకి వర్షపునీరు, మురుగునీరు చేరడంతో పలు కార్లు, ద్విచక్ర వాహనాలు నీట మునిగాయి. పైగా కాలనీ, బాలంరాయి, మార్గదర్శి కాలనీల్లో మోకాలిలోతు వరద నీరు చేరింది.

కూకట్‌పల్లిలో వర్షబీభత్సం

కూకట్‌పల్లిలో భారీ వర్షం కారణంగా ఇళ్ల బయట రోడ్లపై పార్క్ చేసిన వాహనాలు, పలు ఇళ్లలోని వస్తు సామాగ్రి రోడ్లపై కొట్టుపోయాయి. ధర్మారెడ్డి ఫేజ్–1లో ప్రాంతంలో ఓ బహుళ అంతస్తుల భవనం ప్రహరీగోడ కూలిపోయి వరద నీరు ఉధృతంగా ప్రవహించడంతో.. పార్క్ చేసి ఉన్న ఓ కారు, ద్విచక్రవాహనాలు కొట్టుపోయాయి. వాహనాలు కొట్టుకుపోకుండా ఆపేందుకు ప్రయత్నించిన వాచ్‌మెన్‌కు, ఓ వాహనం యజమానికి గాయాలయ్యాయి. బేగంపేట నాలా పరిధిలోని అల్లంతోట బావి, మయూరి మార్గ్, బ్రాహ్మణవాడీ, ఓల్డ్ కస్టమ్స్ బస్తీ, ప్రకాశ్‌నగర్ ఎక్స్‌టెన్షన్‌ప్రాంతాలు నీటమునిగాయి. పలుచోట్ల ప్రహరీ గోడలు, చెట్లు కూలిపోయి రాకపోకలకు అంతరాయం కలిగింది.

మంచు కాదు.. మురుగు నురుగు

శుక్రవారం రాత్రి ఉధృతంగా కురిసిన వర్షంతో పరికి చెరువులోని కలుషిత నీరు ఉప్పొంగి.. సమీప ప్రాంతాలన్నీ మురుగు నురుగుతో నిండిపోయాయి. శనివారం ఇక్కడి కాలనీల్లో చెట్లు, భవనాలు, వాహనాలు ఎక్కడ చూసినా.. నురగలో తేలియాడాయి. ధరణినగర్‌తో పాటు నాలాను ఆనుకొని ఉన్న ఆల్విన్‌కాలనీ పరిస్థితి దుర్భరంగా మారింది. కలుషిత నీటితోపాటు డ్రైనేజీ దుర్గంధంతో ముక్కుపుటాలు అదిరిపోతున్నాయి. ఈ నురగను జీహెచ్ఎంసీ జోనల్ కమీషనర్ హరిచందన, ఉప కమీషనర్ దశరథ్ పరిశీలించారు. అయితే చెరువు నీటిలో పిల్మెంటరీ బ్యాక్టీరియా పెరగడంతోనే నురగ ఏర్పడుతోందని కాలుష్య నియంత్రణ బోర్డు అధికారి రవీందర్ తెలిపారు.

చంద్రబాబు గజిని

- ఇచ్చిన ఏ ఒక్క హామీనీ అమలుచేయని సీఎం
- కాకినాడలో ఎమ్మెల్యే రోజా ప్రచారం



కాకినాడలో మాట్లాడుతున్న రోజా

కాకినాడ: 'ఉద్యోగాలిస్తా.. లేదంటే నిరుద్యోగ భృతి కల్పిస్తా.. రైతులు, డ్వాక్రా సంఘాలకు రుణమాఫీ చేస్తా.. అర్హులందరికీ ఇళ్లిస్తా..' ఇలా మూడున్నరేళ్ల కిందట ప్రజలకిచ్చిన ఏ ఒక్క హామీనీ అమలు చేయని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఓ గజినీ అని వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, నగరి ఎమ్మెల్యే ఆర్‌కే రోజా విమర్శించారు. కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో ఆమె శనివారం తూర్పు గోదావరి జిల్లా కాకినాడలోని 10, 11, 12, 13, 27, 28, 29, 31, 32, 33 డివిజన్లలో ప్రచారం నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ నిరుద్యోగ భృతిపై మాట తప్పిన చంద్రబాబు ప్రతి నిరుద్యోగికీ రూ.70 వేల చొప్పున అప్పు ఉన్నారని చెప్పారు. నిరుద్యోగులకు ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వకపోగా తన కుమారుడికి మాత్రం మంత్రి పదవి ఇచ్చారని మండిపడ్డారు. కోర్టు మొట్టికాయలు వేస్తేతప్ప కాకినాడలో ఎన్నికలు నిర్వహించే దమ్ముకూడా చంద్రబాబుకు లేకపోయిందని ఎద్దేవా చేశారు. కాకినాడ వాసులంటే కాజాలా తియ్యగా ఉంటారని సీఎం చంద్రబాబు అనుకుంటున్నారని, మోసం చేస్తే తాటతీస్తామని, మడతకాజా రుచి చూపిస్తారన్న విషయం తెలియజెప్పాలని పిలుపునిచ్చారు. మద్యంపాలసీ తీసుకొచ్చి విచ్చలవిడిగా మద్యం దుకాణాలకు అనుమతిచ్చారని ఆమె విమర్శించారు. జిల్లా కేంద్రలో అడుగడుగునా మద్యం దుకాణాలే దర్శనమిస్తున్నాయని రోజా మండిపడ్డారు.

నవభారతమే బీజేపీ లక్ష్యం: రామ్‌మాధవ్



హైదరాబాద్: ఎన్నికల రాజకీయాలతో సంబంధం లేకుండా 2022 నాటికి నవ భారత నిర్మాణమే లక్ష్యంగా బీజేపీ ముందుకెళుతోందని ఆ పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి వి.రామ్‌మాధవ్ అన్నారు. శనివారం హైదరాబాద్ కంటోన్మెంట్ ఇంపీరియల్ గార్డెన్స్‌లో నిర్వహించిన 'సంకల్ప్ సే సిద్ధి'కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. క్విట్ ఇండియా ఉద్యమం మొదలై 75 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా బీజేపీ 'న్యూ ఇండియా మూవ్‌మెంట్'(2017– 2022) కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఈ ఐదేళ్లలో అవినీతి రహిత, పేదరికం లేని, తీవ్రవాద రహిత, కుల, మతతత్వం లేని, స్వచ్ఛభారత్ సాధన లక్ష్యంగా కార్యాచరణ చేపడుతున్నామని చెప్పారు. ఈ మేరకు ప్రతి భారతీయుడు ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిచ్చారు. 2019 ఎన్నికల్లో బీజేపీ విజయఢంకా మోగిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ మేరకు బీజేపీ విజయంలో ప్రధాని మోదీ– పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షాతోపాటు, కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు రాహుల్‌గాంధీ కూడా ముఖ్యపాత్ర పోషిస్తారని చలోక్తి విసిరారు. రాహుల్‌గాంధీ ప్రచారం చేపట్టిన ప్రతిచోటా బీజేపీ ఘనవిజయం సాధిస్తుండటమే ఇందుకు నిదర్శనమని అన్నారు.

సింహాద్రిలో విద్యుదుత్పత్తి పునరుద్ధరణ

పరవాడ (పెందుర్తి): విశాఖ సింహాద్రి ఎన్టీపీసీ రెండో యూనిట్‌లో సాంకేతిక కారణాలతో బుధవారం నిలిచిపోయిన విద్యుదుత్పత్తిని శుక్రవారం పునరుద్ధరించారు. రెండో యూనిట్‌లో అమర్చిన బాయిలర్‌లో ఏర్పాటు చేసిన ట్యూబ్‌కు రంధ్రం పడడంతో 500 మెగావాట్ల విద్యుదుత్పత్తికి అంతరాయం ఏర్పడిన విషయం తెలిసిందే. శుక్రవారం ఉదయానికి యూనిట్‌లో విద్యుదుత్పత్తిని పునరుద్ధరించారు. కాగా, మూడో యూనిట్‌లో వార్షిక మరమ్మతుల కోసం నెల రోజుల పాటు విద్యుదుత్పత్తిని నిలిపివేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం 1, 2, 4 యూనిట్ల ద్వారా 1,500 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతోంది.

కనకమహాలక్ష్మికి స్వర్ణ కిరీటం బహూకరణ

డాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణం): విశాఖలోని బురుజుపేటలో ఉన్న కనకమహాలక్ష్మి అమ్మవారికి ఆ ప్రాంత వాసి, ఉద్యోగరీత్యా ముంబైలో నివాసముంటున్న అమ్మవారి భక్తుడు రూ.8 లక్షల విలువైన స్వర్ణ కిరీటాన్ని శనివారం బహూకరించారు. అమ్మవారికి విశేష పంచామృతాభిషేక సేవ నిర్వహించి కిరీటం అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎస్.జ్యోతిమాధవి, ఆలయ చైర్మన్ డబ్ల్యు. భాస్కరరావు, ధర్మకర్తలు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.



మాచ్‌ఖండ్‌లో నిలిచిన విద్యుత్ ఉత్పత్తి

ముంచంగిపుట్టు (అరకు): ఆంధ్రా– ఒడిశాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రంలో శనివారం విద్యుదుత్పత్తికి అంతరాయం ఏర్పడింది. మాచ్‌ఖండ్ నుంచి అరకు, బొడ్డవరం ఫీడర్ల మీదుగా విశాఖకు విద్యుత్ సరఫరా అవుతుంది. అయితే బొడ్డవరం వద్ద ఫీడర్‌లో సాంకేతిక లోపం తలెత్తడంతో మాచ్‌ఖండ్‌లో వినియోగంలో ఉన్న 1,2,4,5 జనరేటర్లపై దాని ప్రభావం పడి అవి మొరాయించాయి. దీంతో ఉత్పత్తి నిలిచిపోయింది. సిబ్బంది మరమ్మతులు ప్రారంభించి సాయంత్రం 6 గంటలకు 2వ నంబర్ జనరేటర్‌ను వినియోగంలోకి తెచ్చారు. మిగిలిన వాటిని వినియోగంలోకి తెచ్చేందుకు శ్రమిస్తున్నారు.

సాక్షి
రౌండప్
ఆదివారం | ఆగస్టు | 27 | 2017
www.sakshi.com

14

అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ ప్రకారం, 2012-16 మధ్య అత్యధిక విరాళాలు అందుకున్న పార్టీ బీజేపీ. 20 వేల కన్నా ఎక్కువ విరాళాల రూపంలో 2,987 కంపెనీల ద్వారా అది రూ. 705.81 కోట్లు పొందింది. 167 విరాళాల ద్వారా కాంగ్రెస్ అందుకున్నది రూ.198.16 కోట్లు.



నోట్లను వదిలేసి చిల్లర దొంగిలించారు!



దేశ రాజధాని ఢిల్లీ నడిబొడ్డున ఉన్న ఓ బ్యాంక్‌ను కొల్లగొట్టి, 12 గంటల్లో పట్టుబడిన దొంగలు.. పోలీసులకు పెద్ద షాకే ఇచ్చారు. కేవలం చిల్లరను మాత్రమే ఎందుకు ఎత్తుకెళ్లారన్న ప్రశ్నకు విస్తుపోయే సమాధానమిచ్చారు.

ముఖర్జీ నగర్‌లోని సిండికేట్ బ్యాంకులో ఈ నెల 22న సుమారు రూ.2.3 లక్షల నగదు దోపిడీ జరిగింది. కిటికీ గుండా ప్రవేశించిన ముగ్గురు దుండగులు డబ్బును ఎత్తుకెళ్లిపోయారు. ఇందులో ట్విస్ట్ ఏంటంటే... దొంగలు ఒక్క నోటు కూడా ముట్టుకోలేదు. 46 పాలిథీన్ సంచుల్లో నిల్వ ఉంచిన 5, 10 రూపాయల నాణేలను మాత్రమే తీసుకెళ్లారు. బ్యాంకు అధికారుల ఫిర్యాదుతో విచారణ ప్రారంభించిన పోలీసులు కేవలం 12 గంటల్లోనే కేసును ఛేదించి నిందితులను అరెస్ట్ చేశారు. నాణేలను మాత్రమే ఎందుకు దొంగతనం చేశారని అడిగితే... పెద్ద నోట్లను దొంగతనం చేస్తే అందులో ఉన్న చిప్‌ల సాయంతో దొరికిపోతామనే భయంతోనే ముట్టుకోలేదని సమాధానమిచ్చారు. రెండు వేల నోట్లలో ఉన్న చిప్‌ల ద్వారా జీపీఎస్ సాయంతో తాము ఎక్కడున్నా పోలీసులు సులువుగా పట్టేసుకుంటారనే వాటి జోలికి వెళ్లలేదట.

వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో వినాయక చవితి వేడుకలు

పూజల్లో పాల్గొన్న ఎంపీ వైవీ సుబ్బారెడ్డి



పూజలో పాల్గొంటున్న వైఎస్సార్ సీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి

సాక్షి, హైదరాబాద్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. హైదరాబాద్ లోటస్‌పాండ్‌లోని కార్యాలయంలో ఏర్పాటుచేసిన గణేశ్ మండపం వద్ద ఒంగోలు ఎంపీ వైవీ సుబ్బారెడ్డి మొదటి పూజచేశారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలు స్వామివారిని దర్శించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ వినాయక చవితి పండుగ భారతీయ సంస్కృతికి అద్దం పడుతోందని చెప్పారు. తెలుగు రాష్ట్రాలకు అభివృద్ధిపరంగా విఘ్నాలు తొలగిపోయి అన్నీ విజయాలే సిద్ధించాలని ఆకాంక్షించారు. ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని పూజలు చేసినట్లు వైవీ సుబ్బారెడ్డి చెప్పారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పుత్తా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీకి, నాయకులకు, కార్యకర్తలకు, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న కార్యక్రమాలకు ఎలాంటి విఘ్నాలు కలగకుండా ఉండాలని ప్రార్థించినట్లు చెప్పారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండా రాఘవరెడ్డి, ఏపీ స్టేట్ సెక్రటరీ బసిరెడ్డి సిద్ధారెడ్డి, భవనం భూషన్, నాయకులు బి.మోహన్‌కుమార్, రమణారెడ్డి, బెంబడి శ్రీనివాస్‌రెడ్డి, సుందర్, రాఘవనాయుడు, రాజశేఖర్‌రెడ్డి, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

నరసింహుని సన్నిధిలో జస్టిస్ శివశంకర్



లక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో జస్టిస్ శివశంకర్

సఖినేటిపల్లి (రాజోలు): తూర్పు గోదావరి జిల్లా అంతర్వేది గ్రామంలో కొలువై ఉన్న శ్రీలక్ష్మీనృసింహస్వామి వారిని ఏపీ, తెలంగాణ ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.శివశంకర్ శనివారం దర్శించుకున్నారు. ఏపీ స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ సీఈవో సంజయ్ గుప్తా, ఆర్థిక మంత్రి పర్సనల్ అసిస్టెంట్ సెక్రటరీ శ్రీనివాసరెడ్డి తదితర ప్రముఖులు కూడా స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ప్రముఖులకు ప్రధానార్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్, స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, వేదపండితుడు చింతా వేంకటశాస్త్రి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.

బెట్టింగ్‌లపై వెంటనే చర్యలు తీసుకోండి

డీజీపీకి పీసీసీ అధ్యక్షుడు రఘువీరా లేఖ

సాక్షి, అమరావతి: నంద్యాల ఉప ఎన్నిక ఫలితం మీద రాష్ట్రంలో భారీగా బెట్టింగ్‌లు జరుగుతున్నాయని దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ పీసీసీ అధ్యక్షుడు ఎన్.రఘువీరారెడ్డి శనివారం డీజీపీ ఎన్.సాంబశివరావుకు లేఖ రాశారు. రాయలసీమలో ఫ్యాక్షన్ తగాదాలను నివారించేందుకు వీలుగా ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. నష్టపోయిన వారు ఇబ్బందులకు గురై గ్రామాల్లో ఘర్షణలు చెలరేగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

రవాణా వాహనాల ఫిట్‌నెస్‌కు

ఐ అండ్ సీ సెంటర్లు

- విజయవాడ, విశాఖ, కర్నూలులో ఏర్పాటుకు కేంద్రం అంగీకారం
- 25 ఏళ్లు దాటిన వాహనాలు రోడ్డెక్కకుండా నిబంధనలు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో రవాణా వాహనాలకు ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించేందుకు త్వరలో ఇన్‌స్పెక్షన్ అండ్ సర్టిఫికేషన్(ఐఅండ్‌సీ) సెంటర్లు ఏర్పాటు కానున్నాయి. విజయవాడ, విశాఖపట్నం, కర్నూలులో ఈ కేంద్రాలను ఏర్పాటు చేయాలంటూ రాష్ట్ర రవాణా శాఖ పంపిన ప్రతిపాదనలకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్ర విభజన తర్వాత కేంద్రం ఏపీకి ఐడీటీఆర్(అంతర్జాతీయ డ్రైవింగ్ శిక్షణ, పరిశోధన కేంద్రం), ఐఅండ్‌సీ సెంటర్‌ను మంజూరు చేసింది. ఐడీటీఆర్‌కు రూ.18 కోట్లు, ఐఅండ్‌సీ సెంటర్‌కు రూ.10 కోట్ల నిధులు ఇచ్చేందుకు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ అంగీకారం తెలిపింది. ఏపీ ప్రభుత్వం ఐడీటీఆర్‌ను ప్రకాశం జిల్లా దర్శిలో ఏర్పాటు చేసేందుకు శంకుస్థాపన చేసి, టెండర్లను ఖరారు చేయకుండా ఏడాదిగా తాత్సారం చేస్తోంది. ఐఅండ్‌సీ సెంటర్ ఏర్పాటుకు గన్నవరం ప్రాంతాన్ని ఎంపిక చేసి ఆ తర్వాత పట్టించుకోలేదు.

రూ.30 కోట్లతో మూడు కేంద్రాలు

రవాణా వాహనాలకు ఫిట్‌నెస్ లేకపోవడం వల్ల ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని, 25 ఏళ్లు దాటిన వాహనాలను రోడ్డెక్కకుండా చర్యలు తీసుకోవాలని కేంద్రం తాజాగా ఆదేశించింది. అయితే, రాష్ట్రంలో ఐఅండ్‌సీ కేంద్రం లేకపోవడం వల్ల రవాణా వాహనాలకు ఫిట్‌నెస్ పరీక్షలు చేసే అవకాశం లేదని, ఏపీలోని మూడు ప్రాంతాల్లో మూడు సెంటర్లను ఏర్పాటు చేయాలని రవాణా శాఖ ప్రతిపాదనలు పంపింది. ఈ ప్రతిపాదనలకు కేంద్రం అంగీకారం తెలిపింది. రూ.30 కోట్లతో విజయవాడ, విశాఖపట్నం, కర్నూలులో ఐఅండ్‌సీ సెంటర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించింది.

శాస్త్రీయ విధానంలో పరీక్షలు

ఏపీలో దాదాపు 11.50 లక్షల రవాణా వాహనాలు ఉన్నట్లు సమాచారం. రవాణా వాహనాల్లో 25 ఏళ్లు దాటినవి 3 లక్షలకు పైగా ఉంటాయని రవాణా శాఖ అంచనా వేస్తోంది. ఐఅండ్‌సీ సెంటర్‌లో రవాణా వాహనాలకు శాస్త్రీయ విధానంలో పరీక్షలు నిర్వహించి, ఆటోమేషన్ విధానంలో సర్టిఫికేషన్ చేస్తారు. ఫిట్‌నెస్ లేకపోతే వాహనం రోడ్డెక్కకుండా నిషేధించే అధికారం రవాణా అధికారులకు ఉంటుంది. కాలుష్యాన్ని అరికట్టే క్రమంలో 25 ఏళ్లు దాటిన వాహనాలపై నిషేధం విధించాలని కేంద్రం యోచిస్తోంది. ఈ మేరకు రవాణా వాహనాల వివరాలు అందించాలని అన్ని రాష్ట్రాలను ఆదేశించింది.

ఓనం పండుగకు ప్రత్యేక రైళ్లు

రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమం): కేరళలో జరిగే ఓనమ్ పండుగకు సికింద్రాబాద్ –కొచివేలి–సికింద్రాబాద్, నాందేడ్ – ఎర్నాకుళం మధ్య ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు విజయవాడ డివిజన్ ఇన్‌చార్జ్ పీఆర్వో జేవీఆర్‌కే.రాజశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సికింద్రాబాద్–కొచివేలి (07119) ప్రత్యేక రైలు సెప్టెంబర్ 1న సాయంత్రం 4.25 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి రెండో రోజు అర్ధరాత్రి 12.30 గంటలకు కొచివేలి చేరుతుంది. కొచివేలి– సికింద్రాబాద్ (07120) ప్రత్యేక రైలు సెప్టెంబర్ 6న రాత్రి 8.30 గంటలకు కొచివేలిలో బయలుదేరి రెండో రోజు మధ్యాహ్నం 3 గంటలకు సికింద్రాబాద్ చేరుతుంది. నాందేడ్–ఎర్నాకుళం (07505) ప్రత్యేక రైలు సెప్టెంబర్ 1న ఉదయం 7.10గంటలకు నాందేడ్‌లో బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 2 గంటలకు ఎర్నాకుళం చేరుతుంది. ఎర్నాకుళం–నాందేడ్ (07504) ప్రత్యేక రైలు సెప్టెంబర్ 4న రాత్రి 11 గంటలకు ఎర్నాకుళంలో బయలుదేరి రెండో రోజు ఉదయం 6.30గంటలకు నాందేడ్ చేరుతుంది. ఈ రైళ్లు విజయవాడ మీదుగా రాకపోకలు సాగిస్తాయి.

నారా పాలన నీరో పాలన కంటే అధ్వానం

- వైఎస్సార్‌సీపీ నేత భూమన కరుణాకరరెడ్డి ధ్వజం
- మూడేళ్లలో చేసిన అభివృద్ధి నేతిబీరలో నెయ్యి చందమే
- రెండేళ్లుగా కాపుల జీవితాలతో చెలగాటమాడుతున్నారు



సమావేశంలో మాట్లాడుతున్న భూమన కరుణాకర రెడ్డి. చిత్రంలో ఎంపీ వరప్రసాద్ రావు, ఎమ్మెల్యే చెవిరెడ్డి తదితరులు

సాక్షి ప్రత్యేక ప్రతినిధి, కాకినాడ: ''ముఖ్యమంత్రి చంద్రబాబు నిన్నటిదాకా నంద్యాలలో ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అవాస్తవాలు, అబద్ధపు ఆరోపణలతో కథాకళి చేశారు. ఇప్పుడు కాకినాడలో కొత్త నాటకానికి తెరతీశారు. చంద్రబాబు అబద్ధాల్లో గోబెల్స్‌కు అన్నగా మారాడు'' అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూమన కరుణాకరరెడ్డి ధ్వజమెత్తారు. ఆయన శనివారం కాకినాడలో మీడియాతో మాట్లాడారు. నారావారి పాలన నీరో రాజు పాలన కన్నా అధ్వానంగా ఉందన్నారు. మూడేళ్లలో చంద్రబాబు చేసిన అభివృద్ధి నేతిబీరకాయలో నెయ్యి చందమేనని విమర్శించారు. 2014లో ఆరొందల అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు వాటిని గాలికి వదిలేశారని మండిపడ్డారు. ముఖ్యమంత్రిగా రాష్ట్రానికి మేలు చేయాల్సింది పోయి ఓ చీడపురుగుగా మారి ప్రజాద్రోహానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. ఆయనకు జననేత జగన్‌ను విమర్శించే హక్కు లేదన్నారు.

బాబు కాపు ద్రోహి: ప్రజలకు మాయమాటలు చెప్పడం, అరచేతిలో వైకుంఠం చూపించడం చంద్రబాబుకే చెల్లిందని భూమన వ్యాఖ్యానించారు. ఇప్పుడు కాకినాడ కార్పొరేషన్ ఎన్నికలు వచ్చేసరికి మళ్లీ అబద్ధపు వాగ్దానాలకు తెరతీశారని, స్మార్ట్‌సిటీ చేస్తానంటూ ప్రజలను బురిడీ కొట్టించడానికి ప్రయత్నిస్తున్నారని నిప్పులు చెరిగారు. కాపులకు రిజర్వేషన్లు కల్పిస్తామంటూ తిరుపతి వేంకటేశ్వరుడి సాక్షిగా ప్రమాణం చేసిన బాబు ఆ సంగతి మరచిపోయారని విమర్శించారు. రెండేళ్లుగా కాపుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని, మానసిక క్షోభకు గురిచేసి కాపు ద్రోహిగా మిగిలారని పేర్కొన్నారు. తుని రైలు దహనం ఘటనకు పాల్పడిన టీడీపీ నాయకుల అనుచరులెవ్వరో సీబీఐ విచారణ చేయిస్తే తెలుస్తుందన్నారు.

అత్యంత అవినీతి రాష్ట్రం: చంద్రబాబు మూడేళ్ల పాలనలో ఆంధ్రప్రదేశ్‌పై దేశంలోనే అత్యంత అవినీతి రాష్ట్రమన్న మచ్చ పడిందని భూమన కరుణాకరరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. రూ.మూడున్నర లక్షల కోట్ల ప్రజాధనాన్ని వెనకేసుకున్న చంద్రబాబు రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాలను అధఃపాతాళానికి తొక్కేశారని ఆరోపించారు. ఆ అవినీతి సొమ్ముతో ఓట్లను కొనేసి కాకినాడను అవినీతి వ్యాపారకేంద్రంగా మార్చేయాలనే దుష్టపన్నాగం పన్నుతున్నారని విమర్శించారు. తాను మచ్చలేని చంద్రుడిని అనిపించుకోవాలనే చిత్తశుద్ధి ఉంటే ఒక్కసారి టీడీపీ ఎమ్మెల్యేలపై సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

మేకవన్నె పులి మాయలో పడొద్దు: అ అంటే అధికారం, ఆ అంటే ఆదాయం అన్నట్టుగా దగుల్బాజీ రాజకీయాలు చేస్తున్న చంద్రబాబు ప్రజాసంక్షేమం కోసం తపించే వైఎస్ రాజశేఖరరెడ్డి కుటుంబం కాలిగోటికి కూడా సరిపోడని భూమన ఎద్దేవా చేశారు. రూ.కోట్ల అవినీతి సొమ్ముతో ప్రతిపక్ష ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడమే కాకుండా వారిలో నలుగురికి మంత్రి పదవులు కూడా కట్టబెట్టిన చంద్రబాబు నైతిక విలువలేమిటో లోకానికి తెలిసిపోయాయన్నారు. ఇలాంటి మేకవన్నె పులి మాయలో పడకుండా కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించాలని ప్రజలను కోరారు. విలేకరుల సమావేశంలో పార్టీ కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల కోర్ కమిటీ సభ్యుడు చెవిరెడ్డి భాస్కరరెడ్డి, తిరుపతి ఎంపీ వెలగపల్లి వరప్రసాద్, కాకినాడ పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకుడు చలమలశెట్టి సునీల్, కాకినాడ సిటీ కో–ఆర్డినేటర్ ముత్తా శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

డోక్లాం వివాదాన్ని చర్చలతోనే పరిష్కరించుకోవాలి

- భారత్, చైనాలకు నేపాల్ ప్రధాని షేర్ బహదూర్ ద్యూబా సూచన
- తిరుమల శ్రీవారిని దర్శించుకున్న నేపాల్ ప్రధాని, కుటుంబసభ్యులు



నేపాల్ ప్రధాని షేర్ బహదూర్ ద్యూబా దంపతులకు శ్రీవారి చిత్రపటం అందజేస్తున్న టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, జేఈవో శ్రీనివాసరాజు

సాక్షి, తిరుమల: భారత్, చైనాల మధ్య నెలకొన్న డోక్లాం సరిహద్దు వివాదాన్ని రెండు దేశాలు చర్చలతోనే పరిష్కరించుకోవాలని నేపాల్ ప్రధాని షేర్ బహదూర్ ద్యూబా సూచించారు. శనివారం తన సతీమణి అర్జూరాణా ద్యూబా, ఇతర కుటుంబ సభ్యులతో కలసి ఆయన తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. భారత్‌తో సాంస్కృతి, వారసత్వ ,స్నేహ, సుహృద్భావ సంబంధాలు ఉన్నాయని, వాటిని కొనసాగించే ప్రక్రియలో భాగంగానే తన తొలి విదేశీ పర్యటనకు భారత్‌కు వచ్చినట్లు చెప్పారు. భారత్, నేపాల్ సంప్రదాయాలు, ఆచారాల మూలాలు కూడా ఒకటేనని అన్నారు. తిరుమలేశుని దర్శించుకోవటం ఆనందంగా ఉందని వెల్లడించారు.

ప్రోటోకాల్ మర్యాదలతో శ్రీవారి దర్శనం

టీటీడీ ప్రోటోకాల్ మర్యాదలతో నేపాల్ ప్రధాని ద్యూబా తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. తొలుత కుటుంబసభ్యులతో కలసి ఆయన మహద్వారం నుంచి ఆలయానికి వచ్చి ధ్వజస్తంభానికి మొక్కుకున్నారు. అనంతరం పచ్చకర్పూరం హారతి వెలుగులో శ్రీవారి దివ్య మంగళరూపాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు శ్రీవారి పాదాల వద్ద ఉంచిన పట్టు శేషవస్త్రాన్ని ద్యూబాకు బహూకరించారు. అనంతరం ఆయన వకుళమాతను దర్శించుకుని, హుండీలో కానుకలు సమర్పించారు. ఈ సందర్భంగా నేపాల్ ప్రధాని దంపతులకు రంగనాయక మండపంలో వేద పండితులు ఆశీర్వచనం చేయగా, టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, జేఈవో కేఎస్ శ్రీనివాసరాజు శ్రీవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో మంత్రి కాల్వ శ్రీనివాసులు, చిత్తూరు జిల్లా కలెక్టర్ ప్రద్యుమ్న, డీఐజీ ప్రభాకరరావు, తిరుపతి అర్బన్ జిల్లా ఎస్పీ అభిషేక్ మహంతి పాల్గొన్నారు.

వినాయకచవితి నాడు విషాదం

- విద్యుత్ షాక్‌తో నెల్లూరు జిల్లాలో ఇద్దరు మృతి
- తమిళనాడులో నిమజ్జనం చేస్తూ నీట మునిగిన ఇద్దరు విద్యార్థులు

సూళ్లూరుపేట/సేలం (తమిళనాడు): శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా సూళ్లూరుపేట మండలంలోని ఆబాక పంచాయతీ పరిధిలోని కొమ్మినేనిపల్లిలో వినాయకచవితి పండగ ఏర్పాట్లలో శుక్రవారం అపశ్రుతి చోటు చేసుకుంది. విద్యుదాఘాతంతో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు.. కొమ్మినేనిపల్లిలో ఆలయం వద్ద వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేసే క్రమంలో గ్రామానికి చెందిన ఎల్లంపాటి హరీష్ (20), ఎలింబేటి సత్యనారాయణ (41) రంగు పేపర్లను అంటిస్తున్నారు. ఈ క్రమంలో కరెంట్ స్తంభం నుంచి కిందకు వేలాడుతున్న జీఏ వైరు తగిలి హరీష్ విద్యుత్ షాక్‌కు గురై పడిపోయాడు. దీన్ని గమనించిన సత్యనారాయణ పరుగున వెళ్లి హరీష్‌ను పట్టుకోవడంతో ఇద్దరూ విద్యుత్ షాక్ గురై మృతి చెందారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

నిమజ్జనంలో విషాదం

తమిళనాడులోని సేలం జిల్లాలో వినాయక నిమజ్జనం భాగంగా నదిలో మునిగి ఇద్దరు విద్యార్థులు మృతిచెందారు. సేలం సమీపంలోని కొండాలంపట్టిలో శుక్రవారం వినాయక చవితి ఘనంగా నిర్వహించారు. సాయంత్రం కావేరీ నదిలో నిమజ్జనం చేస్తుండగా సేలంలో ప్లస్‌టూ చదువుతున్న వసంతకుమార్ (17), కళాశాల విద్యార్థి షణ్ముగరాజ్ (19) నీటిలో మునిగి మృతి చెందారు.

ఎర్రకూలీలను తరలిస్తున్న బస్సు స్వాధీనం

డ్రైవర్, కండక్టర్ అరెస్ట్

చంద్రగిరి: తమిళనాడు నుంచి శేషాచలం అటవీ ప్రాంతంలోకి ఎర్రకూలీలను తరలిస్తోన్న తమిళనాడు ఆర్టీసీ బస్సుతో పాటు డ్రైవర్, కండక్టర్‌ను శుక్రవారం తెల్లవారుజామున పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చంద్రగిరి సీఐ శివప్రసాద్ అందించిన వివరాల మేరకు...తమిళనాడు ఆర్టీసీ బస్సు వేలూరు సమీపంలోని వడలూరు నుంచి సుమారు 30 మంది ఎర్రచందనం కూలీలను తీసుకుని గురువారం రాత్రి శేషాచలం అటవీ ప్రాంతానికి పయనమయ్యింది. ఈ నేపథ్యంలో శుక్రవారం తెల్లవారుజామున ఆర్టీసీ బస్సు చంద్రగిరి మండలంలోని కాశిపెంట్ల వద్దకు చేరుకుంది. అక్కడ నుంచి కూలీలను అటవీ ప్రాంతంలోకి డ్రైవర్, కండక్టర్‌లు పంపించారు. ఈ సందర్భంగా అటుగా వెళ్తున్న వాహన చోదకులు కూలీలు అటవీ ప్రాంతంలోకి వెళ్లడం చూసి స్థానిక పోలీసులకు సమాచారమందించారు. దీంతో పోలీసులు పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారి చంద్రగిరి నాగాలమ్మ కూడలి వద్ద వాహనాలను తనిఖీ చేశారు. తమిళనాడు ఆర్టీసీ బస్సులో ప్రయాణికులు లేకపోవడం, బస్సు ఖాళీగా రావడంతో పోలీసులకు అనుమానం వచ్చింది. అనంతరం బస్సును స్టేషన్‌కు తరలించి, డ్రైవర్ రవికుమార్, కండక్టర్ చంద్రశేఖర్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. వేలూరు సమీపంలోని వడలూరు నుంచి 30 మంది కూలీలను తీసుకురావడం నిజమేనని, అందుకుగాను ఒక్కొక్కరి వద్ద నుంచి రూ.500లను తీసుకున్నట్లు పోలీసుల విచారణలో డ్రైవర్, కండక్టర్‌లు వెల్లడించారు. వీరి నుంచి రూ.18,812 వేల నగదుతో పాటు రెండు సెల్‌ఫోన్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి నిందితులను తిరుపతి కోర్టుకు తరలించగా 15 రోజులు రిమాండ్ విధిస్తూ జడ్జి ఆదేశించారు.


తిరుమల ఘాట్‌లో మళ్లీ కూలిన కొండ చరియలు

సాక్షి, తిరుమల: తిరుమల ఘాట్ రోడ్డులో నాలుగు రోజులుగా కొండ చరియలు విరిగిపడుతుండటంతో భక్తులు ఆందోళన చెందుతున్నారు. తిరుపతి నుంచి తిరుమలకు వచ్చే రెండో ఘాట్‌రోడ్డులో శనివారం వేకువజామున పలుచోట్ల ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. ఇందులో తిరుమలకు సమీపంలోని చివరి ఐదు మలుపుల్లో భారీ కొండ రాళ్లు కూలాయి. ఈ సమయంలో వాహనాలు రావకపోవడంతో ప్రమాదాలు తప్పాయి. అప్రమత్తమైన టీటీడీ ఇంజనీర్లు ఘటనస్థలికి చేరుకుని జేసీబీలతో రాళ్లను తొలగించారు.



రాళ్లను తొలగిస్తున్న జేసీబీ

Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No. 310, Tadigotla Village, Chintakommadinne Mandal, YSR Kadapa District. 516 003 and Printed at Jagati Publications Limited, Survey No. 310, Tadigotla Village, Chintakommadinne Mandal, YSR Kadapa District. 516 003 EDITOR: V. Murali, Phone No. 08562-200076, 77 RNI Regn No. APTEL/2008/23796.



మనోవీధులు ఊడ్చించాడు!
గురువును చేశాడు!!
- పక్క పేజీలో



కల్యాణ్‌రామ్‌తో
కొత్త లుక్‌లో...
- సినిమా పేజీలో



ఫొటో: శివ మల్లాల

పదిహేనేళ్లు ఇండస్ట్రీ.
విత్‌ఔట్ సింగిల్ బ్రేక్!
మినిమమ్ పదిహేను మంది హీరోలతో చేసింది.
విత్‌ఔట్ బ్రేక్!
రోజుకో గాసిప్ పుట్టే ఇండస్ట్రీలో..
పదిహేను వసంతాలు.
అన్ని క్యారెక్టర్లూ చేసింది.
ఇంత క్యారెక్టర్ కూడా పోగొట్టుకోలేదు.
ఇవిగోండి..
శ్రియానుభవాలు.

శ్రియానుభవాలు

సాక్షి ఎక్స్‌క్లూజివ్



- **హాయ్ శ్రియాగారూ.. పదేళ్ల క్రితం చూసినప్పుడు ఎలా ఉన్నారో ఇప్పుడూ అలానే ఉన్నారు.. సీక్రెట్?**

మా అమ్మ నాన్నల జీన్స్ వల్లే ఇలా ఉన్నా. వాళ్లిద్దరూ స్లిమ్‌గా ఉంటారు. ఎంత తిన్నా బరువు పెరగను. అయినప్పటికీ కొన్ని జాగ్రత్తలు తీసుకుంటాను. యోగా చేస్తాను. నేను కథక్ డ్యాన్సర్‌ని. వీలున్నప్పుడల్లా ఇంట్లో కథక్ ప్రాక్టీస్ చేస్తాను. జిమ్ కంపల్సరీ. డైటింగ్ చేయను కానీ, ఏం తింటున్నాం అనే విషయంలో మాత్రం కేర్ తీసుకుంటాను. రైట్ ఫుడ్ తింటాను. రైట్ ఫుడ్ తీసుకోవడం ఎంత ఇంపార్టెంటో రైట్ టైమ్‌కి ఫుడ్ తీసుకోవడం కూడా అంతే ఇంపార్టెంట్.

- **ఓకే... త్వరలో రిలీజ్ కాబోతున్న 'పైసా వసూల్'లో మీ క్యారెక్టర్ గురించి చెబుతారా?**

ఇందులో నేను ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్ట్‌ని. స్వీట్ అండ్ సింపుల్ క్యారెక్టర్. ఒక మహిళా జర్నలిస్ట్ అంకితభావంతో పనిచేయాల్సి రావడం, అనుకున్నది సాధించాలన్న పట్టుదల వంటి అంశాలు నచ్చాయి. అందుకే ఈ పాత్రను ఎంజాయ్ చేశాను.



- **'గౌతమిపుత్ర శాతకర్ణి'లో చేసిన పాత్రకు భిన్నమైనది 'పైసా వసూల్' పాత్ర. ఈ ట్రాన్స్‌ఫార్మేషన్ గురించి?**

'గౌతమిపుత్ర...'లో యువరాణిని. 'పైసా వసూల్'లో నేటి తరం అమ్మాయిని. జర్నలిస్ట్‌ని. వెంట వెంటనే ఇలా ఒకదానికి ఒకటి పోలిక లేని క్యారెక్టర్స్ చేయడం థ్రిల్ అనిపించింది. ఏ ఆర్టిస్ట్‌కైనా ఇలా చేయడం ఓ చాలెంజ్. ఇలాంటి సవాళ్లు ఎన్ని వస్తే అంత హ్యాపీగా ఉంటా. పూరి జగన్నాథ్‌గారితో నాకిది ఫస్ట్ మూవీ. ఆయన టేకింగ్‌ని ఎంజాయ్ చేశాను.

- **పదిహేనేళ్లుగా సినిమాలు చేస్తున్నారు.. ఇప్పుడు తెలుగు, తమిళంలో సినిమాలు చేస్తూ ఫుల్ బిజీ. ఏమనిపిస్తోంది?**

వెనక్కి తిరిగి చూసుకుంటే ఆనందపడే విషయాలు చాలా ఉన్నాయి. యాక్టింగ్‌ని ప్రేమిస్తాను. అయితే కెమేరా ముందు మాత్రమే. చేసే పని మీద ప్రేమ ఉన్నప్పుడు ఎన్నేళ్లుగా పని చేస్తున్నాం అనే లెక్కలు వేసుకోం.

- **మీ కెరీర్‌ని ఎనలైజ్ చేస్తే, ఇండిపెండెంట్‌గా ఎదిగినట్లు అనిపిస్తుంది.. మీ అమ్మానాన్న ఎప్పుడూ మీ పక్కనే ఉంటూ గైడ్ చేయలేదు?**

మా అమ్మగారు కొన్నిసార్లు నా షూటింగ్ డేట్స్ చూశారు. అయితే మీరన్నట్లు అదే పనిగా పెట్టుకుని నన్ను గైడ్ చేయలేదు. నన్ను నమ్మారు. కంటిన్యూస్‌గా సినిమాలు చేస్తూ డేట్స్ మేనేజ్ చేయడం కష్టం. నాకు మేనేజర్ ఉన్నారు. ఇంకా హెల్ప్ చేయడానికి నా చుట్టూ మనుషులు ఉన్నారు.

ఏదేమైనా పర్సనల్, ప్రొఫెషనల్ లైఫ్‌ని బ్యాలెన్స్ చేసుకునే శక్తి ఉంది. అందరి మీదా ఆధారపడి పైకి రావడం కన్నా 'సెల్ఫ్ మేడ్' అనిపించుకోవడంలో ఓ తృప్తి ఉంటుంది.

- **ఈ జర్నీలో చేదు అనుభవాలు?**

హరిద్వార్‌లో సింపుల్ ఫ్యామిలీలో పుట్టాను. ఢిల్లీ, లేడీ శ్రీరామ్ కాలేజీలో బీఏ చేశాను. సినిమాలనేది నేను ఊహించలేదు. సడన్‌గా ఈ ప్రపంచంలోకి వచ్చాను. ముందు కొంచెం తికమకగానే అనిపించింది. లక్కీగా నాకెలాంటి దురదృష్టకర సంఘటనలు ఎదురవ్వలేదు. ఇప్పటివరకూ నేను పని చేసిన హీరోలు, డైరెక్టర్లు... అందరూ నాకు బాగానే సపోర్ట్ చేశారు. దాంతో ఇబ్బంది అనిపించలేదు. ఒకవేళ ఒక చిన్న చేదు అనుభవం ఎదురైనా అందులోంచి బయటకు రావడానికి కొంచెం టైమ్ పట్టేది. ఈ లాంగ్ జర్నీలో అలాంటి 'టైమ్' రాకపోవడం నా లక్. అఫ్‌కోర్స్ కొన్ని చిన్ని చిన్ని చేదు అనుభవాలు ఉన్నాయనుకోండి. ఏది ఏమైనా ఆ దేవుడు చల్లగా చూస్తున్నాడనుకుంటున్నా.

- **చేదు అనుభవాలు అన్నారు... ఉదాహరణకు?**

కెరీర్‌లో 'ఫ్లాప్'కి మించిన చేదు అనుభవం మరొకటి ఉండదు. ఫ్లాప్ మూవీస్ నా లిస్టులో చాలానే ఉన్నాయి. మొదట్లో తేరుకోవడానికి టైమ్ పట్టేది. రాను రాను హిట్టూ ఫ్లాప్స్‌కి అతీతంగా రియాక్ట్ అవ్వడం మొదలైంది.

- **చెప్పిన టైమ్‌కి శ్రియ షూటింగ్‌కి రాలేదు... ఫలానా హీరోతో ఎఫైర్ అనే వార్తలు రాలేదు. గాసిప్స్ రాకుండా ఎలా మేనేజ్ చేస్తున్నారు?**

ఏమీ చేయనప్పుడు ఎందుకు మేనేజ్ చేయాలి? టైమింగ్స్ వైజ్‌గా పర్‌ఫెక్ట్‌గా ఉంటాను. షూటింగ్ స్పాట్‌లో ఇబ్బంది పెట్టను. ఎవరితోనూ ఎఫైర్లు లేవు. అందుకే నా గురించి వార్తలు రావు.

- **అలాగే సినిమాల్లో చేసే క్యారెక్టర్‌ని బట్టి ఆ ఆర్టిస్ట్ క్యారెక్టర్ 'ఇలా ఉంటుంది' అని కొందరు ఎనలైజ్ చేస్తుంటారు.. దాని గురించి?**

అది నిజమే. సినిమాల్లో వెస్ట్రన్ డ్రెస్సుల్లో కనిపిస్తే... విడిగా అలాంటివే వేసుకుంటామని అనుకుంటారు. ప్రతిరోజూ పార్టీకి వెళతామని ఫిక్స్ అయిపోతారు. ఒకవేళ చీరల్లో కనిపిస్తే సాధ్వి అంటారు. సినిమాల్లో ఆ క్యారెక్టర్‌కి తగ్గట్టు ప్రవర్తిస్తాం. రియల్‌గా మేం వేరేలా ఉంటాం. ఆన్ స్క్రీన్ మమ్మల్ని చూసి, ఆఫ్ ది స్క్రీన్ కూడా అలానే ఉంటామని ఊహించుకునేవాళ్ల ఆలోచనా విధానం మారాలి.

- **ఈ ప్రపంచంలోనే మీరెక్కువగా ఇష్టపడే వ్యక్తి?**

మా అమ్మగారు. నన్ను పెంచి, పెద్ద చేసి, నేనింతవరకూ రావడానికి కారణం తను. కూతురి జీవితం బాగుండాలని తపన పడింది. అమ్మ గురించి మాట్లాడ్డానికి రోజులు చాలవు. నేను చదువుకునేటప్పుడు తనూ స్టూడెంట్ అయింది. నా మానాన నన్ను వదిలేయకుండా పక్కనే కూర్చుని చదివించేది. నాతో పాటు డ్యాన్స్ స్కూల్‌కి వచ్చేది. హీరోయిన్ అయినప్పుడు తోడుగా షూటింగ్ స్పాట్‌కి వచ్చింది. 'స్పా' అనే స్వచ్ఛంద సేవా సంస్థ మొదలుపెడతానన్నప్పుడు సపోర్ట్ చేసింది. నేనివాళ ఇలా ఉన్నానంటే తనే కారణం.

- **ఇప్పటివరకూ మీ 'మిస్టర్ రైట్' మీకు తారసపడలేదా?**

(నవ్వుతూ). తక్కువ టైమ్‌లోనే తను నా లైఫ్‌లోకి వస్తాడన్న నమ్మకం ఉంది.

- **ఎలాంటి లక్షణాలున్న అబ్బాయి భర్తగా రావాలని కోరుకుంటున్నారు?**

అతను నాకు మంచి ఫ్రెండ్‌లా ఉండాలి. అతనితో నా మిగతా జీవితాన్ని సాఫీగా గడపగలగాలి. మానసికంగా, ఆధ్యాత్మికంగానూ అతనితో నా ప్రయాణం బాగుండాలి.

- **ఫైనల్లీ... పెళ్లి మీద మీ అభిప్రాయం ఏంటి?**

మహిళల జీవితంలో పెళ్లి, పిల్లలు అనేది చాలా ముఖ్యమైన విషయం. జరగాల్సినప్పుడు తప్పకుండా జరుగుతుంది. ప్రస్తుతానికి చేసే పనిని నేను లవ్ చేస్తున్నాను.


- డి.జి. భవాని

నాగార్జునగారు ఫస్ట్ సూపర్ స్టార్



- **మీ సెకండ్ సినిమా ('సంతోషం')కే నాగార్జునగారి సరసన నటించారు. ఆ తర్వాత ఆయనతో 'నేనున్నాను', 'మనం' సినిమాల్లో జతకట్టారు.. 'ఊపిరి'లోనూ నాగ్‌తో కాసేపు కనిపించారు..ఈ 29న ఆయన బర్త్‌డే. నాగ్ గురించి కొన్ని విశేషాలు?**

నా ఫస్ట్ సూపర్‌స్టార్ నాగార్జునగారే. ఆయన సినిమాలు చూస్తూ పెరిగినదాన్ని. సౌత్ మూవీస్ హిందీలో రిలీజయ్యేవి. అలా 'శివ' సినిమా చూశాను. నాకు బాగా నచ్చింది. ఆ సినిమా చూసినప్పుడు చాలా చిన్నపిల్లని. భవిష్యత్తు గురించి ఎలాంటి ఊహలు లేవు. కట్ చేస్తే... ఆయన పక్కన హీరోయిన్‌గా నటించగలిగాను. అది కూడా నా సెకండ్ సినిమాకే. 'సంతోషం' నా కెరీర్‌కి సంతోషాన్నిచ్చిన మూవీ. ఆ సినిమా తర్వాత నేను ఫుల్ బిజీ.



- **నాగ్ వైఫ్ అమలగారితో మీ ఈక్వేషన్?**

అమలగారు లవ్లీ. నాతో సన్నిహితంగా ఉంటారు. ఆమె సలహా మేరకే నేను విపశ్యన యోగ చేశాను. నా లైఫ్‌లో నేను అందుకున్న మంచి సలహాలలో అమలగారి నుంచి ఈ సలహా ఒకటి. విపశ్యన ధ్యానం చేశాక నేను మారాను. అంతకు ముందు కన్నా ప్రశాంతంగా ఉంటోంది. ఎమోషన్స్‌ని కంట్రోల్ చేసుకోగలుగుతున్నాను.



- **నాగార్జునగారి పక్కన నటించినప్పుడు సినిమాల వైజ్‌గా మీరు కిడ్. ఎలా అనిపించింది?**

భయం అనిపించలేదు. ఎందుకంటే, నాగార్జునగారు తానో స్టార్ అనే ఫీలింగ్‌తో మాట్లాడేవారు కాదు. చాలా ఫ్రెండ్లీగా ఉండేవారు. యూనిట్ మొత్తం అలానే ఉండేది. దాంతో సంతోషంగా పని చేశా. నా కెరీర్‌లో గుర్తుంచుకోదగ్గ సినిమాల్లో నాగ్ సార్‌తో చేసిన సినిమాలు ఉన్నాయి. ఆయనకు 'సాక్షి' ద్వారా మనస్ఫూర్తిగా బర్త్‌డే విషెస్ చెబుతున్నా.

- **సెప్టెంబర్ 11న మీ బర్త్‌డే.. ఎలా సెలబ్రేట్ చేసుకోవాలనుకుంటున్నారు?**

(నవ్వుతూ). ఇంకా చాలా టైమ్ ఉంది. ఏమీ అనుకోలేదు. అయితే ఒకటి మాత్రం నమ్ముతాను. ప్రతి ఒక్కరి జీవితంలో పుట్టినరోజు అనేది చాలా ముఖ్యమైనది. నా గత పుట్టినరోజున మా ఇంట్లో వినాయకుడు ఉన్నాడు. పోయిన ఏడాది సెప్టెంబర్ 5న వినాయక చవితి వచ్చిన విషయం గుర్తుండే ఉంటుంది. నా బర్త్‌డే నాడు మా ఇంట్లో వినాయకుడు ఉన్నాడు. అందుకని ఆ రోజున గణపతికి పూజ చేశాను.

- **ఇప్పటివరకూ జరుపుకున్న వాటిలో బెస్ట్ బర్త్‌డే?**

నా చిన్ననాటి పుట్టినరోజులు బెస్ట్. ఎందుకంటే అమ్మ చాలా హడావిడి చేసేది. కేక్ కట్ చేయించేది. నాకు శాండ్‌విచెస్ ఇష్టం. బర్త్‌డే నాడు తప్పనిసరిగా అవి చేసేది. నా స్నేహితులు మా ఇంటికి వచ్చేవారు. సింపుల్‌గా చేసినా బాగా అనిపించింది. ఇప్పుడూ అమ్మ హడావిడి చేస్తుంది కానీ, చిన్నప్పుడు ఉన్నంత ఎగ్జయిట్‌మెంట్ ఉండదు కదా.

- **సమాజంలో మద్యం, డ్రగ్స్, సిగరెట్స్ అంటూ.. చెడు వీరవిహారం చేస్తోంది... పిల్లలకు మీరిచ్చే సలహా?**

జీవితానికి హాని చేసేవాటి పట్ల ఎట్రాక్ట్ కావడం మంచిది కాదు. చదువు మీద ఏకాగ్రత చూపించాలి. కెరీర్‌ని పర్‌ఫెక్ట్‌గా ప్లాన్ చేసుకోవాలి. ఆ కెరీర్ పట్ల బాధ్యతగా ఉండాలి. కుటుంబంలో ఒక్కరు చెడు అలవాట్లకు బానిస అయినా అందరూ బాధపడాల్సి వస్తుంది. చెడు అలవాట్లు ఉంటే... వాటిని దూరం చేసుకోవడానికి ప్రయత్నించాలి. అయినా దూరం కాలేకపోతున్నారంటే... డాక్టర్‌ని సంప్రదించాలి. ఆ విషయంలో సిగ్గుపడాల్సిన అవసరం లేదు. ఎందుకంటే అన్నింటికన్నా జీవితం ముఖ్యమైనది.



- **వినాయక చవితిని ఎలా సెలబ్రేట్ చేసుకున్నారు? ఈ పండగకి సంబంధించిన చిన్నప్పటి గుర్తులేమైనా ఉన్నాయా?**

ఒకే ఒక్క ఇన్సిడెంట్ అంటే చెప్పలేను. వినాయక చవితి అంటే మా ఇంట్లో సందడిగా ఉంటుంది. హరిద్వార్, ఢిల్లీ, ఆ తర్వాత ముంబైలో... ఇలా ఎక్కడ ఉన్నా పండగ చేసుకోవడం అలవాటు. స్వాతంత్ర్యం రాక ముందు ప్రజలు స్వాతంత్ర్య సాధన కోసం బోల్డన్ని చర్చా వేదికలు పెట్టుకునేవాళ్లు. అందరూ కలసి మంచీ చెడూ మాట్లాడుకునేవాళ్లు. స్వాతంత్ర్యం సాధించాక అలాంటి మీటింగ్స్ తగ్గాయి. క్రమంగా ఎవరి దారిన వాళ్లు బతకడం మొదలైంది. కానీ, ఇలాంటి పండగలు అందర్నీ కలుపుతాయి. గణేశుణ్ణి ప్రతిష్ఠించి, భారీ పందిళ్లు వేసి, ఏడు, తొమ్మిది రోజులు వైభవంగా పూజలు జరిపి, నిమజ్జనం చేసేవరకూ.. అందరూ కలుస్తారు. ప్రసాదాలు పంచుతారు. మనుషులను దగ్గర చేసే ఈ పండగ అంటే ఇష్టం.

- **మట్టి గణేశుడినే పూజించారా?**

పర్యావరణానికి హాని కలిగించకూడదు. అందుకే మట్టి గణపతిని పూజించా. మా ఇంట్లో ఉన్న వాటర్ ఫౌంటెన్‌లో నిమజ్జనం చేయడం అలవాటు.

ఆత్మీయం

అవకాశాన్ని వెతుక్కోవాలి!



మనలో చాలామందికి ఎన్నో విషయాలలో ప్రతిభ ఉంటుంది. తమ నైపుణ్యాన్ని ప్రదర్శించుకోవడానికి తగిన అవకాశాల కోసం ఎదురు చూస్తుంటారు. అవకాశం తమ తలుపు తట్టగానే చక్కగా అందిపుచ్చుకుంటారు. వెంటనే పని ప్రారంభిచేస్తారు. అయితే, తెలివైన వాళ్లు అవకాశాల కోసం ఎదురు చూడరు. వెతుక్కుంటారు. ఉదాహరణకు వర్షం అంతటా ఒకేలా పడుతుంది. ముత్యపు చిప్పలో పడ్డ నీటిబొట్టు ఆణిముత్యమవుతుంది. సముద్రంలో పడ్డ వానచినుకు వల్ల సముద్రానికీ ప్రయోజనం ఉండదు. వానచుక్కకీ ఉపయోగం ఉండదు. ముత్యపు చిప్పలాంటి వారు అలా అవకాశాలను అందుకుంటారు. ఆణిముత్యాల్లా తయారవుతారు. అంటే అవకాశాలను అందిపుచ్చుకోవడం ఒక కళ. అ కళ అందరికీ ఉండకపోవచ్చు కానీ, అలవరచుకోవాలి నెమ్మదిగానైనా. లేదంటే సముద్రంలో పడ్డ వానచినుకుల్లా నిరుపయోగంగా తయారవుతారు. మనిషి పుట్టిందే విజయం సాధించడానికే. ఓడిపోవడానికి కాదు. అలాగని ఓడిపోయిన వారందరూ పనికి రాని వారు కాదు. ఎలా విజయం సాధించాలో ప్రణాళిక వేసుకోవాలి. విజయం సాధించేవరకు ఆ ప్రణాళికకు తగ్గట్టుగా పని చేయాలి. మనమేమిటో మనం తెలుసుకోవాలి. మనకు మనమే అభివృద్ధి చెందాలి. ఎవరో వచ్చి మనల్ని అభివృద్ధి చేయరు. ఊతం ఇస్తారంతే! ఆ ఊతాన్ని పట్టుకుని పాకిన వారే పైపైకి పోతారు. మన పెరట్లో అనుకోకుండా పడి మొలిచిన కాకర, బీర, చిక్కుడు, సొర, పొట్ల, దోస వంటి తీగజాతి మొక్కలు కూడా ఆసరా కోసం ఎదురు చూడవు. చిన్న చిన్న గోడపగుళ్లనో, దగ్గరలో ఉన్న వృక్షాలనో, కర్రదుంగలనో పట్టుకుని పైపైకి పాకుతాయి. పందిరి వేస్తే అల్లుకుంటాయి.

బ్యూటిప్స్

పట్టులాంటి జుట్టు కోసం



- ఒక పాత్రలో టీ స్పూన్ తేనె, టీ స్పూన్ ఆలివ్ ఆయిల్, ఒక టీ స్పూన్ నిమ్మ రసం, కోడి గుడ్డు సొన ఒకదాని తరువాత ఒకటి వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని కుదుళ్ల దగ్గర నుండి చివరి వరకూ పట్టించి ఇరవై నిమిషాలుంచి కడిగేయాలి.
- తలంటుకునే ముందు షాంపూలో కొద్దిగా వెనిగర్ వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని కురులకంతటికీ పట్టించి పది నిమిషాల తరువాత తల స్నానం చేయాలి.
- వారంలో ఒక్కసారయినా టీ డికాషన్ తో జుట్టుని కడిగేస్తే మంచి ఫలితం ఉంటుంది.
- పెరుగు కుదుళ్ల నుండి జుట్టుకంతటికీ పట్టించి పది నిమిషాలయ్యాక తల స్నానం చేస్తే పట్టులా మెరుస్తుంది.

గుడ్ ఫుడ్

శక్తివనరులు... సజ్జలు




చూడటానికి సజ్జలు చిన్నగా అనిపిస్తాయేమోగానీ వాటి వల్ల సమకూరే శక్తి మాత్రం చాలా ఎక్కువ. పీచుపదార్థాలు ఇంకా ఎక్కువ. సజ్జలు ఆరోగ్యానికి ఎంత మేలు చేస్తాయో తెలుసుకుంటే వాటితో చేసే వంటకాలను పదే పదే తింటారు. సజ్జలతో ఒనగూరే ప్రయోజనాల్లో కొన్ని...

- సజ్జల్లో ఐరన్ పాళ్లు చాలా ఎక్కువ. వంద గ్రాముల సజ్జల్లో మూడు మిల్లీగ్రాముల ఐరన్ ఉంటుంది. అందుకే రక్తహీనత (అనీమియా) ఉన్నవారు సజ్జలతో తయారు చేసిన పదార్థాలు తినడం మేలు.
- సజ్జల్లో ఫాస్ఫరస్ పుష్కలంగా ఉంటుంది. ఇది శక్తి వనరు. కణజాలం అభివృద్ధి కోసం కూడా ఫాస్ఫరస్ ఎంతగానో తోడ్పడుతుంది. ఇక వరి, గోధుమల కంటే సజ్జల్లో ప్రోటీన్లు ఎక్కువ. అందుకే కణజాలం రిపేర్లకు కూడా ఇవి ఉపయోగపడతాయి.
- సజ్జల్లో పీచు పాళ్లు ఎక్కువ. అందుకే జీర్ణవ్యవస్థ ఆరోగ్యానికి ఇవి తోడ్పడతాయి. అంతేగాక ఈ పీచు వల్ల ఒంట్లోకి వచ్చే చక్కెర పాళ్లు చాలా నెమ్మదిగా విడుదలవుతుంటాయి. అందుకే డయాబెటిస్ ఉన్నవారు సజ్జలతో చేసిన పదార్థాలు తినడం మంచిది. సజ్జల్లో ఉన్న పీచు పదార్థాలు మలబద్ధకాన్ని కూడా నివారిస్తాయి.
- సజ్జల్లో యాంటీఆక్సిడెంట్స్ ఎక్కువ. అందుకే అవి ఎన్నో రకాల క్యాన్సర్లను నివారిస్తాయి. వయసు పెరిగే కొద్ది వచ్చే వ్యాధులను నిరోధిస్తాయి.

సాక్షి ఫ్యామిలీ సన్నిధి
వైఎస్ఆర్ జిల్లా
ఆదివారం
27-8-2017

ఆచార్య దేవోభవ

మాయను ఛేదించేవాడే గురువు



ఇంటిమీద ఒక పెద్ద నీళ్ళతొట్టి. దానినిండా నీళ్ళుంటాయి. మొహం కడుక్కోవడానికి కాసిని నీళ్ళు కావాలి. కింద మన ఇంట్లో ఉన్న పంపు తిప్పుతాం. సన్నగా కావాలంటే సన్నగా; ఎంత లావుగా కావాలంటే అంత లావుగా వస్తాయి. మనకెన్ని అవసరమో అన్నే తీసుకుంటాం. భగవంతుని అనుగ్రహం గురువు ద్వారా వచ్చేటప్పుడు ఇలాగే ఏ క్రమం చేత అందుతుందో దానికి దీక్ష అని లేదా ఉపదేశం అని పేరు. గురుశిష్య సంబంధంలో ఇది అనేక క్రమాల్లో ప్రకాశిస్తుంది. మంత్రోపదేశం ఒక ప్రధానమైన దీక్షాక్రమం. ఉపదేశం అన్నివేళలా ఒకేలా ఉండాలని లేదు. వాటిలో ఒకటి కుక్కుట దీక్ష. అంటే స్పర్శ దీక్ష.

ఇందులో ఒక అద్భుతమైన క్రమం ఏమిటంటే –గురువు తన పాదాలను శిష్యుడి తలమీద ఉంచుతాడు. ఒకానొకప్పుడు దక్షిణామూర్తి స్తోత్ర భాష్యం చేసిన మహా పండితుడు ఒకరు చంద్రశేఖరేంద్ర మహాస్వామి వారి దగ్గరకు వెళ్ళి దానిని చూపించగా ఆయన మురిసిపోయి 'నీకేం కావాలి?' అని అడిగారు. 'శ్రీవారి పాదం నాతల మీద పెట్టాలి' అన్నారాయన. 'అబ్బో! పెద్ద కోరికే కోరావు. రేపు శుక్రవారం. తలస్నానం చేసి కామాక్షి దర్శనం చేసుకుని, గాయత్రీ జపం చేసుకుని రా' అన్నారు స్వామి. అలా వచ్చిన పండితుని తలమీద మహాస్వామి పాదం పెట్టారు. గురువంటే జీవితంలో ఒక్కసారే అనుగ్రహిస్తాడు. అంతటి విద్వాంసుడు కనుక ఆయన కోరిక తీర్చాడు. అంతేకానీ కనబడ్డ ప్రతివానికీ 5వేలు, 10వేల రూపాయలు పుచ్చుకుని పాదాలు పెట్టే గురువు కారాయన.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

గురువంటే బరువు. కిలోల లెక్కన కాదు. ఆయన బరువు–అంటే, నేను లఘువు అని అర్థం. లఘువంటే తేలిక. వయసులో చిన్న వాడయినా సరే, ఆయనకెన్నో తెలుసు. ఆయన ధర్మం, ఆచరణ తెలిసున్నవాడు, అనుష్ఠానబలం ఉన్నవాడు, ధర్మం చెప్పగలిగిన వాడు. అందుకని ఆయనంటే నాకు గురి. నాకన్నా బరువు, కాబట్టి ఆయన నాకు గురువు. నేను ఆయనకంటే చిన్నవాణ్ణి, అనుసరించాల్సిన వాణ్ణి, కాబట్టి నేను లఘువు.

స్పర్శక్రమంలో అనుగ్రహించే దానిని కుక్కుట దీక్ష అంటారు. కుక్కుటం అంటే కోడి. గుడ్డు మీద కోడి కూర్చుంటుంది. ఎంత పొందికగా కూర్చుంటుందంటే–కోడి చాలా బరువుగా ఉంటుంది. గుడ్డులో ఉన్న పిండం చాలా తేలిగ్గా ఉంటుంది. గుడ్డు పెంకేమో గట్టిగా కూర్చుంటే పగిలిపోతుంది. కానీ కోడిపెట్ట కాళ్ళు నెమ్మదిగా కదుపుతూ వచ్చి మెల్లగా దాని మెత్తటి పొట్టభాగం గుడ్డుకు తాకేటట్లు రెక్కలు రెండుపక్కలా అడ్డుబెట్టి కదలకుండా అలాగే గుడ్డుమీద కూర్చుంటుంది. దానిపొట్ట వెచ్చదనం గుడ్డుపెంకుకు తగిలి లోపల ఉన్న పిండం ప్రాణం పోసుకుంటుంది. అలా కూర్చోగా కూర్చోగా పిండం పిల్లయి పెంకు పగులగొట్టుకుని పైకొస్తుంది.

అజ్ఞానంలో ఉన్న శిష్యుణ్ణి తన స్పర్శచేత అనుగ్రహించి మంత్రోపదేశం చేస్తాడు గురువు. పిదప మాయ అన్న పెంకు పగులగొట్టుకుని పూర్ణత్వాన్ని పొందిన శిష్యుడు భక్తి, జ్ఞానం అన్న రెక్కలతో ఎగిరిపోయేటట్టు అంతటా నిండి పరబ్రహ్మమయిన ఆత్మ ఆకాశంలో ప్రయాణం చేయదగిన స్థితిని స్పర్శ చేత కలిగించే దక్షత ఉన్నవాడు గురువు. అదీ స్పర్శదీక్ష. అదే కుక్కుట దీక్ష. దానికి ప్రతీక – గురుమండల రూపి అయిన కామాక్షీ పరదేవత. అందుకే శంకర భగవత్పాదులు సౌందర్యలహరి చేస్తూ 'అమ్మా! నీ పాదాలు నా తలమీద ఉంచమ్మా!' అంటారు.

ఇస్లాం వెలుగు

త్యాగాలపండుగ బక్రీద్

అల్లాహ్ విశ్వాసులకు రెండు పర్వదినాలు ప్రసాదించాడు. ఒకటి ఈదుల్ ఫిత్ర్, మరొకటి ఈదుల్ అజ్ హా. వీటినే రమజాన్, బక్రీద్ లని వ్యవహరిస్తారు. రమజాన్ తర్వాత వచ్చేదే బక్రీద్. ఇది జిల్ హజ్జ్ మాసంలో వస్తుంది. ఈ నెలలోని మొదటి పదిరోజులు విశ్వవ్యాప్త విశ్వాసులు ఆయన ఘనతను, గొప్పతనాన్ని కీర్తించడానికి, సముచితరీతిలో ఆయనకు కృతజ్ఞతలు తెలుపుకోవడానికి బక్రీద్ రోజున ఈద్గాహ్‌కు చేరుకుని వేనోళ్ళా స్తుతిస్తారు.

దీన్ని సద్వినియోగం చేసుకోవాలి. పుణ్యకార్యాలు ఆచరించి అత్యంత శ్రేష్ఠ సామగ్రి అయిన 'తఖ్వా'(దైవభీతి)ను హృదయాల్లో ప్రతిష్ఠించుకోవాలి. జీవితం సార్థకం కావాలంటే పరమ ప్రభువు ఆదేశాలను తు.చ. తప్పక పాటించాలి. అందుకే పరమ దయాళువైన అల్లాహ్ మనకోసం కొన్ని వసంత రుతువుల్ని ప్రసాదించాడు.అందులో ఒకటి రమజాన్ కాగా, రెండవది బక్రీద్.

బక్రీద్ పండుగ జరుపుకునే నెల పేరు 'జిల్ హజ్జ్'. ఈ నెలలోని మొదటి పది రోజులకు ఒక ప్రత్యేకత, విశిష్ఠత ఉంది. ఈ రోజుల్లో చేసే పుణ్య కార్యాలు అల్లాహ్‌కు అన్నిటికన్నా ఎక్కువ ప్రీతికరమైనవి. అందుకని ఈ మొదటి పది రోజులు కరుణామయుని దయను పొందే నిమిత్తం కష్టపడాలి. వీలయినన్ని ఆరాధనలు చేసి, నఫిల్ ఉపవాసాలు పాటించి, దానధర్మాలు చేసి, పవిత్రఖురాన్ పారాయణం చేసి అల్లాహ్ ప్రీతిని, ప్రసన్నతను పొందే ప్రయత్నం చేయాలి. జిల్ హజ్ పదవ తేదీన జరుపుకొనే బక్రీద్ ఒక అపూర్వమైన పండుగ. హజ్రత్ ఇబ్రాహీమ్, హ.ఇస్మాయిల్ అలైహిముస్సలాంల త్యాగాలను స్మరించుకునే త్యాగోత్సవం. ప్రపంచ విశ్వాసుల పర్వదినం. ఇదొక మహత్తర సందేశం కలిగిన శుభదినం. మనందరి ప్రభువు ఒక్కడే, మనందరి ప్రవక్త ఒక్కరే, మనందరి గ్రంథం ఒక్కటే. మనందరి ధర్మం ఒక్కటే. మనమంతా ఒక్కటే. సమస్త మానవ జాతీ ఒక్కటే... అనిఎలుగెత్తి చాటే రోజు. మానవ సహజ దౌర్బల్యాల వల్ల చిన్నా చితకా పాక్షిక విభేదాలు ఉన్నప్పటికీ మనందరి విశ్వాసం



కూడా ఒక్కటే అనడానికి ప్రబల తార్కాణం ఈ పండుగ. మౌలిక విశ్వాసం పరంగా ఒక్కటిగానే ఉన్న మనం పాక్షిక పొరపొచ్చాలను విస్మరించి తోటి సోదరుల్ని గుండెలకు హత్తుకోవాల్సిన రోజు. ఈ పర్వదినం మనకిచ్చే మరో సందేశం ఏమిటంటే, సమాజాన్ని కలుపుకుని పోకుండా, సాటి ప్రజల పట్ల ప్రేమ, త్యాగం, సహనం, పరోపకారం లాంటి సుగుణాలను అలవరచుకోకుండా ఏ సంతోషమయినా, ఎంతటి ఆనందమైనా పరిపూర్ణం కాజాలదని. ఏ సంతోష కార్యమైనా సమాజంతో పంచుకోవాలని, కేవలం మన గురించి మాత్రమే కాకుండా సంఘం గురించి, సమాజం గురించి ఆలోచించాలని చెబుతుంది పండుగ.

ప్రతి ఒక్కరూ తమస్థాయి, స్తోమతకు తగినట్లు ఈద్ జరుపుకుంటారు. ఆర్థిక స్థోమత ఉన్నవారు జిల్ హజ్జ్ నెలలో 'హజ్ 'యాత్రకు వెళతారు. అంతటి స్థోమతలేనివారు ఇళ్ళ వద్దనే ఖుర్బానీలు ఇస్తారు. అదికూడా లేనివారు రెండు రకతుల నమాజ్ ఆచరించినా దయామయుడైన అల్లాహ్ హజ్, ఖుర్బానీలు ఆచరించిన వారితో సమానంగా పుణ్యఫలం ప్రసాదిస్తాడు. ఆయన తనదాసుల చిత్తశుద్ధిని, సంకల్పాన్ని మాత్రమే చూస్తాడు. ఆయనకు ధనరాశులు, రక్తమాంసాల అవసరం ఎంతమాత్రంలేదు. కనుక సర్వకాలసర్వావస్థల్లో చిత్తశుద్ధితోకూడిన సత్కర్మలు ఆచరించాలి. పేదసాదల అవసరాలను దృష్టిలో పెట్టుకోవాలి. పండుగల్లాంటి ప్రత్యేక సందర్భాల్లో వారిని ప్రత్యేకంగా గుర్తుంచుకోవాలి. ఆనందంలో వారినీ భాగస్వాములను చేయాలి. అప్పుడే నిజమైన పండుగ. తన అవసరాలను త్యజించి దైవప్రసన్నతకోసం ఇతరుల అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వమని చెప్పేదే ఈ త్యాగాల పండుగ. ఈ సందర్భంగా మనం ఖుర్బానీలు ఇస్తాం, నమాజులు చేస్తాం. ఇతరత్రా ఇంకా ఏవో పుణ్యకార్యాలు ఆచరిస్తాం. కాని మనోవాంఛలత్యాగం అన్నిటికన్నా ముఖ్యమన్న విషయాన్ని విస్మరించకూడదు. ఇది నిస్సందేహంగా కష్టంతో కూడుకున్న కార్యమే. కాని, హజ్రత్ ఇబ్రాహీం, ఇస్మాయిల్ గార్ల త్యాగాలను స్మరించుకుంటే ఏమాత్రం కష్టంకాదు. మనం కూడా పరీక్షలు, కష్టాలు, త్యాగాల కఠినమయిన దశలను దాటవలసి ఉంది. ఈ మార్గంలో చేసే ఏ కృషి అయినా, ఏ త్యాగమయినా వృథా పోదు. చరిత్రే దీనికి సాక్ష్యం.


- ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్

నామస్మరణం

ఒక వృద్ధుడు 'ఓం నమో భగవతే వాసుదేవాయ' అనే మంత్రాన్ని జపిస్తూ గంగానది తీరంలో నడుస్తున్నాడు. ఆ తరంగాలు కలిపురుషుని తాకాయి. ఎక్కడినుండి వస్తున్నది మంత్ర శబ్దం అని చుట్టూ పరికించాడు కలిపురుషుడు. ఒక బక్కచిక్కిన ముదుసలి 'ఓం నమో భగవతే వాసుదేవాయ' అనే నామాన్ని జపించడం కనిపించింది. ఆ మంత్ర జపాన్ని ఆపాలని ఆ ముసలివాడి దగ్గరికి వెళ్లి పట్టుకోబోయాడు. ఆయన మీద చేయి వేసిన వెంటనే ఎగిరి యోజనం దూరంలో పడ్డాడు. 'ఇతన్ని చూస్తే గట్టిగా గాలి వస్తే ఎగిరేలా ఉన్నాడు. కాని పట్టుకుందామంటే నేను ఎక్కడో పడుతున్నాను' అనుకుంటూ ఉండగా అటుగా వెళ్తున్న వేదవ్యాసుడు కనిపించాడు. కలి వెంటనే వ్యాసుడి దగ్గరికి వెళ్లి ''మహానుభావా! నా సందేహాన్ని నివృత్తి చెయ్యి. అదిగో ఆ దూరంగా వెళ్తున్నాడే ఆ ముసలివాడు ఎవరు? ఆయన్ని పట్టుకోవడానికి నా బలం సరిపోవడం లేదు. ఆ ముసలివాడు శివుడా? విష్ణువా?'' అని అడిగాడు. వ్యాసుడు నవ్వి, ''ఆయన విష్ణుభక్తుడు. ఆయన జపించే నామం వలన విష్ణుశక్తి ఉత్పన్నమై నిన్ను దగ్గరికి రానివ్వడం లేదు. పట్టుకోవాలని ప్రయత్నించావా! విష్ణువు నిన్ను నాశనం చేసి కలియుగాన్నే లేకుండా చేస్తాడు. త్రికరణ శుద్ధిగా నిత్యం 'ఓం నమో భగవతే వాసుదేవాయ' అనే నామాన్ని ఎవరు పఠిస్తూ ఉంటారో వారిని నువ్వు కనీసం తాకను కూడా తాకలేవు' అని చెప్పి వెళ్ళిపోయాడు. అదీ హరినామస్మరణ మహాత్మ్యం.

ఏమిటి?

కుండలిని శక్తి అంటే..?



ప్రతి మనిషిలో కుండలిని శక్తి ఉంటుంది. ఇది మూలాధార చక్రంలో అంటే భౌతిక శరీరంలో వెన్నుపూస కింది భాగంలో రెండున్నర చుట్లు చుట్టుకుని సర్పాకారంలో చైతన్యరహితంగా ఉంటుంది. అయితే ఇది సూక్ష్మశరీరంలో ఉంటుంది కాబట్టి భౌతిక శరీరంలో మనం చూడలేం. కుండలిని శక్తికి చైతన్యం కలిగితే కాని ధ్యానయోగం మొదలవదు. ఈ కుండలిని శక్తి మనందరిలో చైతన్యరహితంగా ఉన్న స్థితిని నిద్రించడంగానూ, ఇది చైతన్యవంతం అవడాన్ని కుండలిని నిద్రలేవడంగానూ ఆధ్యాత్మికంగా వ్యవహరిస్తున్నారు. ఈ శక్తి నిద్రలేచాకే ధ్యానయోగం మొదలవుతుంది. అప్పుడే భౌతిక శరీరం ద్వారా మనం ధ్యానంలో అనేక అనుభూతులను పొందగలం. అంటే ధ్యానయోగంలో ప్రవేశించాలనుకుంటే ముందుగా కుండలిని శక్తిని నిద్రలేపాలి. కొందరిలో ఇది సహజంగానే జరుగుతుంది. పూర్వజన్మలో ధ్యానయోగంలో ఉండి మరణించిన వారికి ఈ జన్మలో కర్మశేషం అనుభవించాక కుండలిని మేల్కొని మనసు ధ్యానం వైపు, దైవం వైపు మళ్లుతుంది. కొందరిలో అన్ని జన్మల్లో ఆర్జించిన సంచిత, ఆగామి కర్మలన్నీ ఈ జీవితంలో ఏదో ఒక దశలో అనుభవంతో క్షయం అయిన మరుక్షణం కుండలిని శక్తి చైతన్యవంతమవుతుంది. ఫలితంగా అంతదాకా ఆధ్యాత్మిక మార్గంలో లేనివారు సైతం తక్షణం తీవ్ర వైరాగ్యంతో భక్తిలో పడతారు. ఈ జన్మలో చేసుకున్న కర్మల క్షయానికి ధ్యానయోగం చేపడతారు. వీరినే అవధూతలుగా వ్యవహరిస్తారు. లలితాదేవి కుండలిని మాత. సుబ్రహ్మణ్యేశ్వరుడిని ధ్యానం చేసిన వారికి కుండలిని త్వరగా చైతన్యవంతం అవుతుందని అంటారు.

బౌద్ధవాణి

మనోవీధులు ఊడ్పించాడు! గురువును చేశాడు!!



అది మగధ రాజధాని. అందులో వీధులు ఊడ్చే పారిశుద్ధ్య కార్మికుడు సునీతుడు. రాత్రంతా వీధులు ఊడ్చి పగలు ఊరి చివరి తన గుడిసెలో గడిపేవాడు. బుద్ధుని గురించి విని, ఒకసారి బుద్ధుని ప్రబోధం వినాలనే కుతూహలం కలిగింది. తాను అంటరాని వాడు. అందరితో కలసి కూర్చొని వినడం ఎలా? అని ఆలోచించుకుని బాధపడ్డాడు. ఒక తెల్లవారు జామున వీధి ఊడ్చే సమయంలో బుద్ధుడు అటుగా రావడం చూసి, పక్కకు తప్పుకుని ఆయన వెనకే అనుసరించాడు. చాటుగా దాగి, ధర్మప్రబోధం వినసాగాడు.

ఆ రోజుల్లో ధార్మిక విషయాలు ప్రబోధించడానికి కేవలం బ్రాహ్మణ, క్షత్రియులే అర్హులు. మిగిలిన వారు దూరంగానే ఉండేవారు. సునీతుణ్ణి గమనించిన బుద్ధుడు, ''రా! ఇటురా! నా దగ్గరకు రా!'' అని పిలిచి దగ్గరకు తీసుకున్నాడు. వివరాలు అడిగి తెలుసుకుని, ''సునీతా! ధర్మప్రబోధానికి నీవూ అర్హుడివే!. నీవు ఇన్నాళ్లూ ఈ చీపురుతో వీధుల్లోని మురికిని ఎత్తిపోశావు. నేలను శుభ్రం చేశావు. ఇకనుండి జ్ఞానం అనే చీపురును చేతబట్టు. నీ మనసులోని మలినాలను శుభ్రం చేసుకో. నీ ధర్మప్రబోధాలతో మనుషుల మనసుల్లోని చెడ్డ ఆలోచనల్ని, దురలవాట్లని, అనైతిక కార్యక్రమాల్ని ఊడ్చిపారెయ్యి'వారిలోని అజ్ఞానాన్ని తొలగించు. వారి మనోవీధుల్ని పరిశుద్ధపరచు. రా!''అంటూ భిక్షుదీక్ష ఇచ్చాడు. సునీతుడు అహోరాత్రాలూ కష్టపడి, విద్య నేర్చుకుని, తక్కువ కాలంలో గొప్ప భిక్షువుగా రాణించాడు. గౌరవ మర్యాదలు పొందాడు. అలా మొదటిసారిగా అన్ని కులాలవారికీ ధర్మంలో ప్రవేశం కల్పించిన వాడు బుద్ధుడు. వారితో ధార్మిక ప్రబోధం చేయించాడు. గౌరవం, కీర్తి కల్గించాడు. అలాంటి వారిలో ఒకడే సునీతుడు.

- డా. బొర్రా గోవర్ధన్

పూజకు వేళాయెరా

పుష్పం.. పత్రం.. తోయం..



సాధారణంగా శివునికి బిల్వపత్రాలే ప్రీతిపాత్రమైనవి. మిగతా పత్రాలు ప్రీతికరం కావని అనుకుంటుంటాం. అయితే లింగపురాణం ఆ స్వామికి ఇష్టమైన మరిన్ని పత్రాలను గురించిన వివరాలను అందిస్తోంది. మారేడు, జమ్మి, గుంట గలగర, అడ్డసరం, అశోకపత్రాలు, తమాలం, చీకటి చెట్టు, ఉలిమిడి, కానుగ, నేల ఉసిరి, మాచీపత్రి, నల్ల ఉమ్మెత్త, తామరాకు, నీటికలువ, మెట్టకలువ ఆకులు, సంపెంగ పత్రి, తుమ్మి, ఉత్తరేణి ఆకులను పత్రాలను పూజలో ఉపయోగించవచ్చు. అంటే, ఆయా పుష్పాలు లభించనపుడు, ఆయా పత్రిని కూడా ఉపయోగించవచ్చని శాస్త్రవచనం.

ఎలా?

ప్రదక్షిణలు ఎలా చేయాలి?

భగవంతునిపై భక్తిని చాటుకోవడానికి ప్రదక్షిణలు చేయడం సంప్రదాయం. ప్రదక్షిణలో భక్తి, ఆరోగ్యం రెండూ ఉన్నాయి. ప్రదక్షిణలో ఎంత నిదానంగా నడిస్తే అంత ఫలితం పొందవచ్చు అని స్మృతులు తెలియజేస్తున్నాయి. ఆంజనేయునికి ఐదు ప్రదక్షిణలు చేయడం సంప్రదాయం. శివాలయంలో ఏమైనా ప్రత్యేకమైన కోరికతో చేసే 'చండీ ప్రదక్షిణ విధి' తప్ప మిగతా అన్ని ప్రదక్షిణలు ధ్వజస్తంభం నుండి మొదలుపెట్టి ధ్వజస్తంభం వద్దనే ముగించాలి. అప్పుడే ప్రదక్షిణలు పూర్తి అయినట్లు.



నవగ్రహ ప్రదక్షిణలు చేసే వారు ఆలయంలో ప్రవేశించగానే ముందు పూర్తి ప్రదక్షిణం చేసి ప్రధాన దేవత దర్శనానికి వెళ్ళాలి. కేవలం నవగ్రహాలను పూజించే వాళ్ళు ఇంటికెళ్ళి కాళ్ళు కడుక్కోవాలి. గణపతికి ఒక ప్రదక్షిణ, సూర్యునికి రెండు ప్రదక్షిణలు, శివునికి మూడు ప్రదక్షిణలు, విష్ణువుకు నాలుగు ప్రదక్షిణలు, అశ్వత్థవృక్షానికి (రావిచెట్టుకు) ఏడు ప్రదక్షిణలు చేయాలని ఆగమాలు చెబుతున్నాయి. శివాలయంలో నందీశ్వరుణ్ణి, ధ్వజస్తంభాన్ని కలుపుకొని ప్రదక్షిణ చేస్తే విశేషఫలం ఉంటుందని శాస్త్రోక్తి. ప్రదక్షిణ ఎంత నెమ్మదిగా చేస్తే అంత మంచిది. పరుగులు పెడుతూ చేసేది ప్రదక్షిణ అనిపించుకోదు.

వేదం

భగవంతుని ఊపిరి

భగవంతుడి ఉచ్ఛ్వాశ, నిశ్వాసలే వేదం. అనగా వేదం భగవంతుని ఊపిరి. కనుక వేదానికి నిగమం, ఆగమం అని రెండు పేర్లు. వేదాన్ని శృతి అని కూడా అంటారు. అలా చెప్పడానికి గల ఇంకొక కారణం, వేదం గురువుగారి దగ్గర విని నేర్చుకునేది. గురువు ఉచ్చరించినదాన్ని విని అదే విధంగా శిష్యుడు ఉచ్చరిస్తూ నేర్చుకుంటాడు కానీ పుస్తకం చూసి చదువుకుని, నేర్చుకునేది కాదు. ఎందుకంటే వేదానికి స్వరం ప్రధానం. ఉచ్చరించడంలో దోషం వచ్చినా, స్వరంలో దోషం వచ్చినా, అక్షర దోషం వచ్చినా, అర్థాలు మారిపోతాయి, వ్యతిరేక ఫలితాలు వస్తాయి. వేదోచ్చారణలో జరిగే చిన్న పొరపాటు విపత్తులకు దారి తీస్తుంది. అందువల్ల శిష్యుడు గురువు వద్దకు వెళ్ళి, గురువు ఉచ్చరించినదాన్ని సరిగా తిరిగి అదే విధంగా ఉచ్చరిస్తూ నేర్చుకుంటాడు ఉంటాడు. అందుకే వేదం అనుశ్రవమైంది.

ఉపశమనం

రుణబాధల విముక్తికి మరికొన్ని పరిహారాలు

- ప్రతినెలా పున్నమి, అమావాస్య రోజుల్లో శ్మశాన వాటికలకు చేరువలో ఉండే శివాలయాన్ని దర్శించుకుని అక్కడి శివలింగానికి పంచామృతాభిషేకం చేయించాలి. దశముఖ రుద్రాక్షను ధరించాలి.
- అష్టగంధాల మిశ్రమంతో 108 రావి ఆకులపై 'శ్రీరామ' అని రాసి, వాటిని మాలగా తయారు చేసి ఎనిమిది మంగళవారాలు ఆంజనేయ ఆలయంలో స్వామికి అలంకరణగా సమర్పించాలి.
- రాహు కేతువుల శాంతికి హోమం చేయించుకోవడం వల్ల ఫలితం ఉంటుంది. హోమం పూర్తయిన తర్వాత హోమకుండం నుంచి సేకరించిన విభూదిని తెల్లని వస్త్రంలో మూటగా కట్టి, ఆ మూటను ఇంట్లో లేదా వ్యాపార ప్రదేశంలో డబ్బు భద్రపరచే చోట ఉంచాలి.
- వ్యాపారంలో తరచు సమస్యల కారణంగా రుణబాధ ఎదురవుతున్నట్లయితే, వ్యాపారం కోసం కొనే వస్తువులతో పాటు పిల్లల ఆట వస్తువులను కూడా కొన్ని కొనండి. వాటిని చిన్నారులకు కానుకగా ఇవ్వండి.
- ఆకలితో ఉన్న వృద్ధులు, అంధులు, వికలాంగులు తారసపడినట్లయితే వారికి తృప్తిగా భోజనం పెట్టండి.

- పన్యాల జగన్నాథ దాసు

నిర్వహణ: డి.వి.ఆర్. భాస్కర్

మీకు తెలుసా?

చిరిగిన దేవతల చిత్రాలను, లేదా పగిలిన పటాలను పూజించడం వల్ల మంచి ఫలితం రాదు సరికదా, వ్యతిరేక ఫలం ఎదురవుతుంది. అలాగని అలాంటి వాటిని ఎక్కడ పడితే అక్కడ పడవేయకూడదు. అగ్నికి ఆహుతి చేయాలి. అవును, ఇది పెద్దలు చెబుతున్న మాటే! అగ్ని సర్వభక్షకుడు. ఆయనలో ఆహుతి చేయడం శుభప్రదం, శ్రేయస్కరం.

సందర్శనం

దర్భశయన రాముడు... పెళ్లి చేసే దేవుడు

ఏ ఆలయంలోనైనా దేవుళ్లని నిలబడిన భంగిమలో లేదా కూర్చున్న భంగిమలో దర్శించుకోవడం సాధారణం. కానీ, దర్భశయనంలో మాత్రం శయనించిన శ్రీరాముని దర్శించుకోవచ్చు. ఈ క్షేత్రం 108 వైష్ణవ దివ్యదేశాలలో ఒకటి. తమిళనాడు రాష్ట్రంలో రామనాథపురం జిల్లాలో ఉన్న ఈ దివ్యక్షేత్రం రామేశ్వరానికి సుమారు 60 కి.మీ. దూరంలో రామనాథపురానికి 8 కి.మీ. దూరంలో ఉంది. ఇక్కడి రాముడిని స్థానికంగా 'తిరుపుల్లవి' అంటారు. తిరుపల్ అని అనే తమిళపదానికి గడ్డితో(దర్భలతో) చేసిన శయ్య అని అర్థం. (తమిళంలో పుల్ అంటే గడ్డి అని, అనై అంటే శయ్య అని అర్థం). ఒకప్పుడు దర్భలతో నిండిన దట్టమైన అడవి ఉండేదని, దాన్ని 'పుల్లారణ్య' అనేవారని చెబుతారు.

ఈ రాముడు కళ్యాణ జగన్నాథుడు: ప్రత్యేకించి వివాహలు కావాల్సిన వారికోసం ఇక్కడ దర్భశయనంలో కల్యాణ జగన్నాథుని ప్రతిష్ఠించారు. అదేవిధంగా సంతానం కోసం సంతాన వేణుగోపాలస్వామిని ప్రతిష్ఠించారు. పెళ్లి కావలసిన యువతీ యువకులు దర్భశయనం వెళ్లి స్వామిని దర్శించుకొని కల్యాణ కుంకుమను తెచ్చుకుని 45 రోజులపాటు ప్రతి రోజూ నుదుట ధరిస్తే వివాహం కుదురుతుందని విశ్వాసం.



సువార్త

దేవుని కాడి సులువు

స్వాభిమానం, స్వయంకృషి, స్వాతంత్ర్యం... ఇవి కదా ఆధునిక సమాజంలో వినిపించే మాటలు. పాజిటివ్ ఆలోచనా సరళిని గురించి దాని ప్రభావానికి సంబంధించిన వాదనలు, దృక్పథాలు వినబడని రోజే లేదు. ఎవరికి వాళ్లు వ్యక్తిగతంగా ఇతరులతో సంబంధం లేకుండా బతకడమే ఆధునికతగా మారింది. అది ఏ సమాజమైనా, యుగమైనా, కాలమైనా, ఎంత గొప్పగా జీవించినా, జీవితానికి సంబంధించిన 'అకౌంట్' అంతా దేవునికి అప్పగించే రోజు ఒకటుంటుందని, దాన్నే తీర్పు దినమంటారని బైబిలు చెబుతుంది (ప్రసంగి 11:9). అనుకున్నది సాధించడమే ధ్యేయంగా, అంచెలంచెలుగా పైకి ఎగబాకడమే విజయ చిహ్నంగా, అంతా భావిస్తున్న నేటి తరంలో 'పైన దేవుడున్నాడు, మిమ్మల్ని చూస్తున్నాడు' అని చెప్పడం కొంచెం ఇబ్బందిగానే ఉంటుంది. ఎందుకంటే అదేదో పాతచింతకాయ పచ్చడి సిద్ధాంతమంటూ తేలిగ్గా కొట్టేసే అవకాశాలే ఎక్కువ. దేవుడు లేకుండా జీవించగలమన్న ధీమా ఉంటే మంచిదే! కాని అందుకు అవసరమైనదానికన్నా ఎక్కువగా 'స్వీయ జ్ఞానం' మీద ఆధారపడవలసి ఉంటుంది. అది ప్రమాదమే!' దేవుడున్నాడు సుమా! అనేది ఒక బెదిరింపు కాదు, హెచ్చరిక అసలే కాదు. ఆదరణతో కూడిన స్పష్టీకరణ అది.

పెరిగే జ్ఞానంతో, విశృంఖలత్వంగా వెర్రితలలు వేస్తున్న స్వేచ్ఛా ధోరణులతో సమాజానికేమైనా మేలు జరిగిందా అంటే అదీ లేదు. మద్యానికి, లైగింక విశృంఖలత్వానికి, నేరప్రవృత్తికి, మాదకద్రవ్యాలకు బానిసలైన తరాన్ని అది పెంచి పోషిస్తోంది. పెద్ద జీతం గొప్ప జీవితాన్నిస్తుందనుకుంటే, పరుపు మెత్తదనం గాఢనిద్రనిస్తుందనుకుంటే, విశాలమైన భవనంలో సుఖశాంతులుంటాయనుకుంటే, అందం జీవితానికి సౌశీల్యాన్నిస్తుందనుకుంటే, ఇవే కదా ఎండమావుల భ్రమలంటే!! ఎంత ప్రయాసపడ్డా, బయట ఎంతకాలమున్నా చీకటి వేళకు సొంతగూటికి చేరుకోవలసిందే! వైఫల్యాలు, కన్నీళ్ళు, అవమానాలు, అన్యాయాలన్నీ సహించి బలహీనపడ్డాక సేదతీరేది మాత్రం దేవుని ఒడిలోనే! ప్రయాసపడి భారం మోసే సమస్త జనులకు ఆయనిచ్చే 'విశ్రాంతి'ని పొందడమంటే, మండుటెండలో దప్పికతో అలమటిస్తున్న బాటసారికి చల్లటి, తియ్యటి మంచినీళ్ళు దొరకటమే! ప్రతివ్యక్తి జీవితంలో ఏదో ఒక కాడి మోయక తప్పదు. కాని సాత్వికుడు, దీన మనస్సుగలవాడైన దేవుడిచ్చే కాడి సులువైనది, తేలికైనది అని బైబిలు చెబుతోంది (మత్తయి 11:28–30).



- రెవ.డా.టి.ఎ.ప్రభుకిరణ్

అంతా కుశలమే


● ఎన్టీఆర్

అభిమానులకు వినాయక చవితి కానుకగా ఎన్టీఆర్ ఓ సడన్ సర్‌ప్రైజ్ ఇచ్చారు. అదేంటంటే... 'కుశ' లుక్! ఎన్టీఆర్ హీరోగా కె.ఎస్. రవీంద్ర (బాబీ) దర్శకత్వంలో నందమూరి కల్యాణ్‌రామ్ నిర్మిస్తున్న సినిమా 'జై లవ కుశ'. ఇందులో ఎన్టీఆర్ మూడు పాత్రల్లో (జై, లవకుమార్, కుశ) నటిస్తున్న సంగతి తెలిసిందే. చవితి ముందు రోజున లవకుమార్ టీజర్ విడుదల చేసిన ఎన్టీఆర్, చవితి రోజున 'కుశ' లుక్ విడుదల చేశారు. ఇంకో సర్‌ప్రైజ్ ఏంటంటే... ఇందులో ప్రియా పాత్రలో నటిస్తున్న రాశీ ఖన్నా లుక్‌ను సైతం చవితి రోజునే విడుదల చేశారు. లవ టీజర్, కుశ లుక్, ప్రియా లుక్... ప్రేక్షకులకు ట్రిపుల్ ధమాకా అనే చెప్పాలి. ముఖ్యంగా టీజర్‌లో 'మంచితనం... అది పుస్తకాల్లో ఉంటే పాఠం అవుతుంది. మనలో ఉంటే గుణపాఠం అవుతుంది. అదే నా జీవితాన్ని తల్లకిందులు చేసింది' అని ఎన్టీఆర్ చెప్పిన డైలాగ్‌కు అద్భుత స్పందన లభిస్తోంది. దీంతో ఎన్టీఆర్ ఫ్యాన్స్, 'జై లవకుశ' చిత్రబృందం అంతా కుశలమే.


● జయప్రద, చిరంజీవి, ఆకాశ్‌కుమార్, సురేశ్ కపాడియా, ఎన్. నరసింహారావు

వావ్ అనకుండా ఉండలేకపోయా!

- చిరంజీవి

''దైవశక్తికి, దుష్టశక్తికి మధ్య జరిగిన యుద్ధంలో మానవశక్తి ఎలా సహాయపడిందనే కథతో రూపొందిన సోషియో ఫాంటసీ చిత్రమిది. నా 'జగదేకవీరుడు అతిలోక సుందరి' అలాంటి చిత్రమే'' అన్నారు చిరంజీవి. ఆకాశ్‌కుమార్, మిస్తీ చక్రవర్తి జంటగా, జయప్రద ప్రధానపాత్రలో నటించిన సినిమా 'శరభ'. ద గాడ్.. ఉపశీర్షిక. ఎన్. నరసింహారావు దర్శకత్వంలో అశ్వనికుమార్ సహదేవ్ నిర్మించిన ఈ సినిమా ఫస్ట్ లుక్, మోషన్ పోస్టర్లను చిరంజీవి విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ– ''ఈ సిన్మాలోని కొన్ని సన్నివేశాలను చూశా. తనలో దుష్టశక్తి ఆవహించి, అప్పుడే పుట్టిన తన బిడ్డను చంపాలని ప్రయత్నిస్తున్న టైమ్‌లో జయప్రదగారు నటించిన తీరు ఒళ్లు గగుర్పాటుకు గురయ్యేలా చేస్తుంది. ఆమె నటన చూసి వావ్ అనకుండా ఉండలేకపోయా. క్లైమాక్స్‌లో నరసింహస్వామి పూనిన తర్వాత ఆకాశ్ నటన కూడా అద్భుతం. దర్శకుడు విజువల్ వండర్‌గా సిన్మాను తీర్చిదిద్దారు. లక్ష్మీ నరసింహస్వామి కృపతో సినిమా పెద్ద హిట్టవుతుందనే నమ్మకముంది'' అన్నారు. జయప్రద మాట్లాడుతూ– ''తెలుగులో ఎన్ని అవకాశాలు వచ్చినా నటనకు ఆస్కారమున్న మంచి పాత్ర చేయాలని ఎదురుచూస్తున్న టైమ్‌లో దర్శకుడు 'శరభ' కథ చెప్పారు. చిరంజీవిగారి గోల్డెన్ హ్యాండ్స్ మీదుగా ఫస్ట్ లుక్, మోషన్ పోస్టర్ విడుదల కావడం సంతోషంగా ఉంది. ఆయన ప్రేమ, ఆశీస్సులే మా బలం'' అన్నారు. ''పక్కా కమర్షియల్ చిత్రమిది. తండ్రి సెంటిమెంట్‌తో పాటు నరసింహస్వామి దైవబలం కూడా సినిమాలో ఉంటుంది'' అన్నారు దర్శకుడు. సురేశ్ కపాడియా, కథానాయిక మిస్తీ చక్రవర్తి, సినిమాటోగ్రాఫర్ రమణ సాల్వ తదితరులు పాల్గొన్నారు.

మిస్టర్ క్లీన్!


● శర్వానంద్

కుర్రాడి పేరు ఆనంద్. అతనికి ఓసీడీ ఉంది. అంటే.. అదేదో బీటెక్, ఎమ్‌టెక్ లాంటి డిగ్రీ అనుకునేరు. 'అబ్సెసివ్ కంపల్సివ్ డిజార్డర్' అన్నమాట. దీని లక్షణం అతి శుభ్రం. ఆనంద్ 'మిస్టర్ క్లీన్'. ఈ డిజార్డర్‌తో ఆనంద్ లైఫ్ ఎలా ఉంటుంది? అనేది తెలుసుకోవాలంటే 'మహానుభావుడు' చూడాల్సిందే. శర్వానంద్ టైటిల్ రోల్‌లో మారుతి దర్శకత్వంలో వంశీ, ప్రమోద్‌లు నిర్మిస్తున్నారు. మెహరీన్ కథానాయిక. ఒక్క సాంగ్ మినహా షూటింగ్ కంప్లీట్ అయిన ఈ చిత్రాన్ని దసరాకి విడుదల చేయాలనుకుంటున్నారు. దర్శకుడు మారుతి మాట్లాడుతూ– ''భలే భలే మగాడివోయ్' చిత్రం తర్వాత నాకు బాగా నచ్చిన క్యారెక్టరైజేషన్‌తో చేస్తున్న చిత్రం ఇది. ఫుల్ కామెడీ అండ్ మ్యూజికల్ లవ్‌స్టోరీ. ఓసీడీ ఉన్న కుర్రాడిగా శర్వానంద్ అద్భుతంగా చేస్తున్నారు. తన కెరీర్‌లో బెస్ట్ మూవీగా నిలుస్తుంది. ఎస్.ఎస్. తమన్ అందించిన ఆడియో సూపర్'' అన్నారు. ''మా బ్యానర్‌లో శర్వానంద్ హీరోగా చేస్తున్న మూడో చిత్రం ఇది. క్యారెక్టరైజేషన్‌తో కామెడీ పండించగల దర్శకుల్లో మారుతి ప్రథముడు. డబ్బింగ్ కార్యక్రమాలు స్టార్ట్ చేశాం. త్వరలో ట్రైలర్‌ను విడుదల చేయాలనుకుంటున్నాం'' అన్నారు నిర్మాతలు.

హ్యాపీగా... జాలీగా...



సందర్భం తెలీదు. కానీ, సంతోషం మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది... అల్లు స్నేహ ముఖంలో, ఆమెను పట్టుకుని వెనుక సీటులో కూర్చున్న కుమారుడు అయాన్ నవ్వులో, వీళ్లిద్దరి కంటే ముఖ్యంగా స్కూటర్‌ను పట్టుకుని గాల్లో ఎగురుతూ అల్లు అర్జున్ ఇచ్చిన ఫోజులో. అర్హ (అల్లు అర్జున్ కుమార్తె) చిన్న పిల్ల కదా... ఏం జరుగుతుందో పసిగట్టలేని పసిపిల్ల. ముద్దుగా అమ్మ ఒడిలో కూర్చుంది. ప్రస్తుతం ఈ ఫొటో నెట్టింట్లో చక్కర్లు కొడుతోంది. ఈ ఫొటోకున్న మరో స్పెషాలిటీ ఏంటంటే... స్నేహ ప్రెగ్నెంట్‌గా ఉన్నప్పుడు, అయాన్ పుట్టిన తర్వాత సేమ్ టు సేమ్ ఇలాంటి ఫొటోలే దిగారు. ఇప్పుడు అర్హాతో కలసి మళ్లీ ఫొటోలు దిగారు. హ్యాపీగా.. జాలీగా ఎంజాయ్ చేస్తున్నారు కదూ!


కొంచెం కొత్తగా చేయమన్నారు

- 'అల్లరి' నరేశ్


● విజయ్‌కుమార్, బొప్పన చంద్రశేఖర్, నరేశ్, 'హైపర్' ఆది, సీతారామరాజు

''గమ్యం' సినిమాలో నేను చేసిన గాలి శీను పాత్ర నవ్విస్తూనే ఏడిపిస్తుంది. అలాంటి కథ కోసం చాలా కాలం ఎదురు చూశా. 'నేను, గమ్యం' చిత్రాల తరహా సీరియస్ సినిమా చేద్దామని 'కెవ్వు కేక' టైమ్ నుంచి చంద్రశేఖర్‌గారు అడుగుతున్నారు. కామెడీకి థ్రిల్లర్ అంశాల్ని జోడించిన అటువంటి కథే మలయాళ 'ఒరు వడక్కన్ సెల్ఫీ'. నిర్మాతకు, నాకు బాగా నచ్చడంతో 'మేడమీద అబ్బాయి'గా తెలుగులో రీమేక్ చేశాం'' అని 'అల్లరి' నరేశ్ అన్నారు. నరేశ్, నిఖిలా విమల్ జంటగా జి. ప్రజిత్ దర్శకత్వంలో బొప్పన చంద్రశేఖర్ నిర్మించిన చిత్రం 'మేడ మీద అబ్బాయి'. ట్రైలర్‌ని విడుదల చేసిన అనంతరం నరేశ్ మాట్లాడుతూ– ''మీ సినిమాలు మూస ధోరణిలో ఉంటున్నాయి. కొంచెం కొత్తగా ప్రయత్నించమని చాలామంది అడిగారు. కొత్తగా చేయాలని ఆలోచించి చేసిన ప్రయత్నమే ఈ 'మేడ మీద అబ్బాయి'. సెప్టెంబర్ 8న సినిమాను రిలీజ్ చేస్తున్నాం'' అన్నారు. ''అల్లరి, ప్రాణం, గమ్యం, శంభో శివ శంభో... ఈ నాలుగు సినిమాలు కలిస్తే ఎలా ఉంటుందో 'మేడమీద అబ్బాయి' ఆ స్థాయిలో ఉంటుంది'' అన్నారు నిర్మాత. నటుడు 'హైపర్' ఆది, రచయిత విజయ్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ నిర్మాతలు ఎమ్మెస్ కుమార్, సీతారామరాజు పాల్గొన్నారు.

పల్లెటూరి ప్రేమ


● తనీష్, శ్రుతి

తనీష్, శ్రుతీ యుగళ్ జంటగా ఎస్.వి.ఎన్. రావు సమర్పణలో మహేంద్ర దర్శకత్వంలో దేశాల లక్ష్మయ్య నిర్మించిన చిత్రం 'ప్రేమిక'. దిలీప్ బండారి స్వరపరచిన ఈ చిత్రం పాటలను హైదరాబాద్‌లో విడుదల చేశారు. ''పల్లెటూరి నేపథ్యంలో సాగే మంచి ప్రేమ కథ. మదర్ సెంటిమెంట్ కూడా ఉంటుంది. ఛాన్స్ ఇచ్చిన లక్ష్మయ్యకు రుణపడి ఉంటా'' అన్నారు మహేంద్ర. ''సెప్టెంబర్ 8న సినిమాను విడుదల చేస్తున్నాం'' అన్నారు దేశాల లక్ష్మయ్య. తనీష్, శృతియుగళ్, ఎమ్మెల్యే రసమయి బాలకృష్ణ, దర్శకుడు త్రినాథరావు, గణేష్ మాస్టర్ పాల్గొన్నారు.

కల్యాణ్‌రామ్‌తో కొత్త లుక్‌లో...

'బాహుబలి–2' తర్వాత తెలుగులో పలు అవకాశాలొచ్చినా తమన్నా అంగీకరించలేదు. జస్ట్... గాళ్ నెక్ట్స్ డోర్, బబ్లీ గ్లామరస్ రోల్స్ కాకుండా కొత్తగా, నటనకు అవకాశమున్న క్యారెక్టర్స్ కోసం వెయిట్ చేస్తున్నానని ఓ సందర్భంలో పేర్కొన్నారు. ఇప్పుడు అటువంటి అవకాశమే వచ్చినట్టుంది. వెంటనే ఓకే చెప్పేశారు. నందమూరి కల్యాణ్‌రామ్ హీరోగా '180' ఫేమ్ జయేంద్ర దర్శకత్వంలో ఓ సినిమా ప్రారంభమైన సంగతి తెలిసిందే. కిరణ్ ముప్పవరపు, విజయ్ కుమార్ వట్టికూటి నిర్మిస్తున్న ఈ సిన్మాలో హీరోయిన్‌గా ముందు ఐశ్వర్యలక్ష్మిని ఎంపిక చేశారు. ఏమైందో ఏమో ఇప్పుడామె స్థానంలో తమన్నా వచ్చి చేరారు. ''యస్... కల్యాణ్‌రామ్‌కు జోడీగా తమన్నాను ఎంపిక చేశాం. హీరో హీరోయిన్లు ఇద్దరూ కొత్త లుక్‌లో కనిపిస్తారు. సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లో మేజర్ షెడ్యూల్ మొదలవుతుంది. సెప్టెంబర్ నెలాఖరుకు 50 శాతం టాకీ పూర్తవుతుంది'' అని చిత్రసమర్పకుడు మహేశ్ కోనేరు తెలిపారు. ఈ సినిమాకు తమన్నా కోటీ అరవై లక్షలు పారితోషికం అందుకుంటున్నట్లు సమాచారం!!


● తమన్నా

సాక్షి స్పోర్ట్స్
ఆదివారం 27-8-2017

జోష్నా 15వసారి... సౌరవ్ 12వ సారి

జాతీయ స్క్వాష్ చాంపియన్‌షిప్‌లో మహిళల సింగిల్స్‌లో జోష్నా చినప్ప (తమిళనాడు) 15వసారి... పురుషుల సింగిల్స్‌లో సౌరవ్ గోషాల్ (తమిళనాడు) 12వ సారి చాంపియన్స్‌గా నిలిచారు. ఫైనల్స్‌లో జోష్నా 3–1తో లక్ష్య (తమిళనాడు)పై, సౌరవ్ 3–1తో మహేశ్ (మహారాష్ట్ర)పై గెలిచారు.

మరో సిరీస్‌పై దృష్టి


రహానే
రోహిత్

శ్రీలంకతో భారత్ మూడో వన్డే నేడు

సజీవంగా నిలిచేందుకు ఆతిథ్య జట్టు పోరు

శ్రీలంక పర్యటనలో తొలిసారిగా భారత జట్టుకు రెండో వన్డేలో కఠిన పోటీ ఎదురైంది. స్పిన్నర్ అకిల ధనంజయ స్పిన్ మాయలో పడి టీమిండియా ఒక్కసారిగా ఓటమి దిశగా పయనించింది. 22 బంతుల వ్యవధిలో ఏడు వికెట్లు కూలినా... 'మిస్టర్ కూల్' ధోనికి అనూహ్యంగా భువనేశ్వర్ అండగా నిలవడంతో పరువు దక్కించుకోగలిగింది. ఈ పరిస్థితిలో శ్రీలంకతో కోహ్లి సేన మూడో వన్డేకు సిద్ధమవుతోంది. మిడిలార్డర్ వైఫల్యాన్ని అధిగమించి మ్యాచ్‌తో పాటు సిరీస్ గెలవాలని భారత్ భావిస్తుండగా... ఎలాగైనా ఈ వన్డేలో నెగ్గి సిరీస్‌లో సజీవంగా ఉండాలని ఆతిథ్య జట్టు ఆలోచిస్తోంది.

పల్లెకెలె: శ్రీలంక పర్యటనలో ఇప్పటికే టెస్టు సిరీస్‌ను దక్కించుకున్న భారత జట్టు ఇప్పుడు వన్డే సిరీస్‌పై కన్నేసింది. ఐదు వన్డేల సిరీస్‌లో భారత్ ప్రస్తుతం 2–0తో ఆధిక్యంలో ఉంది. ఈ నేపథ్యంలో నేడు మూడో మ్యాచ్‌కు రంగం సిద్ధమైంది. ఈ మ్యాచ్‌లోనూ నెగ్గితే సిరీస్ భారత్ ఖాతాలో చేరుతుంది. అయితే గురువారం నాటి రెండో వన్డేలో వరుస మారిన భారత మిడిలార్డర్‌లో లోపాలు బహిర్గతమయ్యాయి. ధనంజయ స్పిన్ తాకిడిని తట్టుకోలేక ఆరుగురు బ్యాట్స్‌మెన్ పెవిలియన్‌కు చేరడం జట్టు మేనేజ్‌మెంట్‌ను ఒక్కసారిగా ఆందోళనలో పడేసింది. 2019 వరల్డ్‌కప్‌ను దృష్టిలో పెట్టుకుని జట్టులో ప్రయోగాలు చేసినా ఫలితాన్నివ్వలేదు. ఇక ఈ మ్యాచ్‌లో కచ్చితంగా గెలవాలనే కసితో లంక ఉంది. స్లో ఓవర్ రేట్ కారణంగా రెగ్యులర్ కెప్టెన్ ఉపుల్ తరంగపై రెండు వన్డేల నిషేధం విధించడంతో శ్రీలంక జట్టుకు కపుగెడెర నాయకత్వం వహించనున్నాడు.

ప్రయోగాలు కొనసాగేనా..

రెండేళ్లలో రాబోయే ప్రపంచకప్‌కు అత్యంత పటిష్టంగా సిద్ధం కావాలని భారత్ భావిస్తోంది. దీంట్లో భాగంగానే రెగ్యులర్‌గా కొనసాగుతున్న బ్యాటింగ్ ఆర్డర్‌ను రెండో వన్డేలో మార్చారు. మూడోనంబర్‌లో కోహ్లికి బదులు రాహుల్, ఆ తర్వాత కేదార్ జాదవ్‌లను బరిలోకి దింపారు. అయితే స్పిన్నర్ ధనంజయ గూగ్లీ బంతులకు వీరు గుభేల్‌మన్నారు. ఫామ్‌లో ఉన్నప్పటికీ లోకేశ్ రాహుల్ కోసం రహానే బెంచీకే పరిమితమయ్యాడు. దీంతో తనకు వచ్చిన అవకాశాన్ని రాహుల్ ఉపయోగించుకోలేకపోయాడు. అయితే ధనంజయ సూపర్ బంతులకు అటు కోహ్లి కూడా షాక్ తినాల్సి వచ్చింది. జాదవ్ తన షాట్ సెలక్షన్‌లో విఫలమయ్యాడు. మరి ఈ వన్డేలోనూ కోహ్లి ఇదే ఆర్డర్‌లో జట్టును నడిపిస్తాడా.. వేచి చూడాలి. ఎక్కువగా చేజింగ్‌కు మొగ్గు చూపే అతను ఈసారి టాస్ నెగ్గితే మిడిలార్డర్ ప్రాక్టీస్ కోసం ముందుగా బ్యాటింగ్ తీసుకునే అవకాశాలు లేకపోలేదు. కండరాలు పట్టేయడంతో హార్దిక్ పాండ్యా ఈ మ్యాచ్‌కు అందుబాటులో ఉంటాడా... లేదా అనేది ఆసక్తికరంగా మారింది. ఫిట్‌గా లేకపోతే కుల్దీప్, శార్దుల్ ఠాకూర్‌లలో ఒకరికి చాన్స్ ఉంటుంది. ధోని తన సత్తా ఏమిటో చాటుకోగా... భువనేశ్వర్ బౌలింగ్‌లో విఫలమవుతున్నా అసమాన బ్యాటింగ్‌తో రెండో వన్డేలో ఆపద్బాంధవుడిలా నిలిచాడు. పేసర్ బుమ్రా అదరగొడుతుండగా, స్పిన్నర్లు అక్షర్, చాహల్ ప్రభావం చూపిస్తున్నారు.

ఒత్తిడిలో శ్రీలంక

కెప్టెన్ తరంగ సస్పెన్షన్‌తో పాటు గుణతిలక గాయంతో దూరమవడం జట్టును ఇబ్బంది పెడుతోంది. దీంతో వీరిద్దరి స్థానంలో చండిమాల్, తిరిమన్నె జట్టులోకి వచ్చారు. రెండో వన్డేలో గెలుపు ముంగిట నిలిచి బోల్తా పడిన లంక ఈసారి ఎలాంటి పొరపాటుకు తావీయకుండా ఆడాలని చూస్తోంది. సిరీస్‌లో ఉండాలంటే విజయం తప్పనిసరి కావడంతో పాటు ప్రపంచకప్‌కు నేరుగా అర్హత సాధించాలంటే లంకకు రెండు విజయాలు అవసరముంది. ముఖ్యంగా లంక బౌలింగ్‌లో ఇప్పుడు ధనంజయ సరికొత్త ఆశాకిరణంగా మారాడు. ఈ మ్యాచ్‌లోనూ జట్టు అతడిపైనే భారం వేసింది. అయితే పేసర్లు మలింగ, ఫెర్నాండో ఏమాత్రం ప్రభావం చూపించకపోవడం వీరిని దెబ్బతీస్తోంది.

జట్లు (అంచనా)

భారత్: కోహ్లి (కెప్టెన్), రోహిత్, ధావన్, రాహుల్, జాదవ్, పాండ్యా, ధోని, అక్షర్, చాహల్, భువనేశ్వర్, బుమ్రా.
శ్రీలంక: కపుగెడెర (కెప్టెన్), డిక్‌వెలా, తిరిమన్నె, కుశాల్, చండిమాల్, మాథ్యూస్, సిరివర్ధన, ధనంజయ, చమీర, ఫెర్నాండో, మలింగ.

పిచ్, వాతావరణం

రెండో వన్డే మాదిరిగానే పిచ్ మరోసారి స్పిన్ బౌలింగ్‌కు అనుకూలించనుంది. వర్షం మ్యాచ్‌కు అంతరాయం కలిగించే అవకాశాలున్నాయి.

మధ్యాహ్నం గం. 2.30 నుంచి సోనీ సిక్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

షుమాకర్ సరసన హామిల్టన్

అత్యధిక 'పోల్' పొజిషన్స్ రికార్డు సమం



స్పా–ఫ్రాంకోర్‌చాంప్స్ (బెల్జియం): ఈ ఏడాది ఫార్ములావన్ సీజన్‌లో ఐదో టైటిల్‌ను గెలిచేందుకు మెర్సిడెస్ జట్టు డ్రైవర్ లూయిస్ హామిల్టన్ రంగం సిద్ధం చేసుకున్నాడు. ఆదివారం జరిగే బెల్జియం గ్రాండ్‌ప్రి ప్రధాన రేసును ఈ ప్రపంచ మాజీ చాంపియన్ తొలి స్థానంతో ప్రారంభించనున్నాడు. శనివారం జరిగిన క్వాలిఫయింగ్ సెషన్‌లో హామిల్టన్ అందరికంటే వేగంగా ఒక నిమిషం 42.553 సెకన్లలో ల్యాప్‌ను ముగించి 'పోల్ పొజిషన్' దక్కించుకున్నాడు. ఈ క్రమంలో 68 'పోల్స్'తో జర్మనీ దిగ్గజం మైకేల్ షుమాకర్ పేరిట ఉన్న అత్యధిక 'పోల్ పొజిషన్స్' ప్రపంచ రికార్డును హామిల్టన్ సమం చేశాడు. ఫెరారీ డ్రైవర్ సెబాస్టియన్ వెటెల్ రెండో స్థానం నుంచి, బొటాస్ (మెర్సిడెస్) మూడో స్థానం నుంచి రేసును మొదలుపెడతారు. భారత్‌కు చెందిన ఫోర్స్ ఇండియా జట్టు డ్రైవర్లు సెర్గియో పెరెజ్ తొమ్మిదో స్థానం నుంచి, ఒకాన్ పదో స్థానం నుంచి రేసును ఆరంభిస్తారు.

ప్రిక్వార్టర్స్‌లో అమిత్, గౌరవ్

ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్


గౌరవ్

హంబర్గ్ (జర్మనీ): భారత బాక్సర్లు అమిత్ ఫంగల్, గౌరవ్ బిధురి సత్తా చాటారు. ప్రపంచ పురుషుల సీనియర్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో వీరిద్దరూ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు. పురుషుల 49 కేజీల కేటగిరీ తొలి రౌండ్లో అమిత్ 4–1తో ఫెడెరికో సెర్రా (ఇటలీ)పై గెలుపొందాడు. 56 కేజీల విభాగంలో గౌరవ్ 5–0తో ప్రపంచ యూత్ చాంపియన్‌షిప్ కాంస్య పతక విజేత సామ్ గుడ్‌మాన్ (ఆస్ట్రేలియా)ను కంగుతినిపించాడు. ప్రిక్వార్టర్స్‌లో అమిత్... ఏడో సీడ్ కార్లస్ క్విపో (ఈక్వెడార్)తో, గౌరవ్... ఆఫ్రికా చాంపియన్ జీన్ జోర్డి వాడమటూ (మారిషస్)తో తలపడతారు. ఈ చాంపియన్‌షిప్‌లో 250 మంది అంతర్జాతీయ బాక్సర్లు తలపడుతుండగా... భారత్ తరపున ఎనిమిది మంది పోటీపడుతున్నారు.

ధోనిపై ఇంకా సందేహాలా?

సునీల్ గావస్కర్

వన్డేలకు ధోని ఎంత అవసరమో... క్లిష్ట పరిస్థితుల్లో అతడెంత కీలకమో విమర్శకులకు ఇప్పటికైనా అర్థమై ఉంటుంది. రెండో వన్డేలో భువనేశ్వర్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను నడిపించిన తీరు అద్భుతం. దీంతో అతని సత్తాపై ఇంకెవరికైనా సందేహాలుంటే... అవి పటాపంచలైనట్లే! అతనిపై ఆలోచిస్తామనే మాటలకు సమాధానం దొరికినట్లే! టాప్, మిడిలార్డర్ బ్యాట్స్‌మెన్ పెవిలియన్‌కు వరుస కట్టినా... మిగిలింది టెయిలెండర్లే అని తెలిసినా... ఎలాంటి కంగారు లేకుండా కూల్‌గా, కామ్‌గా తన పని కానిచ్చాడు ధోని. అతని వల్లే భువనేశ్వర్ మ్యాచ్‌ను గెలిపించే ఇన్నింగ్స్ ఆడాడు. మాజీ సారథి చతురతతోనే అది సాధ్యమైందనే సంగతి మరవొద్దు. అతను ప్రతి బంతికి సలహా ఇచ్చాడు. భువీ సాధికారికంగా ఆడేలా ముందుండి ప్రోత్సహించాడు. స్పిన్నర్లు బౌలింగ్‌కు దిగినపుడు బంతి గమనంపై స్పష్టమైన సందేశాలిచ్చాడు.

ఎలాంటి బంతినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలనే సంకేతాలిచ్చాడు. ఇందులో అతని మార్గదర్శనం మరో ఎత్తులో నిలిచింది. భారత్ బౌలింగ్ సమయంలోనూ కీపర్ ధోని బౌలర్లకు లైన్ అండ్ లెంగ్త్ దిశను ఎప్పటికప్పుడు చెబుతుంటాడు. వాళ్లకు అవసరమైన ఫీల్డింగ్‌ను అందుబాటులో ఉంచుతాడు. ఈ విషయంలో కెప్టెన్ విరాట్ కోహ్లి కూడా తన మాజీ సారథికే స్వేచ్ఛనిస్తాడు. భారత బ్యాటింగ్ ఆర్డర్‌లో రాహుల్, జాదవ్‌లను ముందుకు తేవాలన్న ప్రయోగం విజయవంతం కాలేదు. అయితే వీళ్లిద్దరూ ప్రతిభావంతులే. మరిన్ని అవకాశాలు ఇవ్వాల్సిందే. వరుసగా మూడో వన్డేతో పాటు సిరీస్ కూడా గెలిచేందుకు తుది జట్టులో కొన్ని మార్పులు ఉండవచ్చు. అయితే ఇప్పుడున్న జట్టు కూడా అత్యుత్తమమైందే. దీన్ని కొనసాగించినా నష్టమేమీ లేదు.

రిక్త హస్తాలతో వెనక్కి...

పారిస్: భారీ అంచనాలతో ప్రపంచ సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో బరిలోకి దిగిన భారత రెజ్లర్లు ఒక్క పతకం కూడా గెలవకుండానే వెనుదిరిగారు. శనివారం ముగిసిన ఈ మెగా ఈవెంట్‌లో చివరిరోజు బజరంగ్ (65 కేజీలు), అమిత్ ధన్‌కర్ (70 కేజీలు), ప్రవీణ్ రాణా (74 కేజీలు), సత్యవర్త్ (97 కేజీలు) ప్రిక్వార్టర్ ఫైనల్‌ను దాటలేకపోయారు. ప్రిక్వార్టర్ ఫైనల్ బౌట్‌లలో బజరంగ్ 5–6తో ఐకోబిష్‌విలి (జార్జియా) చేతిలో, ప్రవీణ్ రాణా 0–5తో హసనోవ్ (అజర్‌బైజాన్) చేతిలో, సత్యవర్త్ 0–5తో కెటోవ్ (అర్మేనియా) చేతిలో... అమిత్ తొలిరౌండ్‌లో 2–9తో తనతరోవ్ (కజకిస్తాన్) చేతిలో ఓడారు. పురుషుల ఫ్రీస్టయిల్, గ్రీకో రోమన్, మహిళల ఫ్రీస్టయిల్ విభాగాల్లో కలిపి మొత్తం 24 మంది భారత రెజ్లర్లు బరిలోకి దిగగా... మహిళల 53 కేజీల విభాగంలో శీతల్ తోమర్ క్వార్టర్ ఫైనల్ చేరుకోవడమే భారత్ తరపున అత్యుత్తమ ప్రదర్శన. మిగతా వారందరూ ప్రిక్వార్టర్ ఫైనల్‌ను దాటలేకపోయారు.

ఈసారైనా తలపడతారా?

ఒకే పార్శ్వంలో నాదల్, ఫెడరర్ ● యూఎస్ ఓపెన్ 'డ్రా' విడుదల



న్యూయార్క్: యూఎస్ ఓపెన్ చరిత్రలో స్పానిష్ స్టార్ రాఫెల్ నాదల్, స్విట్జర్లాండ్ దిగ్గజం రోజర్ ఫెడరర్ ఒకరికొకరు ఎప్పుడూ ఎదురుపడలేదు. అయితే ఈసారి మాత్రం ఈ టెన్నిస్ లెజెండ్స్ ఇద్దరూ ఒకే పార్శ్వంలో ఉన్నారు. దీంతో టాప్ సీడ్ నాదల్, మూడో సీడ్ ఫెడరర్ తమ ప్రత్యర్థులను ఓడించుకుంటూ సెమీస్ వెళితే మాత్రం... దిగ్గజాల పోరుతో ఈ గ్రాండ్‌స్లామ్ ఈవెంట్ హోరెత్తనుంది. అది సెమీస్ అయినా 'ఫైనల్'ను తలపిస్తుంది. సోమవారం మొదలయ్యే ఈ సీజన్ చివరి గ్రాండ్‌స్లామ్ ఈవెంట్ 'డ్రా'ను శుక్రవారం రాత్రి విడుదల చేశారు. తొలిరౌండ్లో నాదల్... లెజోవిచ్ (సెర్బియా)తో తలపడనుండగా, ఫెడరర్... ఫ్రాన్సెస్ టియాఫె (అమెరికా)తో ఆడతాడు. మహిళల సింగిల్స్‌లో మరియా షరపోవాకు తొలిరౌండ్లో రెండో సీడ్ సిమోనా హాలెప్ (రుమేనియా) ఎదురైంది. డోపింగ్ సస్పెన్షన్ తర్వాత రష్యా స్టార్ బరిలోకి దిగుతున్న తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఇదే. ఆమెకు నిర్వాహకులు వైల్డ్‌కార్డ్ ఎంట్రీ ఇచ్చారు.

తలైవాస్‌పై పట్నా పైచేయి

ముంబై: ప్రొ కబడ్డీ లీగ్‌లో భాగంగా శనివారం జరిగిన మ్యాచ్‌లో పట్నా పైరేట్స్ 35–24తో తమిళ్ తలైవాస్‌ను చిత్తు చేసింది. ఆరంభం నుంచే పట్నా ఆటగాళ్లకు తలైవాస్ ఏమాత్రం పోటీనివ్వలేకపోయింది. మోను 11, అజయ్ ఠాకూర్ 10 రైడింగ్ పాయింట్లతో విజయంలో కీలకంగా నిలిచారు. మరో మ్యాచ్‌లో పుణేరి పల్టన్ 26–24 తేడాతో యు ముంబాపై గెలిచింది.

బ్రాత్‌వైట్, హోప్ సెంచరీలు


లీడ్స్: ఇంగ్లండ్‌తో జరుగుతున్న రెండో టెస్టులో విండీస్ అదరగొడుతోంది. ఓపెనర్ క్రెయిగ్ బ్రాత్‌వైట్ (134; 17 ఫోర్లు, 2 సిక్సర్లు), షాయ్ హోప్ (147 బ్యాటింగ్; 23 ఫోర్లు) శతకాలతో చెలరేగారు. దాంతో రెండో రోజు ఆట ముగిసేసమయానికి విండీస్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 5 వికెట్లకు 329 పరుగులు చేసింది. అంతకుముందు ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 258 పరుగులకు ఆలౌటైంది.

అంతర్జాతీయ బ్యాడ్మింటన్‌లో భారత్ సూపర్ పవర్‌గా ఎదుగుతోందనే సంకేతాన్ని భారత స్టార్స్ మరోసారి ఇచ్చారు. గ్లాస్గో వేదికగా జరుగుతోన్న ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత్ కొత్త చరిత్ర సృష్టించింది. నాలుగు దశాబ్దాల ఈ మెగా ఈవెంట్ చరిత్రలో భారత్‌కు తొలిసారి రెండు పతకాలు లభించనున్నాయి. మహిళల సింగిల్స్‌లో సైనా నెహ్వాల్, పీవీ సింధు సెమీఫైనల్‌కు చేరుకొని పతకాలను ఖాయం చేసుకున్నారు. గాయం నుంచి కోలుకున్న సైనా అంచనాలకు మించి రాణించి కాంస్య పతకాన్ని సొంతం చేసుకోగా... తెలుగు తేజం పీవీ సింధు మూడోసారి ఫైనల్ బెర్త్‌పై గురి పెట్టింది.

మెరిసింది 'మన రాకెట్'

తొలిసారి భారత్‌కు రెండు పతకాలు

సెమీస్‌లో పోరాడి ఓడిన సైనా నెహ్వాల్ ● కాంస్య పతకంతో సంతృప్తి
మూడోసారి సెమీస్‌లోకి సింధు ● ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్


సింధు

నేటి ఫైనల్స్
సాయంత్రం గం. 5.30 నుంచి స్టార్ స్పోర్ట్స్-1లో ప్రత్యక్ష ప్రసారం

గ్లాస్గో (స్కాట్లాండ్): అంచనాలు నిజమయ్యాయి. ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో ఈసారి భారత్ ఖాతాలో ఒకటికంటే ఎక్కువ పతకాలు చేరాయి. గత నాలుగు ప్రపంచ చాంపియన్‌షిప్‌లలో ఒక్కో పతకం గెలిచిన మన షట్లర్లు ఈసారి రెండు పతకాలతో మురిపించారు. మహిళల సింగిల్స్‌లో తెలుగు తేజం పూసర్ల వెంకట (పీవీ) సింధు... హైదరాబాద్‌కే చెందిన సైనా నెహ్వాల్ సెమీఫైనల్‌కు చేరుకొని భారత్ కొత్త చరిత్ర సృష్టించడంలో కీలక పాత్ర పోషించారు. 2015 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో రన్నరప్‌గా నిలిచి రజత పతకం గెలిచిన సైనా నెహ్వాల్ ఈసారి కాంస్య పతకాన్ని దక్కించుకుంది. తొలి సెమీఫైనల్లో ప్రపంచ 16వ ర్యాంకర్ సైనా 21–12, 17–21, 10–21తో ప్రపంచ 12వ ర్యాంకర్ నొజోమి ఒకుహారా (జపాన్) చేతిలో పోరాడి ఓడిపోవడంతో ఈ భారత స్టార్‌కు కాంస్య పతకం లభించింది.

శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్స్‌లో ఒకుహారా గంటా 33 నిమిషాల్లో 21–18, 14–21, 21–15తో డిఫెండింగ్ చాంపియన్, రియో ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత కరోలినా మారిన్ (స్పెయిన్)పై సంచలన విజయం సాధించగా... సైనా 21–19, 18–21, 21–15తో క్రిస్టీ గిల్మోర్ (స్కాట్లాండ్)పై, నాలుగో సీడ్ పీవీ సింధు 21–14, 21–9తో ఐదో సీడ్ సున్ యు (చైనా)పై గెలుపొందారు. సింధు, చెన్ యుఫీ (చైనా)ల మధ్య రెండో సెమీఫైనల్ విజేతతో ఆదివారం జరిగే ఫైనల్లో ఒకుహారా తలపడుతుంది.

ఒత్తిడికి లోనై...

గతంలో ఒకుహారాతో ఆడిన ఏడు మ్యాచ్‌ల్లో ఆరుసార్లు గెలుపొందిన సైనా ఈసారి మాత్రం తన ప్రత్యర్థి పోరాటపటిమ ముందు ఎదురు నిలువలేకపోయింది. గంటా 14 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సైనా 22 నిమిషాల్లో తొలి గేమ్‌ను దక్కించుకుంది. అయితే రెండో గేమ్‌లో భారత స్టార్ తడబడింది. స్కోరు 17–17 వద్ద సైనా ఒత్తిడికిలోనై వరుసగా నాలుగు పాయింట్లు చేజార్చుకొని గేమ్‌ను కోల్పోయింది. తొలి రెండు గేముల్లో నెట్ వద్ద, సుదీర్ఘ ర్యాలీల్లో సైనా పలుమార్లు పైచేయి సాధించినా... మూడో గేమ్‌లో మాత్రం ఒకుహారా ఆటతీరుకు సైనా వద్ద సమాధానం లేకపోయింది. మొదట్లో సైనా 3–1తో ఆధిక్యంలోకి వెళ్లినా... ఒకుహారా తన వ్యూహాలు మార్చి వరుసగా ఐదు పాయింట్లు గెలిచి 6–3తో ముందంజ వేసింది. ఆ తర్వాత ఒకుహారా మరింత జోరు పెంచగా... సైనా డీలా పడింది. ఒకదశలో ఒకుహారా 16–7తో తొమ్మిది పాయింట్ల ఆధిక్యాన్ని సంపాదించింది. సైనా తేరుకునేందుకు ప్రయత్నం చేసినా ఒకుహారా ఎలాంటి అవకాశం ఇవ్వలేదు.

సూపర్ సింధు...

2013, 2014 ప్రపంచ చాంపియన్‌షిప్‌లలో కాంస్య పతకాలు గెలిచిన సింధు ఈసారీ సెమీఫైనల్‌కు చేరుకొని తన ఖాతాలో మూడో ప్రపంచ చాంపియన్‌షిప్ పతకాన్ని వేసుకుంది. ఎన్గాన్ యి చెయుంగ్ (వియత్నాం)తో జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో అతికష్టమ్మీద గట్టెక్కిన సింధు... సున్ యుతో జరిగిన క్వార్టర్ ఫైనల్లో మాత్రం తన విశ్వరూపం ప్రదర్శించింది. కేవలం 39 నిమిషాల్లో సున్ యు ఆట కట్టించిన సింధు ఏదశలోనూ ఈ చైనా స్టార్‌కు కోలుకునే అవకాశం ఇవ్వలేదు. గత ఏడాది వరల్డ్ సూపర్ సిరీస్ ఫైనల్స్ టోర్నీలో సున్ యు చేతిలో వరుస గేముల్లో ఓడిపోయిన ఈ హైదరాబాద్ అమ్మాయి తాజా విజయంతో ఆ ఓటమికి బదులు తీర్చుకుంది.


సైనా

శ్రీకాంత్‌కు నిరాశ

ప్రపంచ చాంపియన్‌షిప్ పురుషుల సింగిల్స్ విభాగంలో భారత్‌కు పతకం వచ్చి 31 ఏళ్లు గడిచాయి. ఈ ఏడాది అద్వితీయమైన ఫామ్‌లో ఉన్న కిడాంబి శ్రీకాంత్ ఈ నిరీక్షణకు తెరదించుతాడని ఆశించినా నిరాశే ఎదురైంది. టాప్ సీడ్ సన్ వాన్ హో (దక్షిణ కొరియా)తో జరిగిన క్వార్టర్ ఫైనల్లో శ్రీకాంత్ 14–21, 18–21తో ఓడిపోయాడు.